
'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సంపుటి: 11 సంచిక: 295

మంగళవారం 15-1-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'జేఎన్‌యూ' కేసులో


చార్జిషీట్

మూడేళ్ల తర్వాత దాఖలు చేసిన ఢిల్లీ పోలీసులు

కన్హయ్య కుమార్ తదితరులపై దేశద్రోహం ఆరోపణలు

- పార్లమెంటుపై ఉగ్ర దాడి సూత్రధారి అఫ్జల్‌గురు వర్ధంతిని 2016లో వర్సిటీ క్యాంపస్‌లో నిర్వహించడంపై వివాదం
- బీజేపీ ఫిర్యాదుతో కన్హయ్య, ఇతరులపై నాడు కేసు
- అరెస్ట్ చేసి తీహార్ జైలుకు..
- ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న కన్హయ్య

13లో



లోక్‌సభ ఎన్నికల దృష్టితోనే...

ఈ కేసులో మూడేళ్ల తర్వాత పోలీసులు ఇప్పుడు చార్జిషీట్ వేయడం కచ్చితంగా రాజకీయ ప్రేరేపణలతో కూడుకున్నదే. సమయం చూసి సరిగ్గా లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీ ఇలాంటి చర్యలకు దిగుతోంది. కానీ ఇది మాకు మంచిదే. కేసు విచారణ పూర్తయితే నిజానిజాలు బయటకొస్తాయి. – కన్హయ్య కుమార్



మళ్లీ ఓట్ల 'పంచాయితీ'!

- సర్పంచ్ ఎన్నికల ఓట్లలోనూ భారీగా గల్లంతు
- 22 లక్షల ఓట్ల గల్లంతుపై చల్లారని వివాదం
- అసెంబ్లీ ఎన్నికల జాబితాకే స్వల్ప మార్పులు
- ముందే దరఖాస్తు చేసుకున్నా పెండింగ్‌లో ఉంచిన ఎన్నికల సంఘం
- ఓటు లేక పోటీకి దూరంగా ఔత్సాహికులు

4లో

ఎందుకింత దిగజారుడు

రాజకీయాలు?

వైఎస్సార్ కుమార్తె, ఏపీ ప్రతిపక్ష నేత జగన్ సోదరి షర్మిల ఆవేదన

- నాపై చేస్తున్న పైశాచిక ప్రచారాన్ని ఆపండి
- ఈ దుష్ప్రచారం వెనుక కచ్చితంగా టీడీపీ ప్రమేయం ఉంది
- 2014 ఎన్నికల్లోనూ ఇలాగే.. ఇప్పుడు మరోసారి..
- ఆ వ్యక్తిని.. నేనెప్పుడూ కలవలేదు, మాట్లాడలేదని నా బిడ్డలపై ప్రమాణం చేసి చెబుతున్నా...
- నాపై విషం చిమ్ముతున్న వారూ ఇలాగే ప్రమాణం చేసి నిజం చెప్పగలరా?.. రాష్ట్రంలో మహిళలకు ఆత్మ గౌరవం లేదా?
- ఓ మహిళపై ఇలాంటి దుష్ప్రచారం తగదని ఏపీ సీఎం చంద్రబాబు ఎందుకు వారించరు?
- సోషల్ మీడియాలో తనపై దుష్ప్రచారం చేయడంపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు షర్మిల ఫిర్యాదు

2లో



హైదరాబాద్ సీపీకి ఫిర్యాదు చేస్తున్న షర్మిల. చిత్రంలో ఆమె భర్త అనిల్, వైఎస్సార్‌సీపీ నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వాసిరెడ్డి పద్మ

సెలవు

సంక్రాంతి సందర్భంగా నేడు (మంగళవారం) సాక్షి కార్యాలయానికి సెలవు. కావున బుధవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం గురువారం.



సోమవారం ఇరాన్ రాజధాని టెహ్రాన్ సమీపంలో అదుపుతప్పి ఇళ్ల వద్ద కుప్పకూలిన కార్గో విమానం. ఈ దుర్ఘటనలో 15 మంది దుర్మరణం పాలయ్యారు. - 13లో

రేట్ల కోతకు 'ధర'ల ఊతం!

- డిసెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 2.19 శాతం
- 18 నెలల కనిష్టం.. టోకు ధరలదీ దిగువబాటే!
- ఎనిమిది నెలల కనిష్ట స్థాయి... 3.80 శాతానికి డౌన్
- ఆర్‌బీఐ వడ్డీరేట్ల కోతకు అవకాశమంటున్న పరిశ్రమలు

14లో



మోదీకి 'ఫిలిప్ కోట్లర్'



- ప్రధాని నరేంద్ర మోదీ ఫిలిప్ కోట్లర్ ప్రెసిడెన్షియల్ అవార్డు స్వీకరించారు. 'ప్రజలు, లాభం, భూమి' అనే అంశాల ప్రాతిపదికన విశేష ప్రతిభ చూపిన దేశాధినేతలకు ఈ అవార్డు ఇస్తారు.

- వివరాలు 13లో

తొలివిడతలో

769

పంచాయతీలు ఏకగ్రీవం

- మూడోదశ పంచాయతీపోరు ప్రారంభం
- రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- ముగిసిన రెండోవిడత నామినేషన్ల పరిశీలన



సాక్షి, హైదరాబాద్: తొలివిడత పంచాయతీ ఎన్నికల్లో 769 సర్పంచ్‌లు, 10,654 వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏకగ్రీవ ఎన్నికల ఫలితాలను సోమవారం రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. తొలివిడతగా 4,479 పంచాయతీలు, 39,822 వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఏకగ్రీవ సర్పంచ్, వార్డు స్థానాలు పోగా మిగిలే 3,701 సర్పంచ్ స్థానాలకు ఈ నెల 25న ఎన్నికలు నిర్వహించనున్నారు. సర్పంచ్ పదవుల కోసం 12,202 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఏకగ్రీవాలు పోగా 28,976 వార్డులకు ఎన్నికలు జరగనుండగా 70,094 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. 9 పంచాయతీలు, 192 వార్డులకు ఎలాంటి నామినేషన్లు రాకపోవడం/చెల్లని నామినేషన్లు రావడంతో ఎన్నికలు నిర్వహించడంలేదు.

ముగిసిన 2వ విడత నామినేషన్ల పరిశీలన

రెండోవిడతగా 4,135 పంచాయతీలకు ఎన్నికలు జరుగుతుండగా, సర్పంచ్ స్థానాలకు 25,419 నామినేషన్లు వచ్చాయి. 36,602 వార్డుస్థానాలకు 91,458 నామినేషన్లు వచ్చాయి. నామినేషన్ల పరిశీలన సోమవారం నిర్వహించి అర్హులైన అభ్యర్థుల జాబితాలను ప్రకటించారు. నామినేషన్ల పరిశీలన నిర్ణయాలపై మంగళవారం అప్పీళ్లను స్వీకరించనున్నారు. బుధవారం ఈ అప్పీళ్లను పరిష్కరించనున్నారు. రెండోవిడత నామినేషన్ల ఉపసంహరణ గురువారం ముగియనుంది. ఈ నెల 25న

మిగతా 2వ పేజీలో ▶

నేటి నుంచే కుంభమేళా

- మార్చి 4 వరకు మహా ఉత్సవం
- తాత్కాలిక నగరం కుంభ్‌నగరిలో సకల సౌకర్యాలు
- ప్రధాన విశేషంగా 13 అఖాడాలు
- 12 కోట్ల మంది పుణ్య స్నానాలు ఆచరిస్తారని అంచనా

- వివరాలు 13లో

ఇనుంగారు



'వినోద' భారం తగ్గేనా?

కూకట్‌పల్లిలో ఉండే శివకు కేబుల్ టీవీ బిల్లు రూ.280 వచ్చింది. 'మేం చూసేదే.. ఐదో, ఆరో చానళ్లు ఇంత ధరెందుకు? అంటే సార్ ఇది హైదరాబాద్.. ఇక్కడ అన్ని భాషలోళ్లు ఉంటరు.. మీ ఒక్కరికోసం తగ్గించలేం 'అని బదులిచ్చాడు కేబుల్ బాయ్.

ఈ బాధ భరించలేక.. డీటీహెచ్ కొనుక్కున్నాడు. కానీ, అందులోనూ అదే దోపిడీ ఎంపిక చేసిన చానళ్ల పేరుతో ఖర్చు రూ.500లకు పెరిగింది.అందులోనూ తాను చూడని చానళ్లే అధికం. దీంతో దిక్కుతోచలేదు అతనికి.

రూ.250 ప్రస్తుత కేబుల్ కనీస చార్జీ

రూ.100-153 ట్రాయ్ రూల్స్ ప్రకారం చెల్లించాల్సింది

- ఫిబ్రవరి 1నుంచి మార్పులకు అవకాశం
- తెలంగాణలోనే 82 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు
- పెయిడ్ చానళ్లలో ప్రకటనలు ఎందుకు: కస్టమర్లు
- ప్యాకేజీల పేరుతో అంటగడుతున్నారంటూ మండిపాటు

సాక్షి, హైదరాబాద్: కేబుల్ టీవీ, డీటీహెచ్ పేరిట ఇష్టానుసారంగా జరుగుతున్న దోపిడీకి ఇది నిదర్శనం. నిబంధనల్ని తుంగలో తొక్కి అవసరం ఉన్నా లేకున్నా.. నచ్చని చానళ్లను అంటగడుతూ.. అందినకాడికి డబ్బులు దండుకుంటున్నారు. ఇక నుంచి ఇలాంటి వినియోగదారులపై వినోద భారం తగ్గనుంది. ఫిబ్రవరి 1 నుంచి ట్రాయ్ కొత్త నిబంధనలు అమలుకానున్నాయి. వాస్తవానికి ఇవి డిసెంబరు ఆఖరుకే అమలు కావాలి. కానీ, వివిధ వర్గాల ఆందోళనల నేపథ్యంలో అమలును ఫిబ్రవరి 1కి వాయిదా వేశారు. ట్రాయ్ కొత్త నిబంధనల ప్రకారం.. ఇష్టానుసారంగా చానళ్లకు రుసుం వసూళ్లు చేస్తామంటే కుదరదు. ఇష్టం లేని, చూడని చానళ్లకు డబ్బులు కట్టాల్సిన అవసరం లేదు.

ఎక్కువ వసూలు చేస్తున్నారు

వాస్తవానికి ట్రాయ్ నిబంధనల ప్రకారం.. కనిష్టంగా రూ.100 నుంచి గరిష్టంగా రూ.153 వసూలు చేయాలి. కానీ.. ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. ఎవరికి వారు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారు. తాము చూడని చానళ్లకు కూడా వారు డబ్బు చెల్లిస్తున్నారు. తెలంగాణలో దాదాపుగా 82 లక్షల మంది టీవీ సబ్‌స్క్రైబర్లున్నారు. వీరిలో 17 లక్షల మంది డీటీహెచ్ సబ్‌స్క్రైబర్లు. మీరు చూడని చానల్‌కు డబ్బులు చెల్లించనక్కర్లేదని ట్రాయ్ చెబుతున్నా.. ఆ నిబంధనల్ని

మిగతా 2వ పేజీలో ▶



భవిష్యత్తులో అంతా ఆన్‌లైన్‌కే మొగ్గు!

ఇప్పటికే ఆన్‌లైన్‌లో అమేజాన్, నెట్‌ఫ్లిక్స్, జియో తదితర సంస్థలు యాడ్లు లేకుండా వినోదాన్ని అందించే ప్యాకేజీలు అందుబాటులో ఉంచాయి. ట్రాయ్ నిబంధనల ప్రకారం.. ప్రతీ ప్యాకేజీ భారంగా కనిపించే అవకాశాలున్న నేపథ్యంలో చాలామంది వీటివైపు మొగ్గు చూపే అవకాశాలు ఉన్నాయి. ఎందుకంటే వీటిలో నచ్చిన కార్యక్రమం చూసుకోవచ్చు. పైగా మొబైల్‌కు, టీవీకి, కంప్యూటర్, ట్యాబ్ ఎక్కడైనా ఎపుడైనా చూసుకోవచ్చు. పైగా వీటి సబ్‌స్క్రిప్షన్ ఏడాదికి రూ.1000 లోపే కావడం గమనార్హం. ట్రాయ్ నిబంధనల్లో ప్రైవేటు ప్యాకేజీల భారంగా భావించినవారంతా వీటివైపు మొగ్గుచూపే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఎందుకంటే ఎలాగూ.. న్యూస్ చానళ్లు ఉచితంగా వస్తున్నాయి. పలు టీవీ సీరియళ్లు యూట్యూబ్ ఇతర యాప్‌లో అందుబాటులో ఉంటున్నాయి.

గవర్నర్ సంక్రాంతి శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ప్రజలకు గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఇరు రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో పండుగ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. సిరి సంపదలు, సౌభాగ్యాలతో ప్రజలు ఆనందంగా ఉండాలని ప్రార్థించారు.

ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు: ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: తెలుగు ప్రజలందరికీ తెలంగాణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు సంక్రాంతి పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని సోమవారం ఓ ప్రకటనలో ఆయన ఆకాంక్షించారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

సాక్షి, హైదరాబాద్: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ రాష్ట్ర ప్రజలకు మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. రైతు, నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని తెలిపారు. రైతుల ఆదాయం రెట్టింపు కావాలని, ఈ సంక్రాంతి పండుగ ప్రజలందరికీ మంచి జరిగేలా నవకాంతులు నింపాలని కోరారు.



కె.లక్ష్మణ్

రేపు ప్రోటెం స్పీకర్ ప్రమాణం

17 నుంచి శాసనసభ సమావేశాలు

సాక్షి, హైదరాబాద్: మజ్లిస్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ బుధవారం ప్రోటెం స్పీకర్‌గా ప్రమాణస్వీకారం చేయనున్నారు. చార్మినార్ స్థానం నుంచి గెలిచిన ముంతాజ్ అహ్మద్ చేత గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ రాజ్‌భవన్‌లో సాయంత్రం 5 గంటలకు ప్రమాణస్వీకారం చేయించనున్నారు. ప్రోటెం స్పీకర్‌గా ముంతాజ్ అహ్మద్ అధ్యక్షతన గురువారం 11.30 గంటలకు కొత్త శాసన సభ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. నూతనంగా ఎన్నికైన శాసనసభ సభ్యులతో ప్రోటెం స్పీకర్ ప్రమాణం చేయించనున్నారు. రెండుగంటల పాటు కొనసాగే ఈ కార్యక్రమం తర్వాత.. మధ్యాహ్నం జూబ్లీహాల్ ప్రాంగణంలోని కౌన్సిల్ లాన్స్‌లో శాసనసభ సభ్యులకు ప్రభుత్వం విందు ఏర్పాటుచేసింది. అనంతరం అఖిలపక్ష.. స్పీకర్ ఎన్నిక షెడ్యూల్ ప్రకటన, నామినేషన్ల స్వీకరణ జరుగనున్నాయి. జనవరి 18న స్పీకర్ ఎన్నిక నిర్వహిస్తారు. తర్వాత కొత్త స్పీకర్ అధ్యక్షతన సభాకార్యక్రమాలు సాగుతాయి. స్పీకర్ అధ్యక్షతన శాసనసభా సలహా సంఘం (బీఏసీ) సమావేశమై ఉభయసభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగంపై (19న) నిర్ణయం తీసుకోనుంది. జనవరి 20న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం ప్రవేశపెట్టడం, దానికి సభ ఆమోదం తెలపడం జరుగుతుంది. మొత్తంగా జనవరి 17 నుంచి 20 వరకు శాసనసభ కార్యకలాపాలు జరుగనున్నాయి. ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో ఘన విజయం సాధించి సీఎంగా బాధ్యతలు స్వీకరించిన కేసీఆర్.. ఉత్తరాయణ పుణ్యకాలంలో ఏకాదశినాడు (జనవరి 17న) శాసనసభ కార్యకలాపాలు ఆరంభించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే.

హైదరాబాద్‌లో చండీగఢ్ వర్సిటీ ఉచిత కౌన్సెలింగ్ సేవలు



హైదరాబాద్: విద్యార్థుల కోసం చండీగఢ్ విశ్వవిద్యాలయం సోమాజిగూడలో ఉచిత కౌన్సెలింగ్ సేవలు ప్రారంభించింది. కెరీర్ పరంగా విద్యార్థులకు ఉచిత కౌన్సెలింగ్ ఇచ్చేందుకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రచారంలో భాగంగా ఆ వర్సిటీ మీడియా హెడ్ ప్రొఫెసర్ ప్రభదీప్ సింగ్ సోమవారం హైదరాబాద్ వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌన్సెలింగ్ సేవలు పొందాలనుకునే వారు సోమాజిగూడ పార్క్ హోటల్‌లో సంప్రదించవచ్చని చెప్పారు. మరో వైపు, తెలంగాణ విద్యార్థులకు చండీగఢ్ విశ్వవిద్యాలయం స్కాలర్‌షిప్ ప్రకటించింది. 2018 బ్యాచ్‌లో స్కాలర్‌షిప్ పొందిన 50 మంది తెలంగాణ విద్యార్థుల్లో 43 మంది టాప్ కంపెనీల్లో ఉద్యోగం సాధించారని సింగ్ పేర్కొన్నారు. వివిధ కోర్సుల్లో 800 మంది విద్యార్థులకు వర్సిటీ స్కాలర్‌షిప్ అందిస్తోందని, స్కాలర్‌షిప్ పొందాలనుకునే వారు ఏప్రిల్–మేలో నిర్వహించే ప్రవేశ పరీక్ష సీయూసీఎస్ఏటీ–2019 రాయాలన్నారు. ఇందుకు www.fssttrack.cuchd.in దరఖాస్తు చేసుకోవాలని సింగ్ సూచించారు.

టీపీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు



దక్షిణ ఫ్లోరిడా తెలుగు సంఘం (టీపీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో దక్షిణ ఫ్లోరిడాలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. దక్షిణ ఫ్లోరిడాలో నివసిస్తున్న తెలుగు ప్రజలు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా ముగ్గులు, వంటలు, వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

'జనరల్ స్థానాల్లో బీసీలను గెలిపించండి'

సాక్షి, హైదరాబాద్: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థులను పార్టీలకతీతంగా గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీసీ జనాభా 56 శాతం ఉన్నా.. ప్రభుత్వం కేవలం 22 శాతం రిజర్వేషన్లకే బీసీలను పరిమితం చేసిందని తెలిపారు. బీసీలకు అవకాశం రాకపోవడంతో చాలాచోట్ల జనరల్ స్థానాల్లో పోటీ చేస్తున్నారన్నారు. బీసీ అభ్యర్థులను గెలిపించేందుకు అన్ని పార్టీల నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన అన్నారు.

తొలి విడతలో 769 పంచాయతీలు ఏకగ్రీవం

▶ మొదటి పేజీ తరువాయి

రెండోవిడత పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయి.

మూడోవిడత పోరు షురూ

మూడోవిడత పంచాయతీ ఎన్నికల సమరం బుధవారం నుంచి ప్రారంభం కానుంది. మూడోవిడతలో 4,115 పంచాయతీలు, 36,718 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ నెల 16 నుంచి 18 వరకు నామినేషన్ల స్వీకరణ చేస్తారు. 19న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. అదే రోజు అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. నామినేషన్లపై అప్పీలు 20న స్వీకరించి 21లోగా పరిష్కరించనున్నారు. 22తో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియనుంది. అదే రోజు ఎన్నికల బరిలో నిలిచిన తుది అభ్యర్థుల జాబితాను వెల్లడించనున్నారు. 30న మూడో విడత పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయి.

నా బూతే... నా భవిష్యత్!

యూట్యూబ్ చానళ్లలో కొందరి పైశాచికత్వం



- డబ్బు సంపాదన కోసం బూతు కథనాలు, అసత్య ప్రచారాలు
- సినీ, రాజకీయ గాసిప్పులతో యువతకు వల
- అత్యధిక హిట్లు, సబ్‌స్క్రైబర్ల కోసం ఇష్టారాజ్యంగా వీడియోలు
- సెన్సార్ లేకపోవడంతో అదేపనిగా చూస్తున్న యువత
- మంచి పరిణామం కాదంటున్న తల్లిదండ్రులు
- నేరస్వభావాన్ని పెంచుతాయని సర్వత్రా ఆందోళన

- ఆ హీరో కాపురంలో చిచ్చుపెట్టిన నటి ఎవరో తెలుసా?...
- నీలిచిత్రాల్లో నటిస్తూ దొరికిపోయిన హీరోయిన్...
- టాప్ హీరోయిన్లలో ఒకరైన ఆమెను ఫుల్లుగా వాడుకున్న స్టార్ హీరో
- ఆ రాజకీయ నాయకుడు హఠాన్మరణం. చివరిచూపు కోసం ఆసుపత్రి ముందు క్యూ కట్టిన ప్రముఖులు...

ఇవీ యూట్యూబ్‌లోని కొన్ని తెలుగు చానళ్లలో కనిపించే తప్పుడు శీర్షికలు. సులువుగా డబ్బు సంపాదన కోసం ఆయా చానళ్ల నిర్వాహకులు వండి వారుస్తున్న అసత్య, బూతు కథనాలు. తాము అప్‌లోడ్ చేసే వీడియోలకు అత్యధిక హిట్లు, సబ్‌స్క్రైబర్లను సాధించేందుకు సాగిస్తున్న అరాచకాలు.

ఎలా ఆపాలి?

వాస్తవానికి యూట్యూబ్ అనేది విజ్ఞానాన్ని పంచేందుకు చక్కటి వేదిక. కానీ ఇందులో ఏం అప్‌లోడ్ చేసినా దాని యాజమాన్యం వెంటనే స్పందించదు. దానికి లిఖితపూర్వకంగా అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఈ–మెయిల్ చేయాలి. అప్పుడే సంస్థ స్పందించి వాటిని తొలగిస్తుంది. ఈ మొత్తం వ్యవహారం జరిగిందుకు కనీసం ఒకరోజు సమయం పడుతుంది. ఈలోగా కొందరు ఆయా వీడియోలను డౌన్‌లోడ్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. దీనివల్ల సినీపరిశ్రమ ఏటా రూ. వందల కోట్లు నష్టపోతోంది. కానీ అంతకంటే విలువైన మానవ వనరులు, రేపటి పౌరులైన విద్యార్థుల మనసులను కలుషితం చేస్తున్న ఇలాంటి వీడియోలను ఉపేక్షించకూడదు. వాటిపై పోలీసులకు వెంటనే ఫిర్యాదు చేయాలి.

సాక్షి, హైదరాబాద్: కాదేదీ కవితకు అనర్హం అన్న చందాన కొందరు అడ్డదారిలో డబ్బు సంపాదన కోసం బూతులతో యూట్యూబ్ వీడియోల తయారీని ఎంచుకుంటున్నారు. నేటి ఆధునిక కాలంలో ప్రతి కుటుంబంలోనూ స్మార్ట్‌ఫోన్లు ఉండటం, సెల్‌ఫోన్ నెట్‌వర్క్ సంస్థలు కారుచౌకగా ఇంటర్నెట్ డేటాను అందిస్తుండటంతో తమ యూట్యూబ్ చానళ్లను పాపులర్ చేసుకునేందుకు ఆయా నిర్వాహకులు 'మసాలా'ఉన్న సబ్జెక్టులను ఎంచుకుంటున్నారు. అశ్లీలం, బూతులు, అసత్య ప్రచారాలకు పూనుకుంటున్నారు. తమ వీడియోలను నెటిజన్ల చేత ఓపెన్ చేయించడమే లక్ష్యంగా వీడియోలు రూపొందిస్తున్నారు. యువతను ముఖ్యంగా టీనేజర్లను తమ వైపు తిప్పుకుంటున్నారు.

సబ్‌స్క్రైబర్లు.... డబ్బుల కోసమే..

వాస్తవానికి ఏ సాంకేతిక పరిజ్ఞానమైనా రెండు వైపులా పదునున్న కత్తిలాంటిదే. యూట్యూబ్‌లో వంటలు, యోగా, కరాటే, సెలబ్రిటీల వీడియోలు పెట్టి చాలా మంది పాపులర్ అవుతున్నారు. ఇందుకుగాను వారికి డబ్బు, గుర్తింపు లభిస్తోంది. కానీ ఇదంతా నాణేనికి ఒకవైపు మాత్రమే. యూట్యూబ్ వీడియోల ద్వారా డబ్బు సంపాదిస్తున్న వారిని చూసి కొందరు వ్యక్తులు ఇంకా వేగంగా డబ్బు సంపాదించాలని, రాత్రికి రాత్రి సెలబ్రిటీలు కావాలనే తొందరపాటులో అడ్డదారులు తొక్కుతున్నారు. అందుకే యువత అమితంగా ఇష్టపడే సినిమాలు, రాజకీయాలను సబ్జెక్టులుగా ఎంచుకుంటూ వాటిలో సంభాషణలను అశ్లీల, బూతులతో నింపేసి దానికి తగ్గట్టుగా రీ రికార్డింగ్, ఎడిటింగ్ చేసి వదులుతున్నారు. ఇలాంటి వీడియోలకు సెన్సార్ లేకపోవడంతో యువత వాటిని పదేపదే చూస్తున్నారు. ఈ వీడియోలను వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా వైరల్ చేస్తూ వదంతుల వ్యాప్తికి కారణమవుతున్నారు. ప్రముఖులపై ఇష్టమొచ్చినట్లు బురదజల్లి వారి ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారు. ఇలాంటి అడ్డదారుల్లో సబ్‌స్క్రైబర్లను ఆకర్షిస్తున్నారు. మొత్తానికి తమ బ్యాంకు ఖాతాల్లో నెలనెలా లక్షల రూపాయలు పడేలా ప్లాన్ చేసి సఫలీకృతమవుతున్నారు.

ఏం జరుగుతుంది?

ఇలాంటి వీడియోల వల్ల యువత మనసు పాడవుతుందని, వారిలో పెడ ధోరణి మొదలవుతుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ రోజుల్లో సెల్‌ఫోన్ వినియోగం విద్యార్థులకు పుస్తకాలతో సమానంగా మారింది. కానీ ఇలాంటి చానళ్ల ద్వారా మానవ సంబంధాలు దెబ్బతింటాయని నెటిజన్లు, పోలీసులు, ఎన్జీవో సంస్థలు హెచ్చరిస్తున్నాయి. పిల్లల్లో మొండితనం, హింసాత్మక ప్రవృత్తి, నేర స్వభావాన్ని ఇలాంటి వీడియోలు పురిగొల్పుతాయని స్పష్టం చేస్తున్నారు.

● డబ్బు కోసం జీవితాలు నాశనం...



ఇలాంటి వీడియోలు యువత మనసును తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. స్మార్ట్‌ఫోన్ ఎడిక్షన్‌కు ఇలాంటి వీడియోలు కూడా కారణమే. త్వరగా పేరు, డబ్బు సంపాదించాలన్న ఆత్రుతతో ఇలాంటి యూట్యూబ్ నిర్వాహకులు టీనేజీ పిల్లలను పక్కదారి పట్టిస్తున్నారు. ఫలితంగా వారు మొండిగా తయారవుతున్నారు. తల్లిదండ్రులు, లెక్చరర్లతో బూతులు మాట్లాడుతున్నారని మాకు ఫిర్యాదులు వస్తున్నాయి. పోలీసులు కూడా ఇదే విషయంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేర స్వభావాన్ని, దుందుడుకు మనస్తత్వాన్ని పెంచే ఇలాంటి వీడియోలను నిషేధించాలి. - అనిల్ రాచమల్ల, ఎండ్ నౌ ఫౌండేషన్

ఎందుకింత దిగజారుడు రాజకీయాలు?

వైఎస్సార్ కుమార్తె, ఏపీ ప్రతిపక్ష నేత జగన్ సోదరి షర్మిల ఆవేదన

నాపై చేస్తున్న పైశాచిక ప్రచారాన్ని ఆపండి

ఈ దుష్ప్రచారం వెనుక కచ్చితంగా టీడీపీ ప్రమేయం ఉంది



సోమవారం హైదరాబాద్‌లో పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన అనంతరం భర్త అనిల్ కుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతున్న షర్మిల. చిత్రంలో సజ్జల, వైవీ సుబ్బారెడ్డి, పద్మ

హైదరాబాద్ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: ఓ సినీ నటుడితో తనకు సంబంధం ఉన్నట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారం వెనుక టీడీపీ హస్తం ఉందని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తె, ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోదరి షర్మిల ఆరోపించారు. తన బిడ్డలపై ప్రమాణం చేసి చెబుతున్నానని.. అటువంటి వ్యక్తిని తానెన్నడూ కలవలేదని, మాట్లాడలేదని స్పష్టం చేశారు. తనపై పదేపదే అవే పుకార్లు పుట్టిస్తూ ఎందుకింత పైశాచికత్వానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై దుష్ప్రచారం చేస్తున్నవారితోపాటు చేయిస్తున్న వారిపై కూడా చర్యలు తీసుకుని మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడాలని కోరుతూ షర్మిల తన భర్త అనిల్ కుమార్‌తో కలసి సోమవారం హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె వైఎస్సార్ సీపీ నేతలు వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, వాసిరెడ్డి పద్మ తదితరులతో కలసి మీడియాతో మాట్లాడారు. తనకు ఓ సినీ నటుడితో సంబంధాలున్నట్లు పుకార్లు పుట్టిస్తున్న వారు, అలా ప్రచారం చేయిస్తున్న వారు వాటిని రుజువు చేయగలరా? అని షర్మిల సూటిగా ప్రశ్నించారు. మహిళల సమానత్వం, స్వేచ్ఛ కేవలం కాగితాలు, చర్చలకే పరిమితం కారాదని ఆచరణలోకి రావాలన్నారు. ఈ సందర్భంగా ఆమె ఇంకా ఏమన్నారంటే...

ఎన్నికలు రావడంతో మళ్లీ విష ప్రచారం

'2014 ఎన్నికలకు ముందు మొదలు పెట్టి ప్రభాస్ అనే ఒక మూవీ స్టార్‌కు నాకు సంబంధం ఉందనే దుష్ప్రచారాన్ని ఓ వర్గం ఆన్‌లైన్‌లో ఒక క్యాంపెయిన్‌లా నడిపింది. అప్పట్లో మేం ఫిర్యాదు కూడా చేశాం. విచారణ జరిపి పోలీసు యాక్షన్ తరువాత కొంత కాలం ఈ దుష్ప్రచారం ఆగింది. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు వస్తున్నాయి కనుక మరోసారి ఈ విష ప్రచారం వేగం పెంచారు. వీళ్ల ఉద్దేశం ఒక్కటే... నా వ్యక్తిత్వాన్ని హననం చేయడం. ఈ దుష్ప్రచారాలను సృష్టిస్తున్న వారి మీద, వారి వెనుక ఉన్న వారి మీద చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరేందుకు ఈ రోజు ఇక్కడికి వచ్చా.

స్త్రీలంటే ఇంత చులకన భావమా?

ఇది నా ఒక్కదానికే జరిగిన అవమానంగా భావించడం లేదు. ఇలాంటి రాతలు ఇంకెంతో మంది మహిళల మీద కూడా రాస్తున్నారు. స్త్రీల పట్ల శాడిజం, చులకన భావంతో రాస్తున్నారు. ఇలా రాస్తున్న రాతలను, దుష్ప్రచారాన్ని మన సమాజం ఆమోదించవచ్చా? ప్రజాస్వామ్యం, మానవ హక్కులు, సమానత్వం, మహిళల స్వేచ్ఛ లాంటి గొప్ప పదాలు కాగితాలు, చర్చలకు మాత్రమే పరిమితం కాకూడదు. ఇవి వాస్తవ రూపం దాల్చాలంటే మనం గొంతెత్తాలి. వెబ్‌సైట్‌లు, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలకు తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్న నా విజ్ఞప్తికి మద్దతు పలకాలని ప్రజాస్వామికవాదులు, జర్నలిస్టులు, మహిళలు, రాజకీయ నేతలను కోరుతున్నా. దుష్ప్రచారం చేస్తున్నవారు, చేయిస్తున్న వారికి బదులుగా ఈరోజు ఇలా దోషిలా నిలబడి నా వాదనను వినిపించుకోవాల్సిన దుస్థితి రావడం ఒక్క నాకే కాదు మహిళలందరికీ ఇది అవమానకరం. ఐదేళ్ల కిందట మొదలైంది ఇప్పుడు మళ్లీ తలెత్తింది. మళ్లీ మళ్లీ కూడా తలెత్తవచ్చు. నేను మాట్లాడక పోతే అది నిజమేమో అని కొంతమందైనా అనుకునే ప్రమాదం ఉంది కనుక ఈ తప్పుడు ప్రచారాలను మూలాలతో సహా తొలగించాలని పోలీసులను కోరేందుకు వచ్చా.

నాలా ప్రమాణం చేసి చెప్పగలరా?

ఓ భార్యగా, తల్లిగా, చెల్లిగా నా నైతికత, నిజాయితీని నిరూపించుకోవాల్సిన అవసరం లేదు. నా గురించి నాకు తెలుసు. ఆ దేవుడికీ నా గురించి తెలుసు. కానీ ఈరోజు నా గౌరవాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది కనుక మీ ముందుకొచ్చి చెబుతున్నా. ఏ వ్యక్తితో నాకు సంబంధం ఉందని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారో.. ఆ వ్యక్తిని నా జీవితంలో నేనెప్పుడూ కలవలేదు. ఒక్కసారి కూడా మాట్లాడ లేదు. ఆ వ్యక్తికీ, నాకు ఏ సంబంధమూ లేదు. ఎప్పుడూ ఏ సంబంధమూ లేదు. ఇది నిజం. ఇదే నిజమని నా పిల్లల మీద ప్రమాణం చేసి మరీ చెబుతున్నా. దుష్ప్రచారాలు చేస్తున్నవారు, చేయిస్తున్న వారు నాలా ప్రమాణం చేసి నిజం చెప్పగలరా? నాకు ఫలానా వ్యక్తితో సంబంధం ఉందని కానీ, నేనెప్పుడైనా కలిశానని గానీ, మాట్లాడానని గానీ రుజువులు, ఆధారాలు చూపగలరా? పుకార్లు పుట్టించి వ్యక్తిత్వ హననానికి పాల్పడటం దారుణం, దుర్మార్గం కాదా?

ఏమిటీ పైశాచికానందం?

నన్ను ప్రేమించే నా భర్త ఉన్నారు. నామీద ఆధారపడ్డ పిల్లలు, కుటుంబం ఉంది. మా స్నేహితులు, శ్రేయోభిలాషులున్నారు. నాతో పాటు వీరందరినీ బాధ పెట్టిన విషయమిది. పుకార్లను పుట్టించి వ్యక్తిత్వ హననానికి పాల్పడటం ఎంత వరకు సబబు? ఏమిటీ పైశాచికానందం? ఎందుకింత నీచానికి దిగజారుతున్నారు? వీటిల్లో ఇసుమంతైనా నిజం లేదు. ఇలాంటి పుకార్లను పుట్టించే వారి వెనుక ఉన్న వ్యక్తులకు సిగ్గనిపించడం లేదా? ఇంత దిగజారుడుతనం అవసరమా?

ఇది టీడీపీకి కొత్తేం కాదు

ఇలా నాపై బురద చల్లే ప్రచారాల వెనుక టీడీపీ హస్తముందని నేను ఎలాంటి అనుమానం లేకుండా ఆరోపణ చేస్తున్నా. అందుకు కారణం లేక పోలేదు. టీడీపీకి పుకార్లు పుట్టించడం కొత్తేమీ కాదు. మా నాన్న దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డిని ఫ్యాక్షనిస్టు అంటూ పుకార్లు పుట్టించింది ఈ టీడీపీనే. మా నాన్న ముఖ్యమంత్రి అయిన తరువాత ఆయనది ఎంత గొప్ప మనసో, ఎంత పెద్ద మనసో, ఎంత గొప్ప వ్యక్తిత్వమో లోకమంతా చూసింది.

చంద్రబాబు ఎందుకు ఖండించరు?

మా జగనన్న గర్విష్టి, కోపిష్టి, అహంభావం ఉన్నవారని పుకార్లు పుట్టించింది కూడా తెలుగుదేశం పార్టీయే. కానీ ఆయన ఎంత సౌమ్యుడో పాదయాత్రలో కోట్ల మంది ప్రజలకు అర్థం అయింది. ఇప్పుడు నామీద పుకార్లు పుట్టిస్తున్నది కూడా టీడీపీనే. ఒకవేళ టీడీపీ ప్రమేయం లేకుంటే ఆ పార్టీ వాళ్లు మాట్లాడుతున్నపుడు అలాంటి మాటలను ఎందుకు ఖండించడం లేదు? 'ఒక అమ్మాయి గురించి అలా మాట్లాడటం తప్పు..'అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎందుకు ఆపలేదు? ఒక అబద్ధాన్ని వంద సార్లు చెప్పైనా సరే దాన్నే నిజంలా చూపించాలన్నది టీడీపీ సిద్ధాంతం కాదా? స్వయంగా చంద్రబాబు గారే వీటిని ప్రోత్సహిస్తారు. అందుకే వాళ్ల నాయకులు దానిని అనుసరిస్తారు. ఇదీ వాస్తవం! తెలుగువారి ఆత్మగౌరవం అంటూ పెద్ద పెద్ద డైలాగులు చెప్పే పార్టీలకు చెందిన వారు అసలు రాష్ట్రంలోని మహిళలకు ఆత్మగౌరవం ఉండాలో, లేదో చెప్పండి. కుటుంబ గౌరవం అన్నది ఉందో లేదో చెప్పండి. మీ పార్టీలో ఉన్న మహిళలకు, మీ కుటుంబాల్లో ఉన్న మహిళలకు మాత్రమే ఆత్మగౌరవం ఉంటుందని మీరు భావిస్తున్నారా? రాజకీయాలను ఇంతగా దిగజార్చకండి.

చంద్రబాబు ఇంట్లో ఆడవాళ్లు లేరా?

ఏపీ సీఎం చంద్రబాబు ఇంట్లో ఆడవాళ్లు లేరా? మేం కూడా ఇలాంటి పుకార్లు పుట్టించాలి అనుకుంటే పుట్టించలేమా! మాకు ఆ తెలివి లేకా కాదు, మాకు చేతకాకా కాదు. నామీద టీడీపీ నాయకులు అసహ్యంగా మాట్లాడినప్పటికీ మేం తిరిగి అలాంటి చర్యలకు దిగలేదంటే కారణం.. మాకు విలువలున్నాయి కనుకనే. మా అన్నకు నైతికత, మంచితనం ఉంది కనుకనే. మా నాన్న వైఎస్సార్ మాకు ధర్మంగానే పోరాటానికి ధైర్యమిచ్చాడు కనుకనే. అసలు చంద్రబాబు డిక్షనరీలో విలువలు, నైతికత అనే పదాలే లేవు. ఓ నాయకుడు మంచివాడైతే అతడిని అనుసరించే వారు కూడా సన్మార్గంలోనూ నడుస్తారు. సొంత మామ దగ్గరి నుంచి కుర్చీ లాక్కున్నప్పటి నుంచీ చంద్రబాబువి ఎప్పుడూ మోసపూరితమైన ఆలోచనలే. ఇలాంటి నాయకులు అధికారంలో ఉన్నంత వరకూ సమాజం బాగు పడదు. ఇలాగే నీచమైన రాజకీయాలు చేస్తూ పోతే, ఇంతగా దిగజార్చుతూ పోతే వాళ్లెక్కడా కనిపించరని గుర్తుంచుకోవాలి. ఈ రాతలు రాస్తున్న వారు, రాయిస్తున్న వాళ్లు దేవుడున్నాడని గుర్తు పెట్టుకోవాలి. పాపం ఊరికే పోదు. ఇది నా ఒక్కరి వ్యక్తిగత విషయంగా పరిగణించకుండా మహిళలందరి గౌరవం, మర్యాదకు సంబంధించిన విషయంగా భావించి దోషులను శిక్షించాలని పోలీస్ అధికారులను కోరాం. చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాం.' అని పేర్కొన్నారు. ఈ దుష్ప్రచారం వెనుక కచ్చితంగా టీడీపీ ప్రమేయం ఉందని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా షర్మిల పేర్కొన్నారు. మీరు ఏపీలో ఫిర్యాదు చేయకుండా హైదరాబాద్‌లో ఎందుకు ఫిర్యాదు చేశారు? అక్కడి పోలీసులపై నమ్మకం లేకనా? లేక మీరు ఇక్కడ ఉంటున్నారు కాబట్టా? అని మీడియా ప్రశ్నించగా 'మాకు నమ్మకం లేదు' అని క్లుప్తంగా సమాధానమిచ్చారు.

మహిళలను వేధిస్తే వదలం...

- హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ హెచ్చరిక
- షర్మిల ఇచ్చిన ఫిర్యాదుపై సీసీఎస్‌లో కేసు నమోదుకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: మహిళలను వేధింపులకు గురిచేస్తే ఎంతవారినైనా వదిలే ప్రసక్తేలేదని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ హెచ్చరించారు. షర్మిల ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించిన ఆయన దీనిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ ఫిర్యాదును నగర సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లోని సైబర్ క్రైమ్ విభాగానికి బదిలీ చేస్తూ వెంటనే కేసు నమోదు చేయాలని ఆదేశించారు. దుష్ప్రచారం చేస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు ఎవరు? ఎక్కడి నుంచి సోషల్ మీడియాలో అభ్యంతకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారో గుర్తించి అరెస్ట్ చేయాలని అదేశించారు.

రంగంలోకి ప్రత్యేక బృందం...

షర్మిలపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్న గుర్తుతెలియని వ్యక్తులపై సెక్షన్ 67 ఐటీ యాక్ట్ 2000 (ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా అసత్యాలను ప్రచారం చేయడం), ఐపీసీ సెక్షన్ 509 (మహిళలను కించపరచడం) కింద కేసు (19/2019) నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్టు సైబర్ క్రైమ్ విభాగం అదనపు డీసీపీ రఘువీర్ తెలిపారు. ఈ కేసుపై దర్యాప్తు జరిపేందుకు ప్రత్యేక బృందాన్ని నియమించారు. షర్మిల ఇచ్చిన ఫిర్యాదులోని అంశాలను పరిగణలోకి తీసుకుని సంబంధిత సోషల్ మీడియా ఖాతాలకు చెందిన ఐపీ అడ్రసులను గుర్తించేందుకు గూగుల్, యూట్యూబ్, ఫేస్‌బుక్ ఇతర సోషల్ మీడియా సంస్థలకు లేఖలు రాస్తున్నట్లు పోలీస్ అధికారులు చెప్పారు. ఐపీ చిరునామా ఆధారంగా నిందితులను వెలికి తీస్తామని, రెండు మూడు రోజుల్లోనే ట్రోల్స్ చేస్తున్న వారి వివరాలు వెలుగులోకి వస్తాయని సైబర్ క్రైమ్ పోలీసులు పేర్కొన్నారు.

'వినోద' భారం తగ్గేనా?

▶ మొదటి పేజీ తరువాయి

కొన్ని శాటిలైట్ చానళ్లు పట్టించుకోవడం లేదు. వాస్తవానికి మదర్ చానల్ ఒకటి ఉంటుంది. దానికి అనుబంధంగా మరో డజను చానళ్ల వరకు ఉంటాయి. ఈ డజను చానళ్లలో ఏదో ఒకటే ఎంచుకుంటానంటే కుదరదు. ఏ ఒక్కటి చూడాలన్నా.. మొత్తం కొనుక్కోవాల్సిందే. వీటిపై ట్రాయ్ ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

ప్రకటనల మాటేంటి?

వివిధ చానళ్లలో యాడ్ల ద్వారా ఆయా చానళ్లకు కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతోంది. వీటిలో ఉచిత చానళ్లలో యాడ్లపై వినియోగదారులకు ఎలాంటి అభ్యంతరాలు లేవు. ఎటొచ్చీ పెయిడ్ చానళ్ల విషయంలో అభ్యంతరాలను లేవనెత్తుతున్నారు. ఇప్పటికే చానల్ చూస్తున్నందుకు డబ్బులిస్తున్నాం కదా? అలాంటప్పుడు మళ్లీ యాడ్ల గోల ఎందుకు? అని నిలదీస్తున్నారు. ట్రాయ్ కొత్త నిబంధనల నేపథ్యంలో ఒక్కో చానల్ ధరను 400% పెంచేశాయి. వీటి ద్వారానే కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతున్నపుడు తిరిగి ప్రకటనలు ప్రసారం చేయడం ఎందుకంటున్నారు.

వినియోగదారులకు హక్కులివి!

1. ఏ పే చానల్‌కు అయినా.. గరిష్ఠంగా 19 రూపాయలు మాత్రమే వసూలు చేయాలి. కొత్త నిబంధనల ప్రకారం 100 ఉచిత చానళ్లు తప్పనిసరిగా ఇవ్వాలి. అందులో 26 దూరదర్శన్ చానళ్లే ఉంటాయి. ఈ వంద చానళ్లకీ కలిపి 130 రూపాయలు, 18% జీఎస్టీ అంటే మొత్తం రూ.153.40 మాత్రమే చెల్లించాలి.
2. ఉచిత చానళ్ల ఎంపికలో పూర్తి స్వేచ్ఛ వినియోగదారుడిదే. వంద చానళ్ల కంటే ఎక్కువ ఉచిత చానళ్లను ఎంపిక చేసుకునే హక్కు కూడా వినియోగదారుడికి ఉంది. ఉదాహరణకు వందకు పైన ఇంకో 25 ఉచిత చానళ్లు కోరుకుంటే దానికి మరో 20 రూపాయలు ఎక్కువ బిల్లు కట్టాలి.
3. ప్రతీ చానల్ ధర వేర్వేరుగా ఉంటుంది. లేదంటే ఒకే గ్రూపునకు చెందిన చానళ్లు నాలుగైదింటికి కలిపి ఒక ధర ఇవ్వవచ్చు.
4. ప్రతీ ఆపరేటరూ తాను అందించే చానళ్ల లిస్టును వినియోగదారులకు వద్దకు తీసుకురావాలి. అందులో వినియోగదారులు నచ్చినవి ఎంపిక చేసుకుని, ఏది కావాలో టిక్ పెట్టి కింద సంతకం పెట్టాలి.
5. కేబుల్ యాక్టివేషన్ చార్జీలు 350 రూపాయలకు మించకూడదు. అన్నిటికీ బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలి. నెల నెలా కట్టే డబ్బులతో సహా.
6. మీకిచ్చే కార్డులో మొత్తం చానళ్ల పట్టిక, వాటి ధరలు, గ్రూపు చానళ్ల ధరలు, మీ ఎంపిక, నెలవారీ బిల్లు – మొత్తం ఉండాలి.
7. అన్ని రకాల నిబంధనలు ముద్రించిన కాగితం ఇవ్వాలి. అన్ని రకాల రేట్లు, రూల్స్ గురించి వివరించి చెప్పాలి. ఫిర్యాదు చేస్తే 8 గంటల్లో సర్వీసు సమస్య పరిష్కరించాలి.
8. ఏదైనా పే చానల్ ప్రసారాలు ఆగిపోతే ఆ డబ్బు వసూలు చేయకూడదు. కావాలంటే దాని బదులు అంతే ధర ఉన్న వేరే పే చానల్ ఇవ్వవచ్చు.
9. ఫిర్యాదులకు సంబంధించిన నంబర్లు ఇవ్వాలి, వెబ్ సైట్ ఏర్పాటు చేయాలి. చానళ్ల మార్పిడి రాతపూర్వకంగా ఉండాలి, 72 గంటల్లో జరగాలి.
10. నెల కంటే ఎక్కువ రోజులు చానల్ చూడకపోతే ఆ నెల బిల్లు కట్టక్కర్లేదు. కానీ ఆ విషయం 15 రోజుల ముందే ఆపరేటర్‌కి చెప్పాలి. కానీ రీ–కనెక్షన్‌కి 3 నెలల లోపు అయితే 25 రూపాయలు, మూడు నెలలు దాటితే 100 రూపాయలు కట్టాలి.

ప్రస్తుత తెలుగు చానళ్లు ఆఫర్ చేస్తోన్న ధరలు(రూ.ల్లో)

జెమినీ బొకే	రూ.35.40,
ఈటీవీ బొకే	రూ.28.32,
స్టార్ తెలుగు బొకే	రూ.46.02,
జీ ప్రైమ్ ప్యాక్ బొకే	రూ.23.60


B NEW
SMART MOBILE STORE
సంక్రాంతి బంపర్ ఆఫర్స్
BNew EXCLUSIVE
UPTO
₹5000
CASHBACK
ప్రతి మొబైల్ ఫైనాన్స్ పై
ఖచ్చితమైన కాష్ బ్యాక్ లభించును
సరదాల్ని తెచ్చే సంక్రాంతిని
సరికొత్తగా జరుపుకొందాం.
మన బిన్యూ ఆఫర్లతో.
70+ Mobile Stores
Redmi 6A
STOCK AVAILABLE
Xiaomi
NEVER BEFORE PRICE
Redmi 6 Pro
3+32 10,299 11,499
4+64 12,499 13,499
Redmi Note 5 Pro
4+64 13,499 15,999
6+64 14,499 17,999
Mi A2
4+64 14,499 17,499
6+128 16,499 20,500
Redmi Y2
3+32 9,299 10,499
4+64 11,499 13,499
SAMSUNG Galaxy A9
₹36,990 ₹33,990
SAMSUNG Galaxy A7
₹21,990 ₹18,990
vivo V11 Pro
PAY 0
Get a Smartphone
ON SELECTED MODELS
Assured Gift
FREE
10,000 mAh POWERBANK
oppo F9 Pro
mobiistar
X1 dual
ఈ ఒక్క రోజుకు మాత్రమే ఈ ఆఫర్
కేవలం
₹11,500 ₹8,599
LAVA
Z60s | Z50
Best PRICE
Smart Discount Offers
కేవలం
₹6,999
5" Full HD Display
3GB + 32GB
FLAT 50% OFF
CELKON UNIQ
కేవలం
₹6,499
Basic Deals
Powerbank FREE
కేవలం
₹2,999
4G Smart Phone
Best DEAL
కేవలం
₹444
Amazing Deals
Earphone
కేవలం ₹99
16GB MEMORY CARD
కేవలం ₹199
FM + Memory Card options
Bluetooth Speaker
కేవలం ₹449
Neckband
కేవలం ₹699
16GB MEMORY CARD
కేవలం ₹999
బిన్యూ
SMART MOBILE STORE
లక్ష్మి నివాస్ కాంప్లెక్స్, హైదరాబాద్ రోడ్, నల్గొండ.
తెలంగాణతల్లి విగ్రహం దగ్గర, ఎం. జీ రోడ్, సూర్యాపేట.
Helpline
040 - 4849 1111
www.bnewmobiles.com /bnewmobile /bnewmobiles /bnewmobiles
BAJAJ FINSERV EMI
CAPITAL FIRST
HDB FINANCIAL SERVICES
HOME CREDIT
TVS CREDIT
మా వద్ద ఇన్సూరెన్స్ మరియు ఫైనాన్స్ సదుపాయం కలదు



పద పదవే

వయ్యారి గాలిపటమా!

నాలుగు రకాలు.. 250 వెరైటీలు..

ఈ పతంగుల పండుగలో నాలుగు రకాల కైట్స్‌ను ప్రదర్శనలో ఉంచారు. ట్రెడిషనల్ కైట్స్, ఇన్‌ఫ్లైటబుల్ కైట్స్, లైన్ కైట్స్, సింగిల్ లైన్ కైట్స్ ఉంచారు. ఈ నాలుగు రకాల్లో.. 250 పతంగుల ప్రదర్శనతో భాగ్యనగరం ఆకాశం రంగులమయమైంది.

- కన్నుల పండువగా హైదరాబాద్ అంతర్జాతీయ పతంగుల పండుగ
- పరేడ్ గ్రౌండ్‌లో సందర్శకుల ఉత్సాహం.. కేరింతలు!
- ఆకట్టుకుంటున్న వివిధ డిజైన్ల పతంగులు



సాక్షి, హైదరాబాద్: భాగ్యనగరం మురిసిపోయింది. ఆకాశం సప్తవర్ణ శోభితమైంది. పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్ నగర గగనానికి కొత్తరంగులు అద్దింది. అంతర్జాతీయ పతంగుల పండుగను నగర యువత ఎంజాయ్ చేస్తోంది. అసలే పండుగ.. ఆపై వరుస సెలవులు కావడంతో సోమవారం భారీ సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. రకరకాల ఆకారాలు, రంగురంగుల పతంగులను ఎగరేస్తూ.. రాత్రి వరకు ఉత్సాహంగా గడిపారు. ఈ పండుగకో సమే వచ్చిన దేశ, విదేశాలకు చెందిన పతంగులు సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. గాలిలో నృత్యం చేస్తున్న టైగర్, డ్రాగన్, చింపాంజీ, గరుడ వంటి రకరకాల పతంగులు చూసేందుకు ఉత్సాహం చూపించారు. గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన డీజే సౌండ్స్ సందర్శకుల్లో మరింత ఉత్సాహాన్ని పెంచాయి. రిమోట్ సహాయంతో రాత్రి ఆకాశంలో ఎగురవేసిన లైటింగ్ పతంగులు ఈ ఇంటర్నేషనల్ ఫెస్టివల్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సప్తవర్ణాల పతంగులతో పరేడ్ గ్రౌండ్ పరిసరాలు కలర్‌ఫుల్‌గా మారాయి. అటు నెక్లెస్ రోడ్‌లోనూ కుర్రకారు ఉత్సాహంగా పతంగులు ఎగురవేశారు.

రెండు కళ్లు చాలవంతే!

సంక్రాంతి పండుగ సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాలు బోసిపోగా పరేడ్ గ్రౌండ్ పరిసరాలు మాత్రం సందర్శకులతో కిక్కిరిసిపోయాయి. నగరంలో సంక్రాంతి సందడంతా పరేడ్ గ్రౌండ్‌లోనే కనిపించింది. ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్‌ను చూసేందుకు పలు ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ ఉత్సాహం.. పండుగ వాతావరణాన్ని చూసేందుకు రెండు కళ్లు చాలవంటే అతిశయోక్తి కాదు. ఈ హడావుడితో మైదానం చుట్టూ రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

4 ఇది నాలుగోసారి

హైదరాబాద్ ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్‌లో పాల్గొనడం ఇది నాలుగోసారి. ఈసారి.. ఇండోనేసియా, థాయ్‌లాండ్, మలేసియా, స్వీడన్, పోలాండ్, న్యూజిలాండ్, అమెరికా, బ్రిటన్, కొరియా, కాంబోడియా, పిలిప్పీన్స్ దేశాలకు చెందిన కైట్ ప్లేయర్స్ పాల్గొన్నారు. మాది గుజరాత్. వ్యక్తిగతంగా నాకు ఇది 15వ ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్. 45 మంది అంతర్జాతీయ కైట్ ప్లేయర్స్ ఇందులో పాల్గొంటున్నారు.

– పవన్ సొలంకి, తెలంగాణ టూరిజం కైట్స్ కన్సల్టెంట్



సీఎల్పీ నేత ఎవరు?



- కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ
- రేపు.. లేదా ఎల్లుండి సీఎల్పీ భేటీ
- రేసులో ఉత్తమ్, భట్టి, దుద్దిళ్ల, రాజగోపాల్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) సమావేశంపై సందిగ్ధం కొనసాగుతోంది. కాంగ్రెస్ అధిష్టాన దూత, కేరళ ఎంపీ కేసీ వేణుగోపాల్ సమక్షంలో సమావేశమై సీఎల్పీ నేతను ఎన్నుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆయన హైదరాబాద్‌కు రానున్నారు. అయితే సమావేశానికి సంబంధించిన తేదీని టీపీసీసీ ఇంకా ఖరారు చేయలేదు. ఈ నెల 17 నుంచి రాష్ట్ర శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. అందుకు ఒకరోజు ముందు బుధవారం కనుమ రోజు సీఎల్పీ సమావేశం నిర్వహిస్తారా.. లేదా 17న శాసనసభ ప్రారంభమయ్యే రోజు నిర్వహిస్తారా.. అన్న అంశంపై పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు సీఎల్పీ నేత పదవి రేసులో టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. సీఎల్పీ నేతగా ఎవరిని నియమిస్తారన్న దానిపై పార్టీ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

బీసీ అభ్యర్థులను గెలిపించాలి: కృష్ణయ్య



హైదరాబాద్: పంచాయతీ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో బీసీ అభ్యర్థులను నిలబెట్టి గెలిపించాలని 14 బీసీ సంఘాలు రాష్ట్రంలోని బీసీ ప్రజలకు విజ్ఞప్తి చేశాయి. పార్టీ గుర్తులు లేకున్నా ఆయా పార్టీల తరఫున పోటీచేసే బీసీ అభ్యర్థులకు మద్దతివ్వాలని కోరాయి. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు బీసీ అభ్యర్థులకు మద్దతివ్వాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య ఆయా పార్టీలకు సోమవారం లేఖలు రాశారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతానికి తగ్గించి అన్యాయం చేశారని విమర్శించారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా స్పందించలేదని తెలిపారు. దీంతో సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేశామని, రెండు, మూడు రోజుల్లో దీనిపై వాదనలు జరుగుతాయని పేర్కొన్నారు. జనరల్ స్థానాల్లోనూ బీసీలు అభ్యర్థులుగా నిలబడాలని పిలుపునిచ్చారు. పంచాయతీ ఎన్నికల్లో భారీగా డబ్బులు, మద్యం పంచిపెడుతున్నారని అన్నారు. ఎన్నికలు ముగిసే వరకు మద్యం షాపులను మూసేయాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. కార్యక్రమంలో బీసీ జాతీయ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సురేశ్, నీలం వెంకటేశ్, రాజేందర్, మల్లేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే కన్హయ్యపై చార్జ్‌షీట్


సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు నారాయణ ధ్వజం



సాక్షి, న్యూఢిల్లీ: జేఎన్‌యూ విద్యార్థి సంఘం మాజీ నేత కన్హయ్య కుమార్ తదితరులపై కేంద్రప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు నారాయణ ఆరోపించారు. సోమవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. మూడేళ్ల క్రితం అక్రమంగా బనాయించిన దేశద్రోహం కేసులో రాజకీయ దురుద్దేశంతో కేంద్రం ఇప్పుడు చార్జ్‌షీట్ దాఖలు చేసిందన్నారు. దేశ వ్యతిరేక నినాదాలపై ఎలాంటి ఆధారాలు లేకపోవడం వల్లే గతంలో కన్హయ్యను విడుదల చేశారని, అయితే ఇప్పుడు సాధారణ ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రత్యర్థులను ఇరుకునపెట్టాలని చార్జ్‌షీట్ దాఖలు చేశారని విమర్శించారు. కేంద్రం తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం దర్యాప్తు సంస్థలను ఇష్టానికి వాడుకుంటోందని, చివరికి సీవీసీ కమిషనర్ కేవీ చౌదరి కూడా కేంద్రానికి లొంగిపోయారని ఆరోపించారు. ఇలాంటి చర్యలను ప్రజలు ఉపేక్షించరని, ఎన్నికల్లో వారే తగిన బుద్ధి చెబుతారన్నారు.

ఎంతటి వారైనా ఉపేక్షించొద్దు..

మైనర్ బాలిక రేప్ కేసులో సీపీకి హోంమంత్రి ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: నగర కమిషనరేట్‌లోని కామాటిపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై జరిగిన లైంగిక దాడి ఘటనపై హోంమంత్రి మహమూద్ అలీ ఆరా తీశారు. ఈ ఘటనకు పాల్పడినవారు ఎంతటి వారైనా ఉపేక్షించవద్దని, ఈ కేసు దర్యాప్తు కోసం ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి విచారణ వేగవంతం చేయాలని నగర కమిషనర్ అంజనీకుమార్‌ను సోమవారం ఫోన్‌లో ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని, మహిళల భద్రత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల రక్షణ చర్యలు చేపడుతోందన్నారు. అదే విధంగా బాధితురాలికి వైద్యసహాయం అందించాలని, ఎలాంటి సహాయ సహకారాలు అవసరమున్నా వేగంగా స్పందించాలని కమిషనర్‌కు హోంమంత్రి ఆదేశాలు జారీ చేశారు.

అసెంబ్లీ సమావేశాలూ, భద్రతా ఏర్పాట్లపై మండలి చైర్మన్ సమీక్ష



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 17 నుంచి నిర్వహించనున్న అసెంబ్లీ సమావేశాలు, భద్రతా ఏర్పాట్లపై మండలి చైర్మన్ స్వామిగౌడ్ నేతృత్వంలోని బృందం సోమవారం సమీక్షించింది. శాసనసభ కార్యదర్శి నరసింహాచార్యులు, డీజీపీ మహేందర్‌రెడ్డి, నగర కమిషనర్ అంజనీకుమార్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఉన్నతాధికారులు, ట్రాఫిక్, ఫైర్ విభాగాల ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో పోలీస్ ఉన్నతాధికారులు అసెంబ్లీ, మండలి ప్రాంగణాలను పరిశీలించి సీఎం, వీఐపీల అలైటింగ్ పాయింట్లు, వాటి భద్రత, అసెంబ్లీ లోపల, బయట ఎంత మంది సిబ్బందిని భద్రతలో నిమగ్నం చేయాలన్న దానిపై చర్చించారు. అదే విధంగా ట్రాఫిక్‌సమస్య తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ముందు జాగ్రత్తగా అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు.

సంరక్షణ హేయం.. ధనార్జనే ధ్యేయం

ఎన్జీవోలు నడుపుతున్న పలు సంరక్షణ గృహాలు అస్తవ్యస్తం

- కనీస సౌకర్యాలు కల్పించరు.. రక్షణ చర్యలూ డొల్లే
- మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆకస్మిక తనిఖీలతో వెలుగులోకి..
- రాష్ట్రవ్యాప్తంగా 62 గృహాలకు తాళం వేసిన అధికారులు
- పోలీసుశాఖ సమన్వయంతో ఇకపై నిరంతర దాడులకు ప్రణాళిక

ఓ బాలబాలికల సంరక్షణ కేంద్రం నిర్వాహకులు అనాథ బాలలతో భిక్షాటన చేయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సదరు సంరక్షణ కేంద్రానికి ఎలాంటి అనుమతులు లేనప్పటికీ దర్జాగా పిల్లలతో భిక్షాటన చేయిస్తున్న తీరుపై సమాచారం అందుకున్న అధికారులు క్షణాల్లో అక్కడికి చేరుకుని బాలబాలికల సంరక్షణ కేంద్రంపై దాడి చేశారు. పూర్తిస్థాయిలో తనిఖీ చేసి ఆ కేంద్రానికి తాళం వేశారు. అక్కడున్న పిల్లలను ప్రభుత్వ గృహానికి తరలించారు.

– ఇటీవల రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ సమీపంలో చోటుచేసుకున్న ఘటన ఇది



సాక్షి, హైదరాబాద్

ఇది కేవలం ఒక జిల్లాలో జరిగిన ఘటన కాదు. రాష్ట్రంలో చాలాచోట్ల అనధికారికంగా కొనసాగుతున్న పలు బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు చేస్తున్న నిర్వాకమిదే. అనాథ పిల్లల సంరక్షణ ముసుగులో పిల్లలతో వెట్టి చాకిరీ, భిక్షాటన తదితర కార్యకలాపాలు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న సంస్థలు అనేకం. ఇటీవల మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖకు ఫిర్యాదులు వెల్లువెత్తడంతో రాష్ట్రవ్యాప్తంగా ఆకస్మిక దాడులకు దిగిన అధికారులకు కళ్లు బైర్లు కమ్మే వాస్తవాలు తెలిశాయి. ఎలాంటి అనుమతులు లేకుండా కేంద్రాలను నడుపుతున్న సంస్థలు కొన్నైతే, అనుమతులున్నప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించకుండా బాల, బాలికలను దుర్భర స్థితిలోకి నెట్టివేస్తున్న సంస్థలు మరికొన్ని. ఈ పరిస్థితులను పరిశీలించిన తనిఖీ బృందాలు పలు బాలల సంరక్షణ కేంద్రాలకు తాళం వేశారు.

62 సంరక్షణ కేంద్రాలు సీజ్

రాష్ట్రవ్యాప్తంగా 448 బాలల సంరక్షణ కేంద్రాలున్నట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. వీటికి అధికారికంగా గుర్తింపు ఉన్నప్పటికీ పలు కేంద్రాలు మూతబడ్డాయి. కానీ అనధికారికంగా కొనసాగుతున్న సంరక్షణ కేంద్రాల సంఖ్య వందల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖకు ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఆ శాఖ అధికారులు రెవెన్యూ, పోలీసు యంత్రాంగంతో కలిసి పలు చోట్ల దాడులు నిర్వహించారు. ఇందులో ఏకంగా 62 కేంద్రాలకు తాళం వేశారు. ఈ కేంద్రాల్లో పిల్లలకు కల్పిస్తున్న రక్షణ శూన్యమనే చెప్పాలి. అనాథ పిల్లలు, కుటుంబ సమస్యలతో బయటికి వచ్చిన పిల్లలు, తప్పిపోయిన పిల్లలు ఎక్కువగా ఈ సంరక్షణ ఈ కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్నారు. ప్రభుత్వ సాయం పొందిన వారిని ప్రభుత్వ గృహాలకు తరలిస్తుండగా, స్వచ్ఛంద సంస్థలు, సంఘ సేవకులకు చిక్కిన పిల్లలు నేరుగా ప్రైవేటు సంస్థలు, ఎన్జీవోలు నిర్వహిస్తున్న కేంద్రాల్లో చేరుతున్నారు. ఈ కేంద్రాల్లోని పిల్లలకు విద్యతో పాటు ఇతర నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి ప్రయోజకులను చేయడమే సంరక్షణ కేంద్రాల ప్రధాన లక్ష్యం. కానీ ఈ కేంద్రాల్లో జరుగుతున్న వాస్తవ కార్యక్రమాలు భిన్నంగా ఉన్నాయి. కొన్ని సంస్థలు పిల్లలతో వెట్టి చాకిరి చేయిస్తుండగా, కొన్ని సంస్థలు ఏకంగా భిక్షాటన చేయించి సొమ్ము చేసుకుంటున్నాయి.

గుర్తింపు తప్పనిసరి...

జువైనల్ జస్టిస్–2015 చట్టం ప్రకారం ప్రతి బాలల సంరక్షణ కేంద్రప్రభుత్వ గుర్తింపు పొందాల్సి ఉంటుంది. ఈ కేంద్రాల్లో బాలబాలికలకు వేర్వేరుగా ఆశ్రయం ఇవ్వాలి. ఒకే భవనంలో వసతి కల్పించడానికి వీల్లేదు. వయసుల వారీగా బాలలకు వేరువేరు గదులు కేటాయించాలి. బాలికల ఆశ్రమాల్లో మహిళలే పనిచేయాలి. చిన్నారులకు కచ్చితంగా పరుపు, మంచం ఉండాలి. ప్రతి 25 మంది చిన్నారుల పడకకు వెయ్యి నుంచి 2 వేల చదరపు అడుగుల వైశాల్యం ఉండాలి. ప్రతి 8 మందికి ఒక మూత్రశాల, ప్రతి ఐదుగురికి ఒక స్నానపు గది తప్పనిసరి. వైద్యుడు అందుబాటులో ఉండి నెలకోసారి వైద్య పరీక్షలు నిర్వహించి రికార్డుల్లో నమోదు చేయాలి. మెనూ ప్రకారం పౌష్టికాహారం, రక్షిత తాగునీరు సమకూర్చాలి. సిబ్బంది, చిన్నారుల వ్యక్తిగత ప్రొఫైల్, వైద్య, ఆరోగ్యపరమైన వివరాల రికార్డులు నిర్వహించాలి. ప్రాంగణం చుట్టూ ప్రహరీతోపాటు రక్షణ వలయం, 24 గంటల పాటు భద్రత, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. కౌన్సిలర్, టీచర్ నిత్యం విధుల్లో ఉండాలి. చదువుతోపాటు వృత్తిపరమైన శిక్షణ అందజేయాలి. స్కూళ్లకు పంపినా తోడుగా మరొకరిని ఉంచాలి. ఆరేళ్లలోపు చిన్నారులను ఆశ్రమాల్లో చేర్చుకోవద్దు. కానీ ఈ నిబంధనలకు పలు సంస్థలు మంగళం పాడాయి. నిబంధనల్ని పలు సంస్థలు గాలికొదిలేసి అనధికారికంగా నడిపిస్తున్నాయి. ఈక్రమంలో మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ సరికొత్త కార్యాచరణకు ఉపక్రమించింది. నెలకోసారి అన్ని కేంద్రాల్లో పోలీసు, రెవెన్యూ అధికారులతో కలసి తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈమేరకు కార్యాచరణను త్వరలో ప్రకటించనుంది.

మళ్లీ ఓట్ల ‘పంచాయితీ’!

సర్పంచ్ ఎన్నికల ఓట్లలోనూ భారీగా గల్లంతు

సాక్షి, హైదరాబాద్: మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో వివాదానికి కారణమైన 22 లక్షల ఓట్ల గల్లంతుపై రచ్చ జరుగుతుండగానే.. పంచాయతీ ఎన్నికల్లోనూ ఈ గల్లంతు వ్యవహారం వివాదాస్పదమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్ల జాబితాతో అభాసుపాలైనా తీరుమార్చుకోని ఎన్నికల సంఘం.. ఈ జాబితా ఆధారంగానే పంచాయతీ ఓటర్ల జాబితాను రూపొందిస్తుండడమే ఇందుకు కారణం. శాసనసభ ఎన్నికలు ముగిసిన తర్వాత.. కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం షెడ్యూల్‌ను ప్రకటించింది. డిసెంబర్ 26 నుంచి జనవరి 25 వరకు కొత్త ఓటర్ల నమోదు కోసం దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది. ఈ నెల 9వరకు కొత్త ఓటర్ల నమోదు కోసం ఏకంగా 8,64,128 దరఖాస్తులొచ్చాయి. 2019 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వ్యక్తులకు అవకాశం కల్పిస్తూ ఓటర్ల నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తుండగా, ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల్లో 18–19 ఏళ్ల వయస్సు గల కొత్త ఓటర్ల దరఖాస్తుల సంఖ్య వేలల్లోనే ఉండనుంది. మిగిలిన వారిలో అత్యధికులు గతంలో ఓటుండి.. ఆ తర్వాత జాబితాలో పేర్లు గల్లంతైనవారే. ఇప్పటికే ఓటర్ల నమోదుకు 8.6లక్షల దరఖాస్తులు రాగా, ఈ నెల 25తో గడువు ముగిసే నాటికి ఈ సంఖ్య 20 లక్షలకు మించే అవకాశముందని ఎన్నికల సంఘం అంచనా వేస్తోంది. ఇందులో సగానికిపైగా గ్రామీణ ఓటర్లే ఉండనున్నారు. ఫిబ్రవరి 22న ప్రచురించనున్న కొత్త ఓటర్ల జాబితాలో వీరికి చోటు లభించనుంది. అయితే.. ఈ నెల 21, 25, 30 తేదీల్లో మూడు దశల్లో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం వీరికి ఉండదు.

అసెంబ్లీ జాబితాతోనే..

శాసనసభ నియోజకవర్గాల ఓటర్ల జాబితాలను విభజించి గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా తయారు చేసిన ఓటర్ల జాబితాలను పంచాయతీ ఎన్నికల్లో వినియోగిస్తున్నారు. డిసెంబర్ 19న తొలి అనుబంధ ఓటర్ల జాబితా ప్రచురించగా, గ్రామ పంచాయతీల్లో 1,49,52,058 మంది ఓటర్లున్నట్లు వెల్లడైంది. ఈ నెల 7న రెండో అనుబంధ ఓటర్ల జాబితాను ప్రచురించిన ఓటర్ల సంఖ్యగా స్వల్పంగా పెరిగి 1.50 కోట్లకు చేరింది. శాసనసభ ఎన్నికల్లో ఓట్లు గల్లంతైన వారు ఆ తర్వాత పెద్ద సంఖ్యలో మళ్లీ ఓటరుగా నమోదు కావడానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను సకాలంలో పరిష్కరించకుండా పెండింగ్‌లో ఉంచడంతో రెండో అనుబంధ ఓటర్ల జాబితాలో కొద్ది మంది కొత్త ఓటర్లకు మాత్రమే చోటు లభించింది. అదేవిధంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కింద వచ్చిన 8.5లక్షల కొత్త ఓటరు నమోదు దరఖాస్తులను సైతం ఇంకా పరిష్కరించలేదు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించిన ఓటర్ల జాబితానే కాస్త.. అటు ఇటుగా మార్చి గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు వినియోగించాల్సిన దుస్థితి ఏర్పడింది.

ఆ రెండు కార్యక్రమాలతోనే..

2015లో చేపట్టిన నేషనల్ ఎలక్టరల్ రోల్ ప్యూరిఫికేషన్ అండ్ అథెంటిఫికేషన్ ప్రొగ్రాం (నెర్పార్) కింద 35,00,700 ఓటర్లను, ఆ తర్వాత 2016లో ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఎలక్టొరల్ రోల్ (ఐఆర్‌ఈఆర్) కార్యక్రమం కింద మరో 24,20,244 ఓటర్లు కలిపి మొత్తం 59,20, 944 ఓటర్లను తొలగించారు. అసెంబ్లీ ఎన్నికల్లో లక్షల సంఖ్యలో ఓట్ల గల్లంతుకు ఈ రెండు కార్యక్రమాలే కారణమని విమర్శలున్నాయి. ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైన కారణంగా.. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని కోల్పోయామని.. చాలా మంది ఔత్సాహిక అభ్యర్థుల నుంచి ఫిర్యాదులొచ్చాయి. ఈ క్రమంలో త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో సైతం పెద్ద మొత్తంలో ఓట్లు గల్లంతు కావడానికి అవకాశాలున్నాయని చర్చ జరుగుతోంది.

పరిస్థితులు మారతాయి..

లోక్‌సభ ఎన్నికల ముందు కేడర్‌లో జోష్ నింపే ప్రయత్నాల్లో కమలనాథులు

‘టార్గెట్ కాంగ్రెస్’గానే ప్రచారం చేపట్టాలని నాయకత్వం ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో డీలా పడిపోయి, నిరాశానిస్పృహలకు గురైన కేడర్‌లో ఉత్సాహం నింపే ప్రయత్నాల్లో బీజేపీ నాయకత్వం నిమగ్నమైంది. అసెంబ్లీ ఎన్నికల నాటి పరిస్థితులు లోక్‌సభ ఎన్నికలకల్లా మారతాయని కార్యకర్తల్లో మనోధైర్యం కల్పిస్తున్నారు. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నాయకత్వం అప్రమత్తమైంది. లోక్‌సభ ఎన్నికల్లో కచ్చితంగా మంచి ఫలితాలు రాబట్టే అవకాశముందని, నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే దేశవ్యాప్తంగా బీజేపీని గెలిపిస్తాయనే విశ్వాసాన్ని కలిగించేందుకు ముఖ్యనేతలు సిద్ధమవుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కంగుతిన్నా.. కార్యకర్తలు నైరాశ్యం నుంచి బయటపడటానికి కొంత సమయం పట్టొచ్చని బీజేపీ నేత ఒకరు ‘సాక్షి’కి చెప్పారు.

బీజేపీ చేస్తోందని చెప్పాలి...

ఇటీవల ఢిల్లీలో జరిగిన బీజేపీ జాతీయ కార్యవర్గభేటీలో ప్రధాని మోదీ, అధ్యక్షుడు అమిత్‌షా కేడర్‌లో కొత్త ధైర్యాన్ని, విశ్వాసాన్ని నూరిపోసే ప్రయత్నం చేశారు. తెలంగాణకు ప్రత్యేక దిశానిర్దేశం ఏమీ చేయకపోయినా, ప్రజాకూటమి పేరిట కాంగ్రెస్ చేసిన ఎన్నికల ప్రయోగం విఫలం కావడం గురించి ప్రత్యేకంగా ఉదహరించారు. జాతీయస్థాయిలో వివిధ రాజకీయపక్షాలు, ప్రాంతీయపార్టీలను కలుపుకుని పోయేందుకు కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నం కూడా ఇదే విధంగా విఫలప్రయోగంగా మారుతుందనే ధీమాను బీజేపీ నేతలు, కార్యకర్తల్లో కల్పించే ప్రయత్నం జరిగింది. కేంద్రం అమలు చేస్తున్న పలు పథకాల వల్ల తెలంగాణసహా దేశవ్యాప్తంగా కోట్లాదిమంది లబ్ధి పొందుతున్నా, వాటిని బీజేపీ చేపడుతోందన్న విషయం ప్రజలకు చేరడంలేదని జాతీయ నాయకత్వం అభిప్రాయపడింది. ఉజ్వల స్కీం ద్వారా ఎల్పీజీ సిలిండర్లు, జన్‌ధన్ ద్వారా బ్యాంకు ఖాతాల్లోకి పెన్షన్లు, ఇతర రూపాల్లో ప్రత్యక్షంగా సొమ్ము వచ్చి చేరడం, జీఎస్టీ అమల్లోకి వచ్చాక మధ్యతరగతి, వ్యాపార వర్గాలకు మేలు కలగడం వంటి వాటిపై విస్తృత ప్రచారం చేయాలని రాష్ట్ర నాయకత్వాలను నిర్దేశించింది.

ప్రధాన టార్గెట్ కాంగ్రెస్సే..

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి ప్రయోగం విఫలమైన తీరుపై పెద్దఎత్తున ప్రచారం చేయాలని రాష్ట్ర నేతలను అధినాయకత్వం ఆదేశించింది. అవినీతి తదితర అంశాలపై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించింది. స్థానిక సమస్యలతోపాటు సుదీర్ఘకాలం అధికారంలో ఉన్నందున మూడు రాష్ట్రాల్లో బీజేపీపై ప్రభుత్వ వ్యతిరేకత పనిచేసిందని పేర్కొంది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్సే ప్రధాన శత్రువని, ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశం తిరోగమనంలోకి వెళ్తుందని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని నిర్దేశించింది.



సోమవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన ఏకలవ్య ‘ఫస్ట్ నేషనల్ స్పోర్ట్స్ మీట్’లో చిత్రాలను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి జశ్వంత్ సిన్హ్


నవోదయకు దీటుగా ‘ఏకలవ్య’

- గిరిజన వ్యవహారాల కేంద్ర సహాయ మంత్రి జశ్వంత్ సిన్హ్
- ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధికి మోదీ కృషి

హైదరాబాద్: జవహర్ నవోదయ పాఠశాలలకు దీటుగా ఏకలవ్య పాఠశాలలను తీర్చిదిద్దుతామని గిరిజన వ్యవహారాల కేంద్ర సహాయ మంత్రి జశ్వంత్ సిన్హ్ సుమన్ భాయ్ భభోర్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సహకారంతో కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో ఈఎంఆర్‌ఎస్ (ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్) తొలి ‘ఫస్ట్ నేషనల్ స్పోర్ట్స్ మీట్’కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సోమవారం ప్రారంభమైన ఈ స్పోర్ట్స్ మీట్ 16 వరకు జరగనుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏకలవ్య పాఠశాలలు నెలకొల్పాలన్న దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి ఆలోచననే ప్రధాని నరేంద్ర మోదీ ఆచరణలో పెట్టారని తెలిపారు. 2022లోగా 400 ఏకలవ్య మోడల్ స్కూళ్ల ప్రారంభించి, వాటిని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో కీలకంగా నిలిచిన ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధికి మోదీ కృషి చేస్తున్నారని తెలిపారు.

ఏకలవ్యకు నిధులు పెంచాం..

ఈఎంఆర్‌ఎస్‌లకు 2014–15 బడ్జెట్‌తో పోలిస్తే.. 2018–19 బడ్జెట్‌లో నిధులు అధికంగా కేటాయించామని వివరించారు. వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు దోహదం చేస్తాయని, అందరూ పట్టుదలతో కృషి చేసి క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. గిరిజన యువతలో ఎంతో ప్రతిభా పాటవాలు దాగి ఉంటాయని, అందుకు క్రికెటర్ ధోనీ, బాక్సర్ మేరికోమ్‌లే నిదర్శనమని అన్నారు. 20 వేల జనాభాకు ఒక గురుకులం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏక్ భారత్ – శ్రేష్ట భారత్ నినాదంతో దేశ అభివృద్ధికి మోదీ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఈఎంఆర్‌ఎస్ విద్యార్థులు స్వచ్ఛ భారత్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, హరితహారం నృత్యాలు, వివిధ రాష్ట్రాల విద్యార్థులు ప్రదర్శించిన కోయ, లంబాడీ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గిరిజన వ్యవహారాల కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ జనరల్ బిశ్వజిత్ దాస్, రాష్ట్ర గిరిజన సంక్షేమ కార్యదర్శి డాక్టర్ బెన్హూర్ మహేశ్ దత్ ఎక్కా, కమిషనర్ డాక్టర్ క్రిస్టినా జడ్ చోగ్తు, టీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్, కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ డైరెక్టర్ రాజేంద్ర కుమార్, శాట్స్ చైర్మన్ ఎ.వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



‘పీడీ’కిలి బిగిసింది

రాష్ట్రవ్యాప్తంగా 1,199 మందిపై పీడీ యాక్ట్

దొంగలు మొదలు లైంగిక వేధింపుల నిందితుల వరకు.. అందరిపై నమోదు

రాష్ట్రంలో క్రైమ్‌రేటు తగ్గుదలలో పీడీ యాక్ట్ బాగా ఉపకరించింది. సాధారణ దొంగలు, రౌడీషీటర్లు, పదే పదే లైంగిక వేధింపులకు గురిచేస్తున్నవారు తదితర నిందితులపై పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. దీనివల్ల వ్యవస్థీకృత నేరాల్లో తగ్గుదల కనిపించినట్టు డీజీపీ మహేందర్‌రెడ్డి తెలిపారు. పీడీ యాక్ట్ కింద కేసులు మోపబడిన వారు చేసే నేరాల్లో గతేడాదికి ఇప్పటికీ 37% క్రైమ్ రేటు తగ్గుదల కనిపించిందని వెల్లడించారు. రాష్ట్ర ఆవిర్భావం నుంచి 2018 డిసెంబర్ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 1,199 మంది నేరస్థులపై పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. - సాక్షి, హైదరాబాద్

2014లో	2015లో	2016లో	2017లో	2018లో
29 మంది	275 మంది	348 మంది	162 మంది	385 మంది

ఈ మొత్తం నేరాల్లో కొంతమంది రాజకీయ నాయకుల అనుచరులు కూడా ఉండటంతో వారిపై పీడీ యాక్ట్ అమలు చేయకుండా పోలీస్‌శాఖపై

ఒత్తిడి ఉన్నా తగ్గేది లేదు...

మొదట్లో ఒత్తిడి వచ్చినట్టు తెలిసింది. అయితే, ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఆదేశాలతో పోలీస్ ఉన్నతాధికారులు కేసుల నమోదుకు వెనుకాడలేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ నేరాల నియంత్రణలో వెనక్కి తగ్గాల్సిన అవసరం లేదన్న వైఖరితో పీడీ యాక్ట్ అమలు చేశారు. పీడీ యాక్ట్ మోపబడినవారిలో ముగ్గురు లైంగిక వేధింపులకు గురిచేసిన వారుండటం సంచలనం రేపుతోంది. షీ టీమ్స్ ద్వారా ఈవ్‌టీజింగ్, లైంగిక వేధింపుల నియంత్రణకు రాష్ట్రవ్యాప్తంగా పోలీస్‌శాఖ చర్యలు చేపడుతోంది. మొదటిసారి పట్టుబడ్డ వారికి కౌన్సెలింగ్ ఇస్తుండగా, రెండోసారి పట్టుబడ్డ వారికి కౌన్సెలింగ్, వార్నింగ్ ఇచ్చి వదిలేస్తున్నారు. మూడోసారి పట్టుబడితే ఏకంగా కేసు నమోదు చేసి రిమాండ్ చేస్తున్నారు. ఇన్ని చేసినా నాలుగోసారి పట్టుబడుతున్న వారిని పీడీ యాక్ట్‌కు సిఫారసు చేసినట్టు స్పష్టమవుతోంది. పదే పదే అదే నేరానికి పాల్పడితే ఉపేక్షించకుండా పీడీ యాక్ట్ అమలు చేస్తున్నామని ఐజీ స్వాతి లక్రా స్పష్టం చేశారు.

నేరాలను బట్టి చూస్తే...

రౌడీషీటర్లు–129, బూట్ లెగ్గర్– 18, అనైతిక కార్యకలాపాల నేరాలు–67, డ్రగ్ సరఫరా నేరస్థులు–42, మోసపూరిత వ్యక్తులు–62, పీడీఎస్ బియ్యం దొంగలు–17, మత ఘర్షణ, సంబంధిత నేరస్థులు– 2, డెకాయిటీస్–13, రాబరీ నేరస్థులు–55, దోపిడీ దొంగలు–202, చైన్‌స్నాచర్లు–122, దృష్టి మరల్చే దొంగలు–98, గూండాలు–34, లైంగిక వేధింపుల నిందితులు –3, ఆర్థిక నేరస్థులు–15, వాహనాల దొంగలు–2, ఇతర సాధారణ నేరస్థులు–57.. మొత్తం 1,199 మందిపై పీడీ యాక్ట్ ప్రయోగించారు.

అటవీ శాఖ కూడా..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కలప స్మగ్లింగ్, వన్యప్రాణుల వేటకు పాల్పడే వారిపై అటవీశాఖ చేపడుతున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. అక్రమ కలప రవాణాతో ముడిపడిన వివిధ అంశాలపై జిల్లాల్లో పోలీసు అధికారులతో కలిసి అటవీశాఖ సంయుక్తంగా అమలుచేస్తున్న కార్యాచరణ కారణంగా ఇప్పటికే 200 కేసులకు పైగా నమోదు చేశారు. వివిధ జిల్లాల్లో దాదాపు రూ. 40–50 లక్షల విలువ చేసే కలపను స్వాధీనం చేసుకున్నారు. గత కొన్నేళ్లుగా కలప స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న 500మంది బడా స్మగ్లర్లను అటవీ అధికారులు గుర్తించారు. కలప అక్రమ రవాణాపై సాగిస్తున్న ప్రత్యేక కార్యాచరణను ఈ నెలాఖరు వరకు కొనసాగించనున్నట్లు ప్రభుత్వవర్గాల సమాచారం. ఆ తర్వాత కూడా నిరంతర నిఘా కొనసాగుతుందని అటవీ అధికారులు చెబుతున్నారు. కలప స్మగ్లింగ్, వన్యప్రాణుల వేటపై ఉక్కుపాదం మోపడంలో భాగంగా వారిపై పీడీయాక్ట్ సహా కఠినమైన చట్టాల ప్రయోగానికి ఆ శాఖ సిద్ధమవుతోంది.

కఠిన శిక్షలు అమలు..: తెలంగాణ ఏర్పడ్డాక తొలిసారిగా ఆదిలాబాద్, నాగర్‌కర్నూలు తదితర జిల్లాల్లో దాదాపు 20 మంది స్మగ్లర్లపై పీడీయాక్ట్ ప్రయోగానికి అనువుగా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. రెండు, మూడురోజుల వ్యవధిలోనే పలువురిపై పీడీయాక్ట్ కింద కేసు నమోదుచేసి, ఏడాదిపాటు బెయిల్ దొరకని విధంగా శిక్ష విధించేందుకు అటవీశాఖ చర్యలు చేపట్టింది. స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న వారిపైనే కాకుండా వారి వెనక ఉండి ప్రోత్సహించే వారిని కూడా పీడీ యాక్ట్ పరిధిలోకి తీసుకొస్తున్నారు. కలప స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్టు పీసీసీఎఫ్ (విజిలెన్స్) రఘువీర్ సాక్షికి తెలిపారు. ఈ చర్యల్లో భాగంగా నిరంతర నిఘాతోపాటు ప్రత్యేక బృందాలతో దాడులు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.



బాబ్బాబు.. ఒక్క సంతకం!

- నేటికీ కొలిక్కి రాని తెలంగాణ–ఏపీల సింగిల్ పర్మిట్ వివాదం
- నాలుగేళ్లుగా తెలంగాణ లారీ యజమానులపై ఆర్థిక భారం
- 80 శాతానికి పైగా లారీలకు ఉన్నది స్టేట్ పర్మిట్ మాత్రమే
- ఏపీకి వెళ్లే ప్రతిసారీ రూ.1,500 చెల్లించాల్సిందే..
- ఇప్పటికే పలుమార్లు ఏపీ సీఎం, మంత్రులకు విజ్ఞప్తులు
- చంద్రబాబు ఒక్క సంతకం చేస్తే చాలంటున్న లారీల ఓనర్లు

సాక్షి, హైదరాబాద్



తెలుగు రాష్ట్రాలు తెలంగాణ–ఆంధ్రప్రదేశ్‌ల మధ్య నాలుగేళ్లుగా నానుతున్న సింగిల్ పర్మిట్ వివాదానికి ఇప్పట్లో తెరపడేలా కనిపించడం లేదు. ఒప్పందానికి ఏపీ సీఎం చంద్రబాబు అస్సలు ఆసక్తి చూపకపోవడంతో ఈ సమస్య మరింత జఠిలంగా మారుతోంది. ప్రతీరోజూ తెలంగాణ నుంచి ఏపీకి వెళ్లి రావాలంటే.. రూ.వేలకు వేలు చలానా కడుతున్నామంటూ లారీల యజమానులు వాపోతున్నారు. దీంతో తాము ఆ ఖర్చును వినియోగదారుల నుంచి వసూలు చేయాల్సి వస్తోందని చెబుతున్నారు.

సింగిల్ పర్మిట్ అంటే..

దేశంలో ప్రతీ రాష్ట్రంలోని వాహనాలు వివిధ పనుల రీత్యా ఇతర రాష్ట్రాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇలా రాష్ట్ర సరిహద్దు దాటిన ప్రతీసారి రూ.1,500 వరకు చలానా కడతారు. అయితే ఇలా రోజూ రాకపోకలు సాగించే వాహనాలు వేల సంఖ్యలో ఉంటాయి. ఇలాంటి వాహనాల కోసం పొరుగు రాష్ట్రాలతో పక్క రాష్ట్రాలు ఒప్పందం చేసుకుంటాయి. దాన్నే సింగిల్ పర్మిట్ విధానం అంటారు. దీని ప్రకారం.. ఒక వాహనం తరచుగా పొరుగు రాష్ట్రాలకు వెళ్లాలంటే ఏటా రూ.5,000 చెల్లిస్తే చాలు. ఏడాది పాటు ఎలాంటి ఆటంకాలు లేకుండా రాకపోకలు సాగించవచ్చు. ఇందులో భాగంగా తెలంగాణ పొరుగున ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లతో ఒప్పందం చేసుకుంది. కానీ ఏపీతో మాత్రం ఇంతవరకు చేసుకోలేకపోయింది.

ఏంటి వివాదం?

రాష్ట్రంలో దాదాపు 2 లక్షలకు మించి లారీలున్నాయి. వీటిలో 80 శాతం లారీలు కేవలం స్టేట్ పర్మిట్ మాత్రమే తీసుకున్నాయి. వీటిలో చాలావరకు రాష్ట్ర విభజనకు ముందు కొనుగోలు చేసినవే. ఆ సమయంలో ఆంధ్రాలోని కాకినాడ, కర్నూలు, మచిలీపట్నం, విశాఖపట్నం ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నా ఎలాంటి ప్రత్యేక చలానాలు ఉండేవి కావు. 2015 మార్చి 31 వరకు ఈ విధానం కొనసాగింది. కానీ, ఆ తర్వాత రాజకీయ వైరుధ్యాల నేపథ్యంలో రెండు రాష్ట్రాలు ఈ వివాదాన్ని తెరపైకి తీసుకొచ్చాయి. అయితే ఇక్కడ తెలంగాణకే అధిక నష్టం వాటిల్లుతోంది. ఏపీలో ఉన్న లారీల్లో 80 శాతం వాటికి రిజిస్ట్రేషన్ సమయంలోనే నేషనల్ పర్మిట్ తీసుకున్నారు. దీంతో వారి లారీలు తెలంగాణకు సులువుగానే రాగలుగుతున్నాయి.

ఎప్పుడు సంతకం చేస్తారో..

లారీ యజమానులపై ఆర్థిక భారంగా మారిన ఈ వివాదంపై తెలంగాణ లారీ యజమానుల సంఘం సీఎం కేసీఆర్‌ను కలిసింది. దీంతో ఒప్పందాన్ని రూపొందించి దానిపై సంతకం చేసి 2015 సెప్టెంబర్ లోనే ఏపీకి పంపారు. కానీ, చంద్రబాబు ప్రభుత్వం ఇప్పటికీ ఆ ఫైల్‌ను పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో తెలంగాణ లారీ యజమానుల సంఘం నేతలు ఏపీ సచివాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తెలంగాణ ఎన్నికలు ముగిశాక రెండు రాష్ట్రాల సీఎంల మధ్య రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈ నేపథ్యంలో చంద్రబాబు ఎప్పుడు సంతకం చేస్తారా.. అని లారీ యజమానులు కోటికళ్లతో ఎదురుచూస్తున్నారు.

ఇప్పటికైనా మాగోడు పట్టించుకోవాలి..

సింగిల్ పర్మిట్ విషయంపై ఆంధ్రప్రదేశ్ సచివాలయం చుట్టూ తిరుగుతున్నామని తెలంగాణ లారీ యజమానుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. ‘సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి పలుమార్లు, ఏపీ రవాణా మంత్రి, అక్కడి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో సమావేశమై సమస్యను విన్నవించారు. అంతా సానుకూలంగానే స్పందిస్తున్నారు. కానీ, ఫైల్‌పై ఏపీ సీఎం సంతకం మాత్రం కావడం లేదు. గతవారం కూడా మరోసారి రవాణా మంత్రిని కలిసి విన్నవించాం. ఇప్పటికీ నాలుగేళ్లు గడిచాయి. ఇప్పుడైనా మా గోడు పట్టించుకుని ఫైల్‌పై సంతకం చేయాలని కోరుతున్నాం..’అని చెప్పారు.

దాదాపు 80 శాతం పైగా తెలంగాణ లారీలకు నేషనల్ పర్మిట్ లేదు. దీంతో వీళ్లు ఆంధ్రా సరిహద్దు దాటిన ప్రతీసారి రూ.1,500 చెల్లించాల్సి వస్తోంది.

ఎంత ఖర్చు చేశారు?

- ప్రత్యేక అభివృద్ధి నిధులపై లెక్కలివ్వని ప్రభుత్వ శాఖలు
- ఈ ఏడాది నిధుల వినియోగంపై యూసీలు కోరుతున్న నోడల్ ఏజెన్సీలు
- శాఖల వారీగా హెచ్‌వోడీలకు లేఖలు

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీలకోసం అమలుచేస్తున్న ప్రత్యేక అభివృద్ధి నిధుల వినియోగంపై అయోమయం నెలకొంది. 2018–19 వార్షిక బడ్జెట్‌లో ఈ రెండు కేటగిరీల్లో రూ.26,145 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. ఇందులో ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ.16,452 కోట్లు, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ.9,693 కోట్లు చొప్పున ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులను 42 ప్రభుత్వ శాఖల ద్వారా ఖర్చు చేసేందుకు ప్రణాళికలు రూపొందించి లక్ష్యాలు నిర్దేశించింది. వార్షిక సంవత్సరం పూర్తయ్యేలోపు కేటాయించిన నిధులన్నీ ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో మూడు త్రైమాసికాలు ముగిశాయి. ప్రస్తుతం నాల్గో త్రైమాసికం కొనసాగుతోంది. ఈక్రమంలో మూడు త్రైమాసికాలలో వినియోగానికి సంబంధించిన వివరాలను నోడల్ ఏజెన్సీలకు ఇవ్వాలి. కానీ గత ఆర్నెల్లుగా ప్రత్యేక అభివృద్ధి నిధి ఖర్చుపై అయోమయం నెలకొంది. శాఖల వారీగా లక్ష్యసాధనకు సంబంధించిన వివరాలేవీ నోడల్ ఏజెన్సీలకు ఇవ్వడం లేదు. దీంతో ఈ పద్దు కింద ఎంత ఖర్చు జరిగింది, లక్ష్యాలు ఏమిటనేదానిపై అస్పష్టత నెలకొంది.

శాఖాధిపతులకు నోటీసులు

ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి పర్యవేక్షణకు ప్రభుత్వం




రెండు నోడల్ ఏజెన్సీలను ఏర్పాటుచేసింది. ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి నోడల్ ఏజెన్సీగా ఎస్సీ అభివృద్ధి శాఖ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి నోడల్ ఏజెన్సీగా గిరిజన సంక్షేమ శాఖను నియమించింది. ఈ శాఖలు ఎస్సీ, ఎస్టీ ఎస్‌డీఎఫ్ సమావేశాలు, నోడల్ ఏజెన్సీ మీటింగ్‌లు, పురోగతిపై సమీక్షలు నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలి. ఈక్రమంలో ఎస్‌డీఎఫ్ నిధుల వినియోగంపై స్పష్టత లేకపోవడంతో వినియోగానికి సంబంధించిన సమాచారం సమర్పించాలని పలుమార్లు సూచించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో తాజాగా వివరాలు సమర్పించని ప్రభుత్వ శాఖలకు నోటీసులు జారీ చేస్తున్నాయి. త్వరలో నోడల్ ఏజెన్సీ సమావేశం ఉండడంతో ఆలోపు వివరాలు ఇవ్వాలని స్పష్టం చేశాయి.

రూ.7లక్షలు పరిహారం కట్టండి

- సకాలంలో బీమా చెల్లించకుండా నష్టం కలిగించారు..
- కెనరా బ్యాంకు తీరును తప్పుపట్టిన రాష్ట్ర వినియోగదారుల ఫోరం
- వైఎస్ ప్రెస్‌కు పరిహారం చెల్లింపునకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్ : సకాలంలో బీమా చెల్లించకుండా ఓ ఖాతాదారుడికి నష్టం కలిగించడమే కాకుండా, తప్పు తమది కాదంటూ తప్పించుకునే ప్రయత్నం చేసిన కెనరా బ్యాంకు తీరును రాష్ట్ర వినియోగదారుల ఫోరం తప్పుపట్టింది. వ్యాపారం కోసం ఖాతాదారుడు రుణం తీసుకున్నప్పుడు, రుణ ఒప్పందం ప్రకారం బీమా చెల్లించాల్సిన బాధ్యత బ్యాంకుదేనని తేల్చి చెప్పింది. సకాలంలో బీమా మొత్తం చెల్లించకపోవడం వల్ల ఆ ఖాతాదారుడికి కలిగే నష్టాన్ని భరించాల్సింది బ్యాంకేనంది. సకాలంలో బీమా చెల్లించకపోవడం వల్ల వైఎస్ ప్రెస్‌కు జరిగిన ఆస్తి నష్టానికి బాధ్యత వహించాల్సిందేనని కెనరా బ్యాంకును వినియోగదారుల ఫోరం ఆదేశించింది. అతనికి రూ.7 లక్షల పరిహారాన్ని 9 శాతం వడ్డీతో చెల్లించాలని బ్యాంకుకు స్పష్టం చేసింది. ఖర్చుల కింద రూ.10వేలను చెల్లించాలంది. ఈ మేరకు ఫోరం అధ్యక్షుడు జస్టిస్ ఎం.ఎస్.కె.జైశ్వాల్, సభ్యులు కె.రమేశ్‌ల ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది. ఖమ్మం జిల్లాకు చెందిన వై.శేఖర్ వైఎస్ ప్రెస్ పేరుతో వ్యాపారం ప్రారంభించారు. వ్యాపార టర్నోవర్ బాగుండటంతో ఖమ్మంలోని కెనరా బ్యాంకు శేఖర్ ప్రెస్‌కు 2010లో రూ. 20 లక్షల రుణం ఇచ్చింది.ఒప్పందం మేరకు ప్రెస్ స్టాకుకు బ్యాంకే బీమా చెల్లించాలి. దీని ప్రకారం 2013 వరకు బీమా చెల్లించింది. 2014 నుంచి చెల్లించలేదు. పాలసీ రెన్యువల్ చేసుకోవాలని బీమా కంపెనీ నోటీసు పంపినా కెనరా బ్యాంకు పట్టించుకోలేదు. ఇదిలా ఉండగా 2015లో వైఎస్ ప్రెస్‌లో విద్యుదాఘాతం వల్ల ప్రమాదం జరిగింది. దీంతో శేఖర్ పరిహారం కోసం బీమా కంపెనీకి దరఖాస్తు చేసుకోగా, తమకు బ్యాంకు ప్రీమియం చెల్లించలేదని బీమా కంపెనీ తెలిపింది. దీంతో శేఖర్ కెనరా బ్యాంకుపై రాష్ట్ర వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశారు. దీనిపై జస్టిస్ జైశ్వాల్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. కెనరా బ్యాంకు వాదనను తోసిపుచ్చింది. బీమా కంపెనీ చూపిన రుజువులూ పరిశీలించింది.ఇరు పక్షాల వాదనలు విన్న



ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరిస్తూ కెనరా బ్యాంకు వాదనను తప్పుపట్టింది. తన తప్పును బీమా కంపెనీపై నెడుతోందంటూ ఆక్షేపించింది. ఇది పూర్తిగా బ్యాంకు బాధ్యతా రాహిత్యమేకాక, సేవలను అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడమేనని తేల్చింది. దీని వల్ల వైఎస్ ప్రెస్‌కు జరిగిన నష్టానికి కెనరా బ్యాంకే బాధ్యత వహించాలంది. వైఎస్ ప్రెస్‌కు రూ.43 లక్షల మేర నష్టం వాటిల్లిందని సర్వేయర్ నివేదిక చెబుతోందని, పోలీసులు రూ.6.8 లక్షల మేరే నష్టమని చెబుతున్నారని తెలిపింది. అందువల్ల వైఎస్ ప్రెస్‌కు రూ.7 లక్షల పరిహారాన్ని 9 శాతం వడ్డీతో సహా చెల్లించాలని కెనరా బ్యాంకును ఆదేశించింది. అలాగే ఖర్చుల కింద మరో రూ.10వేలు ఇవ్వాలంది.



వైఎస్ జగన్‌పై హత్యాయత్నం వెనుక ఎవరున్నారు?

- పెద్ద సంఖ్యలో సిమ్‌కార్డులు, సెల్‌ఫోన్లు ఎందుకు మార్చావ్?
- ఎయిర్‌పోర్టులోకి తాత్కాలిక అనుమతి పాస్ ఇప్పించిందెవరు?
- ప్రతిపక్ష నేతపై హత్యాయత్నం చేసిన శ్రీనివాసరావును ప్రశ్నించిన ఎన్ఐఏ
- ముగిసిన మూడో రోజు విచారణ
- నేడు విశాఖ ఎయిర్‌పోర్టుకు తీసుకెళ్లే యోచన


సాక్షి, అమరావతి/సాక్షి,హైదరాబాద్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసులో నిందితుడు శ్రీనివాసరావును జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) విచారించింది. విశాఖ విమానాశ్రయంలో గతేడాది అక్టోబర్ 25న హత్యాయత్నం చేసిన శ్రీనివాసరావును కస్టడీకి తీసుకున్న ఎన్ఐఏ మూడో రోజు పలు కీలక అంశాలపై ప్రశ్నించినట్టు సమాచారం. తొలుత హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో వైద్య పరీక్షలు నిర్వహించాక విచారణ కొనసాగించారు. మాదాపూర్‌లోని ఎన్ఐఏ కార్యాలయంలో శ్రీనివాసరావును అతని న్యాయవాది సమక్షంలోనే ఎన్ఐఏ అధికారులు ప్రశ్నించారు. వైఎస్ జగన్‌పై హత్యాయత్నం ఎందుకు చేశావు.. దాని వెనుక ఎవరున్నారనే దానిపై విచారించారు. శ్రీనివాసరావు కాల్ డేటాను పరిశీలించి, వాటికి సంబంధించిన వివరాలు సేకరించేందుకు పలు ప్రశ్నలు సంధించినట్టు సమాచారం. ఒక్క సంవత్సరంలో వందలాది సిమ్ కార్డులు, పదుల సంఖ్యలో సెల్‌ఫోన్లు మార్చడం వెనకున్న ఆంతర్యమేంటని ప్రశ్నించినట్టు తెలిసింది.

టీడీపీ నేతతో శ్రీనివాసరావు ఫోన్ కాల్స్‌పై దృష్టి

జగన్‌పై హత్యాయత్నం చేయడానికి ముందుగా జరిగిన బ్యాంకు లావాదేవీలపై ఆరా తీసినట్టు తెలిసింది. ఎయిర్‌పోర్టులో ఫ్యూజన్‌ఫుడ్స్ యజమాని వద్ద పనికి కుదిర్చిందెవరు? సంబంధిత టీడీపీ నేతతో శ్రీనివాసరావుకు జరిగినట్టు భావిస్తున్న ఫోన్ కాల్స్ సంభాషణలపైనా దర్యాప్తు అధికారులు దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఎయిర్‌పోర్టు లోపలికి వెళ్లేందుకు ఇచ్చే అనుమతి పాస్ తాత్కాలికమైనా క్రిమినల్ కేసులున్న వ్యక్తికి ఎలా ఇచ్చారు? తాత్కాలిక పాస్ ఇప్పించిందెవరన్న అంశాలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఆ పాస్‌కు సిఫారసు లేఖతో పాటు పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికేట్ ఇచ్చిన అధికారులు ఎవరన్నది ఎన్ఐఏ అధికారులు ఆరా తీసినట్టు సమాచారం. హత్యాయత్నం చేయడానికి ఎవరైనా పురిగొల్పారా? అనే కోణంపై కూడా దృష్టి సారించినట్టు తెలిసింది. విచారణలో భాగంగా నిందితుడు చెప్పిన వివరాలను రికార్డు చేశారు. శ్రీనివాసరావు కస్టడీలో నాల్గో రోజైన మంగళవారం మరోసారి విశాఖ ఎయిర్‌పోర్టుకు తీసుకెళ్లేందుకు ఎన్ఐఏ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. విశాఖ విమానాశ్రయంలో మరోసారి సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం శ్రీనివాసరావును తీసుకెళ్లనున్నట్టు తెలుస్తోంది. నేర స్థలంలో మరికొన్ని అదనపు వివరాలు సేకరించే విషయంపై ఎన్ఐఏ అధికారులు దృష్టిసారించారు. ఎన్ఐఏ డీఐజీ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో విచారణ కొనసాగింది.

16న ఆర్జిత సేవలు రద్దు

వసంతోత్సవం, సహస్రదీపాలంకార సేవలు కూడా: టీటీడీ



తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రతిరోజు తెల్లవారుజామున భక్తులకు కల్పించే అంగప్రదక్షిణను ఈనెల 16న రద్దు చేస్తున్నట్లు టీటీడీ తెలిపింది. ప్రతి ఏడాది శ్రీవారికి నిర్వహించే పార్వేట ఉత్సవం కనుమ నాడు (16న) జరగనుంది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను టీటీడీ నిర్వహించనుంది. తిరుమల శ్రీవారి ఆలయంలో గోదా పరిణయోత్సవం సందర్భంగా 16న ఉదయం 9.00 గంటలకు ఆండాళ్ అమ్మవారి మాలలను పెద్ద జీయర్‌స్వామి మఠం నుంచి ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకువెళ్ళి స్వామివారికి సమర్పిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మలయప్పస్వామివారు, కృష్ణస్వామివారు పార్వేట మండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ ఆస్థానం, పార్వేట కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉత్సవాల కారణంగా 16న శ్రీవారి ఆలయంలో తోమాలసేవ, అర్చన, సహస్ర కళశాభిషేకం, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్రదీపాలంకార సేవలను రద్దు చేసినట్లు టీటీడీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.



సాక్షి
మంగళవారం, జనవరి, 15

యూపీలో పొత్తుల పర్వం

ఎన్నికలు ముంచుకొస్తున్న సమయంలో రాజకీయ పార్టీలు పొత్తుల కోసం అన్వేషించడం, వ్యూహాలకు పదును పెట్టుకోవడం సాధారణమే. దేశంలో అత్యధికంగా 80 లోక్‌సభ స్థానాలున్న ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)–బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ)ల మధ్య శనివారం కుదిరిన ఎన్నికల పొత్తు ఇప్పుడు అనేక కారణాల వల్ల అందరిలోనూ ఆసక్తి కలిగిస్తోంది. చెరో 38 స్థానాలకూ పోటీ చేయాలని ఆ రెండు పార్టీలూ అంగీకారానికొచ్చాయి. కాంగ్రెస్ అధినేత సోనియాగాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న రాయ్‌బరేలీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రాతినిధ్యంవహిస్తున్న అమేథీ స్థానాలను ఆ పార్టీకే విడిచిపెట్టాలని 'పెద్ద మనసు'తో నిర్ణయించాయి. మరో రెండింటిని అజిత్‌సింగ్ పార్టీ ఆర్‌ఎల్‌డీకి ఇవ్వదల్చుకున్నాయి. 2014 సార్వత్రిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ(బీజేపీ) అక్కడ మిత్రపక్షాలతో కలిసి 73 స్థానాలు గెల్చుకుంది. అటు తర్వాత జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఘన విజయం సాధించింది. ఇప్పుడక్కడ ప్రధాన రాజకీయ పక్షాలైన ఎస్పీ, బీఎస్పీలు రెండూ కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేయాలనుకోవడం సహజంగానే బీజేపీలో వణుకు పుట్టిస్తోంది. అయితే ఆ పార్టీని జాతీయ స్థాయిలో సవాలు చేస్తున్న కాంగ్రెస్‌ను సైతం ఈ పరిణామం ఇరకాటంలో పడేయటమే విశేషం. ఒకపక్క రాహుల్‌గాంధీ భావి ప్రధాని అని డీఎంకే వంటి యూపీఏ మిత్రపక్షాలు చెబుతున్నాయి. బీజేపీపై పోరాడుతున్న యోధుడుగా పేరు తెచ్చుకోవడానికి నానా పాట్లూ పడుతున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేరుగా ఆ మాట అనకపోయినా కాంగ్రెస్‌తో పొత్తు 'ప్రజాస్వామిక అనివార్యత' అని అడిగినవారికీ, అడగనివారికీ చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయంగా కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో ప్రధాన ప్రాంతీయ పార్టీలు రెండూ కాంగ్రెస్‌ను పూర్తిగా విస్మరించటం ఆ పార్టీ సామర్థ్యంపై సంశయాలు కలగజేస్తుంది. రాజకీయంగా కీలకమైన రాష్ట్రంలో తనను అసలు కూటమి ఏర్పాటులో పరిగణనలోకి తీసుకోకపోవడం వల్ల జాతీయ స్థాయిలో తన పాత్ర కుంచించుకుపోవడం ఖాయమని కాంగ్రెస్‌కు తెలుసు. ఇది చాలదన్నట్టు ఎస్పీ–బీఎస్పీ పొత్తు కుదిరిన 24 గంటల్లో రాష్ట్రీయ జనతాదళ్(ఆర్‌జేడీ) నాయకుడు, లాలూ ప్రసాద్ యాదవ్ కుమారుడు తేజస్వి యాదవ్ యూపీకి తరలివెళ్లి ఆ కూటమికి మద్దతు ప్రకటించడం కాంగ్రెస్‌ను మరింత కలవరపరిచి ఉండాలి. బిహార్‌లో ఆర్‌జేడీ–కాంగ్రెస్‌లు ఇప్పటికే కూటమిగా ఉన్నాయి. అయితే బిహార్‌లో తేజస్వి ఇలాంటి ప్రయోగం చేయడానికి అవకాశం లేదు. బిహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌కు చెందిన జనతాదళ్(యూ), రాంవిలాస్ పాశ్వాన్‌కు చెందిన లోక్ జనశక్తి పార్టీ(ఎల్‌జేపీ) బీజేపీకి మిత్రపక్షాలుగా ఉన్నాయి. కనుక ఎస్పీ–బీఎస్పీల తరహాలో కాంగ్రెస్‌ను దూరం పెట్టి పొత్తు పెట్టుకోవడానికి తగిన బలమైన ప్రాంతీయ పార్టీ తేజస్వికి బిహార్‌లో దొరక్కపోవచ్చు.

ఎస్పీ–బీఎస్పీ పొత్తుతో ఖంగుతిన్న కాంగ్రెస్ తాము మొత్తం 80 స్థానాలకూ పోటీ చేస్తామని బింకంగా చెబుతున్నా ఆ రాష్ట్రంలో అంతంతమాత్రంగా ఉన్న ఆ పార్టీకి అంతమంది అభ్యర్థులు దొరకడం కూడా కష్టమే. కాంగ్రెస్‌ను కూడా కూటమిలో చేర్చుకుంటే అది మరింత బలంగా ఉండేదని చెబుతున్నవారున్నారు. ముఖ్యంగా ఇటీవల జరిగిన 5 రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ పుంజుకున్న సూచనలు కనబడ్డాయని వారి వాదన. దాంతోపాటు ముస్లిం ఓట్లలో చీలిక వస్తే ఆమే రకు బీజేపీ లాభపడుతుందని వారంటున్నారు. అయితే మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఇటీవలి ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నుంచి తనకెదురైన భంగపాటుకు ఇది మాయావతి ఇచ్చిన జవాబు అని చెప్పాలి. పొత్తు కుదిరాక జరిగిన విలేకరుల సమావేశంలో ఇది స్పష్టంగా బయటపడింది. కాంగ్రెస్‌పై ప్రశ్నలు ఎదురైనా ఎస్పీ నాయకుడు అఖిలేష్ యాదవ్ ఎలాంటి వ్యాఖ్యలూ చేయకుండా మౌనంగా ఉండిపోగా, మాయావతి మాత్రం నిప్పులు చెరిగారు. ఇదంతా ఆ రెండు పార్టీల నేతలూ ముందుగా నిర్ణయించుకున్న వ్యూహంలో భాగమే కావొచ్చు. కాంగ్రెస్‌తో రెండు భిన్న సందర్భాల్లో ఆ రెండు పార్టీలూ యూపీలో పొత్తు పెట్టుకుని దెబ్బతిన్నాయి. మాయావతి వ్యక్తి గతంగా పొత్తులకు వ్యతిరేకం. రెండు దశాబ్దాలపాటు పొత్తుల కోసం వెంపర్లాడటం వల్లనే రాష్ట్రంలో తమ పార్టీ దెబ్బతిన్నదని ఆమె భావన. అందుకే ఆమె వీటికి దూరంగా ఉన్నారు. 2009 లోక్‌సభ ఎన్నికల్లో 20 స్థానాలకు పరిమితమైన ఆమె పార్టీ 2012లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దారుణ పరాజయం చవిచూశారు. అనంతరం 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా గెల్చుకోలేకపోయారు. రాష్ట్రంలో ఫలానా కులం లేదా మతం ఓట్లు లభించడానికి ఆ వర్గాలకు ప్రాతి నిధ్యం వహిస్తున్నామని చెప్పే పార్టీలతో పొత్తు కంటే... నేరుగా ఆ వర్గాలవారికి రాయితీలిస్తామని చెప్పడమే మార్గమని ఆమె నమ్ముతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎస్పీ–బీఎస్పీ కూటమిగా ఏర్పడాలని నిర్ణయించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఒక రాష్ట్రంలో అధికారం కోసం పోటీ పడుతున్న రెండు ప్రాంతీయ పార్టీలు సన్నిహితం కావడం సాధారణ విషయం కాదు. అఖిలేష్ యాదవ్ గట్టిగా కృషి చేయకపోయి ఉంటే ఇది సాధ్యమయ్యేది కాదు. బీజేపీని దెబ్బతీయడానికి బీఎస్పీతో కలిసి నడవటం అవసరమని ఆయన గుర్తించటంతోపాటు మాయావతిని కూడా అందుకు ఒప్పించారు.

ఉత్తరప్రదేశ్‌లో సాగుతున్న వరస ఎన్‌కౌంటర్లు, గోరక్షణ పేరుతో కొన్ని ముఠాలు సాగిస్తున్న దాడులతో ఆ రాష్ట్ర ప్రజలు బీజేపీతో విసుగెత్తి ఉన్న మాట వాస్తవం. కానీ ఆ అసంతృప్తి మాత్రమే ఎస్పీ–బీఎస్పీ కూటమికి అధిక స్థానాలు సాధించిపెట్టదు. జనం ఎదుర్కొంటున్న సమస్యలపై తమ వైఖరేమిటో, వాటికి తమ పరిష్కారాలేమిటో అవి చెప్పగలగాలి. ఆ రెండు పార్టీలూ తనను ఎందుకు దూరం పెట్టాయో కాంగ్రెస్ సైతం ఆత్మ విమర్శ చేసుకోవాలి. తనకు బలమున్న చోట ఎవరినీ లెక్క చేయకపోతే తనకూ వేరేచోట అదే పరిస్థితి ఏర్పడుతుందని యూపీ అనుభవంతో కాంగ్రెస్ గ్రహించాలి.


గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు పుష్యమాసం, తిథి శు.నవమి రా.7.43 వరకు, తదుపరి దశమి నక్షత్రం అశ్వని ఉ.9.41 వరకు, తదుపరి భరణి, వర్జ్యం రా.7.21 నుంచి 9.00 వరకు, దుర్ముహూర్తం ఉ.8.49 నుంచి 9.34 వరకు తదుపరి రా.10.51 నుంచి 11.44 వరకు, అమృతఘడియలు... తె.5.14 నుంచి 6.54 వరకు, మకర సంక్రాంతి. ఉత్తరాయణ ప్రారంభం.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం: 5.40
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

వ్యవస్థల్ని ఇంత పతనం చేయాలా?

సీబీఐలో తాజాగా సాగిన రెండు వర్గాల మధ్య పోరు– అవినీతికి సంబంధించిందే. ఇందులో ప్రధాన డైరెక్టర్ ఆలోక్ వర్మ, స్పెషల్ డైరెక్టర్ ఆస్థానా మధ్య ఎవరికెక్కువ అవినీతి అన్న సమస్యను తేల్చడంలో బీజేపీ పాలకవర్గం ప్రధానంగా ఆరోపణలున్న ఆస్థానాకు కంటితుడుపుగా కొమ్ముకాసి, డైరెక్టర్ ఆలోక్ వర్మపై ఆస్థానా ఆరోపణలను భుజానికెత్తుకుంది. రఫేల్ ఒప్పందం కాగితాలు, వాటి వెనుక జరిగిన వేలకోట్ల రూపాయల లావాదేవీలు సీబీఐ చేతికి చిక్కి రచ్చకాకుండా ఉండాలంటే– ఆలోక్ వర్మ అక్కడ ఉండకూడదు. ఈ పథకంలో విజిలెన్స్ కమిషనర్, సుప్రీం జడ్జి కూడా మోదీకి దన్ను కాస్తూ భాగం కావడం రాజ్యాంగ వ్యవస్థల పరిపూర్ణ పతనానికి గుర్తు.



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

''నీవు శిక్షణ ఫలితంగా అబ్బిన గుణగణాల వల్ల, నీవు జతకట్టిన స్నేహితులను బట్టి, నీలో కొన్ని వర్గ భావాలు ఏర్పడుతుంటాయి. అలాంటప్పుడు నీవు ఇతరుల అభిప్రాయాలను పరిశీలించాల్సి వచ్చినప్పుడు నీవు చెప్పాలనుకున్న నీ మంచి అభిప్రాయాన్ని నిశితమైన నీ తీర్పును ప్రకటించలేవు. శ్రమజీవుల పట్ల తీర్పులు ప్రకటించేటప్పుడు న్యాయమూర్తులకు (జడ్జీలు) ఎదురయ్యే సమస్యే ఇది. నిజానికి నిష్పాక్షికంగా వ్యవహరించగల నీ జడ్జీలెక్కడ? ఈ జడ్జీలు విద్యాధికులైనప్పటికీ, పారిశ్రామిక యాజమాన్యాలు పెరిగిన మూస భావాల్లోనే వారూ పెరుగుతూవచ్చారు. అలాంటప్పుడు ఒక శ్రామికుడు కానీ, ఒక ట్రేడ్ యూనియన్ కానీ, నిష్పాక్షికమైన తీర్పుల్ని ఎలా పొందగలడు? ఈ భిన్న దృక్పథాలు గల వర్గాల్లో ఒకరైన శ్రామికునికి దానికి విరుద్ధమైన వర్గానికి చెందిన మరొకరి (జడ్జి)కి మధ్య నిష్పాక్షిక నిర్ణయం అనేది క్లిష్టమైన విషయం!''
– సుప్రసిద్ధ న్యాయమూర్తి జస్టిస్ స్క్రూటన్, కేంబ్రిడ్జి లా సొసైటీలో ఉవాచ.

''న్యాయమూర్తులనేవారు కూడా ఒక వర్గానికి చెందినవారే. ఫలితంగా ఆ వర్గ లక్షణాలు వారికి అలవడటం సహజం. జడ్జీలు కూడా ప్రజాప్రయోజనాలను నిర్వచిస్తూ ఉంటారు, అయితే తామేవర్గం నుంచి వచ్చారో ఆ వర్గ భావాలనే వల్లిస్తారు. వారి దృక్పథం నుంచే భాష్యం చెబుతారు'' – (ప్రొఫెసర్ గ్రిఫిత్: ''ది పాలిటిక్స్ ఆఫ్ ది జ్యుడీషియరి'')

నేడు దేశంలో ప్రజాస్వామ్యం ముసుగులో, రిపబ్లిక్ రాజ్యాంగం పేరిట ఘటిల్లుతున్న పరిణామాలు దేశంలోని రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ ఒక్కటొక్కటిగా పాలక పక్షాలు కూలగొట్టడం వైపుగానే సాగుతున్నాయనిపిస్తోంది. సుమారు 19 ఏళ్ల నాడు భారత సుప్రీం కోర్టు 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న రోజున (జనవరి 26) సుప్రసిద్ధ సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ వి.ఆర్ కృష్ణయ్యర్ ధర్మాసన చైతన్యం ప్రజా ప్రయోజనానికి ఎంత ఉపయోగకారిగా ఉందో అంత దుర్వినియోగపడుతోందని చెప్పారు. ఇంతకూ దేశాన్ని ఎదుర్కొంటున్న అసలు సవాలంతా– సుప్రీం కోర్టును భారత ప్రజల సమున్నత స్థాయి వాణిగా మార్చేయడమేనని అదే నిజమైన వ్యవస్థా, ప్రజాస్వామిక పరివర్తన అనీ ఆయన వర్ణించారు. ఈ ప్రజాస్వామిక పరివర్తనా దశకు అనుగుణంగానే పూర్తి స్థాయిలో మన పాలకులు గాని, వారి సమక్షంలో కొలువు తీరుతున్న న్యాయవ్యవస్థగానీ నడుచుకోగలుగుతున్నాయా?

అప్పుడప్పుడూ అవాంఛనీయమైన ఒత్తిళ్లకు కేంద్రపాలకులు (ప్రధానమంత్రితో సహా) న్యాయవ్యవస్థను గురిచేస్తున్నప్పటికీ ఒక మేరకు న్యాయమూర్తులు కొందరు నిభాయించుకుని రాగలుగుతున్నట్లు కన్పిస్తున్నా, తిరిగి ఏదో ఒక దశలో పాలకవర్గ ప్రయోజనాలకు అనుగుణంగా తీర్పులను పాలకులు లొంగదీసుకునే స్థితికి అలవాడుపడుతున్నారు. ఇందుకు ఇటీవల కాలంలో అనేక ఉదాహరణలున్నాయి. వీటిలో తాజా ఘటనగా రఫేల్ విమానాల కొనుగోలు కుంభకోణంలో మోదీ (బీజేపీ) ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఎదుర్కొన్న అనేక విమర్శలు, చివరికి ఫ్రెంచి మాజీ ప్రెసిడెంట్ హయాంలో అనిల్ అంబానీ ప్రయోజనాలు నెరవేర్చే దసాల్ట్ ఫైటర్ విమానాల కంపెనీతో కుదిర్చిన 'వియ్యం' తాలూకు (రూ. 30,000 కోట్ల పైచిలుకు కాంట్రాక్టు) ఒప్పందం రగడ అక్కడితో కూడా ఆగకుండా దాని తాలూకు ప్రకంపనలు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ), సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ పెద్దల దాకా విస్తరించాయి. స్వతంత్ర భారతంలో ఇంతకుముందెన్నడూ లేనంత స్థాయిలో రాజ్యాంగ విధులను పక్కకు తోసేసి రాజ్యాంగ ప్రధాన బాహ్య శాఖలలో ఒకటైన న్యాయ వ్యవస్థలోనే రాజకీయ పాలనా వర్గం జోక్యం చేసుకోవడానికి, తీర్పులను బలవంతంగానో లేదా నర్మగర్భంగా 'సన్నాయి నొక్కుళ్ల' ద్వారానో తారుమారు చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలను ప్రజలూ, సామాజిక శాస్త్రవేత్తలు, కార్యకర్తలు, వివిధ ప్రజా సంస్థలూ గమనిస్తూనే ఉన్నారు.

రెండో మాట


నరేంద్ర మోదీ · ఆలోక్‌వర్మ · జస్టిస్ ఏకే సిక్రీ

ఈ విషయమై బీజేపీ మాజీ మంత్రి అరుణ్ శౌరి పుస్తకావిష్కరణ సందర్భంగా ప్రసిద్ధ న్యాయమూర్తి జస్టిస్ లోథా మాట్లాడుతూ చాలా బరువైన సందేశాన్ని అందజేశారు: ''సుప్రీంకోర్టు ప్రస్తుతం నడుస్తున్న దశ, తీరూ వినాశకరమయింది. సుప్రీంను నడపగలిగిన సుప్రీం నాయకత్వం అత్యవసరం. స్వతంత్ర న్యాయస్థానం ఒత్తిళ్లకు రాజీ బేరాలకు అతీతంగా ఉండాలి. అందుకు చొరవ అగ్రస్థానం నుంచే రావాలి. లేనిపక్షంలో దేశ న్యాయ వ్యవస్థ అరాచకం పాలయ్యే సమయం దగ్గర పడుతుంద''ని హెచ్చరించారు జస్టిస్ లోథా. ఒరిస్సా మెడికల్ ఇనిస్టిట్యూట్ నిర్వహణ నియామకాల్లో ఒక న్యాయమూర్తి అవినీతిని శిక్షించకుండా సమర్థించి రక్షించినందుకు అది పెద్ద వివాదాస్పద సమస్యగా మారినప్పుడు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్ ఆధ్వర్యంలో సుప్రీం పాలనా నిర్వహణ శాఖాధికారిగా ప్రధాన న్యాయమూర్తికి ఉన్న అధికారాన్ని ప్రశ్నించకుండానే ఆ అధికారాన్ని చట్ట పరిధులకు లోబడి హేతుబద్ధంగా నిర్వహించాలన్న సత్యాన్ని గుర్తింపజేస్తూ నలుగురు సుప్రీం జడ్జీలతో పత్రికా గోష్ఠి నిర్వహించి తొలిసారిగా సుప్రీంలో ప్రజాస్వామిక పద్ధతుల్లో స్పష్టమైన భిన్నాభిప్రాయాన్ని ప్రకటించి చరిత్ర సృష్టించారు. సుప్రీం నిర్వహణలో ఇదొక ఆహ్వానించదగ్గ ప్రజాస్వామ్య మలుపు.

ఇక తాజాగా, రఫేల్ కుంభకోణం పూర్వ రంగంలో మొత్తం సీబీఐ–కేంద్ర పాలకవర్గం తేనెతుట్టెంతా కదిలింది. సీబీఐ నాయకత్వంలో రెండు వర్గాల మధ్య పోరు– అవినీతికి సంబంధించిందే. అయితే ఇందులో ప్రధాన డైరెక్టర్ ఆలోక్ వర్మ, స్పెషల్ డైరెక్టర్ ఆస్థానా మధ్య ఎవరికెక్కువ అవినీతి అన్న సమస్యను తేల్చడంలో బీజేపీ పాలకవర్గం ప్రధానంగా ఆరోపణలున్న ఆస్థానాకు కంటితుడుపుగా కొమ్ముకాసి, డైరెక్టర్ ఆలోక్ వర్మపై ఆస్థానా ఆరోపణలను ప్రధానంగా భుజానికెత్తుకుంది. సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసు హత్యలో అమిత్ షా పాత్ర తెరమీదికొచ్చినప్పుడు, తరువాత జస్టిస్ లోయా అనుమానాస్పద మరణం వెనుక గాథ వెల్లడైనప్పుడు అమిత్ షాను ఉదహరిస్తూ ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ.పి.షా మాట్లాడారు, జస్టిస్ లోయా మరణవార్త చుట్టూ పాకిపోయిన అనుమానాన్ని తేలిగ్గా తోసిపుచ్చుతూ లోయా కేసును కాస్తా మూసేయడం న్యాయ శాస్త్రం రీత్యా అనుమతించదగింది కాదని ఆయన చెప్పారు. తీరా ఇప్పుడు 'వయా రఫేల్' జరిగిన తంతు– అసలు మోదీ బర్తరఫ్ చేసిన సీబీఐ చీఫ్ డైరెక్టర్ ఆలోక్ వర్మను సుప్రీం ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ తిరిగి పదవిలో ప్రతిష్ఠించి న్యాయ వ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడారు.

కానీ రఫేల్ ఒప్పందం కాగితాలు, వాటి వెనుక జరిగిన వేలకోట్ల రూపాయల లావాదేవీలు సీబీఐ చేతికి చిక్కి రచ్చకాకుండా ఉండాలంటే– ఆలోక్ వర్మ అక్కడ ఉండకూడదు. కనుకనే సీబీఐకి పోటీగా కేంద్ర విజిలెన్స్ (నిఘా) కమిషనర్ కేవీ చౌదరి రహస్యంగా ఒక పని నెరవేర్చారని ప్రధాన ప్రతిపక్షం బయట పెట్టింది. ఈ 'రహస్యం' ఏమిటి? ఆలోక్ వర్మను సీబీఐ డైరెక్టర్‌గా తప్పించడానికి 17 రోజుల ముందు (అక్టోబర్ 6) సీవీసీ చౌదరి 'అర్ధరాత్రి మద్దెలదరువు' అన్నట్టు అకస్మాత్తుగా వెళ్లి వర్మకు ఉద్వాసన ఉత్తర్వును అందజేయడానికి వెళ్లినప్పుడు ఆయనకు సీవీసీ పదవి పరువు కూడా గుర్తుకు రాలేదు. ఈ వ్యవహారంలో మరో పరువు తక్కువ కార్యం ఏమిటంటే, ప్రధాన న్యాయమూర్తి గొగోయ్ తరఫున ప్రధాని ఆధ్వర్యంలో ఉన్న 'త్రిసభ్య ఉన్నతాధికార నిర్ణయ సంఘానికి సీనియర్ న్యాయమూర్తి ఎ.కె. సిక్రీని మూడవ సభ్యునిగా నిర్ణయించారు. అయితే ఈ నియామకానికి ముందే ప్రధాని మోదీ ప్రభుత్వం చేసిన పని లండన్‌లోని అంతర్జాతీయ కామన్వెల్త్ సెక్రటేరియట్ ఆర్బిట్రేషన్ (తీర్పరి) ట్రిబ్యునల్ సంస్థలో ప్రభుత్వ ప్రతినిధిగా సిక్రీని నియమించడం. ఈ వార్త పొక్కి పోవడంతోనే సిక్రీ లండన్ ట్రిబ్యునల్‌లో తన నియామకం వార్తను ఖండిస్తూ ప్రకటించాల్సి వచ్చింది.

రాజకీయ నాయకులు (పాలకులు) అందరినీ ఎలా 'నీతిమంతులు'గానో అవినీతిపరులుగానో మూకుమ్మడి ముద్ర ఎలా వేయలేమో పోలీసు అధికారులు సహా యావత్తు అధికార గణాన్ని అలా బదనాం చేయలేం. కానీ 'నాపై అవినీతి ఆరోపణలను రుజువు చేయండి అవి రుజువూ పత్రంలేని ఆరోపణలు. నాపట్ల శత్రుత్వంతో వ్యవహరిస్తున్న స్పెషల్ డైరెక్టర్ వేసిన అభాండాలు'' అని ఆలోక్ వర్మ సవాలు చేశారు. కనుకనే వర్మను పదవినుంచి బర్తరఫ్ చేస్తూ 2018 అక్టోబర్ 23 నాటి సీవీసీ ఉత్తర్వులను సుప్రీంకోర్టు కొట్టేయడమే వర్మ వాదనకు బలం అవుతోంది. సీబీఐ స్వతంత్ర సంస్థగా, ఎలాంటి రాజకీయ పాలకుల ప్రలోభాలకు లోనుకాని కేవలం స్టాట్యుటరీ సంస్థగా వర్ధిల్లకుండా పాలకుల 'చేతి ఎత్తుబిడ్డ'గా ఎదుగుతూ పాక్షిక విచారణలు, శత్రుపూర్వక ఆరోపణలతో ఎలా వ్యక్తులను, ప్రత్యర్థులను పాలకులు వేధిస్తారో– కొందరు న్యాయమూర్తుల్ని, సీబీఐ అధికారులను గత పాతికేళ్లలో తాను కేసుల్నుంచి బయట పడటానికి లేదా జగన్‌మోహన్ లాంటి యువ ప్రత్యర్థుల్ని అక్రమంగా జైళ్లపాల్జేయడానికీ ఏ మాత్రం వెరవని బాబు లాంటి పయోముఖ విషకుంభాలు నిరూపించాయి. ఇక అలాంటి చరిత్రలు పునరావృతం కావడాన్ని తెలుగు గడ్డపై సహించరాదు. కొందరు జడ్జీలు నేనా కేసును చూడను (నాట్ బిఫోర్) అని తప్పుకుంటారు. జగన్ కేసులో జస్టిస్ లోకూర్, సుప్రీంలో అంబానీ ప్రవేశంతో జస్టిస్ భండారీ ఇలాగే తప్పుకున్నారు. ఈ వైఖరి స్వతంత్ర శక్తికి, నిజాయితీకి అగ్నిపరీక్ష!

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




సోషల్ మీడియా

సిగ్గుచేటు



"కన్యత్వాన్ని కూల్ డ్రింక్ సీసాకు ఉండే సీల్‌తో పోల్చి అవమానకరంగా మాట్లాడిన జాదవ్‌పూర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కనక్ సర్కార్‌ను తక్షణం సస్పెండ్ చేయాలి. పైగా, ప్రొఫెసర్ కనక్ సర్కార్ తన మాటల్ని సిగ్గులేకుండా సమర్థించుకుంటున్నారు కూడా. వెలుగులీనుతున్న భారత్‌కు ఇలాంటి స్త్రీ ద్వేషులు, భయానక మనస్తత్వం ఉన్నవారు అవసరం లేదు"
– బృందా అదిగే
మహిళల, బాలల హక్కుల కార్యకర్త

గర్వకారణం



"అసోం గణపరిషత్ పౌరసత్వ సవరణ బిల్లు వివాదంలో బీజేపీతో తెగ దెంపులు చేసుకోవడాన్ని చూసి గర్వంగా అనిపిస్తోంది. ఎన్‌పీపీ కూడా అదే బాటలో వెళ్తుందని అంటున్నారు. ఈశాన్య ప్రాంత ప్రజలు నిజమైన లౌకికవాదులు. కౌ బెల్ట్ రాజకీయాలు అక్కడ చెల్లవు"
– జైనాబ్ సికందర్, రచయిత్రి

తెలిసీతెలియని ఆరోపణలు



"సాగరికా ఘోష్ వంటి వివక్షాపూరిత వ్యక్తి సుప్రీంకోర్టు న్యాయమూర్తి సిక్రీపై బురదజల్లడం విచిత్రం. ఆలోక్ వర్మ వివాదంలో ఆయన ప్రధాన న్యాయమూర్తి ప్రతినిధిగా వెళ్లారన్న సంగతిని గుర్తించకుండా ఆరోపించడం ఆశ్చర్యకరం"
– మోహన్‌దాస్ పాయ్
విద్యావేత్త, పరిశోధకుడు

ఆస్కార్ రావాల్సిందే



"'యాక్సిడెంటల్ ప్రైమ్‌మినిస్టర్' చిత్రంలో తన నటనకు ఆస్కార్ అవార్డ్ రావాలని అనుపమ్ ఖేర్ ఆశిస్తున్నారు. ఇదెలా ఉందంటే– తన పనితీరు చూశారు కాబట్టి మరోసారి అందలం ఎక్కించమని ప్రధాని నరేంద్ర మోదీ అడుగుతున్నట్టు ఉంది" – కునాల్ కమ్రా, కమెడియన్

ఎన్‌కౌంటర్లపై 'సుప్రీం' దృష్టి



"ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం సాగిస్తున్న ఎన్‌కౌంటర్లపై దాఖలైన వ్యాజ్యం చాలా ముఖ్యమైనదని సుప్రీంకోర్టు చెప్పింది. యోగి ప్రభుత్వం డజన్లకొద్దీమందిని ఎన్‌కౌంటర్లలో మట్టుబెడుతూ వారి బంధువులు ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతోందని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ప్రతినిధి కూడా తెలియజేశారు. యోగి ప్రభుత్వ ప్రతిష్ట ఈ విధంగా అంతర్జాతీయ స్థాయిలో కూడా పాకి పోవడం గమనార్హం. జనవరి 21వ తేదీన ఈ పిటిషన్‌పై విచారణ జరగనుంది."
– ప్రశాంత్ భూషణ్
సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది

కేబుల్ చందాదారును మోసగించిన 'ట్రాయ్'

సందర్భం



తోట భావనారాయణ

కేబుల్ టీవీ డిజిటైజేషన్ వలన చందాదారుకు ఎంతో మేలు జరుగుతుందంటూ కేబుల్ టీవీ నియంత్రణ చట్టాన్ని సవరించే సందర్భంలో కేంద్ర ప్రభుత్వం నమ్మబలికింది. పారదర్శకత, ప్రసారాల నాణ్యత, కోరుకున్న చానల్స్‌కే చెల్లించే అవకాశం లాంటి మాయ మాటలు చెప్పింది. కానీ సామాన్య ప్రేక్షకులను బుట్టలో వేయటానికే ఈ అబద్ధాలు చెప్పిందన్నది ఇప్పుడు అందరికీ అర్థమవుతున్న నిజం. సగటున 15 నుంచి 20 చానల్స్ మాత్రమే చూసే ప్రేక్షకులకు వంద చానల్స్ అందుతున్న సమయంలో ఈ సంఖ్యను 500కు తీసుకుపోతామంటూ చెప్పింది. అలా చానల్స్ పెరిగే కొద్దీ బిల్లు తడిసి మోపెడవుతుందని మాత్రం చెప్పలేదు.

అనలాగ్ ప్రసారాల వలన కేబుల్ టీవీలు వంద చానల్స్ మించి ఇవ్వలేకపోతున్నాయని, అందువలన చందాదారు ఎంచుకునే స్వేచ్ఛకు భంగం కలుగుతోందని ప్రభుత్వానికి డిజిటైజేషన్ మీద చేసిన సిఫార్సులలో ట్రాయ్ చెప్పింది. డిజిటైజేషన్‌లో 500 చానల్స్ సైతం ఇవ్వగలిగే వీలుంటుందని చెప్పినా పంపిణీ సంస్థలకు మాత్రం 500 చానల్స్ ఇవ్వాలనే షరతు విధించలేదు.

ఉచిత చానల్స్ ఎంచుకునే స్వేచ్ఛ చందాదారుడిదే అనేది మరో మోసం. స్వేచ్ఛ అంటున్నప్పుడు కనీసం 200 ఇవ్వకుండా 100 ఎంచుకోమంటే దాన్ని స్వేచ్ఛ అనాలా? అలా 200 చానల్స్ ఎంతమంది ఎమ్‌ఎస్‌ఓలు ఇవ్వగలుగుతున్నారు? పైగా ఆ 100 లోనే 26 దూరదర్శన్ చానల్స్ కచ్చితంగా తీసుకోవాలి. మిగిలిన 74 చానల్స్ లో ఉచిత చానల్స్‌తోబాటు మనం ఎంచుకునే పే చానల్స్ కూడా కలిసే ఉంటాయి. కాకపోతే పే చానల్స్‌కు అదనంగా చందా కడతాం. అంటే, ఈ 74 లో మనం కనీసం నాలుగు తెలుగు బొకేలు ఎంచుకున్నా 33 అయిపోతాయి. మిగిలేది 41. తెలుగులో ఉచిత చానల్స్ సంఖ్య దాదాపు 45. ఆ విధంగా చూస్తే మనం కోరుకునే చానల్స్ సంఖ్య 100 దాటిపోతుంది. అది దాటాక ప్రతి 25 చానల్స్ కు రూ.20 వసూలు చేస్తారు. ఇదీ ట్రాయ్ చెప్పే రూ. 130 – వంద చానల్స్ వెనుక అసలు కథ. పైగా ఇప్పుడున్న రూ.130 మరో ఆరు నెలల తరువాత పెంచుకోవటానికి పంపిణీ సంస్థలకు ట్రాయ్ అవకాశమిచ్చింది.

డిజిటైజేషన్ అనేది సెట్ టాప్ బాక్స్ తోనే సాధ్యం. ఇది టీవీ యజమాని సమకూర్చుకోవాలని ప్రచారం చేశారు. కానీ, ఆ సెట్ టాప్ బాక్స్ ఒకేసారి డబ్బు పెట్టి కొనుక్కోవాల్సిన అవసరం లేదని, అద్దెకు కూడా తీసుకోవచ్చునని, వాయిదాల పద్ధతిలో ఇమ్మని కూడా మీ ఎమ్మెస్వో/ఆపరేటర్‌ను అడగవచ్చునని ఆ ప్రచారంలో ఎక్కడా చెప్పలేదు. చందాదారుల ప్రయోజనం ముఖ్యమైతే ఈ వెసులుబాటు గురించి కదా ప్రచారం చేయించాల్సింది?

ఎవరైనా ఆ ఎమ్‌ఎస్‌ఓ సేవలు నచ్చక ఇంకొకరి పరిధిలోకి వెళ్ళాలంటే ఆ బాక్స్ పనికి రాదు. ఇంటర్ ఆపరేటబిలిటీ లక్షణం వాటికి లేదు. అంటే, చందాదారుడు కొనుక్కున్న బాక్స్ మీద పరోక్షంగా యాజమాన్యం మాత్రం ఎమ్‌ఎస్‌ఓదే. అతడి పరిధిలో మాత్రమే అది పనికొస్తుంది. ఎవరైనా మరో ఊరికి మారితే మళ్ళీ అక్కడ సెట్ టాప్ బాక్స్ కొనుక్కోవాల్సిందే. అప్పట్లో స్వదేశీ సెట్ టాప్ బాక్సులు తగినన్ని లేక దిగుమతి చేసుకోవటం వలన ఈ ఫీచర్ లేకపోయినా తీసు కోవాల్సి వచ్చిందనేది ట్రాయ్ వివరణ. హడావుడిగా డిజిటైజేషన్ అమలు చేసిన ఫలితమిది.

డిజిటైజేషన్ వలన కేబుల్ బిల్లు తగ్గుతుందని ట్రాయ్ చెప్పటం అతిపెద్ద అబద్ధం. ఇప్పటికీ అదే అబద్ధం చెబుతోంది తప్ప వివరణ ఇవ్వటం లేదు. తగ్గటం, పెరగటం అనేది ఇప్పటి బిల్లుతోనే జనం పోల్చుకుంటారు. 200 చానల్స్ ఇచ్చే ఆపరేటర్ ప్రస్తుతం రూ. 200 వసూలు చేస్తున్నాడనుకుంటే ఇప్పుడు అవే చానల్స్‌కు బిల్లు లెక్కగడితే రూ.750కి తగ్గటం లేదు. ట్రాయ్ ఇప్పుడు చెబుతున్నదేంటంటే, ఆపరేటర్ ఇచ్చే చానల్స్ కాకుండా నిజంగా మీరు చూడాలనుకునే చానల్స్ కే లెక్కగట్టండి అంటోంది. అలా చూసినా రూ. 400 కి తగ్గేట్టు లేదు.

టారిఫ్ ఆర్డర్ 36 వ పేజీ 52వ పాయింట్ ఇలా ఉంది: ''ట్రాయ్ అందరి అభిప్రాయాలూ లెక్కలోకి తీసుకున్న మీదట చానల్స్‌కు పూర్తి స్వేచ్ఛ, వ్యాపారంలో వెసులుబాటు ఇవ్వటం ద్వారా అవి సొమ్ము చేసుకునే అవకాశం ఇవ్వాలని భావించింది. అందుకే పే చానల్స్ కు వాటి కంటెంట్ తరహా ఆధారంగా ధర పరిమితి విధించకూడదని నిర్ణయించింది.



అయితే తన పే చానల్స్ ధర నిర్ణయించేటప్పుడు బ్రాడ్‌కాస్టర్ పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తూ వివక్ష చూపకుండా, చందాదారుల ప్రయోజనాలు కాపాడతాడని ఆశిస్తున్నాం. అర్థవంతంగా ధర నిర్ణయించటం ద్వారా అధికాదాయం సంపాదించుకుంటాడని కూడా అంచనావేస్తున్నాం ''. ఇది ట్రాయ్ చేసిన పెద్ద తప్పుడు అంచనా. బ్రాడ్‌కాస్టర్‌కు అవకాశమిచ్చిన తరువాత తక్కువధర నిర్ణయించవచ్చునని ఆశించటమేంటి?.

ప్రేక్షకులు ఆసక్తి చూపని చానల్స్‌ను కూడా అంటగట్టే బొకేల విధానాన్ని అదుపులో ఉంచటానికి ఒక నిబంధన పెట్టింది. బొకేలోని చానల్స్ విడివిడి ధరల మొత్తంలో డిస్కౌంట్ 15% మించకుండా బొకే ధర నిర్ణయించాలని చెప్పింది. ఇది కచ్చితంగా ధరలను అదుపు చేయటానికి వీలుండే అంశమే. అయితే మద్రాసు హైకోర్టు ఈ నిబంధనను కొట్టివేసినప్పుడు సుప్రీంకోర్టుకు వెళ్ళాలన్న కనీస జ్ఞానం ట్రాయ్‌కి లేకపోయింది. నెలలతరబడి ఆలస్యంగా మేలుకొని వెళితే, మీరు ఇన్నాళ్ళూ నిద్రపోయారా అని సుప్రీంకోర్టు అడగ్గానే పిటిషన్ వెనక్కు తీసుకుని ''బ్రాడ్ కాస్టర్లు తగ్గిస్తే తగ్గవచ్చునేమో వేచి చూద్దాం'' అని చెప్పటం ఎంత సిగ్గు చేటు?

డిజిటైజేషన్ గురించి స్పష్టత ఇవ్వకుండా, సెట్ టాప్ బాక్స్ కొనకపోతే ప్రసారాలు ఆగిపోతాయని భయపెట్టటాన్నే అవగాహనగా చెప్పుకుంది. ఇప్పుడు కూడా ''మేం అవకాశమిచ్చినట్టుగా చానల్స్ నిర్ణయించుకున్న ధరలకు మీరు ఆమోదముద్ర వెయ్యకపోతే ఫిబ్రవరి 1 తరువాత మీకు టీవీ ప్రసారాలు ఆగిపోతాయి'' అనే ప్రచారం మొదలైంది.


నియంత్రణా సంస్థ అయిన ట్రాయ్‌కి చాలా విషయాల్లో నియంత్రణ లేదు. కేబుల్ నెట్‌వర్క్‌ను ఎమ్‌ఎస్‌ఓలు అమ్ముకుంటున్నప్పుడు వాటి పరిధిలో ఉన్న ఆపరేటర్లు, చందాదారుల ప్రయోజనాల సంగతేంటని పట్టించుకోదు. ఈ మధ్య కాలంలో రిలయెన్స్ జియో లాంటి సంస్థలు పెద్ద ఎత్తున కార్పొరేట్ ఎమ్‌ఎస్‌ఓలను సైతం కొంటూ ఉంటే ఎలాంటి సమాచారమూ లేకుండానే స్థానిక కేబుల్ ఆపరేటర్లు, చందాదారులు గొర్రెల్లా కొత్త యజమాని అధీనంలోకి వెళ్ళిపోతున్నారు. ఇది కచ్చితంగా గుత్తాధిపత్యానికి దారి తీసి చందాదారుల మీద పెనుభారం మోపే ప్రమాదం ఉంది. అయినా ట్రాయ్ జోక్యం చేసుకోవటానికి ఇష్టపడటం లేదు. చందాదారుల ప్రయోజనాలు గాని, కేబుల్ ఆపరేటర్ల ప్రయోజనాలుగాని కాపాడలేని నియంత్రణా సంస్థ ఎవరికి మేలు చేస్తున్నదో ఆత్మ విమర్శ చేసుకోవాలి.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయుడు
మొబైల్ : 99599 40194

మకర సంక్రాంతి

ఎంతయినా చెప్పండి. పండుగల కళ అంతా పల్లెటూళ్లదే! అసలు సందడులూ, సంబరాలూ, ఉత్సవాల సంరంభాలూ పల్లెటూళ్ల సొత్తు. ప్రకృతి రామణీయకతలో ప్రతిదినం పరవశించే వారు పల్లె ప్రజలు. సంక్రాంతి పదహారణాల పల్లెటూరి పండుగ. దీని సంరంభం పల్లెపట్టుల్లోనే చూడాలి తప్ప నగరాల్లో నామమాత్రమే. తెలుగు పల్లెటూళ్ల ప్రాకృతిక సౌందర్యాన్ని, అకృత్రిమమైన కళాత్మకతనూ, పల్లెప్రజల జీవన మాధుర్యాన్ని మకర సంక్రాంతిలాగా ప్రతిబింబించే పర్వదినం మరొకటి లేదు.

లోకం సుభిక్షంగా ఉండే శుభసమయంలో వచ్చే పండుగ సంక్రాంతి. అటు ఆధ్యాత్మికంగా చూస్తే, మార్తాండుడు మకరరాశిలోకి సంక్రమణం (ప్రవేశం) చేయడంతో ఉత్తరాయణ పుణ్యకాలానికి నాంది పలుకుతుంది గనక ఈ శుభదినాన్ని మకర సంక్రాంతి అని అంటాం. ఇటు ఐహికంగా చూస్తే, పంటలు ఇంటికి చేరి కర్షకుడి చేతిలో కాసులు గలగలలాడే కాలమూ ఈ సంక్రాంతి రోజులే. పణమూ, పబ్బమూ రెండూ కలిసి వస్తేనే కదా నిజమైన పండుగ! మనుషులకే కాదు. పశు పక్షులకు కూడా ఆహార సమృద్ధితో ఆహ్లాదాన్నిచ్చే పండుగ సంక్రాంతి పండుగ.




చల్లని పిల్లగాలులూ, చక్కిలిగింతలు పెట్టే చిరు చలులూ సంక్రాంత సంత కాలు, వేకువ చలులు భోగిమంటల సెగలతో జరిపే సంవాదం చర్మేంద్రియానికి చెప్పలేనంత హాయినిస్తుంది. కాళిదాస కావ్యంలో కథానాయికలా ప్రకృతి కాంత పుష్పాభరణాలనే అసలైన, అసదృశమైన, అమూల్యమైన ఆభరణాలుగా ధరించి కనువిందు చేసే సమయం సంక్రాంతి ఎన్ని బంగారు నగలు ధరిస్తే వస్తుంది. చిన్ని పారిజాత సుమం సొగసు? బంతులూ చేమంతుల ముందు బంగారు చంద్రహారాల కాంతులు కూడా బలాదూర్ కావలసిందే.

హరిలో రంగ హరీ అంటూ పాడుతూ తిరిగే హరిదాసులూ, జగదంబ పలుకు వినిపిస్తానంటూ జబర్దస్తీగా డుబుడుక్కలు కొడుతూ వచ్చే బుడబుక్కల వారూ, కొండంత బంగారం కుక్కముట్టిందని అవతల పారేయడం వల్ల కొంచెం ఆర్థికమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని కట్టుకథలు చెప్పే పిట్టల దొరలూ, ఇతర కళాకారులూ సంక్రాంతి సమయంలో పల్లెల్లో కోకొల్లలుగా కనిపిస్తారు.

అందమైన అరుదైన జానపద కళాప్రదర్శనలకూ, అనేక విధాలైన గ్రామీణ క్రీడలకూ రంగభూమి సంక్రాంతి. ఎలాంటి షడ్రసోపేతమైన విందుకైనా ఎన్నో శాక పాకాలూ, పళ్లూ ఫలాలూ, ఇతర దినుసులూ సమృద్ధిగా లభించే సమయం సంక్రాంతి. బంధుమిత్రులతో, పాడి పంటలతో, బహువిధాల వినోదాలతో సరదాగా గడిపేందుకు సరయిన సమయం సంక్రాంతి.

అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు! – ఎం. మారుతి శాస్త్రి

సాక్షి
ఫ్యామిలీ
నల్లగొండ ॥ మంగళవారం
15-1-2019


సిరివెన్నెల



సంక్రాంతికి కవులు పదాలను పతంగులుగా చేసి ఎగురవేస్తారు.
పద్యాలను ఇళ్ల ముందరి ముగ్గుల వలే అందంగా తీర్చిదిద్దుతారు.
పాటలను బాణీకట్టి ఆడపిల్లల కిలకిలలకు జోడు కడతారు.
కవులు సంక్రాంతి వస్తే పాతభావాలను భోగిమంటల్లో వేసి
దగ్ధం చేయమంటారు.
కొత్త చైతన్యాన్ని గడపలకు తోరణాలుగా కట్టమంటారు.
కళలు వెల్లివిరిసే సమాజమే సంతోషకరమైన సమాజం.
కవులు సమాజ శ్రేయస్సు ఆకాంక్షిస్తారు.
సమాజం కవుల వాక్కుకు చప్పట్లు అర్పించాలి.
అభ్యుదయమే అసలైన క్రాంతి.
పురోగమించడమే అసలైన సంక్రాంతి.

కళాల క్రాంతి



కాజల్ అగర్వాల్

సమైక్య క్రాంతి – సిరివెన్నెల

పండగ వస్తుంది.. వెళుతుంది. ప్రతి పండగనీ మనం చేసుకుంటాం. అయితే అర్థాన్ని తెలుసుకుని చేసుకుంటున్నామా? లేదా? అన్నది ముఖ్యం. కొత్త బట్టలు, పిండి వంటలు ఇవి ఎలానూ ఉంటాయి. వాటితో పాటు సంక్రాంతి తాలూకు అర్థాన్ని పిల్లలకు చెప్పాలి. పుష్యమాసంలో పంట ఇంటికి వస్తుంది. 'నేను తినడానికి ముందు సమాజంలో ఉన్నవాళ్లకు నా వంతుగా ఇస్తా' అనే సంప్రదాయం ఏదైతే ఉందో అదే సంక్రాంతి అంటే. సమైక్య క్రాంతి అని అంటాం. అంటే ఒక మంచి మార్పు. మనది పల్లెటూరు బేస్ అయిన సంస్కృతి కాబట్టి పంట ఇంటికొచ్చే రోజు ప్రత్యక్షంగా వస్తువు ఉత్పత్తి చేయకపోయినా మానసిక వికాసానికి తోడ్పడే కళల మీదే జీవనాధారంగా బతుకుతున్నవాళ్లకు ధాన్యం కొలిచి ఇవ్వడం సంక్రాంతి. ఇది చేయడానికి రాజులే అవ్వాల్సిన అవసరంలేదు. ఎవరైనా చేయొచ్చు. భోగి మంటలు, గొబ్బెమ్మలు, ఇలా సంప్రదాయబద్ధంగా చేసుకుంటాం. అమెరికాలాంటి దేశాల్లో స్థిరపడ్డవాళ్లకు కొంచెం ఇబ్బందే. ఎందుకంటే అమెరికాలో పేడతో పనులు చేయడం అనేది శుభ్రం కాదని వాళ్లు ఒప్పుకోరు. మీరు అమెరికాకు పోవద్దు. వెళితే అమెరికాకు తగ్గట్టే ఉండాలి. సంక్రాంతి వచ్చినప్పుడు ఏదో చట్టవిరుద్ధమైన పని చేస్తున్నట్లు రహస్యంగా పేడ సేకరించి తలుపులేసుకుని, గొబ్బెమ్మలు పెట్టి, ఇంగ్లిష్ మాట్లాడే మీ పిల్లలకు పట్టు లంగాలు తొడిగి 'బొహియల్లో.. బొహియల్లో..' అని తిప్పకండి. సంక్రాంతి పండగ అర్థం చెప్పండి. ఎలక్ట్రికల్ భోగి మంట వేసుకుంటున్నారు. కానీ ఆ భోగి మంట అర్థం పిల్లలకు చెప్పండి. విదేశాల్లో ఉన్న తెలుగువాళ్లందరూ ఆ రోజు ఒకచోట కలవండి. అవసరమైనవాళ్లకు ఇవ్వండి. అంతేకానీ పేడ చుట్టూ తిరగక్కర్లేదు. నా బాల్యంలో సంక్రాంతి గురించి చెప్పాలంటే.. ఉత్సాహం కలిగించే పండగల్లో ఇదొకటి. సంక్రాంతి అంటే భోగి మంట. భోగి మంట అంటే ఇంట్లో ఉన్న సామాన్లు అన్నీ ఎక్కడ నిప్పుల్లో పడేస్తామో అని పెద్దవాళ్లు కంగారు పడేవాళ్లు (నవ్వుతూ).

స్వాగతం
– సుద్దాల అశోక్‌తేజ

మంచు పరచిన దారి మళ్లి
వెలుగు వెచ్చని బాటలోకి
అడుగుపెట్టే రవికిరణమా
సంక్రాంతి ఆభరణమా స్వాగతం
హరివిల్లు రంగుల ముగ్గులన్నీ పరచి
వాకిట తేనెలొలికే పలుకు తీయని స్వాగతం
పాడిపంటలు పచ్చదనమై
ఆడిపాడే పల్లె వెలుగై
నిదుర మబ్బులు మేలుకొలిపే
పల్లె సీమల పాట స్వరమై
భోగి వెలుగుల జిలుగు మంటల
పాతనంతా ఆహుతంటూ పలుకు తీయని స్వాగతం
పిల్లపాపలనెల్లకాలం పదిలమంటూ
పసిడి పంటల పరిమళాలను
జల్లుజల్లుగ భోగిరోజున పళ్ళు పూలై
తలతడిమి జారే దీవెనలుగా
ఆశీస్సులన్నీ అడుగుఅడుగున
వెన్నంటి నిలిచే చిలక పలుకుల స్వాగతం
రాతిరంతా వెలుగు మడుగై
వేలికొసలన రంగు రూపై
కొత్త చిత్రపు ముగ్గు మధ్యన
పూలరెక్కల పాన్పుపై గౌరీ దేవిగ
పూజలందే ప్రాణదాతకు ప్రకృతికి
గొంతువిప్పిన గొబ్బిపాటల స్వాగతం
పాతకొత్తల మేలుకలయిక
గంగిరెద్దుల నాట్య హేలకు
సన్నాయి రాగం డోలు శబ్దం
నింగికెగసే గాలి పటమై
హరిలోరంగహరీ అక్షయపాత్రన
వెలిగే దక్షత నింగే నేలై తెలిపే స్వాగతం
విందు వినోదం ఆహ్లాదం
పితృదేవతల పరమార్థం
జంతు సేవలకు తీర్చు ఋణం
అతిథి దేవులకు ఆడబిడ్డలకు
వెచ్చని మమతల ప్రతిరూపం
మాటమాటనా మరువపు మొలకల స్వాగతం.


సుద్దాల అశోక్‌తేజ



ఇది కర్షకుల పండగ
– రామజోగయ్య శాస్త్రి

పండిన పంట ఇంటికొచ్చే రోజు, పడిన కష్టం చేతికొచ్చే రోజు సంక్రాంతి. వ్యవసాయమే ఆధారంగా మనుగడ సాగే మన భరత ఖండంలో ఏ పేరున జరుపుకున్నా ప్రధానంగా ఇది కర్షకుల (రైతులు) పండగ. పండగంటేనే సంతోషం. అందునా ఇది పెద్ద పండగ. మరి అంత సంతోషంగా రైతు జీవితం గడుస్తుందా? ప్రశ్నార్థకమే. ఉన్నంతలో పండగ జరుపుకోవడం కాకుండా ఉన్నతంగా, ఉల్లాసంగా, ఉత్సాహంగా అసలైన అర్థంతో పండగ జరుపుకునే దిశగా సంక్రాంతుల్లో సంక్రమం చేయాలని ఆకాంక్ష.

కైట్ కట్ అయితే 'ఐబో' అనేవాళ్లం
- కాజల్ అగర్వాల్

సంక్రాంతి అంటే గాలి పటాలు ఎగరేయడమే. ఈ పండగకి ముగ్గులు వెయ్యడం మా ఇంట్లో చాలా తక్కువ. దీపావళికి ఎక్కువ ముగ్గులు వేస్తాం. నా చిన్నప్పుడు సంక్రాంతికి మా నానీ వాళ్ల ఇంటికి వెళ్లేదాన్ని. మా కజిన్స్ అందరూ వచ్చేవాళ్లు. వాళ్లు గాలిపటాలు ఎగరేస్తుంటే నేను ఆ దారం డబ్బా పట్టుకుని నిలబడేదాన్ని. నా సీన్ అంతే. ఎందుకంటే గాలిపటం ఎగరేద్దామని రెండు మూడు



సార్లు ట్రై చేస్తే వేలు కోసుకునిపోయింది. పైగా ఒక్కసారి కూడా నా కైట్ ఎగరలేదు. అందుకే మనం దారం డబ్బా పట్టుకోవడానికే అని ఫిక్స్ అయ్యా (నవ్వుతూ). మా సందడి ఎలా ఉండేదంటే.. ఎవరైనా మా కైట్‌ని కట్ చేయడానికి ట్రై చేస్తుంటే అందరం గట్టిగా అరిచేసేవాళ్లం. ఆ సౌండ్‌కి పక్కవాళ్లు కంగారుపడాల్సిందే. పంజాబీలో ఒక పదం ఉంటుంది. 'ఐబో' అనుకుంటాను. అంటే.. అయ్యో గాలిపటం కట్ అయ్యిందే అని అర్థం. మా కైట్ కట్ అయినప్పుడల్లా.. ఐబో.. ఐబో.. అని అరిచేవాళ్లం. చిన్నప్పటి ఆ సందడి ఇప్పుడు సాధ్యం కాదు. అయితే పండగలంటే నాకు ఇష్టమే. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు.

- కాజల్ అగర్వాల్

అందుకే ఈ పండగంటే ఇష్టం
- గోరటి వెంకన్న, కవి

సంక్రాంతి అనగానే చక్కనైన ముగ్గులు చూసి చుక్కలన్నీ చాటుకుపోయే వేకువ సన్నివేశం. కలశంతో పొద్దున వచ్చే తులసీదాసుల హరి కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, సన్నాయి మేళాలు, నవధాన్యాల పిండి వంటలు, అల్లుళ్ల సందడి, ఆడబిడ్డల వైభోగం, కోడి పందెం, యెద్దుల పరుగులు, రచ్చబండల యక్షగాన రూపకాలు, హేమంతపు గాలులు, వెన్నెల రాత్రులు, ఎత్తైన పంట రాశులు, వాగునీట యెద్దుల ఈతలు, లేగ మెడలో మువ్వల గంటలు, రేగి పండ్లు, పిండిపూలు, పసుపు కుంకుమల గొబ్బెమ్మలు, ఆహ్లాదం, ఆనందం... ప్రకృతి యెడల భక్తిభావం... ఇలాంటి మంచి పండగ అంటే నాకు చాలా ఇష్టం. కారణం.. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. వ్యవసాయానికి, గ్రామీణ జీవితానికి శోభాయమానంగా ఉండే పండగ కాబట్టి రైతులు ఆనందంగా ఉంటారు కాబట్టి ఈ పండగ నాకిష్టం. మహిషాసురుణ్ణి చంపిన సందర్భంగా దసరా పండగ చేసుకుంటారు. నరకాసురుడి అంతమే దీపావళి పండగ. సంక్రాంతికి ఇలాంటిది లేదు. ఇది రైతుల పండగ. అందరి పండగ. మా తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలో సంక్రాంతి బాగా చేస్తారు.



గోరటి వెంకన్న

అలా రెండు సంక్రాంతులు గడిచాయి - శ్రీమణి

సంక్రాంతి అనగానే నాకు నేను రెండు రకాలుగా గుర్తొస్తాను. ఇండస్ట్రీకి రాకముందు, ఇండస్ట్రీకి వచ్చిన తర్వాత. అంతకుముందు ఆ తర్వాతలా అన్నమాట. అంతకు ముందు సంక్రాంతి అనగానే ఫ్యామిలీతో అందరం కలిసి ఉండటం. అరిసెలు ఆరగించడం. అరిసెలు చేయటంలో మోస్ట్ ఫేవరేట్ ప్లేస్ మా అమ్మమ్మ గారిల్లు. అందుకే పండగ అంటే అమ్మమ్మగారింట్లోనే. అమ్మమ్మగారి ఊళ్లో ఉన్న ఫ్రెండ్స్‌తో కలిసి గాలి పటాలు ఎగరేయటం. గాలి పటాలెగరేసుకుంటూ విన్న పాటలతో పాటు నేను పెరిగాను. ముఖ్యంగా 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి గారు రాసిన కొన్ని పాటలను ఇక్కడ ప్రస్తావించాలి. అప్పుడు ఆ పాటల్లోని భావాలను వింటూ ఎప్పటికైనా నేను మంచి పాటలు రాయాలనుకునేవాణ్ని. ఆ పాటలు ఏంటంటే... 'వర్షం' చిత్రంలోని 'కోపమా నాపైనా, ఆపవా ఇకనైనా అంతగా బుసకొడుతుంటే నేను తాళగలనా..' అనే ప్రేమ పాటలు వింటూ ఆ పాటలోని అక్షరాలతో ఓ సంక్రాంతి గడిచింది. మరో సంక్రాంతికి 'నువ్వొస్తానంటే నేనొద్దంటానా' చిత్రంలోని 'రేయంతా నీ తలపులతో ఎర్రబడే కన్నులు ఉంటే... ఆ కాంతే నువ్వెతికే సంక్రాంతై ఎదురవదా...' అంటూ శాస్త్రిగారు రాసిన మాటలు నేను ఈ ఇండస్ట్రీకి రావటానికి స్ఫూర్తినిచ్చాయి. విషయం ఏంటంటే ఆ రెండు చిత్రాలు నిర్మించిన యం.యస్. రాజుగారిని సంక్రాంతి రాజు అని పిలిచేటంత హిట్టయ్యాయి ఆ సినిమాలు. ఇక ఆ తర్వాత కథ ఏంటంటే.. అలా పాటలు వింటూ సంక్రాంతి చేసుకున్న నేను ఇక్కడికొచ్చాక 'శతమానం భవతి' సినిమాలో సంక్రాంతిని ఉద్దేశించి 'హైలో హైలెస్సారో... ఆదిలక్ష్మీ, అలిమేలమ్మకు అందమైన గొబ్బిళ్లు... కన్నెపిల్లల కోర్కెలు తీర్చే వెన్నాలయ్యకు గొబ్బిళ్లు... ' అనే పాట రాశాను. ఆ పాట పెద్ద హిట్. ప్రతి సంక్రాంతి పండక్కి ప్రేక్షకులు ఈ పాట వింటూ పండగ చేసుకోవాలన్నది నా ఆకాంక్ష. సంక్రాంతి అంటే తెలుగువాళ్లందరి సిరి. బంధువులందర్నీ ఓ చోట కలిపి మన మనసులను ఆనందింపజేసే పండగ ఇది.



శ్రీమణి

ముగ్గు-ముచ్చట



కోమట్ల ప్రభావతి
బాపట్ల, గుంటూరు జిల్లా
24 చుక్కలు, 4 వరుసలు, 4 వచ్చేవరకు


గుత్తి కళావతి, గండిమైసమ్మ, హైదరాబాద్



రథం ముగ్గు
15 చుక్కల నుండి 2 చుక్క వచ్చేవరకు (చుక్కలు చూసి పెట్టుకోవాలి)



ఇంట్లో ఇల్లాలు... గ్రౌండ్‌లో ప్రియురాలు



● దివ్యాంశ కౌశిక్, నాగచైతన్య

2017 అక్టోబర్ 6... నాగచైతన్య, సమంత తమ ప్రేమ ప్రయాణంలో పెళ్లి అనే 'మజిలీ'ని చేరుకున్న రోజు. పెళ్లి తర్వాత వారిద్దరూ కలిసి నటిస్తున్న మొదటి చిత్రం 'మజిలీ'. ఇందులో ఇద్దరూ భార్యాభర్తలుగానే నటిస్తున్నారు. 'దేర్ ఈజ్ లవ్.. దేర్ ఈజ్ పెయిన్' అనేది ఉపశీర్షిక. షైన్ స్క్రీన్ బ్యానర్‌పై సాహు గారపాటి, హరీశ్ పెద్ది నిర్మిస్తున్నారు. 'నిన్ను కోరి' ఫేమ్ శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే దాదాపు 80 శాతం పైగా షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 5న విడుదల చేస్తున్నట్లు చిత్రనిర్మాతలు తెలిపారు. జనవరి 1న ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఫస్ట్ లుక్‌లో గడ్డంతో సమంత సరసన కనిపించారు చైతూ. సంక్రాంతి సందర్భంగా సోమవారం ఈ చిత్రం సెకండ్ లుక్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో చేతిలో బ్యాట్, క్లీన్ షేవ్‌తో కనిపించారు చైతూ. అయితే ఈసారి ఫొటోలో సమంత కనిపించడంలేదు. రెండో హీరోయిన్‌గా చేస్తున్న దివ్యాంశ కౌశిక్ ఆత్మీయంగా చైతూని హగ్ చేసుకుని కనిపిస్తున్నారు. ఇంట్లో ఇల్లాలు సమంత అయితే గ్రౌండ్‌లో ప్రియురాలు దివ్యాంశ అనుకోవాలేమో. అంటే.. ఇదేమైనా ట్రయాంగిల్ లవ్ స్టోరీయా? ఏప్రిల్‌లో తెలుసుకుందాం. ఈ చిత్రకథ మాత్రం విశాఖపట్నం నేపథ్యంలో ఉంటుందట. రావు రమేశ్, పోసాని కృష్ణమురళి, సుబ్బరాజు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: గోపీ సుందర్, కెమెరా: విష్ణు వర్మ.

ఆ నలుగురూ ముఖ్యులు



● అంజలి ● మాధవన్ ● షాలినీ పాండే ● అనుష్క

తెలుగు, తమిళ, హిందీ భాషల్లో మంచి పేరున్న నటుడు మాధవన్. 'బాహుబలి' ముందు వరకూ అనుష్క దక్షిణాది వరకే పరిమితం. ఆ సినిమా తర్వాత ఉత్తరాదిన కూడా పేరు తెచ్చుకున్నారు. తెలుగమ్మాయి అంజలికి సౌత్‌లో మంచి పేరుంది. ఇక 'అర్జున్‌రెడ్డి'తో ఒక్కసారిగా పాపులర్ అయ్యారు షాలినీ పాండే. ఈ నలుగురూ ముఖ్య తారలుగా తెరకెక్కుతున్న చిత్రం మార్చిలో ప్రారంభం కానుంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, కోన ఫిలిం కార్పొరేషన్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం అమెరికాలో జరిగే షూటింగ్‌తో ప్రారంభం కానుంది. హారర్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రానికి హేమంత్ మధుకర్ దర్శకుడు. టీజీ విశ్వప్రసాద్, కోన వెంకట్ నిర్మాతలు. ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు పలు భాషల్లో తీయనున్నామని చిత్రనిర్మాతలు తెలిపారు. అలాగే తెలుగు, తమిళ, హాలీవుడ్ సాంకేతిక నిపుణులు ఈ సినిమాకి పని చేస్తారు. తొలి క్రాస్ ఓవర్ మూవీగా ఈ చిత్రం తెరకెక్కనుంది. అవసరాల శ్రీనివాస్, సుబ్బరాజులు ముఖ్య పాత్రలు చేస్తారు. కోన వెంకట్, షనిల్ డియో, గోపీ మోహన్, నీరజ కోన, గోపీసుందర్ టెక్నీషియన్లుగా చేయనున్నారు. త్వరలోనే మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను తెలియజేస్తామని నిర్మాతలు తెలిపారు. మార్చిలో ప్రారంభం అయ్యే ఈ సినిమాను ఈ ఏడాది ద్వితీయార్థంలో విడుదల చేస్తామన్నారు.

గురుదక్షిణ ఏమడిగారు?

ద్రోణాచార్యులనే గురువుగా భావించి ఆయన బొమ్మ ముందు విద్యను నేర్చుకున్న ఏకలవ్యుడి వద్ద బొటన వేలునే గురుదక్షిణగా స్వీకరించారు ద్రోణాచార్యులు. ప్రస్తుత కాలంలో ద్రోణాచార్యులు లాంటి గురువు ఎలాంటి గురుదక్షిణ అడిగి ఉంటారు? అనే కాన్సెప్ట్‌తో సందీప్ కిషన్ లేటెస్ట్ చిత్రం తెరకెక్కనుంది. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'సుబ్రమణ్యపురం' ఫేమ్ సంతోష్ జాగర్లపూడి దర్శకుడు. 'కార్తికేయ'ను నిర్మించిన వెంకట శ్రీనివాస్ బొగ్గరమ్ నిర్మాత. షూటింగ్ వివరాలు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే తెలియజేస్తామని చిత్రబృందం పేర్కొంది.



● సందీప్ కిషన్



అక్షర పోరాటం



● నందితా శ్వేత

విద్య సమాజాన్ని మార్చే బలమైన ఆయుధం అంటున్నారు దర్శకుడు చిన్నికృష్ణ. కానీ ఇప్పుడు సమాజంలో విద్యను మించిన వ్యాపారం మరోటి లేదు అని అందరూ అంటుంటారు. విద్యా వ్యవస్థను కథా వస్తువుగా చేసుకుని నందితా శ్వేత ముఖ్య పాత్రలో దర్శకుడు చిన్నికృష్ణ తెరకెక్కిస్తున్న చిత్రం 'అక్షర'. సురేష్ వర్మ అల్లూరి, అహితేజ బెల్లంకొండ నిర్మాతలు. భోగి పండగ సందర్భంగా 'అక్షర' చిత్రం మోషన్ పోస్టర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ సందర్భంగా దర్శకుడు చిన్నికృష్ణ మాట్లాడుతూ– ''ఫక్తు వ్యాపారంగా మారిపోయిన విద్యా వ్యవస్థపై అక్షర చేసే పోరాటమే ఈ సినిమా. నందిత కెరీర్‌లోనే అక్షర బెస్ట్ పాత్రగా నిలుస్తుంది. సురేశ్ బొబ్బిలి అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు హైలెట్ అవుతుంది. ఇటీవలే ఫస్ట్ షెడ్యూల్ పూర్తయింది. వేసవిలో సినిమాను విడదల చేస్తాం'' అన్నారు.

దర్శకుడు కట్టా రంగారావు మృతి



ప్రముఖ దర్శకులు కట్టా రంగారావు అనారోగ్యంతో సోమవారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. 1957 మే 5న జన్మించారాయన. 'ఇంద్రధనస్సు' చిత్రంతో దర్శకుడిగా మారిన రంగారావు 'ఉద్యమం, అలెగ్జాండర్, నమస్తే అన్నా, బొబ్బిలి బుల్లోడు'తో పాటు మరికొన్ని చిత్రాలను రూపొందించారు. దర్శకుల సంఘంలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన రంగారావు మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలియజేశారు. సోమవారం సాయంత్రం సూర్యాపేటలోని మేడారం గ్రామంలో ఆయన అంత్యక్రియలు జరిగాయి.










సాక్షి సాగుబడి
నల్లగొండ
మంగళవారం 15-1-2019

ఓ రకమైన ఆలోచనా ప్రక్రియ ఫలితమే ఈ ప్రపంచం.
మార్పు తేవాలంటే
ముందు ఆలోచనా ప్రక్రియను మార్చాలి!
- అల్బెర్ట్ ఐన్‌స్టీన్, సుప్రసిద్ధ శాస్త్రవేత్త



ఉత్తరాషాఢ కార్తె - జనవరి 23 వరకు

డెల్టా భూముల్లో చిరుధాన్యాల దిగుబడి రెట్టింపు!



డా. విలాస్ ఎ.తొనపి

పౌష్టికాహార భద్రతను కల్పించే చిరుధాన్యాల వినియోగంపై తెలుగు రాష్ట్రాల ప్రజల్లో చైతన్యం వెల్లివిరుస్తున్న నేపథ్యంలో మెట్ట పొలాలతో పాటు గోదావరి, కృష్ణా డెల్టా భూముల్లో కూడా వీటిని సాగు చేయడంపై రైతులు దృష్టి సారించాలని రాజేంద్రనగర్‌లోని భారతీయ చిరుధాన్య పరిశోధనా సంస్థ (ఐఐఎంఆర్) డైరెక్టర్ డా. విలాస్ ఎ.తొనపి సూచించారు. సంక్రాంతి సందర్భంగా 'సాక్షి సాగుబడి'తో ఆయన మాట్లాడారు. మెట్ట ప్రాంతాలతో పోల్చితే సారవంతమైన డెల్టా భూముల్లో చిరుధాన్యాల రెట్టింపు దిగుబడి పొందవచ్చన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని డెల్టా భూముల్లో ఖరీఫ్‌లోనూ చిరుధాన్యాలను సాగు చేయవచ్చన్నారు. వరి కోసిన తర్వాత రెండో పంటగా కూడా చిరుధాన్యాలను సాగు చేయవచ్చని, భూమిలో తేమ ఉంటుంది కాబట్టి, ఒక రక్షక పంట ఇస్తే సరిపోతుందన్నారు.

చిరుధాన్యాలతోపాటు పప్పుధాన్యాలు, నూనెగింజలను అంతర పంటలుగా, మిశ్రమ పంటలుగా సాగు చేయాలన్నారు. కర్బన ఉద్గారాలను తగ్గించడం, సాగు నీటి వినియోగాన్ని గణనీయంగా తగ్గించడం కోసం చిరుధాన్యాల సాగును, వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చిరుధాన్యాల క్లస్టర్లను ఏర్పాటు చేసి రైతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పత్తి తదితర పంటల నుంచి రైతుల దృష్టి మళ్లించాలంటే ప్రభుత్వ ప్రోత్సాహం అవసరమన్నారు.

కొర్ర, అండుకొర్ర, సామ, ఊద, అరికలు వంటి సిరి(చిరు)ధాన్యాల ప్రాసెసింగ్‌కు యంత్రాలను అందుబాటులోకి తేవడంతో పాటు మార్కెటింగ్‌కు మౌలిక సదుపాయాలు కల్పించడం అవసరమన్నారు. రైతులకు శిక్షణతోపాటు మేలైన విత్తనాలు అందించడానికి ఐ.ఐ.ఎం.ఆర్. సిద్ధంగా ఉందని డా. తొనపి(85018 78645) తెలిపారు.

నివాళి

కన్నీళ్లతో కడుపు నింపుకుంటున్నాం..



పిల్లలతో ఈరన్న భార్య శ్యామల



ఈరన్న


కర్నూలు జిల్లా ఆదోని మండలం దొడ్డనగేరి గ్రామానికి చెందిన రైతు మచ్చల ఈరన్న అప్పుల బాధ భరించలేక 2017 అక్టోబరు 18న పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో అతని భార్య శ్యామల, నలుగురు పిల్లల జీవితం వేదనా భరితంగా మారింది. ప్రభుత్వం నుంచి చంద్రన్న బీమా సహా ఎటువంటి ఆర్థిక సాయం అందలేదు. రైతుల సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో చెప్పడానికి కన్నీళ్లతో కడుపు నింపుకుంటున్న శ్యామల, నలుగురు పిల్లల వేదనా భరిత జీవితమే నిదర్శనం. వివరాలు ఆమె మాటల్లోనే..

''మా సొంతూరు జాలిమంచి. పదేళ్ల క్రితం ఈరన్నతో పెళ్లి అయింది. నా భర్త పేరు మీద 3 ఎకరాల భూమి ఉంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో సకాలంలో వర్షాలు కురవడంతో పంటలు బాగా పండాయి. మా కాపురం ఎంతో సంతోషంగా కొనసాగింది. మాకు ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు. మా అమ్మ, నాన్న, అత్త, మామ చనిపోయారు. నా భర్త సొంత భూమితోపాటు మరికొంత భూమి కౌలుకు తీసుకుని సేద్యం చేశారు. అతివృష్టి, అనావృష్టి కల్లోలం రేపడంతో పెట్టుబడి పెట్టడం తప్ప రాబడి లేకుండా పోయింది. రెండేళ్ల క్రితం ఉల్లి, పత్తి వేశాం. వానలు ఎక్కువై పంటలు పోయాయి. తెలిసిన వారి దగ్గర చేసిన అప్పు రూ. 3 లక్షలతో పాటు ఆదోని ఆంధ్రా బ్యాంకులో తీసుకున్న అప్పు రూ.1.5 లక్షలు కట్టలేక పోయాం. పోయి నేడు వానలే లేవు. మా పొలంలో సాగు చేసిన పత్తి దిగుబడి విత్తనాల ఖర్చుకు కూడా రాలేదు. గర్భవతిని కావడంతో తొమ్మిదో నెలలో పుట్టినిల్లు జాలిమంచిలో మా చిన్నాన్న ఇంటికి పురిటికి వెళ్లాను. ఒంటరిగా ఉన్న నా భర్త ఇంట్లోనే పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన చనిపోయిన వారంలో మగ పిల్లోడు పుట్టాడు. నెలలోపే దొడ్డనగేరికి వచ్చేశాను. విఆర్‌ఓ సురేష్ వివరాలు సేకరించుకు వెళ్లారు. ఏడాది దాటినా ఒక్క పైసా సాయం అందలేదు. ఈ ఏడు తీవ్ర కరువు వచ్చింది. మా పొలంలో పత్తి వేసినా దిగుబడి పెద్దగా రాలేదు. బోరు బావుల కింద కూడా పంటలు లేవు. ఉపాధి పనులు పెట్టలేదు. కూలి పనికి పిలిచే వారు కూలీలుగా మారారు. వారానికి రెండు రోజులు కూడా కూలి పనులు దొరకటం లేదు. డీలరు వేసే బియ్యంతో నెలలో సగం రోజులు ఒక పూట గడచిపోతోంది. మిగిలిన రోజుల్లో కూలి పనులు దొరికితే ఒక పూట కడుపు నింపుకుంటున్నాం. లేదంటే మంచి నీళ్లతోనే ఆకలిని సంపుకుంటున్నాం. ప్రభుత్వం ఏదో ఒక రోజు ఆదుకుంటుందన్న ఆశతోనే రోజులు వెళ్లదీస్తున్నా..'

– కె.బసవరాజు, సాక్షి, ఆదోని, కర్నూలు జిల్లా

17 నుంచి హైదరాబాద్‌లో ఉద్యాన ప్రదర్శన

ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు హైదరాబాద్ పీపుల్స్ ప్లాజాలో ఉద్యాన, వ్యవసాయ ప్రదర్శన జరగనుంది. పూల, ఔషధ మొక్కలు, కూరగాయ పంటల నారు, విత్తనాలు, గార్డెనింగ్ పరికరాలు, సేంద్రియ ఎరువులను 80కి పైగా స్టాళ్లలో అమ్మకానికి ఉంచుతారు. వేళలు: ఉ. 9 గం. నుంచి రాత్రి 9 గం. వరకు.



నిజమైన సం..క్రాంతి!

సం..క్రాంతి..
పండుగ కాంతి..

మట్టి పిసికే రైతు ఒంటరిగా ఉంటే విఫణిలో బేలగా నిలబడాల్సి వస్తుంది.. వ్యాపారుల నిలువు దోపిడీకి గురవ్వాల్సి వస్తుంది.. విత్తనాలు, ఎరువులు వ్యాపారులు చెప్పిన (చిల్లర) ధరకు కొనాల్సి వస్తుంది.. దళారులు చెప్పిన (టోకు) ధరకే పంటను తెగనమ్మాల్సి వస్తుంది...!
అటువంటి రైతులే, చేయీ చేయీ కలిపితే మహత్తర శక్తిగా మారొచ్చని జగిత్యాల జిల్లా లక్ష్మీపూర్ రైతన్నలు రుజువు చేశారు. ఐకమత్యంతో కదులుతూ చరిత్రను తిరగరాస్తున్నారు. పెద్ద పండుగ వేళ లక్ష్మీపూర్ రైతన్నల ఆచరణ నుంచి మనమూ స్ఫూర్తి పొందుదాం.. ఒక్కతాటిపైకి వచ్చిన అన్నదాతలకు నిండు మనసుతో శుభాకాంక్షలు చెబుదాం..

లక్ష్మీపూర్ రైతులు రాజకీయాలకు అతీతంగా చేయి చేయి కలిపి.. సమష్టి శక్తిగా ఎదిగారు. తెలంగాణ రాష్ట్రం జగిత్యాల జిల్లాలో ఓ చిన్న గ్రామం లక్ష్మీపూర్. తొలుత సహకార సంఘంగా ఏర్పడిన రైతులు అనతి కాలంలోనే ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీని కూడా ఏర్పాటు చేసుకుని శభాష్ అనిపించుకుంటున్నారు. లక్ష్మీపూర్ సొసైటీ 2016 డిసెంబర్‌లో రిజిస్టరైంది. సొసైటీ కన్నా మెరుగైన ప్రయోజనాల కోసం లక్ష్మీపూర్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ (ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ)ని రైతులు నాబార్డ్ తోడ్పాటుతో సెప్టెంబర్ 2018లో రిజిస్టర్ చేసుకున్నారు. ఈ కంపెనీకి కేంద్ర వాణిజ్య శాఖ గుర్తింపు కూడా ఇటీవలే లభించింది. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలను, రాయితీలను, రుణాలను అందుకోవడానికి.. తమ ఉత్పత్తులను దేశ విదేశాల్లో ఎక్కడైనా అమ్ముకోవడానికి లక్ష్మీపూర్ రైతులకు ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ద్వారా అవకాశం ఏర్పడింది.

సంఘ సభ్యులందరికీ ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా ఒకే చోట విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను తక్కువ ధరకే సంఘం రైతులకు అందుబాటులో ఉంచుతున్నది. ప్రభుత్వ సబ్సిడీ విత్తనాలు సైతం నేరుగా సంఘానికి వస్తాయి. దీని వల్ల రైతులకు రవాణా భారం, ఖర్చులు తగ్గాయి.

వరి, పసుపు, మొక్కజొన్న, నువ్వులు..

ఆ గ్రామంలో 90 శాతం రైతు కుటుంబాలే. దాదాపు 8 వేల జనాభా. వ్యవసాయాన్ని కష్టంగా కాకుండా ఇష్టపడి చేస్తూ, ప్రతి పంటలోను తోటి గ్రామాల రైతుల కంటే అధిక దిగుబడులు సాధిస్తుంటారు. వరి, పసుపు, మొక్కజొన్న, నువ్వులు, టమాటోలు తదితర కూరగాయలు ఎక్కువగా పండిస్తారు. వేరుశెనగ, కంది పంటలను తక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తారు. ప్రతి భూమిలో కనీసం రెండు, మూడు పంటలు పండిస్తారు. ఎన్నికలప్పుడు ఎవరి పార్టీ వారిదే. ఎన్నికలయ్యాక మాత్రం అందరూ ఒక్కటిగా మెలుగుతున్నారు. ఒకప్పుడు అందరు రైతుల మాదిరిగానే ఆ రైతులు పంట అమ్ముకునేందుకు నానా ఇబ్బందులు పడేవారు. అటువంటి పరిస్థితుల్లో రిటైర్డ్ ఎ.డి. అశోక్‌కుమార్ తోడై, రైతుల ఐకమత్యంతో ఏమేమి సాధించవచ్చో నూరిపోశారు. ఈ నేపథ్యంలో నుంచి పుట్టుకొచ్చిందే లక్ష్మీపూర్ రైతుల పరస్పర సహకార సంఘం.

సభ్యత్వ రుసుము రూ. 3,500

తొలుత ఐదుగురు సభ్యులు సహకార సంఘానికి బీజం వేశారు. వారి ఆలోచనలు నచ్చిన గ్రామంలోని రైతులందరు సంఘంలో సభ్యులైనారు. కేవలం నెలలోపే, ఎవరి ప్రమేయం లేకుండా 312 మంది రైతులు సభ్యులుగా చేరడం రాష్ట్ర స్థాయిలో ప్రథమంగా చెపుతుంటారు. రెండెకరాల రైతుకు అప్పట్లో సభ్యత్వ రుసుము రూ. 2,300 ఉండేది, ప్రస్తుతం రూ. 3,500కు పెరిగింది. సభ్యులందరి సహకారంతో సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేయించి, మూడు నెలలకొకసారి సర్వసభ్య సమావేశం నిర్వహిస్తారు. సంఘం చైర్మన్‌తో పాటు 11 మంది సభ్యులను ప్రతి రెండేళ్ల కొకసారి ఎన్నుకుంటారు. వీరు సంఘం నిర్మాణం, పటిష్టత, వ్యాపారాలపై ప్రతి 15 రోజులకొకసారి సమావేశమవుతుంటారు. చైర్మన్ సహా ప్రతి సభ్యుడూ సంఘ నియమాలకు కట్టుబడి ఉంటామని సభ్యులందరి ముందు ప్రమాణం చేస్తారు.



నువ్వులు విక్రయిస్తున్న సంఘ సభ్యులు



'లక్ష్మీపూర్ నువ్వుల'ను మార్కెట్లోకి విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ శరత్

పంట పండించిన ప్రతి రైతూ లాభపడాలి



పంట పండించిన ప్రతి రైతూ లాభపడాలన్నదే మా సంఘం ప్రధాన ఉద్దేశం. ఇందుకు అవసరమైన సలహాలు, సూచనలు తీసుకుంటూనే సంఘాన్ని ముందుకు తీసుకెళుతున్నాం. యువ రైతులను, ఖాళీగా ఉండే వెనుకటి పెద్ద మనుషులను సంఘ సలహాదారులు నియమించుకుంటున్నాం. రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలను ఒక చోట అందిస్తూనే, ముఖ్యంగా రైతులు పండించిన ప్రతి పంటను ఎలా మార్కెటింగ్ చేయాలన్న దానిపైనే చర్చిస్తున్నాం. అదే మాదిరిగా వినియోగదారులకు సైతం తక్కువ ధరలో ఉత్పత్తులు అందేందుకు ప్రయత్నిస్తున్నాం.

- పన్నాల తిరుపతి రెడ్డి, చైర్మన్(93915 28529), లక్ష్మీపూర్ రైతుల సహకార సంఘం, జగిత్యాల జిల్లా

సంకల్ప బలమే సక్సెస్‌కు కారణం



లక్ష్మీపూర్ సొసైటీ రైతు లోకానికి మార్గదర్శిగా మారింది. ఇక్కడి రైతులు రాజకీయాలను పక్కన పెట్టి ముందుకు వెళ్తుండటంతో, చాలా గ్రామాల రైతులు సైతం లక్ష్మీపూర్ రైస్ మాదిరిగా ఆయా గ్రామాల పేర్లతో రైస్ విక్రయించడం జరుగుతుంది. ఇక్కడి రైతుల్లో సంకల్పం, పట్టుదల, విజయం సాధిస్తామన్న నమ్మకం మెండుగా ఉంది. అందువల్లే ప్రతి పనిలోనూ సక్సెస్ కాగలుగుతున్నారు.

- అశోక్‌కుమార్ (85004 28578), జిల్లా వ్యవసాయ శాఖ సలహాదారు, జగిత్యాల

ప్రభుత్వ నిబంధనలతో పాటు సంఘానికి ప్రత్యేక నిబంధనలు రాసుకుని ముందుకు వెళ్తుండటంతో సొసైటీ విజయపథాన నడుస్తోంది. సర్వసభ్య సమావేశానికి రాకపోతే రూ. 500 జరిమానా, సంఘ డైరెక్టర్లు సమావేశానికి వెళ్లకపోతే రూ. 100 జరిమానా విధిస్తుంటారు. దీంతో, ప్రతి సమావేశానికి సభ్యులందరూ వచ్చి తమకు తోచిన సలహాలు, సూచనలు ఇస్తుంటారు. ఈ నేపథ్యంలో సంఘానికి ఆదాయం తెస్తూనే, సంఘ సభ్యుడైన రైతులకు లాభం ఉండేలా తొలుత 'లక్ష్మీపూర్ రైస్'ను తెర మీదకు తెచ్చి, సఫలీకృతులయ్యారు. ఆ కోవలోనే గ్రామ రైతులు పండించిన విత్తనాన్ని తోటి రైతులకు అందించాలనే ఆకాంక్షతో 'లక్ష్మీపూర్ సీడ్'ను అమ్ముతున్నారు. ఇదే వరుసలో తాజాగా 'లక్ష్మీపూర్ నువ్వుల'ను సైతం మార్కెట్లోకి తీసుకువచ్చారు.

క్వింటాలుకు రూ. వెయ్యి అదనపు రాబడి

గ్రామంలో ఎక్కువగా బీపీటీ, హెచ్ఎంటీ, జై శ్రీరాం వరి రకాలను సాగు చేస్తుంటారు. ఈ గ్రామస్తులు అన్ని రకాల యాజమాన్య పద్ధతులు పాటిస్తుండటంతో, ఎకరాకు 28–30 క్వింటాళ్ల దిగుబడి తీస్తుంటారు. రైతులు ఎవరికివారే వరి ధాన్యాన్ని బాగా ఆరబెట్టి, గ్రామంలోని మిల్లుల్లో మర ఆడిస్తారు. అప్పుడు సంఘ ప్రతినిధి బృందం పరిశీలించి, బాగున్నాయనుకుంటేనే సంఘం తీసుకుని, గోదాములో నిల్వ చేస్తుంది. మార్కెట్ రేటు కంటే తక్కువకే నేరుగా వినియోగదారులకు అమ్ముతుంటారు. బియ్యం అమ్మగా వచ్చిన డబ్బులో కొంత సంఘానికి జమ చేసి, మిగతా డబ్బులను వెంటనే రైతులకు చెల్లిస్తుంటారు. దీని వల్ల గ్రామంలోని రైతులందరూ సన్న ధాన్యాన్ని బియ్యంగా మార్చుతుండటంతో, ధాన్యాన్ని అమ్మిన దాని కంటే, బియ్యం అమ్మగా రైతులకు క్వింటాల్‌కు అదనంగా రూ. 500 నుంచి వెయ్యి వరకు లాభపడుతున్నారు.

లక్ష్మీపూర్ సీడ్‌కు ఆదరణ

గ్రామ రైతులు ప్రతి సీజన్‌లో లక్షల రూపాయలు పెట్టి రక రకాల కంపెనీల వరి విత్తనాన్ని తీసుకువచ్చి పంటే వేసేవారు. కానీ, విత్తనాల్లో నాణ్యత లేకపోవడం వల్ల పంట దిగుబడులు వచ్చేవి కాదు. దీంతో, రైతులందరం కలిసి మన విత్తనాన్ని మనమే తయారు చేసుకోవడం కాదు, తోటి రైతులకు కూడా అందించాలని లక్ష్మీపూర్ సీడ్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టారు. పొలాస పరిశోధనా స్థానం నుంచి వరిలో కొత్త దొడ్డు రకం జెజిఎల్–24423ని దాదాపు 1000 ఎకరాల్లో సాగు చేసి, ఆ విత్తనాన్ని తోటి రైతులకు అమ్ముతున్నారు. వీటితో పాటు ఐఆర్–64, బతుకమ్మ, ఎంటియు–1010 రకాలను కూడా విక్రయిస్తున్నారు. విత్తన రైతులకు మార్కెట్ ధర కంటే రూ. 200 వరకు ఎక్కువ ధర వస్తున్నది.

లక్ష్మీపూర్ రైతులు పసుపు పంట తర్వాత నువ్వులు వేస్తుంటారు. గ్రామంలో దాదాపు వెయ్యి క్వింటాళ్ల వరకు నువ్వులు పండుతాయి. నువ్వులు నాణ్యంగా ఉన్నప్పటికీ, దళారులు రంగ ప్రవేశం చేసి కిలో రూ 70–100 వరకు కొనుగోలు చేసేవారు. దీంతో, రైతులకు సరైన ఆదాయం రాక నష్టపోతుండేవారు. సీడ్స్, రైస్‌తో లక్ష్మీపూర్‌కు బ్రాండ్ ఇమేజ్ వచ్చినందున, నువ్వులను సైతం విక్రయిస్తున్నారు. ప్రజలు విశేషంగా స్పందిస్తున్నారు.

లక్ష్మీపూర్ రైతులు ఐకమత్యంతో చేస్తున్న ప్రతి పనికి జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ తోడ్పాటునిస్తున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ చొరవ వల్ల గ్రామంలో రూ. 4 కోట్లతో విత్తన శుద్ధి ప్లాంట్ ఏర్పాటైంది. సంఘ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న చైర్మన్ తిరుపతి రెడ్డి రెండుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికవడం విశేషం. 2017లో రూ. 11 లక్షల బియ్యం, రూ. 8 లక్షల వరి విత్తనాలు, 2018లో రూ. 14 లక్షల బియ్యం, రూ. 8 లక్షల వరి విత్తనాలు అమ్మారు. సంఘం ప్రారంభించిన రెండేళ్లలోనే దాదాపు రూ. 4 కోట్ల టర్నోవర్‌తో శభాష్ అనిపించుకుంటున్నారు.

రైతులు పండించే కూరగాయల అమ్మకానికి లక్ష్మీపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాట్లు జరుగుతున్నాయి. సంఘటితం కావడం వల్ల రైతులు అధికాదాయం పొందుతున్నారు. సరసమైన ధరకు నాణ్యమైన వ్యవసాయోత్పత్తులు దొరుకుతుండటంతో వినియోగదారులూ సంతోషపడుతున్నారు.

(వివరాలకు.. సంఘ ప్రతినిధులు మోహన్ రెడ్డి(95020 26069), రాంరెడ్డి(99484 52429)

– పన్నాల కమలాకర్,
సాక్షి, జగిత్యాల అగ్రికల్చర్

రైతు శాస్త్రవేత్త

శభాష్.. సుభానీ సోలార్ స్ప్రేయర్!

- సౌరశక్తితో తనంతట తానే నడుస్తూ పిచికారీ చేస్తుంది
- అరగంటలో ఎకరంలో పిచికారీ పూర్తి
- ఆరుతడి, మెట్ట పంటలన్నిటికీ ఉపయోగం
- ఆవిష్కర్త సుభానీకి నాబార్డు చేదోడు

కషాయాలు, ద్రావణాలు, జీవామృతం, అటవీ చైతన్యం, అమృత్‌పానీ వంటి భూసార వర్ధని ద్రావణాల నుంచి పురుగుమందుల వరకు పంటలపై మనుషులు పిచికారీ చేయడం రైతుకు భారంగా మారింది. కూలీల కొరత, అధిక ఖర్చు సమస్యలతో పాటు సకాలంలో ప్రారంభించి, త్వరగా పిచికారీ పూర్తి చేయడం కూడా రైతుకు అనుకూలించే ముఖ్య విషయాలు.
రైతుకు ఖర్చును, శ్రమను, సమయాన్ని ఆదా చేసే బూమ్ స్ప్రేయర్లు సహా కొత్త రకం స్ప్రేయర్లను రూపొందించడంలో సయ్యద్ సుభానీ సిద్ధహస్తుడు. సౌరశక్తితో తనంతట తానే నడుస్తూ, పిచికారీ చేసే సోలార్ స్ప్రేయర్‌ను తాజాగా సుభానీ ఆవిష్కరించారు. మెట్ట, ఆరుతడి పంటలన్నిటికీ ఇది ఉపయోగపడుతుంది.

ప్రయోగాలే ఊపిరిగా సరికొత్త స్ప్రేయర్లను రూపొందిస్తూ అన్నదాతల మన్ననలు పొందుతున్న ప్రసిద్ధ గ్రామీణ ఆవిష్కర్త సయ్యద్ సుభానీ తాజాగా సౌర శక్తితో నడిచే 'బ్యాటరీ రన్ సోలార్ స్ప్రేయర్'ను రూపొందించారు. మెకానిక్ అయిన సుభానీ గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలంలోని మారుమూల గ్రామం నాగభైరువారిపాలెం వాస్తవ్యుడు. ఆరేళ్ల క్రితం నుంచి కొత్త డిజైన్లతో స్ప్రేయర్లు తయారు చేస్తున్నారు. జీపు, ట్రాక్టర్లతో నడిచే బూమ్ స్ప్రేయర్లతో పాటు మొత్తం 9 స్ప్రేయర్లను తయారు చేసి ప్రసిద్ధి పొందారు.


ఈ మూడు చక్రాల సోలార్ స్ప్రేయర్‌కు డీజిల్/పెట్రోలు అవసరం లేదు. దీని పైన ఏర్పాటు చేసిన సౌర ఫలకం ద్వారా తయారు చేసుకునే సౌరశక్తితో బ్యాటరీ చార్జి అవుతుంది. ఆ శక్తితోనే నడుస్తుంది, పిచికారీ చేస్తుంది. దీని వెనుక మనిషి ఉండాలి. అయితే, శ్రమపడాల్సిన అవసరం లేదు. ట్యాంకును నింపి, సాలులో దీన్ని నిలిపి ఆన్ చేస్తే చాలు. అదే తనను తాను నడుపుకుంటూ పిచికారీ చేస్తూ ముందుకు వెళ్తుంది. స్ప్రేయర్ చక్రాలకు మట్టి పెళ్లలు అడ్డుపడినప్పుడో, మలుపు తిరగాల్సినప్పుడో మనిషి అవసరం ఉంటుంది.

ఏయే పంటలకు ఉపయోగం?

9 అంగుళాల నుంచి 42 అంగుళాల అచ్చువాడే శనగ, మినుము వంటి అపరాలు, పత్తి, పొగాకు, కూరగాయ పంటలు తదితర మెట్ట, ఆరుతడి పైరులన్నిటిలోనూ కషాయాలు, ద్రావణాలు, పురుగుమందుల పిచికారీకి ఇది సమర్థవంతంగా ఉపయోగపడుతుంది. జీవామృతం పిచికారీ చేయాలంటే.. డబుల్ ఫిల్టర్‌ను వాడాలి. పెద్ద నాజిల్ పెట్టుకోవాలని సుభానీ తెలిపారు.



స్ప్రేయర్ పనితీరును పరీక్షిస్తున్న సుభానీ, తదితరులు



స్ప్రేయర్‌కు తుది మెరుగులు దిద్దుతున్న సుభానీ

పందిరి కూరగాయ తోటల్లో పందిళ్ల పైన పిచికారీ చేయడానికి కూడా దీని డిజైన్‌లో కొన్ని మార్పులు చేసి తయారు చేస్తానని సుభానీ తెలిపారు. ఈ స్ప్రేయర్ చక్రాల మధ్య 18 అంగుళాల దూరం ఉంటుంది. ఇటు 6 అడుగులు, అటు 6 అడుగుల దూరం పిచికారీ చేస్తుంది. అవసరాన్ని బట్టి తగినట్లు మార్పులు చేసుకోవచ్చని సుభానీ తెలిపారు.


అర గంటలో ఎకరం పిచికారీ

స్ప్రేయర్ తయారీకి రూ. 32 వేల ఖర్చు

ఈ మూడు చక్రాల సోలార్ స్ప్రేయర్ తయారీకి సుమారు రూ. 32 వేలు ఖర్చవుతుందని సుభానీ తెలిపారు. సైకిల్‌కి వాడే మూడు చక్రాల బండికి 50 వాట్ల సోలార్ ప్యానల్, 12 యాంప్స్ బ్యాటరీ. 12 వోల్టుల (120 పీఎస్) మోటారు, 22 లీటర్ల సామర్థ్యం వాటర్ ట్యాంక్‌ను అమర్చారు. నాలుగు నాజిల్స్ ఏర్పాటు చేశారు. ఎకరా పొలంలో 30 నిమిషాల్లో పురుగుమందు పిచికారీ చేయవచ్చు. కూలీలను పెట్టుకొని పిచికారీ చేయాలంటే గంటన్నర సమయం పడుతుంది. దీని బ్యాటరీకి ఏడాది గ్యారంటీ ఉంది. మనిషి నెట్టుకుంటూ వెళ్లే విధంగా ఒకే చక్రంతో కూడిన సోలార్ స్ప్రేయర్‌ను రూ. 22 వేలకే రూపొందించవచ్చన్నారు. సుభానీని గ్రాంటు ఇవ్వడం ద్వారా నాబార్డు ప్రోత్సహిస్తుండడం విశేషం.

– ఓబుల్‌రెడ్డి వెంకట్రామిరెడ్డి,
సాక్షి, అమరావతి బ్యూరో
ఫొటోలు: పులి ప్రకాశ్, సాక్షి, పెదనందిపాడు

బ్యాంకు రుణం ఇస్తే మరిన్ని రూపొందిస్తా!



నేను గత ఆరు సంవత్సరాలుగా కొత్తరకం స్ప్రేయర్లపై ప్రయోగాలలో నిమగ్నమై ఉన్నాను. ఇప్పటికి 9 రూపొందించాను. ఈ సోలార్ స్ప్రేయర్ లాంటిది దేశంలో ఇంతకుముందెవరూ తయారు చేయలేదు. నా భార్య షకీలా, తమ్ముడు చిన్న సుభానీ, కుమారులు ఖుధావ, మోషిన్, కుమార్తె షాహిన్‌తోపాటు నాబార్డు, పల్లెసృజన సంస్థలు అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిది. బ్యాంకు రుణ సౌకర్యం కల్పిస్తే, రైతులకు తోడ్పడే మరిన్ని నూతన పరికరాలు రూపొందిస్తా.

- సయ్యద్ సుభానీ (98486 13687), గ్రామీణ ఆవిష్కర్త, నాగభైరువారిపాలెం, పెదనందిపాడు మం., గుంటూరు జిల్లా

ఇంటి పంట

జీవ వైవిధ్యమే ప్రాణం!



'గత డిసెంబరుతో (హైదరాబాద్ సమీపంలోని నారపల్లిలోని) మా మిద్దెతోట తొమ్మిదవ సంవత్సరంలోకి ప్రవేశించింది. గడచిన ఎనిమిది సంవత్సరాల కాలంలో మార్కెట్లో కూరగాయలు కొనలేదు – పండ్లు కొనలేదు!

మిద్దెతోటలోనే ఉత్పత్తి చేశాం!

ఎనిమిది సంవత్సరాల మిద్దెతోట ఉత్పత్తిని – రోజుకు కిలో చొప్పున లెక్కించినా – మూడు టన్నుల పైమాటే! ఇదంతా కేవలం 1240 స్క్వేర్ ఫీట్ల టెర్రస్ మీద మాత్రమే పండించాం. ఎనిమిది సంవత్సరాల క్రితం మిద్దెతోట నిర్మాణ వ్యయం ఇరవై వేల రూపాయలు. అయితే, ఈ ప్రత్యక్ష ఫలితాల గురించి కాదు నేను చెప్పాలనుకుంటున్నది.. అది అందరికీ కనిపించే విషయమే!

ఈ ఉత్పత్తి వెనుక ఒక సహజసిద్ధమైన 'జీవ వైవిధ్య ప్రభావం' ప్రక్రియ ఉన్నదని తెలియజెప్పాలన్నదే ఈ ప్రయత్నం. అదే లేకుంటే, ఈ ఉత్పత్తి వచ్చేదే కాదు!

జీవ వైవిధ్యం వల్లనే ప్రకృతి కొనసాగుతున్నది. మనందరికీ తెలుసు, పరపరాగ సంపర్కం వల్లనే పువ్వులు ఫలిస్తాయని. తేనెటీగలు సీతాకోకచిలుకలు ఇతర రెక్కల పురుగులు అందుకు దోహదపడతాయి.

పూలలోని తేనె కోసం తేనెటీగలు వచ్చి పువ్వుల మీద వాలినప్పుడు వాటి కాళ్ల నూగుకు పువ్వుల పుప్పొడి అంటుకుని.. అలా పరపరాగ సంపర్కం అప్రయత్నంగా జరుగుతుంది. అలా పువ్వులు ఫలదీకరణ చెందుతాయి. మనకు లభించే దాదాపుగా అన్ని రకాల ఉత్పత్తులు ఇలానే పండుతాయి.

మిద్దెతోటను మనం అభివృద్ధి చేస్తున్నకొద్దీ, రావలసిన జీవజాతులు వచ్చి చేరతాయి. మిద్దెతోటల్లో పండ్ల మొక్కలను కూడా పెంచడం వల్ల పక్షులు కూడా వస్తాయి. చిన్న చిన్న పక్షులు మొక్కల మీద పురుగులను ఏరుకొని తింటాయి!



రఘోత్తమరెడ్డి మిద్దె తోటలో జీవవైవిధ్యానికి ఆనవాళ్లు.. పక్షి గూళ్లు, పక్షులు, పిల్లి, కుక్క..

మొక్కలకు హాని చేసే క్రిమికీటకాలను అలా కంట్రోల్ చేస్తాయి. కోయిలలు కూడా పండ్ల కోసం మిద్దెతోటల లోకి వస్తాయి. వాటి పాటలను వినగలగడం వల్ల మనకు ఎంతో సంతోషం కలుగుతుంది. అది మన స్వయం కృషి ఫలమైన సహజ సంగీతం!

మట్టిలో వానపాములు అభివృద్ధి అవుతాయి. వాటివలన సహజసిద్ధమైన ఎరువు తయారు అవుతుంది.

మిద్దెతోటలో సంవత్సరం పొడవునా పువ్వులుండేలా పూల మొక్కలను పెంచుతాం కనుక రంగు రంగుల సీతాకోక చిలుకలు మిద్దె తోటలోకి వస్తాయి, తేనె తాగడానికి! తద్వారా పువ్వుల మధ్య పరపరాగ సంపర్కం జరిగి మనకు సంపూర్ణ ఉత్పత్తి వస్తుంది. గువ్వలు, పిచ్చుకలు వచ్చి మిద్దెతోటలో గూళ్లు కట్టుకుంటాయి. మిద్దెతోటల మొక్కలకు హాని చేసే పురుగూ పుట్రలను అవి తినేస్తూ మొక్కలకు పరోక్షంగా రక్షణ కలిగిస్తాయి.

మిద్దెతోటల్లోకి ఎలుకలు కూడా వస్తాయి.. నష్టాన్ని కలిగిస్తాయి. ఎలుకల కోసం పిల్లులు వస్తాయి. ఇలా ఇప్పుడు మా మిద్దెతోటలో మూడు పిల్లులు ఉన్నాయి. ఒక పెంపుడు శునకం ఉంది. వాటి మధ్య సఖ్యత కూడా కలిగింది!

మిద్దెతోటలో నిత్యం పూసే పువ్వుల తేనె కోసం వందలాది తేనెటీగలు ఉదయం పూట వస్తాయి. మిద్దెతోటలో చిన్నచిన్న తేనెపట్టులు పెట్టుకుంటాయి. ప్రతీ చిన్న పువ్వు నుండి అవి తేనెను గ్రహిస్తాయి. కూరగాయ మొక్కల పువ్వుల నుండి కూడా తేనెను గ్రహిస్తాయి. ఆ ప్రక్రియ వల్లనే నిజానికి సమస్త రకాల పువ్వులు ఫలదీకరణం చెందుతున్నాయి. మనం నిత్యం తినే తిండి తయారీలో తేనెటీగల పాత్ర అపురూపమైనది – వెలకట్టలేనిది!

మనం ప్రకృతి సమతుల్యతను కాపాడితే, అది మన ఆయురారోగ్యాలను కాపాడుతుంది!

మిత్రుడు క్రాంతిరెడ్డి ఓ మాట అన్నాడు, 'నేను మాత్రమే అనుకుంటే అహం – నేను కూడా అనుకుంటే సుఖం. మనుషులొక్కరే భూగోళం మీద మన లేరు – సమస్త జీవజాతుల మనుగడలో మనుషుల మనుగడ ముడిపడి ఉంది!

పట్టణాలలో జీవ వైవిధ్యం పెరగాలంటే, మిద్దె తోటలను మించిన సాధనాలు లేవు!

– తుమ్మేటి రఘోత్తమరెడ్డి,
మిద్దెతోట నిపుణులు, నారపల్లి

సాక్షి భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

మంగళవారం
15-1-2019

ఉద్యోగాలు

యూపీఎస్సీ- కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 358 ఖాళీలు

దేశంలోని వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల్లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 358 పోస్టుల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) దరఖాస్తులు కోరుతోంది.

1. అసిస్టెంట్ ప్రొఫెసర్-16.
- **విభాగాలు:** అనస్థీషియా, కార్డియాలజీ, సీటీవీఎస్, గ్యాస్ట్రో మెడిసిన్, గ్యాస్ట్రో సర్జరీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, సైకియాట్రీ, పల్మనరీ మెడిసిన్, సర్జికల్ ఆంకాలజీ, రేడియాలజీ, యూరాలజీ.
2. ఇంజనీర్ అండ్ షిప్ సర్వేయర్-కమ్-డిప్యూటీ జనరల్ (టెక్నికల్)-1.
3. సైంటిస్ట్-బి (జూనియర్ జియోఫిజిసిస్ట్)-3.
4. మెడికల్ ఆఫీసర్ (జీడీఎంవో)-327.
5. సీనియర్ లెక్చరర్-11.
- **అర్హత:** పోస్టులను బట్టి ఎంబీబీఎస్, సంబంధిత విభాగాల్లో ఎండీ, ఎంఎస్, డీఎం, ఎంసీహెచ్, పీహెచ్‌డీ/డీఎస్సీ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత, పని అనుభవం ఉండాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 31, 2019.
- **వెబ్‌సైట్:** www.upsc.gov.in


వైజాగ్ స్టీల్‌లో 77 ఖాళీలు

విశాఖపట్నంలోని భారత ఉక్కు మంత్రిత్వ శాఖకు చెందిన రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (వైజాగ్ స్టీల్) 77 మేనేజ్‌మెంట్ ట్రైనీ (ఎంటీ)-టెక్నికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** ఎలక్ట్రికల్-20, మెకానికల్-31, మెటలర్జీ-26.
- **అర్హత:** ఇంజనీరింగ్/టెక్నాలజీలో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత. చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయసు:** 27 ఏళ్లకు మించకూడదు. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** గేట్ స్కోర్ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.500. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 20, 2019.
- **వెబ్‌సైట్:** www.vizagsteel.com

ఎగ్జామ్ టిప్స్

గేట్... గెలుపు



గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్).. ఇంజనీరింగ్ పూర్తిచేసిన అధికశాతం మంది విద్యార్థుల స్వప్నం. ఇందులో మంచి స్కోర్ సాధిస్తే.. ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ఇంజనీరింగ్/టెక్నాలజీ/ఆర్కిటెక్చర్ కోర్సుల్లో ఉన్నతవిద్యలో ప్రవేశం పొందొచ్చు. గేట్ స్కోర్ ద్వారా ప్రభుత్వ రంగ సంస్థ(పీఎస్‌యూ)ల్లో సర్కారీ కొలువు సొంతం చేసుకునే అవకాశముంది. ఎంటెక్/ఎంఈ/ఎంఆర్క్/ఎంఎస్సీ/పీహెచ్‌డీ తదితర ఉన్నతవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే గేట్-2019 పూర్తిస్థాయి షెడ్యూల్‌ను ఐఐటీ మద్రాస్ జారీ చేసింది. మరికొద్ది రోజుల్లోనే పరీక్ష ప్రారంభం కానున్న నేపథ్యంలో గేట్‌తో ప్రయోజనాలు.. పరీక్షలో విజయానికి నిపుణుల సలహాలు..

ఐఐటీలు, నిట్‌లు వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో పీజీ కోర్సుల్లో చేరేందుకు గేట్ స్కోర్ తప్పనిసరి. ఉన్నతవిద్య, ప్రభుత్వ ఉద్యోగం, విదేశీ యూనివర్సిటీల్లో ప్రవేశాలు తదితర అనేక అవకాశాలు గేట్ ద్వారా లభిస్తుండటంతో ఈ పరీక్షకు పోటీ తీవ్రంగా ఉంది. పరీక్షకు అందుబాటులో ఉన్న ఈ స్వల్ప సమయాన్ని సమర్థంగా ఉపయోగించుకుంటూ సన్నద్ధమవ్వాలి. ఇంజనీరింగ్ తర్వాత ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్న అభ్యర్థులు ఎక్కువ మంది గేట్‌కు సన్నద్ధమవుతున్నారు. ఆకర్షణీయ వేతనాలు, బంగారు కెరీర్‌కు బాటలు వేసుకునే ఎన్నో అవకాశాలు గేట్ ద్వారా సొంతం చేసుకునే వీలుండటంతో చాలా మంది ఇంజనీరింగ్ అభ్యర్థులకు ఈ పరీక్ష ప్రథమ ప్రాథమ్యంగా మారింది.

పరీక్ష స్వరూపం

- ఫిబ్రవరి 2, 3, 9, 10 తేదీల్లో దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ విధానం(కంప్యూటర్ ఆధారిత పరీక్ష)లో గేట్ జరుగుతుంది. మొత్తం 24 సబ్జెక్టు పేపర్లకు పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థులు ఏదైనా ఒక పేపర్‌కు హాజరుకావచ్చు.
- గేట్ పరీక్ష 65 ప్రశ్నలు, 100 మార్కులకు జరుగుతుంది. ఈ 65 ప్రశ్నల్లో 10 ప్రశ్నలు (15 మార్కులు) జనరల్ ఆప్టిట్యూడ్(లాంగ్వేజ్, అనలిటికల్ స్కిల్స్)కు సంబంధించినవి. మిగతా 55 ప్రశ్నలు అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్టు నుంచి అడుగుతారు. పరీక్ష వ్యవధి మూడు గంటలు. ప్రశ్నపత్రంలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు(ఎంసీక్యూ), న్యూమరికల్ ఆన్సర్(ఎన్‌ఏటీ) టైప్ ప్రశ్నలు ఎదురవుతాయి. నెగిటివ్ మార్కింగ్ విధానం అమల్లో ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3వంతు మార్కు కోత ఉంటుంది.

గేట్‌తో ప్రయోజనాలు

- గేట్ స్కోర్‌తో ఉన్నత విద్యావకాశాలే కాకుండా.. ప్రభుత్వ రంగ సంస్థ(పీఎస్‌యూ)ల్లో ఉద్యోగాలు, పలు ఐఐఎంల్లోనూ సాంకేతిక కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు.
- ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగం కోసం గేట్ రాసే అభ్యర్థుల సంఖ్య ఇటీవల బాగా పెరిగినట్లు నిపుణులు చెబుతున్నారు.
- మహారత్న, నవరత్న, మినీరత్న హోదా ఉన్న ప్రభుత్వరంగ సంస్థలు.. గేట్ స్కోరు ఆధారంగా ఉద్యోగాల భర్తీని చేపడుతున్నాయి. గేట్ పరీక్ష ప్రమాణాలను గమనించిన ప్రభుత్వ రంగ సంస్థలు.. మెరిట్ విద్యార్థులను గుర్తించడం సులువవుతందనే కారణంతో గేట్ ద్వారా నియామకాలు చేస్తున్నాయి.
- ఒక్కో పీఎస్‌యూ.. కేటగిరీల ఆధారంగా, కటాఫ్ మార్కులు నిర్ణయించి మౌఖిక పరీక్షలకు పిలుస్తున్నాయి. ఈ కటాఫ్ మార్కులు పీఎస్‌యూలను బట్టి మారుతూ ఉంటాయి. పీఎస్‌యూల్లో ఉద్యోగం పొందాలంటే.. గేట్‌లో మంచి ర్యాంకు సాధించడం తప్పనిసరి.
- గేట్ స్కోరుతో ప్రఖ్యాత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ)లోనూ చేరే అవకాశం లభిస్తుంది. ఐఐఎస్సీ తర్వాత ఐఐటీలు, ఎన్‌ఐటీలు విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. ఆయా సంస్థల్లో ఎంటెక్, ఎంఈ, ఎంఎస్, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశం ఖాయం చేసుకోవచ్చు. మరికొన్ని విద్యాసంస్థలు నేరుగా పీహెచ్‌డీలో ప్రవేశాలు కల్పిస్తున్నాయి.
- పీజీలో చేరే విద్యార్థులకు నెలకు రూ.12,400 స్టైపండ్ అందుతుంది. పీహెచ్‌డీ కోర్సుల్లో చేరే ప్రతిభావంతులకు పీఎంఆర్‌ఎఫ్ పథకం కింద నెలకు రూ.70,000 స్టైపండ్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దాంతో గేట్ ద్వారా పీహెచ్‌డీలో చేరే వారికి ప్రాధాన్యం లభించనుంది.
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లు నిర్వహిస్తున్న టెక్నికల్ ఎంబీఏ కోర్సుల్లో చేరడానికి కూడా గేట్ స్కోరే ప్రామాణికంగా మారింది. ఐఐఎంల్లో ఫెలోషిప్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఎఫ్‌పీఎం) కోర్సులకూ గేట్ స్కోరును పరిగణనలోకి తీసుకుంటున్నారు.

పీఎస్‌యూలకు దరఖాస్తు

ఇప్పటికే పలు పీఎస్‌యూలు రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్లు విడుదల చేశాయి. అభ్యర్థులు వీటికి ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. గేట్ ఫలితాలు వెలువడ్డాక.. ఆయా పీఎస్‌యూలు ర్యాంకుల ఆధారంగా అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తాయి. ఈ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు.. మలిదశలోని ఎంపిక ప్రక్రియలకు అనుమతి లభిస్తుంది. ఈ దశలో కొన్ని సంస్థలు సొంతంగా రాత పరీక్షలు నిర్వహిస్తాయి. మరికొన్ని పీఎస్‌యూలు బృంద చర్చలు (జీడీ), మౌఖిక పరీక్షలు జరిపి అభ్యర్థులను ఎంపిక చేస్తున్నాయి.

పునశ్చరణ ముఖ్యం

గేట్‌కు ప్రిపేర్ అవుతూ వచ్చిన విద్యార్థులు.. ఇక ఇప్పుడు ఇంతకాలం చదివిన అంశాలను పునశ్చరణ చేసుకోవాలి. అభ్యాస పరీక్షలు ఎక్కువగా రాయాలి. రాయడంతో పాటు వాటి ఫలితాలను తప్పనిసరిగా సమీక్షించుకోవాలి. గేట్‌లో ప్రశ్నలు చాలావరకు అప్లికేషన్ ఓరియెంటెడ్‌గా ఉంటాయి. ఇంతకాలం అభ్యర్థులు రాసుకున్న షార్ట్‌నోట్స్‌ను రివిజన్ చేసుకోవాలి. పరీక్ష హాల్‌లో ఎలాంటి పొరపాట్లు చేయకుండా జాగ్రత్తగా ఉండాలి. ఒత్తిడిని దరిచేరనీయకుండా ప్రశాంతంగా ఉండాలి. సరిపడ నిద్ర పోవాలి. సరైన ఆహారం తీసుకోవాలి. సమయానికి పరీక్ష కేంద్రానికి చేరేలా ముందు రోజే పరీక్ష కేంద్రాన్ని చూసుకోవడం మేలు చేస్తుంది.

– యాదగిరి శశాంక్, తొమ్మిదో ర్యాంకు
సివిల్ ఇంజనీరింగ్, గేట్ 2018.

అవకాశాలు అనేకం

గతంలో బీటెక్‌తోనే చాలామంది చదువు ఆపేసే వారు. కానీ, ప్రస్తుతం ఉన్నత చదువుల పట్ల ఆసక్తి పెరుగుతోంది. కేంద్ర ప్రభుత్వ కాలేజీల నుంచి పీజీ చేస్తున్న వారికి ప్రారంభంలోనే భారీ వేతనాలు అందుతున్నాయి. పరిశోధన సంస్థలు మాస్టర్స్ కోర్సు పూర్తిచేసిన వారిని నియమించుకునేందుకు మొగ్గు చూపుతున్నాయి. అంతేకాకుండా సింగపూర్, జర్మనీ, స్విట్జర్లాండ్‌లోని కొన్ని ప్రముఖ యూనివర్సిటీలు..గేట్‌లో మంచి స్కోరు పొందిన వారికి స్వాగతం పలుకుతున్నాయి. సింగపూర్‌లో ఉన్న అంతర్జాతీయ స్థాయి యూనివర్సిటీలు.. నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్, నాన్‌యంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీ లాంటివి గేట్ స్కోరు ద్వారా ప్రవేశాలు కల్పిస్తున్నాయి. అలానే, టెక్నికల్ యూనివర్సిటీ ఆఫ్ మునిచ్, ఆర్‌డబ్ల్యుటీహెచ్ ఆచెన్ యూనివర్సిటీ వంటి కాలేజీలు గేట్ స్కోరును పరిగణనలోకి తీసుకుంటున్నాయి.

– పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి,
సీఎండీ, వాణి ఇన్‌స్టిట్యూట్.

పరీక్ష రోజు.. ఇలా మేలు

GATE
GRADUATE APTITUDE TEST IN ENGINEERING
2019

- పరీక్షకు ఇంకా కొద్ది సమయమే అందుబాటులో ఉండటం వల్ల సిలబస్ రివిజన్, మాక్ టెస్టులకు ఎక్కువ సమయం కేటాయించాలి. ఇప్పటికే సిద్ధం చేసుకున్న సొంత నోట్స్‌ను ఒకటికి రెండుసార్లు ర్యాపిడ్ రివిజన్ చేయాలి. ప్రశ్నలకు సొంతంగా సమాధానాలు గుర్తించే ప్రయత్నం చేయాలి. అందుకోసం ప్రీవియస్ గేట్ పేపర్లు, మోడల్ పేపర్లు ప్రాక్టీస్ చేయాలి.
- పరీక్ష హాల్‌లోకి వెళ్లిన తర్వాత మొదట నేరుగా సమాధానాలు ఇవ్వగలిగే ప్రశ్నలను గుర్తించాలి. తర్వాత అప్లికేషన్ ఓరియెంటేషన్ ఉన్న ప్రశ్నలను గుర్తించాలి.
- చివరి అర్ధగంట సమయాన్ని గుర్తించిన సమాధానాలను మరోసారి పరిశీలించేందుకు కేటాయించాలి. అలానే 2 మార్కుల ప్రశ్నలకు జవాబులు గుర్తించటంపై ఎక్కువ శ్రద్ధ పెట్టడం మేలు.
- ఆన్‌లైన్ టెస్టులో ఏదైనా క్యాలికులేషన్ చేసే క్రమంలో మొదట పైనఉన్న క్యాలికులేటర్ బటన్‌ను ఉపయోగించుకోవాలి.
- సమయాన్ని ఆదా చేసుకోవడానికి క్యాలికులేటర్‌లో ఉన్న బటన్స్‌ను సరిగ్గా ఉపయోగించుకోవడం అలవాటు చేసుకోవాలి. లాగ్, ఎక్స్‌పో, పై వంటి డిఫాల్ట్ బటన్స్‌ను పరీక్ష సమయంలో వినియోగించుకోవాలి.
- క్యుములేటివ్ టోటల్స్ గణించడానికి మెమరీ ఫంక్షన్స్‌ను వాడుకోవాలి. యూనిట్ల దగ్గర కూడా జాగ్రత్తగా ఉండాలి. క్యాలికులేటర్ ఉపయోగించే క్రమంలో ఆప్షన్లను జాగ్రత్తగా చూసుకోవాలి.
- పెరెంథీసిస్ బ్యాలెన్స్‌డ్‌గా లేకపోతే వదిలేయాలి.
- ఏకకాలంలో చాలా ఆపరేషన్స్ కలిపి ఒకేసారి చేయకూడదు.
- కీ బోర్డ్ యాక్సెస్ ఉండదు.

ఏపీపీఎస్సీ ఎగ్జామ్స్

కార్యదర్శికి మార్గదర్శి

ఆంధ్రప్రదేశ్‌లో ఎట్టకేలకు పంచాయతీ కార్యదర్శి పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. లక్షల మంది నిరుద్యోగుల ఏళ్ల తరబడి నిరీక్షణకు తెరదించుతూ.. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) 1051 పంచాయతీ కార్యదర్శి పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. చాలాకాలం తర్వాత నోటిఫికేషన్ వెలువడటంతో దరఖాస్తులు రికార్డు స్థాయిలో వచ్చే అవకాశముందని అంచనా. అంటే... పోస్టులు తక్కువ... పోటీ తీవ్రం అన్నమాట! ఇలాంటి తీవ్ర పోటీ పరిస్థితిలో పటిష్ట ప్రణాళికతో శ్రమిస్తేనే పోస్టు దక్కే అవకాశం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఏపీ పంచాయతీ కార్యదర్శి పరీక్ష విధానం, ప్రిపరేషన్ వ్యూహం...



- పరీక్ష ఫీజు చెల్లింపునకు చివరి తేదీ: జనవరి 18
- పోస్టులు తక్కువ.. పోటీ తీవ్రం
- స్క్రీనింగ్ టెస్టు, మెయిన్ పరీక్ష ద్వారా ఎంపిక
- పటిష్ట ప్రణాళికతో చదవాలంటున్న నిపుణులు

➠ **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత.

ఎంపిక విధానం

మొదట స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుంది. ఇందులో అర్హత సాధించిన వారికి మెయిన్ పరీక్ష నిర్వహిస్తారు. మెయిన్ ఎగ్జామినేషన్ (కంప్యూటర్ బేస్డ్ టెస్టు) లో చూపిన ప్రతిభ ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది.

పరీక్ష విధానం

స్క్రీనింగ్ టెస్టు (150 మార్కులు)

విభాగం	ప్రశ్నలు	సమయం
ఎ. జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ	75	75 ని.
బి. గ్రామీణ అభివృద్ధి-సమస్యలు (ఏపీ ప్రత్యేక దృష్టితో)	75	75 ని.

మెయిన్ ఎగ్జామినేషన్ (300 మార్కులు)

పేపర్	ప్రశ్నలు	సమయం
1. జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ	150	150 ని.
2. గ్రామీణాభివృద్ధి-సమస్యలు (ఏపీ ప్రత్యేక దృష్టితో)	150	150 ని.

ప్రిపరేషన్ వ్యూహం

- అభ్యర్థులు ముందుగా స్క్రీనింగ్ టెస్టు, మెయిన్ ఎగ్జామినేషన్‌కు ఒకే సిలబస్ ఉందని గుర్తించాలి. స్క్రీనింగ్ టెస్టులో జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ,గ్రామీణాభివృద్ధి-గ్రామీణ ప్రాంత సమస్యలను ఒకే పేపర్‌లో రెండు విభాగాలుగా పేర్కొంటే.. మెయిన్స్‌లో వాటినే రెండు పేపర్లుగా మార్చి ఒక్కో పేపర్‌కు 150 మార్కులు కేటాయించారు. సిలబస్ (స్క్రీనింగ్/మెయిన్స్)లో జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ, గ్రామీణాభివృద్ధి-సమస్యలు (ఏపీ ప్రత్యేక దృష్టి) నుంచి 12 చొప్పున ఉప అంశాలను కీలకంగా పేర్కొన్నారు.

ముఖ్యాంశాలను గుర్తించాలి

- సిలబస్‌లో జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్య అంశాలు, కరెంట్ అఫైర్స్ తొలి రెండు అంశాలుగా ఉన్నాయి. అభ్యర్థులు కరెంట్ అఫైర్స్, ప్రాధాన్యాంశాలకు మధ్య తేడాను గుర్తించాల్సిన అవసరం ఉంది. తద్వారా ప్రిపరేషన్ పరంగా స్పష్టతకు రాగలుగుతారు. భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా ముఖ్య సంఘటనలు ప్రాధాన్యాంశాల కిందకు వస్తాయి. ఇందులో భాగంగా బ్రిక్స్, సార్క్ తదితర సదస్సుల గురించి చదవాలి.
- పరీక్షలో కరెంట్ అఫైర్స్ పాత్ర అత్యంత కీలకం. దీన్ని గుర్తించి 2018, సెప్టెంబర్ నుంచి పరీక్ష ముందు వరకు జరిగిన సమకాలీనాంశాలను చదవాలి. ఈ దిశగా రోజూ వార్తా పత్రికలు చదవడం, ముఖ్యాంశాలను నోట్స్ రాసుకోవడం లాభిస్తుంది. కరెంట్ అఫైర్స్ పరంగా గతేడాది డిసెంబర్‌లో జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికలు, బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్లో పి.వి.సింధు గెలుపు, బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ (భారత్ నిలబెట్టుకుంది), ఇస్రో నిర్వహించిన ఉపగ్రహ ప్రయోగాలు తదితర కీలక అంశాలు ఉన్నాయి.
- జనరల్ సైన్స్‌కు సంబంధించి దైనందిన జీవితంతో ముడి పడిన అంశాలను చదవాలి. దీని కోసం ఎనిమిది నుంచి పదో తరగతి వరకు భౌతిక, రసాయన, వృక్ష, జంతు శాస్త్రాల పాఠ్యపుస్తకాలను చదవాలి. దీంతోపాటు సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ)ల గురించి తెలుసుకోవాలి.
- పాలిటీ ప్రిపరేషన్‌లో భాగంగా రాజ్యాంగ సంబంధిత అంశాలు, ప్రభుత్వ విధానాలు, సంస్కరణలు, ఈ-గవర్నెన్స్ కార్యక్రమాల (ఏపీ ప్రత్యేక దృష్టి) గురించి చదవాలి. అలాగే పరీక్ష నాటికి తాజా ఎకనామిక్ సర్వే విడుదలవుతుంది. దీంతోపాటు ఎన్నికల సమయం కాబట్టి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఈ రెండింటి పైనా దృష్టిపెట్టాలి.

విపత్తు నిర్వహణ

- జనరల్ స్టడీస్‌లో విపత్తు నిర్వహణ కీలకమని చెప్పొచ్చు. ఏపీపై తుపాన్ల ప్రభావం అధికంగా ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని హుద్‌హుద్, లైలా, గజ, తిత్లీ, పెథాయ్ తుపానుల గురించి తెలుసుకోవాలి. అలాగే విపత్తు రకాలు, నిర్వహణ పద్ధతులు, యంత్రాంగం తదితరాల గురించి అధ్యయనం చేయాలి.
- వీటితో పాటు సుస్థిర అభివృద్ధి, లాజికల్ రీజనింగ్, ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్, అనలిటికల్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, డేటా అనాలసిస్ కీలక అంశాలుగా ఉంటాయి.

నిర్ణయాత్మకం.. ఇవే!

స్క్రీనింగ్ టెస్టులో పార్ట్ బి, మెయిన్ ఎగ్జామినేషన్ పేపర్-2లను పరీక్ష పరంగా నిర్ణయాత్మక శక్తులుగా అభివర్ణించొచ్చు. వీటిలో రాణించడంపైనే విజయావకాశాలు ఆధారపడి ఉంటాయి.

పరిణామ క్రమం

- భారత, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ వ్యవస్థ పరిణామక్రమాలు అత్యంత కీలక అంశాలుగా ఉంటాయి. ఇందులో భాగంగా ప్రాచీన, మధ్య, ఆధునిక కాలాల్లో జరిగిన గ్రామీణాభివృద్ధిని ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి.
- రుగ్వేదంలో పేర్కొన్న సభ, సమితి; కౌటిల్యుడు (మౌర్యులు) అర్థశాస్త్రంలో ప్రస్తావించిన 'గ్రామిక', అలాగే చోళులు కాలంలో గ్రామీణ వ్యవస్థ అభివృద్ధి గురించి తెలిపే ఉత్తర మేరూరు శాసనం తదితరాల గురించి తెలుసుకోవాలి.
- మధ్యయుగంలో గ్రామీణ వ్యవస్థ కొంత నిరాదరణకు గురైందని చెప్పవచ్చు. ఈ కాలంలో భారత దేశాన్ని ఢిల్లీ సుల్తానులు, మొగలులు పాలించారు. ఢిల్లీ కేంద్రంగా పాలించిన సుర్ వంశానికి చెందిన షేర్షా సూరి గ్రామీణాభివృద్ధికి కొన్ని కీలక చర్యలు తీసుకున్నాడు. ఔత్సాహికులు ఆయా అంశాలను చదవాల్సి ఉంటుంది.
- ఆధునిక కాలం విషయానికొస్తే.. గవర్నర్ జనరల్ లార్డ్ మేయో(1870) స్థానిక ప్రభుత్వాలను పునరుద్ధరించాడు. తదనంతరం లార్డ్ రిప్పన్ (స్థానిక స్వపరిపాలన పితామహుడు) తీసుకొచ్చిన స్థానిక ప్రభుత్వాల చట్టం 1882తోపాటు భారత కౌన్సిల్ చట్టం 1892, రాయల్ కమిషన్ 1907, మింటో మార్లే సంస్కరణలు 1909, భారత ప్రభుత్వ చట్టం 1919, 1935 తదితరాలను అధ్యయనం చేయాలి.

స్వాతంత్ర్యానంతరం.. కమిటీలు

- రాజ్యాంగంలోని ఆర్టికల్40(ఆదేశిక సూత్రాలు) స్థానిక ప్రభుత్వాల ఏర్పాటును సూచిస్తోంది. ఇందులో భాగంగా భారత ప్రభుత్వం 1952, అక్టోబర్ 2న సమాజ అభివృద్ధి పథకం(తొలి గ్రామీణాభివృద్ధి పథకం)ను ప్రారంభించింది. దీనికి కొనసాగింపుగా 1953లో జాతీయ విస్తరణ సేవల పథకం(నెస్) తీసుకొచ్చింది. తదనంతర కాలంలో జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో పంచాయతీ రాజ్ వ్యవస్థ పనితీరు పరిశీలన, తగిన సూచనల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కమిటీలను నియమించాయి. ఆయా కమిటీల వివరాలు, సిఫార్సులు, వాటి అమలు తీరుపై మూడు నుంచి అయిదు ప్రశ్నలు వస్తున్నాయి.

వ్యత్యాసం ఇదే..!

పోటీ పరీక్షల్లో తెలివైన వ్యూహంతో కొంతమంది విజేతలుగా నిలుస్తుంటే.. సరైన వ్యూహం లేక మరికొందరు పోటీలో వెనకబడిపోతున్నారు. సిలబస్ పరంగా గతానికి ఇప్పటికీ ఎలాంటి మార్పు లేదు. జనరల్ స్టడీస్‌లో అడిగే ప్రశ్నలు ఇతర ఏపీపీఎస్సీ పరీక్షల స్థాయిలోనే ఉంటాయి. గ్రామీణాభివృద్ధి పథకాలు, వివిధ పథకాలు-అమలు, పథకాల ఏకీకరణ, లబ్ధిదారులు, లక్ష్యాల గురించి అధ్యయనం చేయాలి. ప్రిపరేషన్‌లో కరెంట్ అఫైర్స్‌ను అన్వయించే విషయంలోనే ప్రధానంగా విజేతలకు, పరాజితులకు మధ్య తేడా కనిపిస్తుంది. కరెంట్ అఫైర్స్‌పై పట్టుతోనే ఎలాంటి ప్రశ్నలకైనా సమాధానాలు గుర్తించగలం. వివిధ పథకాల కింద స్థానిక సంస్థలకు లభిస్తున్న నిధులు, ఆదాయ వ్యయాలు, అకౌంటింగ్ అంశాలు పంచాయతీ కార్యదర్శి పరీక్షలో ప్రత్యేకమైనవి. కాబట్టి ఇతర పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు సదరు అంశాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. 73, 74 రాజ్యాంగ సవరణలు, మహిళా సాధికారత, స్వయం సహాయక బృందాలు, మైక్రో ఫైనాన్స్, కమిటీలు-సిఫార్సులు తదితరాలు పరీక్షలో కీలకంగా నిలుస్తాయి. ప్రిపరేషన్ పరంగా ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ)లో లభించే సమాచారం అభ్యర్థులకు లాభిస్తుంది.

– బి.కృష్ణారెడ్డి, పోటీ పరీక్షల నిపుణులు.

గ్రూప్స్ స్పెషల్ జనరల్ నాలెడ్జ్

జ్ఞానపీఠ్ పురస్కారం



సాహిత్య రంగంలో విశేష కృషిచేసిన వారికి భారతీయ జ్ఞానపీఠ్ సంస్థ.. ఏటా జ్ఞానపీఠ్ పురస్కారం ప్రదానం చేస్తోంది. రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో పేర్కొన్న 22 భాషల్లో, ఇంగ్లిష్‌లో రచనలు చేసిన భారతీయులకు దీన్ని ప్రకటిస్తారు. అవార్డు గ్రహీతలకు రూ.11 లక్షల నగదు, సరస్వతీ దేవీ కాంస్య విగ్రహం ప్రదానం చేస్తారు. ఇప్పటివరకు 59 మందికి జ్ఞానపీఠ్‌ను ప్రదానం చేయగా.. అందులో ఎనిమిది మంది మహిళా రచయిత్రులున్నారు. తొలి అవార్డు గ్రహీత మలయాళ రచయిత జి.శంకర్ కురుప్. ఆయనకు ఈ అవార్డు 1965లో 'ఒదక్కుజల్' అనే పుస్తకానికి లభించింది. తొలి మహిళా గ్రహీత బెంగాలీ రచయిత్రి ఆశాపూర్ణాదేవి (1976). ఇప్పటివరకు ముగ్గురు తెలుగు రచయితలు జ్ఞానపీఠ్ అందుకున్నారు. వారు.. విశ్వనాథ సత్యనారాయణ (1970), సి.నారాయణ రెడ్డి(1988), రావూరి భరద్వాజ (2012).

2018 అమితావ్ ఘోష్

2018వ సంవత్సరానికి ప్రముఖ రచయిత అమితావ్ ఘోష్‌ను జ్ఞానపీఠ్ అవార్డుకు ఎంపిక చేసినట్లు ప్రముఖ రచయిత్రి ప్రతిభా రే సార థ్యంలోని జ్ఞానపీఠ్ ఎంపిక మండలి 2018, డిసెంబర్ 14న ప్రకటించింది. ఈ పురస్కారం గెలుచుకున్న తొలి ఆంగ్ల భాషా రచయిత అమితావ్ ఘోష్ కావడం విశేషం. ఆయన 54వ జ్ఞానపీఠ్ పురస్కారాన్ని అందుకోనున్నారు. 1956లో కోల్‌కతాలో జన్మించిన అమితావ్ ఘోష్ ప్రస్తుతం న్యూయార్క్‌లో నివశిస్తున్నారు. 1989లో ద షాడో లైన్స్ అనే పుస్తకానికి ఆయన సాహిత్య అకాడెమీ అవార్డు గెలుచుకున్నారు. 2007లో భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని అందజేసింది.


అమితావ్ ఘోష్ ప్రముఖ రచనలు

1. ద సర్కిల్ ఆఫ్ రీజన్
2. ద గ్లాస్ ప్యాలెస్
3. ద హంగ్రీ టైడ్
4. సీ ఆఫ్ పాపీస్
5. రివర్ ఆఫ్ స్మోక్
6. ఫ్లడ్ ఆఫ్ ఫైర్
7. ద గ్రేట్ డిరేంజ్‌మెంట్: క్లైమేట్ ఛేంజ్ అండ్ ద అన్‌థింకబుల్

దీవుల పేర్లు మార్పు



నేతాజీ సుభాష్ చంద్రబోస్ 1943, డిసెంబర్ 30న అండమాన్ నికోబార్ దీవుల రాజధాని పోర్ట్‌బ్లేర్‌లోని జింఖానా మైదానంలో భారత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు (జింఖానా మైదానాన్ని ప్రస్తుతం నేతాజీ స్టేడియంగా పిలుస్తున్నారు). ఆ సందర్భంగా బ్రిటిష్ పాలన నుంచి విముక్తి పొందిన తొలి భారత భూభాగంగా అండమాన్ దీవులను నేతాజీ ప్రకటించారు. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ అండమాన్ నికోబార్ దీవులను బ్రిటిష్ ప్రభుత్వం నుంచి ఆక్రమించుకుంది. నేతాజీ నాయకత్వంలోని ఆజాద్ హింద్ ఫౌజ్ జపాన్ మిత్ర పక్షంగా ఉండేది. నేతాజీ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ అండమాన్ నికోబార్ దీవులను 2018, డిసెంబర్ 30న సందర్శించారు. ఆ సందర్భంగా ఇక్కడి మూడు దీవుల పేర్లను మార్చారు. రాస్ ఐలాండ్ పేరును నేతాజీ సుభాస్ చంద్రబోస్ ద్వీప్‌గా, నీల్ ఐలాండ్‌ను షహీద్ ద్వీప్‌గా, హేవెలాక్ ఐలాండ్‌ను స్వరాజ్ ద్వీప్‌గా మారుస్తున్నట్లు ప్రధాని ప్రకటించారు. ఈ మూడు దీవులు ప్రముఖ పర్యాటక ప్రదేశాలు. ప్రధాని పోర్ట్‌బ్లేర్‌లోని నేతాజీ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని... 75 రూపాయల స్మారక నాణేన్ని, తపాలా బిళ్లను, ఫస్ట్‌డే పోస్టల్ కవర్‌ను విడుదల చేశారు. మోదీ మరీనా పార్క్‌లో 150 అడుగుల ఎత్తయిన త్రివర్ణ పతాకాన్ని ఎగరేశారు. పోర్ట్‌బ్లేర్‌లోని సెల్యులార్ జైలును సందర్శించారు. దీనినే కాలాపానీ అంటారు. ఈ జైలులోనే ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులను బ్రిటిష్ ప్రభుత్వం నిర్బంధించేది. వీర్‌సావర్కర్, బట్టుకేశ్వర దత్తు, యోగేంద్ర శుక్లా తదితర నాయకులను సెల్యులార్ జైలులోనే ఉంచారు. ఈ జైలును 1896 నుంచి 1906 మధ్యకాలంలో నిర్మించారు. ప్రస్తుతం ఇది జాతీయ స్మారక చిహ్నంగా కొనసాగుతోంది.



ఎన్.విజయేందర్‌రెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ



మమ్మల్ని మన్నించండి!

బేషరతు క్షమాపణలు కోరిన హార్దిక్ పాండ్యా, రాహుల్

న్యూఢిల్లీ: మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి నిషేధం ఎదుర్కొంటున్న భారత క్రికెటర్లు హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్ బేషరతుగా క్షమాపణలు చెప్పారు. తమకు కొత్తగా జారీ చేసిన రెండో షోకాజ్ నోటీసులకు బదులిస్తూ తమను మన్నించాలని వీరిద్దరు విజ్ఞప్తి చేశారు. అయితే సీఓఏ చీఫ్ వినోద్ రాయ్ ఆదేశాలను అనుసరించి బోర్డు నిబంధన 41 (సి) ప్రకారం వీరిద్దరిపై సీఈఓ రాహుల్ జోహ్రి విచారణ కొనసాగిస్తారు. అయితే ఇటీవలే అమ్మాయిలను వేధించిన ఆరోపణలు ఎదుర్కొన్న జోహ్రితోనే విచారణ జరిపించడంపై సీఓఏ మరో సభ్యురాలు డయానా ఎడుల్జీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలా చేస్తే విచారణ 'కంటి తుడుపు'గానే భావించాల్సి ఉంటుందని ఆమె అన్నారు. దీనిపై వినోద్ రాయ్ వివరణ ఇస్తూ...ఎడుల్జీకి లేఖ రాశారు. 'పాండ్యా, రాహుల్‌ను సరిదిద్దాల్సిన బాధ్యత మనపై ఉంది. వారి కెరీర్‌ను నాశనం చేయాలను కోవడం లేదు. బోర్డు నియమావళి ప్రకారమే సీఈఓ విచారణ చేస్తున్నారు తప్ప అది కంటితుడుపు కాదు' అని రాయ్ స్పష్టం చేశారు.

శ్రీకాంత్ జాక్‌పాట్

నాలుగేళ్ల కాలానికి 'లి-నింగ్'తో రూ. 35 కోట్ల ఒప్పందం



న్యూఢిల్లీ: భారత స్టార్ షట్లర్, తెలుగు తేజం కిడాంబి శ్రీకాంత్ బ్రాండింగ్ ప్రపంచంలో బ్రహ్మాండంగా మెరిశాడు. క్రికెటేతర ఆటగాళ్లలో రికార్డు మొత్తానికి భారీ ఒప్పందం కుదుర్చుకున్నాడు. చైనా స్పోర్ట్స్ బ్రాండ్ 'లి-నింగ్' నాలుగేళ్ల కాలానికి శ్రీకాంత్‌తో రూ.35 కోట్లకు డీల్ కుదుర్చుకుంది. ఇందులో రూ. 30 కోట్లు స్పాన్సర్‌షిప్ మొత్తంగా అందించనుండగా... మరో రూ. 5 కోట్ల విలువైన క్రీడా సామగ్రిని లి-నింగ్ అందిస్తుంది. 2023 వరకు ఈ ఒప్పందం కొనసాగుతుందని శ్రీకాంత్ వ్యవహారాలు చూసే బేస్‌లైన్ వెంచర్స్ సంస్థ వెల్లడించింది. ఒప్పంద కాలంలో భారత షట్లర్ ఆ సంస్థకు చెందిన క్రీడోపకరణాలే వాడటంతో పాటు మ్యాచ్‌లు ఆడేటపుడు కూడా లి-నింగ్ దుస్తులే ధరించాల్సి ఉంటుంది. కెరీర్‌లో ఆరు సూపర్ సిరీస్ టైటిల్స్ గెలిచిన శ్రీకాంత్ గత ఏడాది వరల్డ్ నంబర్‌వన్‌గా కూడా నిలిచాడు. ప్రస్తుతం అతను ఎనిమిదో ర్యాంక్‌లో ఉన్నాడు. గతంలో రెండేళ్ల పాటు (2014-15) శ్రీకాంత్ లి-నింగ్‌కు ప్రచారకర్తగా ఉన్నాడు. అయితే ఆ తర్వాత అతను ప్రముఖ జపాన్ సంస్థ 'యోనెక్స్'తో జత కలిశాడు. చైనాకు చెందిన లి-నింగ్ సంస్థ తమ దేశంతో పాటు ఇండోనేసియా, సింగపూర్, ఆస్ట్రేలియా బ్యాడ్మింటన్ టీమ్‌లకు కిట్‌లను అందిస్తోంది. 2018 జకార్తా ఆసియా క్రీడల్లో భారత బృందానికి స్పాన్సర్‌గా వ్యవహరించిన లి-నింగ్... 2020 టోక్యో ఒలింపిక్స్ వరకు కూడా భారత జట్టుతో ఒప్పందం కొనసాగించనుంది.

విష్ణువర్ధన్‌కు స్వర్ణం

పుణే: ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో ఆంధ్రప్రదేశ్ వెయిట్‌లిఫ్టర్ బీఎస్‌డీ విష్ణువర్ధన్ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నాడు. అండర్-21 జూనియర్ బాలుర 102 కేజీల విభాగంలో విష్ణువర్ధన్ 279 కేజీల బరువెత్తి విజేతగా నిలిచాడు. ప్రదీప్ కుమార్ యాదవ్ (ఉత్తరప్రదేశ్-277 కేజీలు), దిల్‌ప్రీత్ సింగ్ (పంజాబ్-245 కేజీలు) రజత, కాంస్య పతకాలు గెలిచారు. అండర్-17 బాలికల 81 కేజీల విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కే చెందిన గాయత్రి రెడ్డికి రజత పతకం లభించింది. గాయత్రి 109 కేజీల బరువెత్తి రెండో స్థానంలో నిలిచింది. వైష్ణవి పవార్ (మహారాష్ట్ర-114 కేజీలు) స్వర్ణం సాధించగా... దేబా (తమిళనాడు-102 కేజీలు) కాంస్యం సొంతం చేసుకుంది. షూటింగ్‌లో అండర్-17 బాలుర 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ కుర్రాడు నేలవల్లి ముకేశ్ (216.7 పాయింట్లు) కాంస్య పతకాన్ని సాధించాడు.

లెక్క సరిచేస్తారా!

ఉ.గం.8.50 నుంచి సోనీ సిక్స్, సోనీ టెన్-3లలో ప్రత్యక్ష ప్రసారం

నేడు ఆస్ట్రేలియాతో భారత్ రెండో వన్డే

- ఓడితే సిరీస్ కోల్పోయే ప్రమాదం
- ఒత్తిడిలో కోహ్లి బృందం
- ఆత్మవిశ్వాసంతో ఆస్ట్రేలియా
- ధోని బ్యాటింగ్‌పైనే అందరి దృష్టి



కోహ్లి

పద్నాలుగేళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో ధోని వన్డే బ్యాటింగ్‌పై విమర్శలు వచ్చిన సందర్భాలు చాలా అరుదు. అలాంటివి ఎప్పుడు వచ్చినా వాటిని వెంటనే తన ఆటతోనే అతను బదులిచ్చాడు. కానీ సిడ్నీ వన్డే తర్వాత అన్ని వేళ్లు అతని వైపే తిరిగాయి. 10 సెంచరీలు, 68 అర్ధ సెంచరీలు సాధించిన ధోని రెండోసారి మాత్రమే 60కంటే తక్కువ స్ట్రయిక్‌రేట్‌తో అర్ధ సెంచరీ చేశాడు. వరల్డ్ కప్ చేరువవుతున్న తరుణంలో ఒకవైపు బ్యాటింగ్‌లో తడబాటు, మరోవైపు రిషభ్ పంత్ ఇటీవలి ప్రదర్శనతో బహుశా ధోని కూడా ఒత్తిడికి గురవుతున్నాడేమో. ఇప్పుడు రెండో వన్డేలో గెలిచి సిరీస్ కాపాడుకోవడంతో పాటు అందరి దృష్టి ధోనిపైనే నిలిచింది. ఈ నేపథ్యంలో భారత బ్యాట్స్‌మెన్ ఎలా స్పందిస్తారనేది ఆసక్తికరం.

తుది జట్ల అంచనా

భారత్: కోహ్లి (కెప్టెన్), రోహిత్, ధావన్, రాయుడు, ధోని, దినేశ్ కార్తీక్/కేదార్ జాదవ్, జడేజా, భువనేశ్వర్, కుల్దీప్, షమీ, ఖలీల్/సిరాజ్.
ఆస్ట్రేలియా: ఫించ్ (కెప్టెన్), క్యారీ, ఖాజా, షాన్ మార్ష్, హ్యాండ్స్‌కోంబ్, స్టొయినిస్, మ్యాక్స్‌వెల్, రిచర్డ్‌సన్, లయన్, సిడిల్, బెహ్రన్‌డార్ఫ్.

పిచ్, వాతావరణం

ఇక్కడ జరిగిన గత రెండు వన్డేల్లో తక్కువ స్కోరు నమోదు కాగా, పేస్ బౌలర్లు మంచి ప్రభావం చూపించారు. అయితే సిడ్నీతో పోలిస్తే బౌండరీలు చిన్నవి కాబట్టి భారీ షాట్లకు కూడా అవకాశం ఉంది. వాతావరణం వేడిగా ఉంది. వర్షం సమస్య లేదు.

అడిలైడ్

ఆస్ట్రేలియాపై టెస్టు సిరీస్ గెలిచిన ఉత్సాహంతో వన్డే సిరీస్ బరిలోకి దిగిన భారత్‌కు తొలి మ్యాచ్‌లో అనూహ్య ఫలితం ఎదురైంది. భారత్‌తో పోలిస్తే ఎన్నో అంశాల్లో అనుభవం తక్కువగా ఉన్న ఆసీస్ ముందు టీమిండియా తలవంచింది. సిరీస్ కోల్పోకుండా ఉండాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన రెండో వన్డేలో నేడు భారత్, ఆస్ట్రేలియాతో తలపడుతోంది. టెస్టు సిరీస్ విజయానికి తొలి అడుగు పడిన అడిలైడ్‌లో మరో గెలుపును అందుకోవాలని కోహ్లి సేన ఆశిస్తుండగా... వన్డే సిరీస్ గెలవగలిగితే అది తమ జట్టుకు గొప్ప ఘనతగా ఆసీస్ బృందం భావిస్తోంది.

జాదవ్‌కు అవకాశం!

గత మూడేళ్లుగా భారత టాప్-3 బ్యాట్స్‌మెన్ జట్టుకు అద్భుత విజయాలు అందించారు. రోహిత్, ధావన్, కోహ్లిలలో కనీసం ఇద్దరు చెలరేగడంతో మన జట్టు ఎదురు లేకుండా గెలుపు యాత్ర కొనసాగించింది. తొలి వన్డేలో కూడా రోహిత్ అద్భుత సెంచరీ సాధించాడు. అయితే అది విజయానికి సరిపోలేదు. స్టార్ బ్యాట్స్‌మన్ కోహ్లి వైఫల్యం అందులో ఒక కారణం కాగా, మన మిడిలార్డర్ పేలవ ప్రదర్శన జట్టును దెబ్బ తీసింది. ఈ మ్యాచ్‌లో ఆ పొరపాట్లు దిద్దుకుంటే భారత్‌కు గెలుపు అవకాశాలు ఉంటాయి. మిడిలార్డర్‌లో ధోని తన స్థాయికి తగ్గ ఆటను ప్రదర్శించాల్సి ఉంటుంది. గత మ్యాచ్‌లో పరిస్థితులను బట్టి నెమ్మదిగా ఆడాడని సర్ది చెప్పుకునే ప్రయత్నం చేసినా... కచ్చితంగా ధోని ఆటలో మునుపటి వాడి లేదన్నది వాస్తవం. మ్యాచ్‌ల మధ్యలో సుదీర్ఘ విరామం, తగినంత ప్రాక్టీస్ లేకపోవడం కూడా అందుకు కారణం. తనలో సత్తా ఉండటం వల్లే వరల్డ్ కప్ వరకు కొనసాగే ఆలోచన ఉంది తప్ప పాత ఘనతతో మాత్రం కాదని ధోని కూడా నిరూపించుకోవాల్సి ఉంది. తెలుగు తేజం అంబటి రాయుడుకు తొలి మ్యాచ్ అచ్చిరాలేదు. అయితే ఆసియా కప్‌లో, ఆ తర్వాత సొంతగడ్డపై విండీస్‌తో కూడా చెలరేగిన రాయుడు మళ్లీ ఫామ్‌లోకి రావడం కష్టం కాకపోవచ్చు. ఆరో స్థానంలో దినేశ్ కార్తీక్ మళ్లీ నిరాశపర్చాడు. అతని స్థానంలో కేదార్ జాదవ్‌కు చోటు దక్కవచ్చు. గత వన్డే అనుభవం నేపథ్యంలో జాదవ్ వేసే కొన్ని ఓవర్లు కూడా జట్టుకు పనికొస్తాయి. బుమ్రా గైర్హాజరు కారణంగా బౌలింగ్‌లో శుభారంభం అందించాల్సిన బాధ్యత భువనేశ్వర్‌పై ఉంది. తొలి మ్యాచ్ తరహాలోనే షమీ బౌలింగ్ చేస్తే ప్రత్యర్థిని భారత్ కట్టడి చేయవచ్చు. కుర్ర ఖలీల్‌కు మరో అవకాశం దక్కవచ్చని అనిపిస్తోంది కానీ ప్రాక్టీస్ సెషన్‌లో సిరాజ్ సుదీర్ఘంగా బౌలింగ్ చేసిన తీరు చూస్తే అరంగేట్రానికి కూడా చాన్స్ ఉంది. జడేజా జట్టులో ఉండటంతో చహల్ మరోసారి పెవిలియన్‌కే పరిమితం కానున్నాడు.

మార్పుల్లేకుండానే...

తొలి వన్డేలో గెలుపుతో ఆస్ట్రేలియా శిబిరంలో కాస్త ఆత్మవిశ్వాసం పెరిగింది. టెస్టు సిరీస్ కోల్పోయిన తర్వాత వచ్చిన ఈ విజయం మళ్లీ ఆసీస్ అభిమానులకు ఊరటనిచ్చింది. మరీ అద్భుతంగా ఆడకపోయినా చక్కటి ప్రణాళికతో ఆడిన కంగారూలు సిడ్నీలో భారత్‌ను ఓడించగలిగారు. ఈసారి అదే తరహాలో ప్రత్యర్థిని పడగొట్టాలని ఆ జట్టు భావిస్తోంది. బౌలింగ్‌తో తొలి మ్యాచ్‌ను శాసించిన పేసర్లు రిచర్డ్‌సన్, బెహ్రన్‌డార్ఫ్‌లు మళ్లీ టీమిండియా టాప్‌ను కుప్పకూల్చాలని పట్టుదలగా ఉన్నారు. సిడిల్, లయన్ కూడా రాణించడంతో జట్టు బౌలింగ్ కూర్పులో ఎలాంటి మార్పులు ఉండకపోవచ్చు. బ్యాటింగ్‌లో కూడా టాప్-6లో ఫించ్ మినహా అందరూ ఆకట్టుకున్నారు. కెప్టెన్ ఫించ్ కూడా ఫామ్‌లోకి వస్తే తిరుగుండదు. ముఖ్యంగా విధ్వంసకర ఆటగాడు మ్యాక్స్‌వెల్ ఏడో స్థానంలో రావాల్సి వచ్చిందంటే జట్టు బ్యాటింగ్ లోతు అర్థమవుతుంది. ఈసారి మ్యాక్స్‌వెల్‌ను కాస్త ముందుగా పంపే ఆలోచన కూడా ఆసీస్ చేస్తోంది. మిషెల్ మార్ష్ ఫిట్‌గా ఉన్నా గెలిచిన జట్టును మార్చరాదని టీమ్ మేనేజ్‌మెంట్ దాదాపుగా నిర్ణయించుకుంది.



ముర్రే ఖేల్ ఖతం

- తొలి రౌండ్‌లోనే ఓడిన బ్రిటన్ స్టార్
- ఫెడరర్, నాదల్ శుభారంభం



మెల్‌బోర్న్: ఊహించినట్టే జరిగింది. బ్రిటన్ టెన్నిస్ స్టార్ ఆండీ ముర్రే ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నమెంట్ నుంచి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. 22వ సీడ్ బాటిస్టా అగుట్ (స్పెయిన్)తో జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ముర్రే 4-6, 4-6, 7-6 (7/5), 7-6 (7/4), 2-6తో పోరాడి ఓడిపోయాడు. 4 గంటల 9 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ముర్రే 19 ఏస్‌లు సంధించి, 51 అనవసర తప్పిదాలు చేశాడు. గతంలో ఐదుసార్లు ఈ టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన ముర్రే 2008 తర్వాత ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో తొలి రౌండ్‌లో ఓడిపోవడం ఇదే ప్రథమం. తుంటి గాయంతో బాధపడుతున్న ముర్రే గతేడాది కేవలం యూఎస్ ఓపెన్‌లో మాత్రమే పాల్గొని రెండో రౌండ్‌లోనే ఓటమి పాలయ్యాడు. ఈ సీజన్‌లో తదుపరి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లలో ఆడాలా వద్దా అనే నిర్ణయాన్ని వచ్చే వారం తీసుకుంటానని ముర్రే వ్యాఖ్యానించాడు.

మరోవైపు డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెడరర్ (స్విట్జర్లాండ్), మాజీ విజేత రాఫెల్ నాదల్ (స్పెయిన్) శుభారంభం చేశారు. తొలి రౌండ్‌లో మూడో సీడ్ ఫెడరర్ 6-3, 6-4, 6-4తో ఇస్టోమిన్ (ఉజ్బెకిస్తాన్)పై... రెండో సీడ్ నాదల్ 6-4, 6-3, 7-5తో జేమ్స్ డక్‌వర్త్ (ఆస్ట్రేలియా)పై గెలిచారు. అయితే తొమ్మిదో సీడ్ జాన్ ఇస్నెర్ (అమెరికా) తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టాడు. అమెరికాకే చెందిన రీలీ ఒపెల్కా 7-6 (7/4), 7-6 (8/6), 6-7 (4/7), 7-6 (7/5)తో ఇస్నెర్‌ను బోల్తా కొట్టించాడు. ఈ మ్యాచ్‌లో ఒపెల్కా 40 ఏస్‌లు... ఇస్నెర్ 47 ఏస్‌లు సంధించడం విశేషం. ఇతర మ్యాచ్‌ల్లో ఐదో సీడ్ అండర్సన్ (దక్షిణాఫ్రికా) 6-3, 5-7, 6-2, 6-1తో మనారినో (ఫ్రాన్స్)పై, ఆరో సీడ్ మారిన్ సిలిచ్ (క్రొయేషియా) 6-2, 6-4, 7-6 (7/3)తో బెర్నార్డ్ టామిక్ (ఆస్ట్రేలియా)పై గెలిచి రెండో రౌండ్‌కు చేరుకున్నారు.

ప్రజ్నేశ్ పరాజయం

భారత నంబర్‌వన్ ప్రజ్నేశ్ గుణేశ్వరన్ తొలి రౌండ్ అడ్డంకిని దాటలేకపోయాడు. ప్రపంచ 39వ ర్యాంకర్ టియాఫో (అమెరికా)తో జరిగిన మ్యాచ్‌లో ప్రజ్నేశ్ 6-7 (7/9), 3-6, 3-6తో ఓటమి చవిచూశాడు.

షరపోవా జోరు...

మహిళల సింగిల్స్‌లో మాజీ చాంపియన్ షరపోవా (రష్యా), డిఫెండింగ్ చాంపియన్ కరోలైన్ వొజ్నియాకి (డెన్మార్క్), రెండో సీడ్ కెర్బర్ (జర్మనీ) రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లారు. తొలి రౌండ్‌లో షరపోవా 6-0, 6-0తో క్వాలిఫయర్ హారియట్ డార్ట్ (బ్రిటన్)ను చిత్తుగా ఓడించగా... వొజ్నియాకి 6-3, 6-4తో అలీసన్ (నెదర్లాండ్స్)పై, కెర్బర్ 6-2, 6-2తో హెర్కాగ్ (స్లొవేనియా)పై గెలిచారు. ఐదో సీడ్ స్లోన్ స్టీఫెన్స్ (అమెరికా), ఎనిమిదో సీడ్ క్విటోవా (చెక్ రిపబ్లిక్), తొమ్మిదో సీడ్ కికి బెర్‌టెన్స్ (నెదర్లాండ్స్) కూడా రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. స్లోన్ స్టీఫెన్స్ 6-4, 6-2తో టౌన్‌సెండ్ (అమెరికా)పై, క్విటోవా 6-3, 6-2తో రిబరికోవా (స్లొవేకియా)పై, కికి బెర్‌టెన్స్ 6-3, 6-3తో అలీసన్ రిస్కీ(అమెరికా)పై నెగ్గారు. 22వ సీడ్ ఒస్టాపెంకో (లాత్వియా) 1-6, 6-3, 2-6తో మరియా సకారి (గ్రీస్) చేతిలో ఓడిపోయింది.

ముంబై మహారథి శుభారంభం



పంచ్‌కులా (హరియాణా): ప్రొ రెజ్లింగ్ లీగ్‌లో భారత మహిళా స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ సభ్యురాలిగా ఉన్న ముంబై మహారథి జట్టు శుభారంభం చేసింది. సోమవారం జరిగిన తొలి పోటీలో ముంబై మహారథి 4-3తో డిఫెండింగ్ చాంపియన్ పంజాబ్ రాయల్స్‌ను ఓడించింది. 53 కేజీల బౌట్‌లో వినేశ్ (ముంబై) 8-0తో అంజుపై గెలిచింది. ముంబై తరఫున ఇలియాసోవ్ (57 కేజీలు), సచిన్ రాఠి (74 కేజీలు), నెమెత్ (76 కేజీలు) కూడా విజయం సాధించారు. పంజాబ్ రాయల్స్ తరఫున 65 కేజీల విభాగంలో ఆసియా క్రీడల విజేత బజరంగ్ పూనియా 8-2తో హర్‌ఫుల్‌పై గెలిచాడు.

దక్షిణాఫ్రికా క్లీన్‌స్వీప్

మూడో టెస్టులోనూ ఓడిన పాక్



జొహన్నెస్‌బర్గ్: బౌలర్లు మరోసారి విజృంభించడంతో పాకిస్తాన్‌తో జరిగిన చివరిదైన మూడో టెస్టులో దక్షిణాఫ్రికా 107 పరుగుల తేడాతో గెలిచింది. సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. 381 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్ 65.4 ఓవర్లలో 273 పరుగులకు ఆలౌటైంది. నాలుగో రోజు సోమవారం ఓవర్‌నైట్ స్కోరు 153/3తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్తాన్ 120 పరుగులు జోడించి మిగతా ఏడు వికెట్లను కోల్పోయి ఓటమిని మూటగట్టుకుంది. దక్షిణాఫ్రికా పేసర్ ఒలివియర్ వరుస బంతుల్లో బాబర్ ఆజమ్ (29 బంతుల్లో 21; 5 ఫోర్లు), కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్ (0)లను ఔట్ చేసి పాకిస్తాన్‌ను దెబ్బ తీశాడు. క్రీజులో నిలదొక్కుకున్న అసద్ షఫీఖ్ (71 బంతుల్లో 65; 11 ఫోర్లు)ను ఫిలాండర్ ఔట్ చేయడంతో పాక్ కోలుకోలేకపోయింది. షాదాబ్ ఖాన్ (47 నాటౌట్; 7 ఫోర్లు), హసన్ అలీ (22; 2 ఫోర్లు, సిక్స్) కాస్త పోరాడినా దక్షిణాఫ్రికా విజయాన్ని ఆలస్యం చేశారే తప్ప పాక్‌ను ఓటమి నుంచి తప్పించలేకపోయారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఒలివియర్, రబడ మూడేసి వికెట్లు తీశారు. సిరీస్ మొత్తంలో 24 వికెట్లు తీసిన ఒలివియర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' పురస్కారం... రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన దక్షిణాఫ్రికా వికెట్ కీపర్ క్వింటన్ డి కాక్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించాయి.

ఆఖరి క్షణాల్లో ఆశలు ఆవిరి

- బహ్రెయిన్ చేతిలో భారత్ పరాజయం
- ఆసియా కప్ నుంచి నిష్క్రమణ



షార్జా: మరో నాలుగు నిమిషాలు గడిస్తే... భారత ఫుట్‌బాల్ జట్టుకు ఆసియా కప్‌లో నాకౌట్ బెర్త్ ఖాయమయ్యేది. కానీ ఇంజ్యూరీ సమయంలో 'డి' ఏరియాలో ప్రణయ్ హల్దర్ చేసిన తప్పిదంతో భారత్ భారీ మూల్యమే చెల్లించుకుంది. బహ్రెయిన్ ప్లేయర్‌ను ప్రణయ్ మొరటుగా అడ్డుకోవడంతో రిఫరీ ప్రత్యర్థి జట్టుకు పెనాల్టీ కిక్‌ను ప్రకటించారు. జమాల్ రషీద్ భారత గోల్ కీపర్‌ను బోల్తా కొట్టిస్తూ బంతిని లక్ష్యానికి చేర్చాడు. దాంతో బహ్రెయిన్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఇంజ్యూరీ సమయంలోని మిగతా మూడు నిమిషాలు ఈ ఆధిక్యాన్ని కాపాడుకున్న బహ్రెయిన్ తుదకు 1-0తో భారత్‌పై విజయాన్ని ఖాయం చేసుకుంది. దాంతో గ్రూప్ 'ఎ' నుంచి ఆతిథ్య యూఏఈ (5 పాయింట్లు), థాయ్‌లాండ్ (4 పాయింట్లు), బహ్రెయిన్ (4 పాయింట్లు) జట్లు నాకౌట్ దశకు అర్హత సాధించాయి. 3 పాయింట్లతో భారత్ చివరి స్థానంలో నిలిచి నిష్క్రమించింది. తొలి మ్యాచ్‌లో 4-1తో థాయ్‌లాండ్‌ను ఓడించిన భారత్... రెండో మ్యాచ్‌లో 0-2తో యూఏఈ చేతిలో... మూడో మ్యాచ్‌లో 0-1తో బహ్రెయిన్ చేతిలో ఓడింది. గ్రూప్ 'ఎ'లో సోమవారమే జరిగిన యూఏఈ-థాయ్‌లాండ్ మ్యాచ్ 1-1తో 'డ్రా' కావడం భారత్ నాకౌట్ ఆశలను దెబ్బ తీసింది. ఒకవేళ యూఏఈ గెలిచి ఉంటే భారత్‌కు నాకౌట్ అవకాశాలు మిగిలి ఉండేవి. ఓటమి తర్వాత భారత కోచ్ పదవికి తాను రాజీనామా చేస్తున్నట్లు కాన్‌స్టంటైన్ ప్రకటించారు.



ఆరోగ్య సందేశాలతో రాణిప్రసాద్ రంగరించిన రంగవల్లులు

ముగ్గుల్లో ఆరోగ్య సందేశం

- బాలసాహితీవేత్త వినూత్న ఒరవడి
- సిరిసిల్లకు చెందిన కందేపి రాణిప్రసాద్ సృష్టి

సిరిసిల్లటౌన్: సిరిసిల్లకు చెందిన బాలసాహితీవేత్త కందేపి రాణిప్రసాద్ వినూత్న ఒరవడికి శ్రీకారం చుట్టారు. వైద్య పరిభాషలోని వివిధ రకాల వ్యాధులకు చెందిన బొమ్మలను సంక్రాంతి ముగ్గులను ఆమె ఆవిష్కరించారు. ఏ వ్యాధి సోకినా చికిత్స ఉంటుందని బ్రెస్టు క్యాన్సర్ బాధితులు భయపడొద్దని, హెచ్ఐవీ వైరస్ నిర్మూలన, కిడ్నీల పనితీరు, థైరాయిడ్ సమస్యతో బాధపడకుండా ఆరోగ్యంగా ఉండాలంటూ..ఆమె చేయి నుంచి జాలువారిన ముగ్గులు చూపరులను ఆకట్టుకున్నాయి. సంక్రాంతిని పురస్కరించుకుని వైవిధ్య భరితమైన వైద్య సందేశాత్మక ముగ్గులను ఆవిష్కరించారు. ఆమె ఆవిష్కరించిన రంగవల్లుల్లో మెదడు, కిడ్నీలు, కాలేయం, హృదయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, థైరాయిడ్, పేగులు వంటి మానవ శరీర అంతర్భాగాలతో ఇలా ముగ్గులను సృష్టించారు. గతంలో వాడేసిన మందుబిళ్లల డబ్బాలు, సిరంజిలు, ఇంకజక్షన్ సీసాల మూతలతో ఆమె అందమైన కళాకృతులు తయారు చేసి కళకు ఏది కాదు అనర్హం అంటూ.. వ్యర్థాలకు అర్థం చెప్పిన ఆమె కళాకృతులు అందరి మెప్పుపొందాయి.

వైభవంగా మల్లన్న బ్రహ్మోత్సవాలు

ఐనవోలు: వరంగల్ అర్బన్ జిల్లా ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలతో పాటు పట్నాలు వేసి పిల్లపాలపను చల్లంగా చూడాలని మల్లికార్జునుడిని వేడుకున్నారు. శివసత్తుల కోలాహలం, మల్లన్న నామస్మరణతో ఆ ప్రాంగణం మార్మోగింది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకున్నారు.

పందెం కోళ్లు స్వాధీనం

డిచ్‌పల్లి (నిజామాబాద్ రూరల్): నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం ధర్మారం (బి) గ్రామ శివారులోని పంట పాలాల్లో కోడి పందాలు ఆడుతున్న 10 మంది నిందితులను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి ఎనిమిది పందెం కోళ్లను, కత్తులు, పది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపారు.

ప్రాణం తీసిన సెల్ఫీ

రిజర్వాయర్లో పడి యువకుడి గల్లంతు



చిల్పూరు: సెల్ఫీ మోజు ఓ యువకుడిని బలి తీసుకుంది. ఈ ఘటన జనగామ జిల్లా చిల్పూరు మండలం మల్లన్నగండి వద్ద సోమవారం చోటుచేసుకుంది. సీఐ రాజిరెడ్డి కథనం ప్రకారం.. లింగాలఘణపురం మండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన హరికృష్ణ ఓ ప్రయివేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. సంక్రాంతి సెలవుల సందర్భంగా గ్రామానికి వచ్చిన అతను సోమవారం ఉదయం స్నేహితులైన మధు, సాయితేజ, శేఖర్, కిషోర్, సాయికుమార్‌లతో కలసి చుట్టుపక్కల రిజర్వాయర్లను చూసుకుంటూ మల్లన్నగండికి చేరుకున్నారు. అక్కడ కాసేపు సరదాగా తిరిగారు. చివరకు ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి మల్లన్నగండిలోకి నీరు పోస్తున్న పైప్‌లైన్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఉన్న స్థానికులు పైకి ఎక్కి ఫొటోలు దిగవద్దని వారించి వెళ్లి పోయారు. అయినా వినకుండా సెల్ఫీ దిగేందుకు ఎక్కారు. హరికృష్ణ సెల్ఫీ తీసేందుకు అందరిని ఒకదగ్గరకు రమ్మంటూ వెనక్కి జరగడంతో ప్రమాదవశాత్తు జారీ రిజర్వాయర్లో పడి పోయాడు. అతని స్నేహితులు వెంటనే సమీపంలో ఉన్న రైతులకు సమాచారం ఇవ్వగా వారు పోలీసులకు తెలిపారు. మృతదేహం కోసం గాలించినా ఫలితం దక్కలేదు.

సింగూరు నీటి విడుదల

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టు నుంచి మంజీర బ్యారేజీకి సోమవారం 15,138 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు డిప్యూటి ఇంజినీర్ బాలగణేష్ తెలిపిన వివరాల ప్రకారం ప్రస్తుతం ప్రాజెక్టులో 513 మీటర్లకు గాను 2.30 టీఎంసీల నీటి నిల్వ ఉంది. మిషన్ భగీరథకు 100 క్యూసెక్కుల నీటితో పాటు హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్‌కు 30 క్యూసెక్కుల నీటిని ప్రతి రోజు వినియోగిస్తున్నారు. సోమవారం ప్రాజెక్టు నుంచి 15,138 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

బహుముఖ పోరు!

- 98 గ్రామ పంచాయతీల్లో ద్విముఖ పోరు
- 137 చోట్ల ఇద్దరి కంటే ఎక్కువ మంది
- రుద్రారంలో 'సర్పంచ్'బరిలో 12 మంది
- సొంత టీం కోసం ఎమ్మెల్యేల ప్రయత్నం

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: తొలి విడత ఎన్నికలు జరిగే గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవి కోసం బహుముఖ పోటీ నెలకొంది. పార్టీలు, వాటి గుర్తులతో సంబంధం లేకుండా ఎన్నికలు జరుగుతుండడంతో పార్టీలకు అతీతంగా ఔత్సాహికులు ఎన్నికల బరిలో నిలిచారు. తొలి విడతలో సంగారెడ్డి రెవెన్యూ డివిజన్ పరిధిలోని 12 మండలాల్లోని 258 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే. 10 మండలాల పరిధిలోని 23 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు ఇప్పటికే ఎన్నిక కాగా, అందోలు, అమీన్‌పూర్ మండలాల్లో మాత్రం అన్ని పంచాయతీల్లో సర్పంచ్ పదవి కోసం పోటీ నెలకొంది. ఏకగ్రీవంగా ఎన్నుకున్న 23 పంచాయతీలను మినహాయిస్తే జిల్లాలో మరో 235 పంచాయతీల్లో సర్పంచ్ ఎన్నిక జరుగుతోంది. 764 మంది అభ్యర్థులు సర్పంచ్ పదవి కోసం పోటీ పడుతున్నారు. మెజారిటీ గ్రామ పంచాయతీల్లో అంటే 137 చోట్ల సర్పంచ్ పదవి కోసం ఇద్దరి కంటే ఎక్కువ మంది పోటీ పడుతుండడంతో బహుముఖ పోరు నెలకొంది. పటాన్‌చెరు మండలం రుద్రారంలో అత్యధికంగా 12 మంది సర్పంచ్ పదవి కోసం బరిలో నిలిచారు. గుమ్మడిదల మండల కేంద్రంలో పది మంది, జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామ పంచాయతీలో ఎనిమిది మంది సర్పంచ్ పదవి కోసం పోటీ పడుతున్నారు. పారిశ్రామిక, పట్టణీకరణ చెందిన ప్రాంతాలున్న అమీన్‌పూర్, పటాన్‌చెరు, జిన్నారం, గుమ్మడిదల, సంగారెడ్డి, కంది మండలాల పరిధిలోని పంచాయతీల్లో బహుముఖ పోటీ ఎక్కువగా కనిపిస్తోంది. 98 పంచాయతీల్లో ఇద్దరు చొప్పున మాత్రమే పోటీలో ఉండడంతో ద్విముఖ పోరు సాగనుంది. తొలి విడత ఎన్నికలు జరిగే సర్పంచ్, వార్డు స్థానాలకు సంబంధించి బరిలో ఉండే అభ్యర్థుల లెక్క తేలడంతో, ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా బ్యాలెట్ పత్రాలను లెక్కిస్తున్నారు. వీటిని ఒకటి రెండు రోజుల్లో మండల కేంద్రాలకు చేరవేసేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

సొంత టీం కోసం..!

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన శాసనసభ్యులందరూ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాలపై పట్టు సాధించేందుకు పావులు కదుపుతున్నారు. 2014 సాధారణ ఎన్నికల్లో గెలుపొందిన శాసనసభ్యులు.. అంతకు ముందే 2013లో ఎన్నికైన సర్పంచ్‌ల మద్దతు కూడగట్టుకునేందుకు తీవ్రంగా శ్రమించారు. గ్రామాల్లో పట్టు కోసం ఇతర పార్టీల సర్పంచ్‌లను తమవైపు తిప్పుకునేందుకు ప్రాధాన్యత ఇచ్చారు. ఇప్పుడు ఎమ్మెల్యేలు ఐదేళ్ల పాటు అధికారంలో ఉండనుండడంతో పట్టు సాధించేందుకు పంచాయతీ ఎన్నికలే సరైన సందర్భమని భావిస్తున్నారు. దీంతో రిజర్వేషన్లకు అనుగుణంగా గ్రామాల్లో తమకు అనుకూలంగా ఉండే వారిని గెలిపించుకునేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. పంచాయతీల వారీగా బరిలో నిలుచున్న అభ్యర్థుల గుణగణాలను పరిశీలిస్తూ.. తమ అనుకూలంగా ఉండే వారికి మద్దతు ప్రకటిస్తున్నారు. సొంత పార్టీకి చెందిన వారైన స్థానికంగా బలం లేని వారిని బరిలో నుంచి తప్పించేందుకు ఎమ్మెల్యేలు విశ్వ ప్రయత్నాలు చేశారు. కొన్ని చోట్ల సొంత పార్టీలో బలమైన అభ్యర్థులు ఉన్నా, తమతో విభేదించే వారిని ఓడించేందుకు కూడా ఎమ్మెల్యేలు పావులు కదుపుతున్నారు. ఇటీవలి ఎన్నికల్లో డబ్బులు ఇస్తే తప్ప ప్రచారంలో కలిసి రాని సొంత పార్టీ నాయకులను పక్కన పెట్టేలా వ్యూహ రచన చేస్తున్నారు. మరోవైపు తమ అనుయాయులను గెలిపించుకునేందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు అక్కడక్కడా ఆర్థిక సాయం కూడా చేసేందుకు ముందుకు వస్తున్నారు.

'చిరు'ధాన్యం.. ఆరోగ్యభాగ్యం

డీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా రైతుల చైతన్యం

- సేంద్రియ విధానంలో చిరు ధాన్యాల సాగు
- రెండు దశాబ్దాలుగా పాత పంటల జాతర
- ప్రారంభమైన 20వ పండుగ

జహీరాబాద్: అంతరించి పోతున్న చిరు ధాన్యాల సాగును సేంద్రియ విధానంలో ప్రోత్సహించడమే లక్ష్యంగా డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) ఆధ్వర్యంలో చేపట్టిన పాత పంటల జాతర రెండు దశాబ్దాలుగా నిరంతరంగా సాగుతోంది. సోమవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం అర్జున్ నాయక్ తండాలో 20వ పాత పంటల జాతరను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ ప్రారంభించారు. జహీరాబాద్ మండలం రంజోల్ గ్రామంలో 1999లో డీడీఎస్ ఈ జాతరకు శ్రీకారం చుట్టింది. నాటినుంచి ఏటా వివిధ గ్రామాల్లో జాతరను నిర్వహిస్తూ వస్తోంది. ఇలా ఇప్పటికి వంద గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహించింది. డీడీఎస్ డైరెక్టర్ పి.వి.సతీశ్ మహిళా సంఘాలను ఏర్పాటు చేసి గ్రామాల్లో మహిళలను చిరు ధాన్యాల సాగువైపు ప్రోత్సహిస్తున్నారు. ఎకరం, రెండెకరాల వ్యవసాయ భూమి ఉన్న రైతులు చిరు ధాన్యాలను సాగు చేస్తూ వస్తున్నారు. ఏడాదిపాటు వారి ఆహార అవసరాలకు సరిపడా ధాన్యం నిల్వచేసుకుని, మిగతా 'చిరు'ధాన్యాన్ని డీడీఎస్ సంస్థకు విక్రయిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర కంటే 20 శాతం ఎక్కువ ధర చెల్లించి ఈ సంస్థ రైతులనుంచి పంటలను కొనుగోలు చేస్తోంది. ఇలా కొనుగోలు చేసిన ధాన్యాన్ని సంస్థ తరఫున హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా విక్రయిస్తున్నారు. మొబైల్ వాహనాల ద్వారా సైతం అమ్ముతున్నారు.

సేంద్రియ వ్యవసాయమే లక్ష్యంగా..

సేంద్రియ వ్యవసాయమే లక్ష్యంగా మహిళా రైతులు చిరు ధాన్యాలను పండిస్తున్నారు. ఎలాంటి రసాయనాలు లేకుండా పూర్తిగా సేంద్రియ ఎరువులనే వేసి వీరు చిరు ధాన్యాలు పండిస్తున్నారు. ఇలా సాగు చేసిన చిరు ధాన్యాల పంటలకు అంతగా తెగుళ్లు సోకవని అంటున్నారు. పెట్టుబడులు అంతగా అవసరం ఉండదని, వర్షాభావాన్ని సైతం తట్టుకుని చిరు ధాన్యాలు పండుతాయని చెబుతున్నారు. ఎర్రనేలలు, రేగడి నేలల్లో వీటిని సాగు చేసుకుంటున్నట్లు మహిళా రైతులు పేర్కొంటున్నారు. మహిళా సంఘాలకు సంబంధించిన ఐదువేల మంది సభ్యులు తమకున్న కొద్దిపాటి పొలంలో చిరు ధాన్యాలను మిశ్రమ పంటలుగా సాగుచేసుకుంటున్నారు. ఒక్కో రైతు 10 నుంచి 30 రకాల పంటలను కలిపి వేసుకుని ఏడాది పొడవునా అవసరమైన ధాన్యాలను సాగుచేస్తున్నారు. జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంగం, రాయికోడ్ మండలాల్లో చిరు ధాన్యాల సాగు ఎక్కువగా ఉంది. కాగా, పాతపంటల సాగుపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.



పాతపంటల జాతరలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్



పాతపంటల జాతర ముఖద్వారం



ఖరీఫ్, రబీ కోసం విత్తనాల నిల్వలు

రైతులు ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాల కోసం ఎదురు చూడకుండా తమకు అవసరమైన విత్తనాలను ముందుగానే నిల్వ చేసి ఉంచుతారు. ఈ విధానం సంప్రదాయంగా వస్తోంది. రైతులు తాము పండించిన పంట చేతికి అందగానే పంటలోని నాణ్యమైన ధాన్యాన్ని విత్తనం కోసం సేకరించి పెడతారు. ఇలా సేకరించిన విత్తనాన్ని ఈత కట్టెతో అల్లిన బుట్టల్లో పోసి పైభాగంలో మట్టి, పేడ, వేప, వాయిలాకులు కలిపి మూసివేస్తారు. విత్తనం ధాన్యంలో వేపాకు, బూడిద కలిపి పురుగు పట్టకుండా కలుపుతారు. విత్తనాలు నాటే సమయం రాగానే వాటిని బయటకు తీసి నాటేందుకు వీలుగా శుభ్రం చేస్తారు.

68 గ్రామాల్లో విత్తన బ్యాంకులు

జహీరాబాద్, కోహీర్, ఝరాసంగం, రాయికోడ్, న్యాల్‌కల్ మండలాల్లోని సుమారు 68 గ్రామాల్లో మహిళలు విత్తన బ్యాంకులను ఏర్పాటు చేసుకున్నారు. ఈ విత్తనాలు సుమారు 10 వేల ఎకరాలకు పైగా సాగు చేసేందుకు ఉపయోగపడుతాయి. బహుళజాతి కంపెనీల విత్తనాలపై ఆధారపడకుండా తామే స్వయంగా పండించిన ధ్యాన్యంలో నాణ్యమైన ధ్యాన్యాన్ని ఎంపిక చేసుకుని విత్తనాలుగా వినియోగించుకుంటున్నట్లు పేర్కొంటున్నారు. రైతులు 20 నుంచి 30 రకాల విత్తనాలను అందుబాటులో పెట్టుకుంటున్నారు. ఖరీఫ్ కింద మినుము, పెసర, కంది, సజ్జ, పచ్చజొన్న, రబీ కింద శనగ, తెల్ల కుసుమ, సాయిజొన్న, అవుశ, వాము తదితర పంటలను అధికంగా సాగు చేస్తున్నారు. తైదలు, కొర్రల వంటి పలు పంటలను కూడా సాగు చేస్తున్నారు.



చిరుధాన్యం పంట రాసులను పరిశీలిస్తున్న హైదరాబాద్ ప్రాంత వినియోగదారులు, వినియోగదారురాలికి చిరు ధాన్యం కట్‌ను అందిస్తున్న మహిళా రైతు

రైతులకు అవగాహన

ఈ ఏడాది పాత పంటల జాతర సోమవారం ప్రారంభమైంది. ఉత్సవాలను ప్రారంభించిన పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ .. చిరు ధాన్యాల సాగును మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆరోగ్యాన్నిచ్చే చిరు ధాన్యాలను ప్రతి ఒక్కరూ తినేందుకు ఆసక్తి చూపుతున్నారని, ఇది శుభ పరిణామని పేర్కొన్నారు. ఫిబ్రవరి 13వ తేదీ వరకు 24 గ్రామాల్లో జాతరను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రైతులకు, ప్రజలకు అవగాహన సమావేశాలు నిర్వహిస్తారు. నిపుణులచేత పంటల సాగు, సేంద్రియ వ్యవసాయంతో కలిగే ఉపయోగాల గురించి వివరిస్తారు. జాతర సందర్భంగా 16 ఎడ్ల బండ్లలో చిరు ధాన్యాలను ప్రదర్శిస్తారు. పాత పంటలు అంతరించి పోతున్న తరుణంలో వాటిని పరిరక్షించుకుంటూ ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్లను తట్టుకుంటూ వ్యవసాయాన్ని ముందుకు తీసుకువెళ్లడంపై అవగాహనకల్పిస్తారు.

ఆశించిన ఫలితాలు వస్తున్నాయి



ప్రజలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమం ఆశించిన మేరకు ఫలితాలనిస్తోంది. సేంద్రియ వ్యవసాయ విధానంలో పండించిన చిరు ధాన్యాలను తినేందుకు పల్లె, పట్టణ ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. రెండు దశాబ్దాలుగా ఈ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్నాం. జహీరాబాద్ ప్రాంతంలో చేపట్టిన చిరు ధాన్యాల సాగు ఉద్యమం దేశవ్యాప్తంగా విస్తరించింది. 13 రాష్ట్రాల్లో చిరు ధాన్యాల సమాఖ్యలు ఏర్పడ్డాయి. వీటికి డీడీఎస్ సారథ్యం వహిస్తోంది. ఆహార భద్రత చట్టంలో చిరు ధాన్యాలను చేర్పించడం మా ఉద్యమ ఫలితమే. సుమారు 1.5 లక్షల మంది ప్రజలు, రైతులు ఈ జాతరలో పాలుపంచుకుంటారు.

– పి.వి.సతీశ్, డీడీఎస్ డైరెక్టర్, జహీరాబాద్

చిరు ధాన్యాలనే సాగు చేస్తున్నా



దశాబ్ద కాలం నుంచి వ్యవసాయం చేస్తున్నాను. చిరు ధాన్యాలనే వేసుకుంటున్నా. ఏడాది పాటు అవసరమైన ధాన్యం లభిస్తోంది. మిగిలిన ధాన్యం అమ్ముకుంటున్నాం. ఈ ఏడాది హైదరాబాద్‌కు చెందిన వినియోగదారులు పెట్టుబడి కోసం ఆర్థిక సాయం చేశారు. అందుకు సరిపడా చిరు ధాన్యాలను వారికి అందజేస్తున్నాం. పశువులు, మేకల ఎరువును మాత్రమే వేసి పండిస్తున్నాం. ఉత్సవాలు మా గ్రామం నుంచే ప్రారంభించడం సంతోషంగా ఉంది.

– చక్రిబాయి, మహిళారైతు, అర్జున్‌నాయక్ తండా

ఇదే ఆహారం తింటున్నాం..



చిరు ధాన్యాల ఆహారమే తింటున్నాం. ఏడాది క్రితం జహీరాబాద్ ప్రాంత రైతులతో అనుబంధం ఏర్పడింది. వారు చేస్తున్న వ్యవసాయ విధానం నమ్మకంగా ఉండటంతో పెట్టుబడి వ్యయం ఇచ్చి బదులుగా ధాన్యం తీసుకున్నాం. వారిని ప్రోత్సహించినట్లు ఉండడమే కాకుండా రసాయనాలు లేని ఆహార ధాన్యాలు లభిస్తుండడం సంతోషాన్నిచ్చింది. 50 మంది వరకు సభ్యులం చిరు ధాన్యాలను కొంటున్నాం. ఇదే ఆహారం తింటున్నాం.

– రాజు, దిశ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, హైదరాబాద్

వేటగాళ్ల ఉచ్చుకు చిరుత బలి

మంచిర్యాలఅర్బన్: వన్యప్రాణుల కోసం వేటగాళ్లు అమర్చిన ఉచ్చుకు చిరుతపులి బలైంది. ఈ ఘటన సోమవారం మంచిర్యాలలో ఆలస్యంగా వెలుగు చూసింది. మంచిర్యాల ఫారెస్ట్ డివిజన్ అధికారి వెంకటేశ్వర్‌రావు కథనం ప్రకారం.. లక్సెట్టిపేట అటవీ రేంజ్ పరిధిలోని పాత మంచిర్యాల బీట్ రంగంపేట్ అటవీ సమీపంలో వన్యప్రాణుల కోసం వేటగాళ్లు ఓ చెట్టుకొమ్మకు క్లచ్ వైరుతో ఉచ్చు బిగించారు. ఓ చిరుతపులి అటుగా వచ్చి ఈ ఉచ్చులో చిక్కుకుంది. తప్పించుకునే ప్రయత్నం చేసిన అది మెడకు మరింతగా బిగిసిపోవటంతో మృత్యువాత పడింది. సోమవారం అటవీ ప్రాంతంలోకి వంట చెరుకు కోసం వెళ్లిన స్థానికులు ఉచ్చులో పడి ఉన్న చిరుతను గమనించారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మూడు రోజుల కిందట చిరుత మృతి చెందినట్లు భావిస్తున్నారు. నిందితులను పట్టుకుంటామని మంచిర్యాల ఎఫ్‌డీవో వెంకటేశ్వరావు తెలిపారు.

నిజామాబాద్ జిల్లాలో

7 గోర్లు, 4 దంతాలు స్వాధీనం

మాక్లూర్: నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం మామిడిపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో చిరుతపులి అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. ఈ మేరకు నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 4న గుత్ప శివారులోని ఓ మామిడితోటకు వేసిన ఇనుప కంచెకు చిక్కిన చిరుత అదే రోజు సాయంత్రం తప్పించుకుంది. ఈ నేపథ్యంలో అటవీప్రాంతంలో పూర్తిగా కుళ్లిపోయిన చిరుత కళేబరం కనిపించింది. అటవీ అధికారులు డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి విచారణ చేపట్టారు. చిరుతపులి చనిపోయిన స్థలంలో కొద్ది దూరంలోనే దాని తల, నడుము, మరి కొద్ది దూరంలో కాలు పడి ఉన్నాయి. చిరుత కళేబరం పూర్తిగా కుళ్లిపోయింది. పక్కనే బీడీల కట్ట, అంబర్ ప్యాకెట్ లభించాయి. డాగ్‌స్క్వాడ్ ఆధారంగా గుత్ప తండాకు చెందిన రవికుమార్, తులసీరాం, నరేందర్, విజయ్‌లను అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వారి నుంచి 7 గోర్లు, 4 దంతాలను స్వాధీనం చేసుకున్నారు. చిరుత పులి అనారోగ్యంతో మృతి చెందిందా.. లేదా వేటగాళ్లు చంపేశారా.. అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మండల పశువైద్యాధికారి చిరుత కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం ల్యాబ్‌కు పంపారు. రిపోర్టు రాగానే నిందితులపై చర్యలు తీసుకుంటామని ఎఫ్‌డీవో రాములు తెలిపారు.



చిరుత పులికళేబరాన్ని పరిశీలిస్తున్న ఎఫ్‌డీవో రాములు, సిబ్బంది

అక్కన్నపేట స్టేషన్‌లో సమస్యల కూత

రామాయంపేట (మెదక్): జిల్లాలోనే పెద్దదైన అక్కన్నపేట రైల్వేస్టేషన్ సమస్యల నిలయంగా మారింది. స్టేషన్‌లో కనీసం మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా స్టేషన్‌లో నెలకొన్న నీటిఎద్దడి పరిష్కారం విషయమై ఆశాఖ అధికారులు ఎంతమాత్రం పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోతులు, కుక్కలు, పందుల బెడద తీవ్రస్థాయిలో నెలకొంది. దీనితో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. నీటిఎద్దడితో స్టేషన్‌లో ఒక కుళాయి తప్పించి మిగతావి నిలిపేశారు. రైళ్లలో వస్తున్న ప్రయాణికులు నీటి కోసం చాలా ఇబ్బంది పడుతున్నారు.జిల్లాలోనే పెద్దదైన ఈరైల్వేస్టేషన్‌లో కనీసం మూత్రశాలలుకూడా లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. అన్ని స్టేషన్లలో మూత్రశాలలు నిర్మించిన అధికారులు ఈస్టేషన్ గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టాయిలెట్లు లేక స్టేషన్ ఆవరణకు దూరంగా వెళ్లి ఇబ్బంది పడుతున్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి

- మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన
- కామారెడ్డి ఆస్పత్రిలో ఘటన
- నిర్లక్ష్యం చేయలేదు: డాక్టర్ శ్రీనివాసరావు

కామారెడ్డి టౌన్: వైద్యుల నిర్లక్ష్యం ఓ బాలింతను బలితీసుకుంది. ఆస్పత్రి వైద్యుల తీరును నిరసిస్తూ మృతదేహంతో కామారెడ్డి ఏరియా ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. బీబీపేట మండలం ఇస్సానగర్‌కు చెందిన బోదాసు నాగరాణి మొదటి కాన్పు కోసం ఈ నెల 11వ తేదీన కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి వచ్చింది. శుక్రవారం ఆమెకు వైద్యులు సిజేరియన్ చేశారు. మగబిడ్డకు జన్మనిచ్చింది. అదేరోజు సాయంత్రం ఫిట్స్ రావడంతో ఐసీయూకు తరలించారు. కాస్త ఆరోగ్యం కుదుటపడగానే మరుసటి రోజైన శనివారం మెటర్నిటీ వార్డుకు తరలించారు. ఆదివారం సాయంత్రం పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో రామాయంపేట సమీపంలో తుదిశ్వాస విడిచింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు అదే రాత్రి మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. సోమవారం ఉదయం ఆస్పత్రి ఎదుట బైఠాయించి రెండు గంటలకు పైగా రాస్తారోకో చేశారు. రెండు రోజుల పాటు నాగరాణి పరిస్థితి బాగా లేదని, వైద్యం అందించాలని వైద్యులకు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదని మృతురాలి భర్త పరశురాం ఆరోపించారు. చివరి క్షణంలో తమతో సంతకాలు చేయించుకుని మృతదేహాన్ని అప్పగించి హైదరాబాద్ తీసుకెళ్లాలని సూచించారన్నారు. కామారెడ్డిలోనే తమకు అనుమానం వచ్చిందని, కానీ కాపాడుకుంటామన్న ఆశతో హైదరాబాద్‌కు తీసుకుపోవడానికి సిద్ధమయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే నాగరాణి చనిపోయిందన్నారు. డీఎస్పీ లక్ష్మీనారాయణ ఆస్పత్రికి వచ్చి, ఆందోళనకారులను సముదాయించారు. ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. ఈ విషయమై ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ నాగరాణికి ఫిట్స్, బీపీ ఉన్నాయని, కాపాడేందుకు తాము శాయశక్తులా ప్రయత్నించామని పేర్కొన్నారు. అకస్మాత్తుగా ఫిట్స్ రావడం, బీపీ తగ్గడంతో హైదరాబాద్ రిఫర్ చేశామన్నారు. వైద్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించలేదన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఆస్పత్రి ముందు ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న మృతురాలి బంధువులు

ఏకగ్రీవం కోసం ఎన్నిక

- పోటీదారుల మధ్య ఓటింగ్
- గోవిందరావుపల్లె తండాలో మాక్ పోలింగ్

సిరిసిల్ల: కొత్తగా ఆవిర్భవించిన గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలనుకున్నారు. కానీ సర్పంచ్ పదవి కోసం ఐదుగురు పోటీ పడ్డారు. దీంతో సోమవారం మాక్‌పోలింగ్ నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కోనరావుపేట మండలం గోవిందరావుపల్లె వాసులు 300కి పైగా ఓటర్లున్న ఆ గిరిజనపల్లెలో ఎన్నికలు నిర్వహించారు. బరిలో ఉన్న మాజీ సర్పంచ్ గుగులోతు జగన్‌నాయక్‌కు 103 ఓట్లు రాగా, గుగులోతు ప్రకాశ్‌కు 68 ఓట్లు, లావుడ్య గోపాల్‌కు 34, సీతారాం, నందులకు 26 చొప్పున ఓట్లు వచ్చాయి. మూడు ఓట్లు చెల్లలేదు. దీంతో జగన్‌నాయక్‌ను ఏకగ్రీవం చేసుకున్నారు. వచ్చే పంచాయతీ ఎన్నికల్లో వార్డుసభ్యులతో సహా పాలకవర్గాన్ని ఏకగ్రీవం చేసుకుని ప్రభుత్వ పారితోషకం రూ.25 లక్షలు గ్రామాభివృద్ధికి సాధించుకుంటామని గ్రామస్తులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో మాక్ పోలింగ్ చర్చనీయాంశమైంది.



గోవిందరావుపల్లెలో మాక్‌పోలింగ్


సోమవారం త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు చేస్తున్న లక్షలాది మంది భక్తులు

నేటి నుంచే కుంభమేళా

మార్చి 4 వరకు మహా ఉత్సవం

- తాత్కాలిక నగరం కుంభ్‌నగరిలో సకల సౌకర్యాలు
- ప్రధాన విశేషంగా 13 అఖాడాలు

అలహాబాద్: ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక ఉత్సవం కుంభమేళాకు అలహాబాద్ సర్వం సన్నద్ధమైంది. అసంఖ్యాక జన సందోహానికి 'కుంభ్ నగరి' స్వాగతం పలుకుతోంది. మకర సంక్రాంతి సందర్భంగా నేటి నుంచి అధికారికంగా ప్రారంభమయ్యే ఈ మహా జనయజ్ఞం మార్చి 4వ తేదీ వరకు అంటే మహాశివరాత్రి దాకా కొనసాగనుంది. 12 ఏళ్లలో రెండు పర్యాయాలు జరిగే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని అర్ధ కుంభ్‌గా పిలుస్తుంటారు. కానీ, యూపీ ప్రభుత్వం ఇటీవల ఆ పేరును కుంభ్‌గా మార్చింది. ఈ కార్యక్రమంలో అందరినీ ఆకర్షించే అఖాడాలు వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి చేరుకుంటున్నారు.

తాత్కాలిక మహానగరం

సంక్రాంతి నుంచి శివరాత్రి వరకు 50 రోజుల పాటు సాగే ఈ క్రతువులో 12 కోట్ల మంది వరకు పాల్గొంటారని అంచనా. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందుకు తగినట్లుగా భారీ ఏర్పాట్లు చేపట్టాయి. గంగా–యమున నదీ తీరాన 32 వేల హెక్టార్లలో ఏర్పాటు చేసిన కుంభ్‌నగరి ప్రపంచంలోనే అతిపెద్ద తాత్కాలిక నగరంగా రికార్డు కెక్కింది. ఇందులో 250 కిలోమీటర్ల పొడవైన రోడ్లు, 20 వంతెనలు, ఇంకా ఆస్పత్రులు, పోలీస్ స్టేషన్లు, బ్యాంకులు..ఇలా ఒక నగరంలో ఉండే అన్ని మౌలిక సదుపాయాలను కల్పించారు. కుంభ్ నగరిలోకి అత్యవసర సేవలందించే వాటిని తప్ప మిగతా అన్ని రకాల వాహనాలను నిషేధించారు. ఇక్కడ 15 రాష్ట్ర ప్రభుత్వాలు 261 కార్యక్రమాలను చేపట్టాయి. యూపీ రాష్ట్ర ప్రభుత్వ శాఖలు 28, కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఆరు విభాగాలు ఈ కుంభమేళా నిర్వహణలో పాలుపంచుకుంటున్నాయి. 2013లో జరిగిన పూర్ణ కుంభమేళా కంటే దాదాపు మూడు రెట్లు నిధులు అంటే రూ.4,200 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. అప్పటి కంటే ఇప్పుడు ఏర్పాట్లు చాలా బాగున్నాయి. కానీ, చాలా లోపాలున్నాయి. మా టెంట్‌లో లైట్లు బిగించటానికి రూ.200 లంచం ఇవ్వాల్సి వచ్చిందని జునా అఖాడాకు చెందిన ఓ సాధువు తెలిపారు. లౌడ్ స్పీకర్లలో వినిపించే ఆధ్యాత్మిక గీతాలు.. దిగంబర దేహమంతటా విబూది రేఖలు, గంజాయి నింపిన చిలుంలను పీలుస్తూ నాగా సాధువులు చేసే ఆనంద నృత్యాలు... వీటన్నిటినీ ఆసక్తిగా తిలకిస్తూ ఫొటోలు తీసుకునే విదేశీ యాత్రికులతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. దీంతోపాటు ఇక్కడ మత రాజకీయాల ప్రస్తావన కూడా కనిపిస్తుంది. మేళా సందర్భంగా అయోధ్యలో రామాలయంపై వివిధ హిందుత్వ సంస్థలు 'ఇప్పుడు నీవు రామ మందిరం నిర్మించ లేకుంటే ముందు తరాల వారికి ఎలా మొహం చూపిస్తావు' అంటూ హోర్డింగులు ఏర్పాటు చేశాయి.


జునా అఖాడా సాధువు

13 అఖాడాలు

8వ శతాబ్దానికి చెందిన హిందూ గురువు ఆది శంకరాచార్య సనాతన ధర్మాన్ని రక్షించే లక్ష్యంగా సాధువులను ఏకతాటిపైకి తెచ్చేందుకు అఖాడాలను నెలకొల్పారు. ఒక్కో అఖాడా ఒక్కో సిద్ధాంతం, ఆచార సంప్రదాయాలను పాటిస్తాయి. ఆరాధన విధానాన్ని బట్టి శైవ, వైష్ణవ, ఉదాసీన్ అనే మూడు ముఖ్యమైన అఖాడాలున్నాయని అఖిల భారతీయ అఖాడా పరిషత్(ఏబీఏపీ) అధ్యక్షుడు నరేంద్ర గిరి తెలిపారు. మొత్తం 13 అఖాడాల్లో ఏడు శైవ, మూడు వైష్ణవ, 2 ఉదాసీన్, ఒక సిక్కు అఖాడాలున్నాయని తెలిపారు. అఖాడా అంటే అఖండం, విడదీయరానిదని అర్థం అని ఆయన వివరించారు. జునా అఖాడా అతి ప్రాచీనమైంది, అన్నిటి కంటే పెద్దదిగా చెబుతుంటారు.

జన వాక్కు

'సౌకర్యం, అసౌకర్యాల గురించి ఆలోచించొద్దు. ఆ గంగామాతను స్మరించుకోండి. మీ కష్టం, అలసట అంతా దూరమవుతుంది..' అన్నారు కనౌజ్ నుంచి కుంభ్‌నగరికి చేరుకున్న ప్రమోద్ ప్రకాశ్(55) అక్కడున్న మిగతా వారిని చూపిస్తూ. ఈయన బరువైన మూడు బ్యాగులను మోసుకుంటూ స్థానిక రైల్వే స్టేషన్ నుంచి ఇక్కడి దాకా నడిచి వచ్చారు. 'స్వచ్ఛమైన భక్తిభావం ఇక్కడి వారిలో చూస్తున్నాం. కుంభమేళా నిర్వహణ కూడా చాలా బాగుంది. మేం మాటల్లో చెప్పలేం. ఈ అద్భుతాన్ని ఎవరైనా చూసి నమ్మాల్సిందే. ఇంతపెద్ద కార్యక్రమం, అసంఖ్యాక జనం. కొంత గందరగోళం అనిపించినా, ప్రతి ఒక్కటీ సజావుగా సాగిపోతోంది. వీటన్నిటి వెనుకా ఏదో అతీతశక్తి ఉంది' అన్నారు ఇటలీ నుంచి వచ్చిన అలెసియో దంపతులు.

అత్యంత పవిత్రమైన 6

త్రివేణీ సంగమంలో స్నానమాచరించేందుకు పవిత్రమైనవి ఆరు రోజులు. అవి మకర సంక్రాంతి పర్వదినం కాగా, పౌష్ పూర్ణిమ(జనవరి 21), మౌని అమావాస్య(ఫిబ్రవరి 4), వసంత పంచమి(ఫిబ్రవరి 10), మాఘి పూర్ణిమ (ఫిబ్రవరి 19), ఆఖరిది మార్చి 4వ తేదీ మహాశివరాత్రి. కాగా, వీటిలో మొదటి, ఆఖరి రోజులను అత్యంత పవిత్రమైనవిగా భావిస్తారు. ఈ రోజుల్లో వేకువజామున 4 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు స్నానం చేయడం శుభప్రదంగా చెబుతారు.

పిల్లలు తప్పిపోకుండా ట్యాగ్‌లు

కుంభమేళా సందర్భంగా తప్పి పోయిన పిల్లలను గుర్తించేందుకు రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్(ఆర్ఎఫ్ఐడీ)ట్యాగ్‌లను అందజేస్తున్నారు. వొడాఫోన్ కంపెనీ సహకారంతో 40వేల ట్యాగ్‌లను సమకూర్చుకున్నట్లు డీఐజీ వివరించారు.

భద్రత నీడలో

కుంభమేళా సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరక్కుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు డీజీపీ అభినయ్ పాండే తెలిపారు. మేళాలో బందోబస్తు కోసం 20వేల పోలీసులు, 6 వేల హోంగార్డులు, 40 పోలీస్ స్టేషన్లు, 40 ఫైర్ స్టేషన్లు, 80 కంపెనీల కేంద్ర బలగాలు, ఇతర బలగాలను మోహరించినట్లు చెప్పారు. 30 మహిళా పోలీస్ స్టేషన్లు, సంఘటన జరిగిన 10 నిమిషాల్లోనే చేరుకునేలా 317 పోలీస్ వాహనాలు అందుబాటులో ఉంటాయన్నారు. డ్రోన్ కెమెరాలు, వాచ్ టవర్లు, బ్యాగేజీ స్కానర్లు, ఆధునిక సమాచార వ్యవస్థను నెలకొల్పామన్నారు. '1, 200 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతర కమాండ్–కంట్రోల్ రూం నెలకొల్పాం. భారీగా జనం గుమికూడినా, తొక్కిసలాటలు జరిగే అవకాశమున్నా వెంటనే గుర్తించేందుకు వీడియో అనలిటిక్స్‌ను వినియోగిస్తున్నాం. ఉగ్రవాదులు, అనుమానితులను గుర్తించేందుకు త్రినేత్ర యాప్‌ను వాడుకలోకి తెచ్చాం' అని అన్నారు.


యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ సభ్యులు

మోదీ సర్వేలో విపక్ష కూటమిపై ప్రశ్న

న్యూఢిల్లీ: 'బీజేపీకి వ్యతిరేకంగా విపక్షాలు ఏర్పాటు చేసుకున్న మహా కూటమి ప్రభావం మీ నియోజకవర్గంలో ఉంటుందా?'.. ఈ ప్రశ్న ప్రధాని నరేంద్ర మోదీకు సంబంధించిన నమో యాప్‌లో నిర్వహిస్తున్న 'పీపుల్స్ పల్స్' సర్వే లోనిది. దీంతో పాటు పలు ఇతర ప్రశ్నలకు కూడా ఈ సర్వేలో పాల్గొనేవారు సమాధానమివ్వాల్సి ఉంటుంది. ఈ సర్వేలో పాల్గొనాల్సిందిగా పౌరులను కోరుతూ ఓ చిన్న వీడియోను తన ట్విటర్ హ్యాండిల్‌లో సోమవారం ప్రధాని మోదీ పోస్ట్ చేశారు. 'నమో యాప్‌లో ఓ సర్వే ప్రారంభమైంది. అందులో పాల్గొని మీ అభిప్రాయాలు చెప్పాలని కోరుతున్నా. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవడంలో అవి మాకు తోడ్పడుతాయి' అని అందులో మోదీ పేర్కొన్నారు. రాష్ట్రం, నియోజకవర్గం, అవినీతి రహిత పాలన, స్వచ్ఛభారత్, మౌలిక వసతులు, చవకగా ఆరోగ్యం, ఆర్థిక రంగం, జాతీయ భద్రత, ఉపాధి, గ్రామీణ విద్యుదీకరణ.. తదితరాలపై పలు ప్రశ్నలున్నాయి.


సోమవారం శబరిమల ఆలయ ప్రాంగణం నుంచి మకర జ్యోతిని దర్శించుకుంటున్న లక్షలాది మంది అయ్యప్ప భక్తులు

ఎస్పీ–బీఎస్పీ కూటమికి ఆర్‌జేడీ మద్దతు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల ఏర్పడిన ఎస్పీ–బీఎస్పీ కూటమికి రాష్ట్రీయ జనతాదళ్(ఆర్‌జేడీ) మద్దతు తెలిపింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కొనేందుకు ఈ రెండు పార్టీలు తీసుకున్న నిర్ణయం దేశమంతటా ప్రభావం చూపనుందని పేర్కొంది. ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ సోమవారం అఖిలేశ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 'యూపీలోని మా పార్టీ శ్రేణులు ఎస్పీ–బీఎస్పీ కూటమికి మద్దతునిస్తాయి. యూపీ పరిణామం దేశవ్యాప్తంగా సంకేతాలు పంపింది. కేంద్రంలో అధికారంలోకి ఎవరు రావాలనే విషయాన్ని యూపీ, బిహార్ రాష్ట్రాలే నిర్ణయించనున్నాయి' అని తేజస్వీ వ్యాఖ్యానించారు. తేజస్వీ ప్రకటనతో యూపీలో తమ కూటమి మరింత బలోపేతమవుతుందని అఖిలేశ్ అన్నారు. 'మా కూటమిని అందరూ స్వాగతించారు. దేశ ప్రజలు బీజేపీ పాలనతో విరక్తి చెందారు. బీజేపీ ప్రజలను మోసం చేసింది. అందుకే ప్రజలు ఆ పార్టీని గద్దె దించాలనుకుంటున్నారు' అని అఖిలేశ్ తెలిపారు. యూపీ కూటమి నుంచి కాంగ్రెస్‌ను పక్కనపెట్టారు కదా అని తేజస్వీని ప్రశ్నించగా.. 'అందరి లక్ష్యం ఒక్కటే, అదే బీజేపీని ఓడించడం. వీళ్లు ఇక్కడ గెలుస్తారు..మేం అక్కడ గెలుస్తాం' అంటూ బిహార్‌లో కాంగ్రెస్‌తో కొనసాగుతున్న పొత్తుపై బదులిచ్చారు. తన తండ్రి, ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ కన్న కలలను నిజం చేసిన ఎస్పీ–బీఎస్పీ నేతలకు కృతజ్ఞతలు చెప్పేందుకే లక్నో వచ్చినట్లు ఆయన వెల్లడించారు. అనంతరం మాయావతి కాళ్లకు నమస్కరిస్తున్నట్లుగా ఉన్న ఫొటోలను తేజస్వీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కాగా, బీజేపీ పన్నిలో ఉచ్చులో ఇరుక్కున్న ఎస్పీ, బీఎస్పీలు యూపీలో తమతో సంబంధం లేకుండానే కూటమిగా ఏర్పడ్డాయని కాంగ్రెస్ తెలిపింది. యూపీలోని లౌకికవాద రాజకీయ పార్టీలను ఏకం కాకుండా చేసి ఓట్లను చీల్చడం ద్వారా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలవాలనే బీజేపీ ప్రయత్నాలు విజయవంతమయ్యాయని కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఆర్‌పీఎన్ సింగ్ అన్నారు.


లక్నోలో తేజస్వీ, అఖిలేశ్ కరచాలనం

మోదీకి 'ఫిలిప్ కోట్లర్' అవార్డు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం తొలి ఫిలిప్ కోట్లర్ ప్రెసిడెన్షియల్ అవార్డు స్వీకరించారు. 'ప్రజలు, లాభం, భూమి'అనే అంశాల ప్రాతిపదికన విశేష ప్రతిభ చూపిన దేశాధినేతలకు ఈ అవార్డు ఇస్తారు. విశిష్ట నాయకత్వ లక్షణాలతో దేశాన్ని నడిపిస్తున్నందుకుగాను ప్రధానికి ఈ అవార్డు ఇచ్చినట్లు అవార్డు కమిటీ తెలిపింది. 'ఆయన చేస్తున్న నిస్వార్థ సేవ, అవిశ్రాంత కృషి వల్ల ఆర్థిక, సామాజిక, సాంకేతిక రంగాల్లో భారత్ అభివృద్ధి సాధించింది'అని కమిటీ పేర్కొంది. మోదీ పాలనలో దేశం నూతన ఆవిష్కరణలకు కేంద్రంగా మారిందని, తయారీ రంగానికి ప్రాముఖ్యత పెరిగి ఐటీ, ఎకౌంటింగ్, ఫైనాన్స్ వంటి సేవలకు భారత్ గ్లోబల్ హబ్‌గా మారిందని చెప్పింది. మోదీ నాయకత్వం ఆధార్ వంటి డిజిటల్ విప్లవాలకు నాంది పలికి.. సామాజిక ప్రయోజనాలు చేకూరేందుకు దోహదం చేసిందని తెలిపింది. మోడ్రన్ మార్కెటింగ్ పితామహుడిగా ప్రఖ్యాతిగాంచిన ఫిలిప్ కోట్లర్ ఏటా ఈ అవార్డు అందిస్తారు. ప్రస్తుతం ఫిలిప్ కోట్లర్ (87) అమెరికాలోని నార్త్‌వెస్టర్న్ వర్సిటీలోని కల్లోజ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విభాగంలో మార్కెటింగ్ ప్రొఫెసర్‌గా చేస్తున్నారు. అనారోగ్యంతో కోట్లర్ ఢిల్లీ రాలేకపోయారు. ఆయన తరఫున జార్జియాలోని ఈఎంఓఆర్‌వై వర్సిటీ ప్రొఫెసర్ జగదీశ్ సేత్, కమిటీ ప్రతినిధులు అవార్డు అందించారు.



అమల్లోకి 'పేదల' 10% కోటా

న్యూఢిల్లీ: జనరల్ కేటగిరీలో ఉన్న ఆర్థికంగా వెనుకబడిన వర్గాల్లోని పేదలకు ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యావకాశాల్లో 10% రిజర్వేషన్లు కల్పించే చట్టం సోమవారం నుంచి అమల్లోకి వచ్చింది. ఈ 103వ రాజ్యాంగ సవరణ చట్టం 2019, జనవరి 14 నుంచి అమల్లోకి వచ్చినట్లు సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న రిజర్వేషన్లకు అదనంగా 10% రిజర్వేషన్లు కల్పించాలని ఇందులో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 15, 16 అధికరణాలను సవరిస్తూ రూపొందించిన బిల్లును ఇటీవలే పార్లమెంటు ఆమోదించిన విషయం తెలిసిందే. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పౌరుల అభివృద్ధి కోసం ప్రత్యేక నిబంధనలు రూపొందించుకునే అవకాశం రాష్ట్రాలకు కల్పిస్తూ ఒక క్లాజ్‌ను సంబంధిత అధికరణల్లో చేర్చారు. ఆర్థిక వెనుకబాటుతనానికి సంబంధించి కుటుంబ ఆదాయం, ఇతర సూచీల ఆధారంగా ప్రభుత్వం నిర్ధారించే వర్గాలను ఆర్థికంగా వెనుకబడిన వర్గాలుగా పరిగణిస్తారని చట్టంలో స్పష్టం చేశారు.

ఎయిమ్స్‌లో చేరిన కేంద్రమంత్రి రవిశంకర్

న్యూఢిల్లీ: కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ సోమవారం రాత్రి ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చేరారు. రాత్రి 8 గంటల సమయంలో ఆయన ఎయిమ్స్‌కు వచ్చి పల్మనరీ మెడిసిన్ విభాగంలో అడ్మిట్ అయ్యారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని వెల్లడించాయి.

ఇరాన్‌లో కూలిన కార్గో విమానం

15 మంది దుర్మరణం



టెహ్రాన్: ఇరాన్‌లో మరో ఘోర విమాన ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 15 మంది విమాన సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. పైలట్ ప్రాణాలతో బయటపడ్డాడు. దశాబ్దాల క్రితం నాటి బోయింగ్ 707 కార్గో విమానం మాంసం లోడ్‌తో సోమవారం కిర్గిస్తాన్ నుంచి ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు బయలుదేరింది. పాయం విమానాశ్రయంలో ల్యాండ్ కావాల్సిన ఈ విమానం అత్యవసరంగా ఉదయం 8.30కి ఫత్ విమానాశ్రయంలో ల్యాండింగ్ చేస్తున్న క్రమంలో రన్‌వేపై అదుపు తప్పింది. దీంతో స్థానికంగా ఉన్న ఇళ్లలోకి దూసుకెళ్లడంతో అక్కడ పెద్ద ఎత్తున మంటలు, పొగ ఎగిసిపడ్డాయి. పాయంలో దిగాల్సిన విమానం పొరపాటున ఫత్‌లో దిగినట్లు ఓ ఏవియేషన్ అధికారి తెలిపినట్లు ఇరాన్ అధికారిక న్యూస్ ఏజెన్సీ ఐఆర్ఎన్ఏ వెల్లడించింది. 2016 నుంచి ఈ బోయింగ్ విమానం కిర్గిస్తాన్ నుంచి ఇరాన్‌కు మాంసం రవాణా చేస్తుంది. ఇరాన్‌లో విమాన ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ఏళ్లపాటు కొనసాగిన అమెరికా ఆంక్షల వల్ల ఇరాన్ కొత్త విమానాలను కొనుగోలు చేసుకోలేకపోయింది.

ప్రకృతిసేద్య నిపుణుడు నారాయణరెడ్డి మృతి



సాక్షి, హైదరాబాద్: సుప్రసిద్ధ ప్రకృతి వ్యవసాయ నిపుణుడు డాక్టర్ ఎల్. నారాయణరెడ్డి(84) కర్ణాటకలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం నిద్రలోనే కన్నుమూశారు. మరలేనహళ్లిలో గల తన వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం సైతం ఆయన రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. కాగా, ఆయన స్వస్థలం బెంగళూరు రూరల్ వర్తూర్‌లో సోమవారం అంత్యక్రియలు నిర్వర్తించారు. జపాన్‌కు చెందిన ప్రకృతి వ్యవసాయ నిపుణులు మసనొబు ఫుకువోకా శిష్యుడిగా నారాయణరెడ్డి ప్రసిద్ధి పొందారు. ఫుకువోకా భారత్‌లో పర్యటనకు వచ్చినప్పుడు మరలేనహళ్లిలోని నారాయణ రెడ్డి వ్యవసాయక్షేత్రాన్ని సందర్శించారు. డాక్టర్ నారాయణరెడ్డి 35 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయంలో ఉన్నారు. తన వ్యవసాయ క్షేత్రాన్ని అంతర్జాతీయ ప్రకృతి వ్యవసాయ శిక్షణా కేంద్రంగా తీర్చిదిద్దారు. ఆ పొలంలోని మట్టి 5 శాతం సేంద్రియ కర్బనంతో కూడి ఉండటం విశేషంగా చెబుతారు. దేశ విదేశాల నుంచి రైతులు వచ్చి ఆయన వద్ద అనుభవపూర్వకంగా ప్రకృతి వ్యవసాయ పాఠాలు నేర్చుకుంటూ ఉంటారు. లీసా ఇండియా ఆంగ్ల ప్రకృతి వ్యవసాయ మాసపత్రికకు చాలా ఏళ్లుగా ఆయన కాలమిస్టు. వేలాది మంది రైతులను ప్రకృతి వ్యవసాయంలోకి మళ్లించిన డా. నారాయణరెడ్డి మరణం తీరని లోటని పలువురు నివాళులర్పించారు.

ప్రాణాలు తీసిన మాంజా

అహ్మదాబాద్: పతంగులు ఎగురవేస్తూ వాటి పదునైన దారాలు లోతుగా గీరుకుపోవడంతో గొంతు తెగి ఓ బాలుడు(8)సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. గుజరాత్‌లో ఉత్తరాయణ్ పండగ సందర్భంగా సోమవారం ఈ విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. మెహ్‌సనా పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెహజీబ్ ఖాన్(8) సైకిల్‌పై వెళుతుండగా పతంగు దారం మెడకు గీసుకుపోయి చనిపోయాడు. అహ్మదాబాద్ జిల్లా ఢోల్కా సమీపంలో మోటారు సైకిల్‌పై వెళ్తున్న అశోక్ పంచాల్(45) కూడా పతంగు దారం గొంతుకు గీరుకుపోవడంతో తీవ్ర రక్తస్రావం అయి చనిపోయాడు. ఆనంద్ జిల్లా కత్తానా గ్రామ సమీపంలో పతంగు ఎగురవేస్తూ మెడకు దారం గీరుకుని గాయపడ్డాడు. సోమవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. అహ్మదాబాద్, రాజ్‌కోట్, సూరత్, వడోదరా జిల్లాల్లో ఆదివారం సాయంత్రం వరకు పతంగులు ఎగురవేసే క్రమంలో ఇళ్లపై నుంచి పడి 117 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు.

చైనా భూగర్భంలో ఉక్కు గోడ

దాడుల నుంచి అణ్వస్త్రాలను కాపాడేందుకు..

బీజింగ్: దాడుల నుంచి అణ్వస్త్రాలను కాపాడుకునేందుకు పర్వతాల కింద, భూగర్భంలో పెద్ద ఉక్కు గోడను చైనా నిర్మించిందని ఆ దేశ రక్షణ మంత్రిత్వ శాఖలో పనిచేసే శాస్త్రవేత్త క్వియాన్ క్విహు (82) వెల్లడించారు. ఇటీవలే ఈయనకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, చైనా రక్షణ శాఖలో అత్యున్నత పురస్కారాన్ని అందజేశారు. ఈ భారీ ఉక్కు గోడ చైనా వ్యూహాత్మక ఆయుధాలకు రక్షణగా నిలుస్తుందనీ, ఎవరైనా చైనాపై దాడులు చేసినపక్షంలో ఆయుధాలు ధ్వంసం కాకుండా కాపాడుతుందని క్విహు వెల్లడించినట్లు చైనా ప్రభుత్వ పత్రిక గ్లోబల్ టైమ్స్ తెలిపింది. పర్వతాల కింద భాగాల్లో చైనాకు రక్షణ స్థావరాలున్నాయి. సాధారణంగా శత్రు దాడుల నుంచి ఆ పర్వతాలే ఆయుధాలకు రక్షణ కల్పిస్తాయి. రక్షణ స్థావరాల్లోకి ప్రవేశించే, నిష్క్రమించే చోట్ల మాత్రం ఎవరైనా దాడులు చేస్తే ఆయుధాలు ధ్వంసం అయ్యే అవకాశం ఉండటంతో ద్వారాల దగ్గర మరింత భద్రంగా ఉండేలా చేసే బాధ్యతను చైనా ప్రభుత్వం క్విహూపై పెట్టింది. ఆయన ఆ పనిని పూర్తి చేయడంతో 2018 ఏడాదికి 'స్టేట్ ప్రీమినెంట్ సైన్స్ అండ్ టెక్నాలజీ అవార్డ్'ను చైనా ప్రభుత్వం క్విహుకు ప్రదానం చేసింది. ఓ కార్యక్రమంలో క్విహు మాట్లాడుతూ 'బల్లెం పదును ఎక్కువవుతున్నప్పుడు కవచం కూడా దృఢంగా తయారైతేనే రక్షణను ఇవ్వగలదు. సవాళ్లకు దీటుగా ఈ భూగర్భ ఉక్కు గోడను నిర్మించాం' అని చెప్పారు.

వేడెక్కిన కన్నడ రాజకీయం

ఆరుగురు కాంగ్రెస్- జేడీఎస్ ఎమ్మెల్యేలు మిస్సింగ్!



సాక్షి, బెంగళూరు/శివాజీనగర/మైసూరు: కన్నడ రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. తమ ఎమ్మెల్యేలకు ఎరవేసి ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ 'ఆపరేషన్ కమలం' ప్రారంభించిందని జేడీఎస్– కాంగ్రెస్.. తమ ఎమ్మెల్యేలనే లాక్కునేందుకు కుమారస్వామి సర్కారు ప్రయత్నిస్తోందంటూ బీజేపీ పరస్పరం ఆరోపణలకు దిగాయి. జాతీయ కౌన్సిల్ సమావేశాలకు ఢిల్లీ వెళ్లిన బీజేపీ ఎమ్మెల్యేలను తిరిగి బెంగళూరు వెళ్లనివ్వకుండా, పార్టీ అగ్ర నేతలు అక్కడే ఉంచారని, తాజాగా గురుగ్రామ్‌లోని ఒక హోటల్‌లో వారికి బస ఏర్పాటు చేశారని వార్తలు గుప్పుమన్నాయి. మరోవైపు, కాంగ్రెస్– జేడీఎస్‌లకు చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు 'కనిపించడం' లేదన్న వార్తలు ప్రభుత్వ శిబిరంలో ఆందోళనలకు కారణమయ్యాయి. ప్రత్యర్థి పార్టీల ఎమ్మెల్యేలు తమ శిబిరంలో చేరేందుకు ఆసక్తిగా ఉన్నారంటూ ఇరు పార్టీల నేతలు మీడియాకు సమాచారమిస్తుండటంతో కర్ణాటక రాజకీయం రసకందాయంలో పడింది. 224 స్థానాలున్న కర్నాటక అసెంబ్లీలో ప్రస్తుతం మేజిక్ ఫిగర్ అయిన 113ను మించి కాంగ్రెస్– జేడీఎస్‌లకు 118 మంది సభ్యుల మద్దతుండగా, బీజేపీకి 104 మంది ఎమ్మెల్యేలున్నారు.

వారు చెప్పే వెళ్లారు: సీఎం కుమారస్వామి

బెళగావి, బళ్లారి జిల్లాలకు చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు బీజేపీ పక్షంలోకి చేరిపోయారనీ వస్తున్న వార్తలతోపాటు, పలువురు జేడీఎస్ ఎమ్మెల్యేలు కూడా గోడ దూకేందుకు సిద్ధంగా ఉన్నారన్న దానిపైనా సీఎం కుమారస్వామి స్పందించారు. 'జేడీఎస్–కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో ఒక్కరు కూడా బీజేపీ వలలో పడరు. ముంబై వెళ్లిన ఎమ్మెల్యేలు మా స్నేహితులే. వ్యక్తిగత పనులపై వెళుతున్నట్లు వారు ముందుగానే చెప్పారు. మా ప్రభుత్వానికి ఏ ఢోకా లేదు' అని స్పష్టం చేశారు. ప్రధాని మోదీకి కర్ణాటక అంటే భయం పట్టుకుందన్నారు. తమ ఎమ్మెల్యేలపై పూర్తి విశ్వాసముందని ఉప ముఖ్యమంత్రి పరమేశ్వర చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ కూడా ఎక్కడికీ వెళ్లలేదని సీఎల్పీ అధ్యక్షుడు సిద్ధరామయ్య అన్నారు. కాగా, ఇటీవల రాష్ట్ర కేబినెట్ నుంచి ఉద్వాసనకు గురైన రమేశ్ జరకిహొలితో పాటు ఆనంద్ సింగ్, బీ నాగేంద్ర, ఉమేశ్ జాధవ్, బీసీ పాటిల్ తదితర అధికార పక్ష ఎమ్మెల్యేలు బీజేపీతో సంప్రదింపులు జరుపుతున్నారని వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.

రిసార్టు రాజకీయాలు చేయం: యెడ్డీ

'జేడీఎస్–కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో మాకు సంబంధం లేదు. మేం వాళ్లను ఎక్కడికీ తీసుకెళ్లలేదు. వాళ్లు ముంబైలో ఎందుకున్నారో ఆ పార్టీల నేతలకే తెలియాలి' అని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు యడ్యూరప్ప అన్నారు. 'మా ఎమ్మెల్యేలపై వల వేసేందుకు జేడీఎస్– కాంగ్రెస్ ప్రయత్నాలు సాగిస్తున్నాయి. అందుకే ముందు జాగ్రత్తగా మావారిని ఢిల్లీలో ఉంచాం. రెండు రోజుల తర్వాత వారంతా తమ తమ నియోజకవర్గాలకు చేరుకుని లోక్‌సభ ఎన్నికలకు ఏర్పాట్లు చేపడతారు' అని తెలిపారు. రిసార్టు రాజకీయాలు మాకు అవసరం లేదన్నారు.

'జేఎన్‌యూ' కేసులో చార్జిషీట్

- మూడేళ్ల తర్వాత దాఖలు చేసిన ఢిల్లీ పోలీసులు
- కన్హయ్య కుమార్ తదితరులపై దేశద్రోహం ఆరోపణలు

న్యూఢిల్లీ: మూడేళ్ల క్రితం నాటి దేశద్రోహం కేసులో ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ) విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు కన్హయ్య కుమార్, ఇతర నిందితులపై ఢిల్లీ పోలీసులు సోమవారం అభియోగపత్రం (చార్జిషీట్) దాఖలు చేశారు. కన్హయ్యతోపాటు జేఎన్‌యూ మాజీ విద్యార్థులు ఉమర్ ఖలీద్, అనిర్బన్ భట్టాచార్యలపై దేశ వ్యతిరేక నినాదాలు చేశారన్న అభియోగాలను పోలీసులు మోపారు. 2001లో పార్లమెంటుపై ఉగ్రవాదుల దాడికి సూత్రధారి అయిన అఫ్జల్ గురు వర్ధంతిని జేఎన్‌యూ క్యాంపస్‌లో 2016 ఫిబ్రవరి 9న కన్హయ్య కుమార్, ఇతర విద్యార్థులు నిర్వహించడంతో వారిపై దేశద్రోహం కేసులు నమోదయ్యాయి. ఎన్నికలకు ముందు రాజకీయ లబ్ధి కోసమే మూడేళ్ల తర్వాత పోలీసుల చేత బీజేపీ ఈ పని చేయిస్తోందని నిందితులు, ఈ ఘటనతో సంబంధం ఉన్న పలువురు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. కాగా, అభియోగపత్రంలో కశ్మీరీ విద్యార్థులు అఖీబ్ హుస్సేన్, ముజీబ్ హుస్సేన్, మునీబ్ హుస్సేన్, ఉమర్ గుల్, రయీయా రసూల్, బషీర్ భట్, బషరత్‌ల పేర్లు కూడా ఉన్నాయి. మొత్తం 36 మందిలో సీపీఐ నేత డి. రాజా కూతురు అపరాజిత, జేఎన్‌యూ విద్యార్థి సంఘం ఉపాధ్యక్షురాలు షెహ్లా రషీద్, బానోజ్యోత్స్న లాహిరి, రమా నాగ తదితరులున్నారు. బుధవారం ఢిల్లీ కోర్టు ఈ అభియోగపత్రాన్ని పరిశీలించనుంది. సీసీటీవీ ఫుటేజీ, మొబైల్ ఫుటేజీతోపాటు పలు పత్రాలను కూడా పోలీసులు అభియోగపత్రంతోపాటు కోర్టుకు సమర్పించారు. దేశ వ్యతిరేక నినాదాలు చేసేలా కన్హయ్య కుమారే అక్కడున్న గుంపును రెచ్చగొట్టాడని పోలీసులు చార్జిషీట్‌లో పేర్కొన్నారు.

రాజకీయ ప్రేరేపితమే: కన్హయ్య

ఇన్నాళ్ల తర్వాత చార్జిషీట్ వేయడం తమకు మంచిదేననీ, కేసు విచారణ పూర్తయితే నిజానిజాలు ఏంటో బయటకొస్తాయని కన్హయ్య అన్నారు. సీపీఐ నేత డి. రాజా మట్లాడుతూ రాజకీయ కారణాలతోనే ఇప్పుడు అభియోగపత్రం దాఖలు చేస్తున్నారనీ, దీనిపై తాము కోర్టులోనూ, కోర్టు బయట రాజకీయంగానూ పోరాడతామని వెల్లడించారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే బీజేపీ ఇలా చేస్తోందని కేసులో మరో నిందితుడు ఉమర్ ఖలీద్ ఆరోపించారు. షెహ్లా రషీద్ మాట్లాడుతూ ఇది నకిలీ కేసు అనీ, నిందితులందరూ నిర్దోషులుగా కేసు నుంచి బయటకొస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.


కన్హయ్య (ఫైల్)

2016లో ఏం జరిగిందంటే..

ఫిబ్రవరి 9: పార్లమెంటుపై దాడి కేసులో సూత్రధారి అఫ్జల్ గురు వర్ధంతి రోజున అతనిని పొగుడుతూ జేఎన్‌యూ క్యాంపస్‌లో ర్యాలీ

ఫిబ్రవరి 10: దీనిపై క్రమశిక్షణా విచారణకు జేఎన్‌యూ యంత్రాంగం ఆదేశం.

ఫిబ్రవరి 11: బీజేపీ ఎంపీ మహేశ్ గిరి, ఆరెస్సెస్ విద్యార్థి విభాగం ఏబీవీపీ ఫిర్యాదులను స్వీకరించి కేసు నమోదు చేసిన ఢిల్లీ పోలీసులు

ఫిబ్రవరి 12: కన్హయ్య కుమార్ అరెస్ట్.. భారీ ఆందోళనలకు దిగిన విద్యార్థులు

ఫిబ్రవరి 15: కన్హయ్య కేసు విచారణకు ముందు పాటియాలా హౌస్ కోర్టులో విద్యార్థులు, పాత్రికేయులు, అధ్యాపకులను దేశ వ్యతిరేకులుగా పేర్కొంటూ న్యాయవాదుల దాడి.

ఫిబ్రవరి 25: తీహార్ జైలుకు కన్హయ్యను పంపిన కోర్టు

మార్చి 3: కన్హయ్యకు ఆరు నెలల బెయిలు

ఆగస్టు 26: కన్హయ్య, ఉమర్ ఖలీద్, అనిర్బన్‌లకు సాధారణ బెయిలు

2019 జనవరి 14: కేసులో అభియోగపత్రం దాఖలు చేసిన పోలీసులు

సాక్షి బిజినెస్

మంగళవారం 15-1-2019 WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
156 ▼	57 ▼
35,854	10,738

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30గం.)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	6,927	▼ 44
డోజోన్స్	23,942	▼ 54
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,855	▼ 63
డాక్స్	10,856	▼ 32
షాంఘై	2,536	▼ 18
నికాయ్ (శుక్రవారం ముగింపు)	20,360	▲ 196

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	69.08	71.44
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	89.17	92.33
€	యూరో	ఎస్‌బీఐ	79.57	82.51
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	63.11	66.55
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	49.73	51.97
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	51.32	53.12
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	17.55	20.65
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	--	--
¥	చైనా యువాన్	థామస్‌కుక్	09.04	11.15

మళ్లీ 71కి జారిన రూపాయి....

- 43 పైసలు పతనంతో 70.92 వద్ద ముగింపు
- నెలరోజుల కనిష్టం
- దేశీయ అంశాలు ప్రధాన కారణం



ముంబై: డాలర్ మారకంలో రూపాయి విలువ మళ్లీ పతనబాట పట్టింది. ఇంటర్ బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో సోమవారం రూపాయి విలువ ఒకే రోజు 43 పైసలు క్షీణించి 70.92 వద్ద ముగిసింది. గడచిన నెల రోజుల్లో ఈ స్థాయికి రూపాయి పతనం కావడం ఇదే తొలిసారి. డిసెంబర్ 17న రూపాయి 71.56 వద్ద ముగిసింది.

కారణాలు చూస్తే...

- శుక్రవారం వెలువడిన నవంబర్ పారిశ్రామిక ఉత్పత్తి గణాంకాలను చూస్తే, కేవలం అరశాతం వృద్ధి నమోదయ్యింది. ఇది 17 నెలల కనిష్ట స్థాయి.
- విదేశీ నిధులు వెనక్కు మళ్లడం, దేశీయ ఈక్విటీ మార్కెట్ల పతనం ప్రతికూల ప్రభావం చూపాయి.
- చమురు ధరలు కొంత తగ్గడం, ప్రధాన ప్రపంచ దేశాల కరెన్సీలపై డాలర్ బలహీనత వల్ల రూపాయి పతనం కొంత ఆగింది కానీ, లేదంటే మరింత పతనం జరిగేదన్నది విశ్లేషణ.
- అక్టోబర్ 9వ తేదీన రూపాయి చరిత్రాత్మక కనిష్ట స్థాయి 74.39 వద్ద ముగిసింది. క్రూడ్ ధరలు అంతర్జాతీయంగా ఇటీవలి గరిష్ట స్థాయిల నుంచి అనూహ్యంగా 30 డాలర్ల వరకూ పడిపోతూ వచ్చిన నేపథ్యంలో...రూపాయి క్రమంగా కోలుకుని 69.40 స్థాయిని చూసింది. అయితే మళ్లీ క్రూడ్ ధర తీవ్రతతో జారుడుబల్లపైకి ఎక్కింది.

బ్యాంకుల్లో ప్రభుత్వ వాటా 52 శాతానికి

క్రమంగా తగ్గించుకోనున్న కేంద్రం



న్యూఢిల్లీ: మెరుగైన కార్పొరేట్ విధానాల్లో భాగంగా... ప్రభుత్వరంగ బ్యాంకుల్లో కేంద్ర ప్రభుత్వం తన వాటాను 52 శాతానికి పరిమితం చేసుకోవాలని భావిస్తోంది. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని అన్ని ప్రభుత్వరంగ బ్యాంకులను కేంద్ర ఆర్థిక శాఖ కోరింది. ''ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ప్రభుత్వం సహజంగానే వాటాదారు. అయితే, ఇది మెరుగైన కార్పొరేట్ విధానాలకు అనుగుణంగా ఉండాలి. ప్రభుత్వం వాటా ముందుగా కనీసం 52 శాతానికి తగ్గాలి. మార్కెట్ పరిస్థితులు అనుకూలంగా ఉన్న సమయంలో బ్యాంకులు ఈ దిశగా చర్యలు తీసుకుంటాయి. అందుకు సంబంధించి వారికి పూర్తి అనుమతులు ఇచ్చాం'' అని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి రాజీవ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ వాటా తగ్గింపుతో సెబీ 'కనీస ప్రజల వాటా' నిబంధనలను పాటించేందుకు వీలవుతుందన్నారు. తగిన జాగ్రత్తలతో బ్యాంకులు రుణాలు మంజూరు చేసేందుకు ఇది ప్రోత్సహిస్తుందన్నారు. కొన్ని ప్రభుత్వరంగ బ్యాంకుల్లో కేంద్రానికి 75%కి పైగా వాటా ఉండటం గమనార్హం. సెబీ నిబంధనల ప్రకారం లిస్టెడ్ కంపెనీల్లో ప్రజల వాటా కనీసం 25% ఉండాలి. ప్రభుత్వ రంగంలో అతిపెద్ద బ్యాంకు ఎస్‌బీఐ ఇప్పటికే క్యూఐపీ ద్వారా రూ.20,000 కోట్ల మేర షేర్ల విక్రయానికి చర్యలు చేపట్టింది. ఇది పూర్తయితే ప్రభుత్వం వాటా ప్రస్తుతమున్న 58.53% నుంచి తగ్గుతుంది. సిండికేట్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంకు, ఓరియంటల్ బ్యాంకులు ఇప్పటికే ఉద్యోగులకు షేర్ల అమ్మకం ద్వారా నిధుల సమీకరణ చర్యలను చేపట్టాయి. దీని ద్వారా కూడా ప్రభుత్వం వాటా కొంత తగ్గే అవకాశం ఉంటుంది.

మింత్రా-జబాంగ్‌కు అనంత్‌నారాయణన్ గుడ్‌బై

కొత్త సీఈవోగా అమర్ నాగారం



న్యూఢిల్లీ: ఈ కామర్స్ సంస్థలు మింత్రా, జబాంగ్ సీఈవోగా అనంత్‌నారాయణన్ తప్పుకున్నట్టు సంస్థ ప్రకటించింది. ఇతర అవకాశాల నేపథ్యంలో ఆయన సీఈవో పదవి నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్టు పేర్కొంది. అమర్ నాగారంను ఈ రెండు ఫ్యాషన్ పోర్టల్స్‌కు నూతన సీఈవోగా నియమించినట్టు, ఫ్లిప్‌కార్ట్ గ్రూపు సీఈవో కల్యాణ్ కృష్ణమూర్తికి రిపోర్ట్ చేయనున్నట్టు తెలిపింది. నాగారం ఫ్లిప్‌కార్ట్ నుంచి ఇటీవలే మింత్రా, జబాంగ్‌కు మారారు. ఏడేళ్ల నుంచి ఫ్లిప్‌కార్ట్ గ్రూపులో పనిచేస్తున్నారు. ఫ్లిప్‌కార్టు వ్యవస్థాపకుడు బిన్నీ బన్సల్ గ్రూపు సీఈవోగా తప్పుకున్న తర్వాత.. కంపెనీ స్థాయిలో నూతన నిర్వహణ విధానాన్ని తీసుకొచ్చారు. అప్పట్నుంచి అనంత్ నారాయణన్ కంపెనీని వీడనున్నారనే వార్తలు వస్తూనే ఉన్నాయి. నూతన విధానంలో భాగంగా మింత్రా, జబాంగ్‌లను ఫ్లిప్‌కార్ట్ కిందకు తీసుకొచ్చారు. దీంతో అనంత్ నారాయణన్ ఫ్లిప్‌కార్ట్ గ్రూపు సీఈవో కల్యాణ్ కృష్ణమూర్తికి రిపోర్ట్ చేయాల్సి వచ్చింది. నారాయణన్ హాట్‌స్టార్‌లో చేరనున్నట్టు సమాచారం. ''మింత్రా, జబాంగ్‌ను ఫ్యాషన్ ఈ కామర్స్ మార్కెట్లో బలమైన సంస్థగా నిలపడంతోపాటు, స్థిరమైన వృద్ధి దిశగా అనంత్ నడిపించారు'' అని మింత్రా ఓ ప్రకటనలో పేర్కొంది. తమ విలువైన కస్టమర్లకు సేవలు అందించేందుకు మింత్రా, జబాంగ్ ఫ్లిప్‌కార్ట్‌లో ముఖ్యమైన విభాగాలుగా కొనసాగుతాయని పేర్కొంది.

'ఓలా'లో సచిన్ బన్సల్ రూ.150 కోట్ల పెట్టుబడి



న్యూఢిల్లీ: ఫ్లిప్‌కార్ట్ సహ వ్యవస్థాపకుడు సచిన్ బన్సల్ ప్రముఖ ట్యాక్సీ ప్లాట్ ఫామ్ ఓలాలో రూ.150 కోట్లు పెట్టుబడి పెట్టారు. కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ వద్ద కంపెనీ సమర్పించిన పత్రాల్లో ఈ మేరకు వివరాలు ఉన్నాయి. 70,588 తప్పనిసరిగా మార్చుకోవాల్సిన క్యుములేటివ్ సిరీస్ జే ప్రిఫరెన్స్ షేర్లను (ముఖ విలువ ఒక్కోటీ రూ.10) సబ్‌స్క్రిప్షన్ ధర రూ.21,250 చొప్పున ఆయనకు కేటాయించినట్టు ఓలా ఆ పత్రాల్లో తెలియజేసింది. ఈ మొత్తం విలువ రూ.150 కోట్లు అవుతుంది. ఫ్లిప్‌కార్ట్‌ను అమెరికా దిగ్గజం వాల్‌మార్ట్ కొనుగోలు చేసిన తర్వాత ఆ సంస్థలో తన వాటాను పూర్తిగా విక్రయించి సచిన్ బన్సల్ బయటకు వచ్చిన విషయం తెలిసిందే. కాగా, విశ్వసనీయ వర్గాలు వెల్లడించిన సమాచారం మేరకు... సచిన్ బన్సల్ రూ.650 కోట్లను ఓలాలో ఇన్వెస్ట్ చేయనున్నట్టు, రూ.150 కోట్లు అందులో భాగమని తెలిసింది.

రేట్ల కోతకు 'ధర'ల ఊతం!!

- డిసెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 2.19 శాతం
- 18 నెలల కనిష్టం ● టోకు ధరలదీ దిగువబాటే!
- ఎనిమిది నెలల కనిష్ట స్థాయి... 3.80 శాతానికి డౌన్
- ఆర్‌బీఐ వడ్డీరేట్ల కోతకు అవకాశమంటున్న పరిశ్రమలు



న్యూఢిల్లీ: ధరల భయాలు డిసెంబర్‌లో తక్కువగా ఉన్నాయని సోమవారం విడుదలైన అధికారిక గణాంకాలు పేర్కొన్నాయి. ఈ నెలలో టోకు, రిటైల్ ద్రవ్యోల్బణం రెండూ తగ్గుముఖం పట్టాయని లెక్కలు వెల్లడించాయి. దీనితో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటు (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు– ప్రస్తుతం 6.50) తగ్గింపునకు ఇది అవకాశమని పారిశ్రామిక వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. తద్వారా దేశ ఆర్థిక వృద్ధికి దోహదపడాలని కోరుతున్నాయి. నవంబర్ పారిశ్రామిక ఉత్పత్తి ఏడు నెలల కనిష్ఠ స్థాయి అరశాతంగా నమోదయిన విషయాన్ని పారిశ్రామిక వర్గాలు ప్రస్తావిస్తూ, ఈ రంగానికి చేయూత నివ్వాల్సిన తక్షణ అవసరాన్ని ఉద్ఘాటిస్తున్నాయి. జనవరి–మార్చికి సంబంధించి డీఅండ్‌బీ వ్యాపార ఆశావహ పరిస్థితి కూడా ఇక్కడ గమనార్హం. కొత్త గవర్నర్ శక్తికాంత్ దాస్ నేతృత్వంలోని ద్రవ్య పరపతి విధాన కమిటీ ఫిబ్రవరి 7వ తేదీన ద్వైమాసిన ద్రవ్య పరపతి విధానాన్ని ప్రకటించనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో విడుదలైన స్థూల ఆర్థిక గణాంకాలను చూస్తే...

వరుసగా రెండవ నెల తగ్గిన టోకు ధరలు

- వరుసగా రెండు నెలల నుంచీ తగ్గిన టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం గణాంకాలు రేటు కోత అవకాశాలపై పారిశ్రామిక వర్గాల్లో ఆశావహ స్థితిని సృష్టిస్తున్నాయి. అక్టోబర్‌లో టోకు ద్రవ్యోల్బణం పెరుగుదల రేటు 5.54 శాతం ఉంటే, నవంబర్‌లో 4.64 శాతంగా నమోదయ్యింది.
- **మొత్తంగా...:** 2018 డిసెంబర్‌లో (2017 ఇదే నెల ధరలతో పోల్చి) టోకు వస్తువుల బాస్కెట్ ధర కేవలం 3.80 శాతమే పెరిగింది. అంతక్రితం ఎనిమిది నెలల్లో ఇంత తక్కువ స్థాయిలో టోకు ధరల నమోదు ఇదే తొలిసారి. ఇంధనం, కొన్ని ఆహార ఉత్పత్తుల ధరలు టోకున తగ్గడం దీనికి ప్రధాన కారణం.
- **ప్రైమరీ ఆర్టికల్స్:** సూచీలో ఆహార, ఆహారేతర ఉత్పత్తులకు సంబంధించిన ఈ విభాగంలో పెరుగుదల రేటు 2.28 శాతంగా నమోదయ్యింది. 2017 ఇదే నెలలో ఈ రేటు 3.86 శాతం.

ఇక ఇందులో ఒక్క ఆహార విభాగాన్ని చూసుకుంటే పెరుగుదల అసలు లేకపోగా -0.07 శాతం తగ్గుదల నమోదయ్యింది. 2017 ఇదే నెలలో ఈ విభాగంలో ధరల పెరుగుదల రేటు 4.72 శాతం. కూరగాయల ధరలు వరుసగా ఆరు నెలల నుంచీ తగ్గుతూ వస్తున్నాయి. నవంబర్‌లో పెరుగుదల రేటు 26.98 శాతం ఉంటే, డిసెంబర్‌లో ఈ రేటు 17.55 శాతంగా ఉంది. టమోటా ధరలు నవంబర్‌లో పెరుగుదల రేటు 88 శాతంగా ఉంటే, డిసెంబర్‌లో 49 శాతానికి తగ్గాయి. ఇక పప్పు దినుసుల పెరుగుదల రేటు 2.1 శాతంగా ఉంది. గుడ్లు, మాంసం, చేపల ధరల పెరుగుదల రేటు 4.55 శాతం. ఉల్లిపాయల ధరలు మాత్రం 64 శాతం తగ్గాయి.

అయితే నాన్ ఫుడ్ ఆర్టికల్స్ విషయంలో మాత్రం ద్రవ్యోల్బణం 4.45 శాతం పెరిగింది. 2017 డిసెంబర్‌లో ఇది క్షీణతలో -0.17శాతంగా నమోదయ్యింది.

- **ఇంధనం, విద్యుత్:** ఈ విభాగంలో రేటు 8.03 శాతం నుంచి 8.38 శాతానికి ఎగిసింది. 2018 నవంబర్‌లో ఈ రేటు ఏకంగా 16.28 శాతం ఉండటం గమనార్హం.
- **తయారీ:** మొత్తం సూచీలో దాదాపు 60% వాటా ఉన్న తయారీ రంగంలో ధరల పెరుగుదల వార్షికంగా 2.79% నుంచి 3.59%కి పెరిగింది. అయితే నెలవారీగా చూస్తే, నవంబర్‌లో ఈ రేటు 4.21%.

రిటైల్‌గా చూసినా తగ్గిన ధరల స్పీడ్..

ఇక వినియోగ ధరల సూచీ(సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం పెరుగుదల రేటు 2018 డిసెంబర్‌లో 2.19%. అంటే 2017 ఇదే నెలతో పోల్చితే రిటైల్‌గా ధరల బాస్కెట్ 2.19% పెరిగిందన్నమాట. గడచిన 18 నెలల్లో ఇంత తక్కువ స్థాయిలో రిటైల్ ధరలు పెరగడం ఇదే తొలిసారి. పండ్లు, కూరగాయలు, ఇంధనం ధరల స్పీడ్ తగ్గడం ఇందుకు ప్రధానంగా దోహదపడింది. 2018 నవంబర్‌లో రిటైల్ ధరల స్పీడ్ 2.33 శాతం ఉండగా, డిసెంబర్‌లో 5.21 శాతంగా నమోదయ్యింది. గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం– ఆహార ఉత్పత్తుల ధరలు పెరక్కపోగా -2.51 శాతం తగ్గాయి. ఇంధనం, లైట్ ద్రవ్యోల్బణం స్పీడ్ 7.39%(నవంబర్‌లో) నుంచి 4.54%కి (డిసెంబర్) తగ్గింది.

వ్యాగన్‌ఆర్ బుకింగ్స్ షురూ

ప్రారంభ చెల్లింపు ధర రూ.11,000



న్యూఢిల్లీ: ఈనెల 23న మార్కెట్లోకి విడుదలకానున్న వ్యాగన్‌ఆర్ కొత్త వేరియంట్ బుకింగ్స్‌ను ప్రారంభించినట్లు మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) ప్రకటించింది. కంపెనీ వెబ్‌సైట్‌లో ఇనీషియల్ పేమెంట్ కింద రూ.11,000 చెల్లించడం ద్వారా ఈ మూడవతరం వ్యాగన్‌ఆర్‌ను బుక్ చేసుకోవచ్చని సూచించింది. ఈ కారును 'బిగ్ న్యూ వ్యాగన్‌ఆర్'గా అభివర్ణించిన సంస్థ.. 1.2 లీటర్ల పెట్రోల్ ఇంజిన్ నూతన వేరియంట్‌లో ఉందని, మరో ఆప్షన్‌లో భాగంగా 1–లీటర్ ఇంజిన్‌ను కూడా అందిస్తున్నట్లు తెలిపింది. ఐదవ తరం హ్యాచ్‌బ్యాక్ ప్లాట్‌ఫాంపై అభివృద్ధి చెందిన ఈకారు సురక్షితంగా ఉంటుందని వ్యాఖ్యానించింది. హై టెన్షన్ స్టీలును వాడటం వల్ల నూతన వేరియంట్‌లో శబ్దం, కుదుపులు తక్కువగా ఉంటాయని తెలిపింది.

మహీంద్రా కొత్త 'మరాజో'

ధర రూ.13.9 లక్షలు



న్యూఢిల్లీ: మహీంద్రా అండ్ మహీంద్రా మరాజో నూతన వేరియంట్‌ను సోమవారం మార్కెట్లోకి విడుదల చేసింది. ఇటీవల విడుదలచేసిన సరికొత్త యుటిలిటీ ప్యాసింజర్ వాహనంలో 7–సీట్లు ఉండగా.. ఈ నూతన వేరియంట్‌లో 8–సీట్లు ఉన్నట్లు కంపెనీ వెల్లడించింది. గత మోడల్ కంటే, ఈకారు ధర రూ.8,000 అధికంగా నిర్ణయించినట్లు తెలిపింది. ఏడు అంగుళాల టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, డైనమిక్ గైడెన్స్‌తో కూడిన రివర్స్ పార్కింగ్ కెమెరా, 17–అంగుళాల అల్లాయ్ వీల్స్ వంటి ప్రత్యేకతలు కలిగిన ఈ వేరియంట్ ధర రూ. 13.9 లక్షలుగా నిర్ణయించినట్లు తెలియజేసింది. ఈ సందర్భంగా సంస్థ సేల్స్ అండ్ మార్కెటింగ్ చీఫ్ విజయ్ నక్రా మాట్లాడుతూ.. 'ఎం8 వేరియంట్‌లో 8–సీట్ల ఆప్షన్ ఉండడం వల్ల మరాజో మోడల్ మరింత విస్తరించనుంది' అని వ్యాఖ్యానించారు.

కుంభమేళాలో ఎయిర్‌టెల్ ప్రీ-5జీ సేవలు



న్యూఢిల్లీ: అలహాబాద్ కుంభమేళాలో ప్రీ–5జీ నెట్‌వర్క్ టెక్నాలజీతో మొబైల్ సేవలు అందించనున్నట్లు టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ వెల్లడించింది. కుంభమేళాకు లక్షల మంది భక్తులు వచ్చే నేపథ్యంలో స్థానికంగా తమ మొబైల్ నెట్‌వర్క్‌ను మరింత పటిష్టం చేస్తున్నట్లు పేర్కొంది. నెట్‌వర్క్ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచే మాసివ్ మిమో టెక్నాలజీని ఇందుకోసం ఉపయోగిస్తున్నట్లు వివరించింది. కొత్త మొబైల్ సైట్ల ఏర్పాటు ప్రక్రియ ఈ వారంలో ప్రారంభమవుతుందని ఎయిర్‌టెల్ పేర్కొంది. గతేడాది ప్రధాన ఐపీఎల్ మ్యాచ్‌లు జరిగిన స్టేడియంలలో కూడా ఈ టెక్నాలజీని ఉపయోగించినట్లు వివరించింది. జనవరి 15 నుంచి మార్చి 4 దాకా అలహాబాద్ కుంభమేళా జరగనుంది.

ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థలకు ప్రోత్సాహకాలు

రుణ హామీ, వడ్డీ సబ్సిడీ కల్పించే యోచనలో కేంద్రం



న్యూఢిల్లీ: దేశీయంగా ఎలక్ట్రానిక్ తయారీ సంస్థలను ప్రోత్సహించే దిశగా కొత్త విధానంపై కేంద్రం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా రూ. 100 కోట్ల దాకా టర్మ్ రుణాలకు హామీనివ్వడం, రూ. 1,000 కోట్ల దాకా రుణాలకు సంబంధించి వడ్డీ సబ్సిడీనివ్వడం తదితర అంశాలను పరిశీలిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. 'కొత్త ఎలక్ట్రానిక్స్ తయారీ యూనిట్ ఏర్పాటు కోసం గానీ.. ఇప్పటికే ఉన్న ప్లాంటు విస్తరణ కోసం గానీ రూ. 100 కోట్ల దాకా పెట్టుబడి అవసరమయ్యే ప్రాజెక్టులకు రుణ హామీ ఇచ్చే ప్రతిపాదన ఉంది. దీనికోసం తనఖా, థర్డ్ పార్టీ గ్యారంటీ అవసరం ఉండదు' అని పేర్కొన్నాయి. ప్రతిపాదన ప్రకారం జారీ అయిన రుణంలో 50 శాతం దాకా మొత్తానికి ప్రభుత్వం రుణ హామీ కవరేజీ ఇస్తుందని వివరించాయి. ఇందుకోసం కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ ప్రత్యేక ఫండ్ దాదాపు రూ. 1,000 కోట్లతో ఏర్పాటు చేస్తుందని తెలిపాయి. స్పందనను బట్టి ఆ తర్వాత ఏడాది ఈ స్కీమును సమీక్షించవచ్చని అధికారులు వివరించారు. ఇక, అంతర్జాతీయ స్థాయిలో ఆమోదయోగ్యమైన వడ్డీ రేట్లకు రుణాలు లభించేలా చర్యలు తీసుకోవాలన్న ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుంటూ, వడ్డీ సబ్సిడీ అంశాన్ని పరిశీలిస్తోంది. ప్రస్తుతం ఇతర దేశాల్లో వడ్డీ రేట్లు 5–7% ఉంటుండగా... దేశీయంగా ఎలక్ట్రానిక్స్ సంస్థలు టర్మ్ లోన్స్‌పై 11–12% వడ్డీ చెల్లిస్తున్నాయి. దీంతో 4–6% సబ్సిడీ రాయితీ కల్పించాలని కేంద్రాన్ని కోరుతున్నాయి. పదేళ్ల దాకా కాలవ్యవధికి రూ. 1,000 కోట్ల దాకా రుణాలపై వడ్డీ సబ్సిడీ కల్పించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని అధికారులు చెప్పారు. అంతకు మించిన రుణ మొత్తం తీసుకున్నా ఇందుకోసం దరఖాస్తు చేసుకోవచ్చని.. కానీ గరిష్టంగా రూ. 1,000 కోట్లకు మాత్రమే వడ్డీ రాయితీ లభించవచ్చని పేర్కొన్నారు. ఫాక్స్‌కాన్, ఫ్లెక్స్ వంటి సంస్థలకూ దీనికి అర్హత ఉంటుందని పేర్కొన్నారు.

ఈ-కామర్స్ నిబంధనలతో ఆఫ్‌లైన్ రిటైలర్లకు లబ్ధి

రూ. 12,000 కోట్ల దాకా పెరగనున్న ఆదాయాలు



న్యూఢిల్లీ: ఈ–కామర్స్ సంస్థల నిబంధనలను కఠినతరం చేయడం వల్ల ఆఫ్‌లైన్ రిటైలర్లకు (బీఎం రిటైల్ స్టోర్స్) గణనీయంగా ప్రయోజనం చేకూరనుందని రేటింగ్స్ ఏజెన్సీ క్రిసిల్ తెలిపింది. 2020 ఆర్థిక సంవత్సరంలో బీఎం రిటైల్ స్టోర్స్ ఆదాయం 150–200 బేసిస్ పాయింట్ల మేర పెరగొచ్చని, విలువపరంగా చూస్తే ఇది సుమారు రూ. 10,000–12,000 కోట్ల మేర ఉండొచ్చని పేర్కొంది. కొత్త నిబంధనలకు అనుగుణంగా ఈ–కామర్స్ సంస్థలు తమ వ్యాపార విధానాలను మార్చుకోవాల్సి రానుండటం, ఫలితంగా వాటి ఆదాయాలు మందగించనుండటం ఇందుకు కారణం కాగలవని వివరించింది. విదేశీ పెట్టుబడులున్న ఈ–కామర్స్ సంస్థలు తమకు వాటాలున్న ఇతర సంస్థల ఉత్పత్తులను సొంత ప్లాట్‌ఫాంలపై విక్రయించకుండా ప్రభుత్వం నిబంధనలు కఠినతరం చేసిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానున్న ఈ నిబంధనలు.. ప్రధానంగా పెద్ద సంస్థలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లపై గట్టిగా ప్రభావం చూపనున్నాయి. కఠినతర నిబంధనల కారణంగా ఈ–కామర్స్ పరిశ్రమ అమ్మకాలు సుమారు 35–40% మేర (దాదాపు రూ. 35,000– 40,000 కోట్లు) దెబ్బతినొచ్చని క్రిసిల్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ అనుజ్ సేఠి చెప్పారు.

దుస్తులు, ఎలక్ట్రానిక్స్‌పై ప్రభావం..

ఈ–కామర్స్ కంపెనీల ఆదాయాల్లో అత్యధిక వాటా ఉండే దుస్తులు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులపై ఎక్కువగా ప్రభావం పడొచ్చని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ ఈ–టెయిలర్స్ నష్టపోయే ఆదాయాల్లో కనీసం నాలుగో వంతు వాటానైనా ఆఫ్‌లైన్ రిటైలర్లు అందిపుచ్చుకోగలిగితే వాటి ఆదాయాలు దాదాపు రూ. 10,000–12,000 కోట్ల మేర పెరగొచ్చని సేఠి తెలిపారు. 2014–18 మధ్యకాలంలో ఈ–కామర్స్ వ్యాపారం ఏటా 40 శాతం వృద్ధితో రూ. 1 లక్ష కోట్లకు చేరింది. అదే సమయంలో ఆఫ్‌లైన్ రిటైలర్ల వ్యాపారం కేవలం 13 శాతం వృద్ధితో రూ. 3.2 లక్షల కోట్లకు చేరింది. గడిచిన నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో ఏకంగా రూ. 95,000 కోట్ల పైగా విదేశీ పెట్టుబడులు రావడం ఈ–కామర్స్ సంస్థలకు ఊతంగా నిల్చిందని క్రిసిల్ రేటింగ్స్ డైరెక్టర్ గౌతమ్ షాహి చెప్పారు. ఆఫ్‌లైన్ రిటైలర్లతో పోలిస్తే ఈ–కామర్స్ సంస్థలు ఆకర్షణీయమైన రేట్లతో మార్కెట్లోకి చొచ్చుకుపోయాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కఠిన నిబంధనలతో ఈ సంస్థలు కాస్త ఇబ్బందిపడినా.. దీర్ఘకాలంలో వృద్ధి అవకాశాలు మెరుగ్గానే ఉన్నాయని అభిప్రాయపడ్డారు.

మళ్లీ మార్కెట్లోకి లాంబ్రెటా!

- 2020 ఆటో ఎక్స్‌పోలో ఎలక్ట్రిక్ వెర్షన్ ఆవిష్కరణ
- భారత కోసం సూపర్ లాంబ్రెటాపై కసరత్తు
- ప్రీమియం సెగ్మెంట్‌పై కంపెనీ దృష్టి



దేశీ ద్విచక్ర వాహనాల మార్కెట్లో ప్రస్తుతం రెట్రో ట్రెండ్ నడుస్తోంది. గతంలో ఓ వెలుగు వెలిగి.. కనుమరుగైపోయిన పాత బ్రాండ్స్ ఒక్కొక్కటిగా మళ్లీ తిరిగొస్తున్నాయి. ఇటీవలే జావా మోటార్ సైకిల్ రీఎంట్రీ ఇవ్వగా .. తాజాగా సుమారు మూడు దశాబ్దాల తర్వాత స్కూటర్ బ్రాండ్ లాంబ్రెటా కూడా పునరాగమనానికి సిద్ధమవుతోంది. లాంబ్రెటా తయారీ సంస్థ ఇన్నోసెంటి ఈ విషయం తెలియజేసింది. 2020లో జరిగే ఢిల్లీ ఆటో ఎక్స్‌పోలో లాంబ్రెటా ఎలక్ట్రిక్ స్కూటర్ నమూనాను ప్రదర్శించనున్నట్లు తెలిపింది. భారత మార్కెట్ కోసం ప్రత్యేకంగా ఉక్కుతో తయారు చేసే సూపర్ లాంబ్రెటాను డిజైన్ చేసే ఆలోచనలో ఉన్నట్లు వెల్లడించింది. ప్రస్తుత లాంబ్రెటాతో పోలిస్తే పరిమాణంలో మరింత పెద్దగా ఉండే సూపర్ లాంబ్రెటా డిజైనింగ్ ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. ఎక్స్‌పోలో ప్రదర్శించబోయే లాంబ్రెటా ఎలక్ట్రిక్ ప్రస్తుతం మిలన్‌లో రూపుదిద్దుకుంటోంది. ప్రత్యర్థి సంస్థ పియాజియో వెస్పా ఎలట్రికా స్కూటర్‌కు పోటీగా దీన్ని ప్రవేశపెట్టే ప్రయత్నాల్లో ఇన్నోసెంటి ఉంది. లాంబ్రెటా ఉత్పత్తులను గతంలో స్కూటర్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఐఎల్) భారత్‌లో విక్రయించేది. అప్పట్లో లాంబ్రెటా స్కూటర్స్‌ను విజయ్ సూపర్ పేరుతో, త్రిచక్రవాహనాలను విక్రమ్ పేరుతో ఉత్పత్తి చేసింది. 1997లో లాంబ్రెటా స్కూటర్స్ తయారీని పూర్తిగా నిలిపివేసిన ఎస్ఐఎల్ ఆ తర్వాత పూర్తిగా త్రిచక్ర వాహనాల ఉత్పత్తికే పరిమితమైంది. స్కూటర్ ఇండియాతో ట్రేడ్‌మార్క్ వివాదాలను పరిష్కరించుకుంటున్న ఇన్నోసెంటి మళ్లీ ఇన్నాళ్లకు లాంబ్రెటాను అందుబాటులో తేబోతోంది.

లోహియా ఆటోతో జట్టు..

భారత్‌లో లాంబ్రెటాల తయారీ కోసం నోయిడా కేంద్రంగా పనిచేసే లోహియా ఆటోతో ఇన్నోసెంటి జట్టు కట్టింది. ప్లాంటుపై కసరత్తు కూడా జరుగుతోంది. ముంబైకి దగ్గర్లో... పుణె పారిశ్రామిక ప్రాంతంలో దీన్ని ఏర్పాటు చేయొచ్చన్న అంచనాలు ఉన్నాయి. ఆటోమొబైల్ దిగ్గజాలైన టాటా మోటార్స్, బజాజ్ ఆటో, మహీంద్రా అండ్ మహీంద్రా, మెర్సిడెస్ బెంజ్, ఫోక్స్‌వ్యాగన్ మొదలైన వాటి ప్లాంట్లు కూడా ఇదే ప్రాంతంలో ఉన్నాయి. భారత్‌లో ఏర్పాటు చేసే ప్లాంటులో ఇటు దేశీ మార్కెట్‌తో పాటు అటు పొరుగుదేశాలు, ఆఫ్రికా మార్కెట్‌కి కూడా అవసరమైన స్థాయిలో స్కూటర్లు తయారు చేయాలని కంపెనీ భావిస్తోంది.

ప్రీమియం మార్కెట్..

విలాసవంతమైన లాంబ్రెటా స్కూటర్లతో ప్రీమియం సెగ్మెంట్ కస్టమర్ల దృష్టిని ఆకర్షించాలని ఇన్నోసెంటి భావిస్తోంది. ఇటాలియన్ డిజైన్‌లోని సృజనాత్మకతతో యువ కస్టమర్లకు చేరువ కావాలని యోచిస్తోంది. అయితే, అప్పట్లో బజాజ్ చేతక్, వెస్పాలతో పోటీలో చాలా దూరంలో ఉండిపోయిన లాంబ్రెటాకు ఇది సాధ్యపడుతుందా? అన్న సందేహాలూ వ్యక్తమవుతున్నాయి. కానీ, ఇన్నోసెంటి టార్గెట్ చేసుకుంటున్న ప్రీమియం విభాగంలో ప్రస్తుతం గణనీయంగా వ్యాపార అవకాశాలున్నాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. కొనుగోలుదారులను ఆకర్షించగలిగే ఫీచర్స్ లాంబ్రెటాలో పుష్కలంగా ఉంటాయంటున్నాయి. ఇందుకు జావాకి వచ్చిన బుకింగ్సే ఉదాహరణ అని చెబుతున్నాయి. వింటేజ్ బ్రాండ్‌గా రాయల్ ఎన్‌ఫీల్డ్ కూడా మంచి సక్సెస్ సొంతం చేసుకుందని పేర్కొన్నాయి. మైలేజీతో సంబంధం లేకుండా రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లను రోజువారీ పనులపై తిరిగేందుకు ఉపయోగించే వారి సంఖ్య కూడా గణనీయంగానే ఉంటోంది. అయితే, వెస్పా క్రమక్రమంగా అమ్మకాలు పెంచుకుంటున్నప్పటికీ.. ఇంకా చెప్పుకోతగ్గ స్థాయిలో మార్కెట్‌లో పట్టు సాధించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రీమియం సెగ్మెంట్‌లో అడుగుపెట్టాలనుకుంటున్నా లాంబ్రెటా పరిస్థితి ఎలా ఉంటుందనేది ఇప్పుడే చెప్పలేమనేది కొన్ని వర్గాల మాట!!

ఐసీఐసీఐ సెక్యూరిటీస్ లాభం 34 శాతం డౌన్

న్యూఢిల్లీ: ఐసీఐసీఐ సెక్యూరిటీస్ కంపెనీ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలానికి 34 శాతం తగ్గింది. గత క్యూ3లో రూ.154 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.101 కోట్లకు తగ్గిందని ఐసీఐసీఐ సెక్యూరిటీస్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.494 కోట్ల నుంచి 18 శాతం తగ్గి రూ.405 కోట్లకు చేరిందని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పలు సమస్యలు తమ వ్యాపారంపై ప్రభావం చూపాయని వివరించింది. స్టాక్ మార్కెట్ తీవ్రమైన ఒడిదుడుకుల్లో ఉండటం, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల లిక్విడిటీ కష్టాలు, కంపెనీల ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్లు(ఐపీఓ)లు అంతంత మాత్రంగానే ఉండటం, మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీ తీసుకున్న కఠిన నిర్ణయాలు... ఇవన్నీ ఇన్వెస్టర్ల సెంటిమెంట్, తమ వ్యాపారంపై ప్రతికూల ప్రభావం చూపాయని ఐసీఐసీఐ సెక్యూరిటీస్ తెలిపింది. ఆర్థిక ఫలితాలు వెల్లడి కానున్న నేపథ్యంలో బీఎస్ఈలో ఐసీఐసీఐ సెక్యూరిటీస్ షేర్ 1.3 శాతం క్షీణించి రూ. 276 వద్ద ముగిసింది.

టాటా మెటాలిక్స్ ఆదాయం రూ.548 కోట్లు

న్యూఢిల్లీ: టాటా మెటాలిక్స్ కంపెనీ ఈ ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసిక కాలంలో రూ.39.6 కోట్ల నికర లాభం సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో రూ.40 కోట్ల నికర లాభం సాధించామని, 2% క్షీణించిందని టాటా మెటాలిక్స్ తెలిపింది. మొత్తం ఆదాయం మాత్రం రూ.490 కోట్ల నుంచి 12% వృద్ధితో రూ.548 కోట్లకు పెరిగిందని పేర్కొంది. టాటా స్టీల్ అనుబంధ కంపెనీ అయిన టాటా మెటాలిక్స్ కంపెనీ పిగ్ ఐరన్, డక్టైల్ ఐరన్ పైప్స్‌ను తయారు చేస్తోంది. నికర లాభం 2% తగ్గడంతో బీఎస్ఈలో టాటా మెటాలిక్స్ షేర్ 2% తగ్గి రూ.637 వద్ద ముగిసింది.

భెల్‌కు సింగరేణి కాలరీస్ నుంచి రూ.565 కోట్ల ఆర్డర్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ కంపెనీ భెల్‌కు సింగరేణి కాలరీస్ కంపెనీ నుంచి రూ.565 కోట్ల భారీ ఆర్డర్ లభించింది. తెలంగాణలో నాలుగు చోట్ల సోలార్ ఫొటోఓల్టాయిక్ (ఎస్‌పీవీ) విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసే ఈ ఆర్డర్‌ను పొందామని భెల్ తెలిపింది. ఎస్‌పీవీ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించి తాము సాధించిన అతి పెద్ద ఆర్డర్ ఇదేనని పేర్కొంది. తెలంగాణలోని నాలుగు ప్రాంతాల్లో ఈ ఎస్‌పీవీ ప్లాంట్లను ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) ప్రాతిపదికన ఏర్పాటు చేస్తామని వివరించింది. ఈ ఆర్డర్‌లో భాగంగా రామగుండంలో 50 మెగావాట్ల ఎస్‌పీవీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నామని, అలాగే ఇల్లెందు (39 మె.వా.), మణుగూరు(30 మె.వా.), పగిడపల్లి(10మె.వా)ల్లో ఎస్‌పీవీ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని పేర్కొంది.

పడేసిన పారిశ్రామిక గణాంకాలు

- ప్రపంచ మార్కెట్లకు చైనా దెబ్బ
- 17 నెలల కనిష్టానికి ఐఐపీ
- పతన బాటలో రూపాయి
- 36,000 పాయింట్ల దిగువకు సెన్సెక్స్
- 156 పాయింట్ల నష్టంతో 35,854 వద్ద ముగింపు
- 57 పాయింట్లు క్షీణించి 10,738కు నిఫ్టీ



పారిశ్రామికోత్పత్తి గణాంకాలు నిరాశపరచడంతో సోమవారం స్టాక్ మార్కెట్ నష్టాల్లో ముగిసింది. చైనా దిగుమతి, ఎగుమతి గణాంకాలు కూడా బలహీనంగా ఉండటంతో ప్రపంచ మార్కెట్లు పతనమవడం, డాలర్‌తో రూపాయి మారకం క్షీణించడం కూడా ప్రతికూల ప్రభావం చూపించాయి. అయితే చివరి గంటలో కొనుగోళ్లు జరగడంతో నష్టాలు ఒకింత తగ్గాయి. బీఎస్ఈ సెన్సెక్స్ కీలకమైన 36,000 పాయింట్ల దిగువకు, నిఫ్టీ సాంకేతికంగా కీలకమైన 10,750 పాయింట్ల దిగువకు పతనమయ్యాయి. స్టాక్ సూచీలు వరుసగా మూడవ ట్రేడింగ్ సెషన్‌లోనూ నష్టపోయాయి. సెన్సెక్స్ 156 పాయింట్లు నష్టపోయి 35,854 పాయింట్ల వద్ద, నిఫ్టీ 57 పాయింట్లు పతనమై 10,738 పాయింట్ల వద్ద ముగిశాయి. బ్యాంక్, లోహ, మౌలిక రంగ షేర్లు నష్టపోగా, ఫార్మా షేర్లు పెరిగాయి.

ప్రపంచ మార్కెట్ల పతనం....

చైనా దిగుమతులు డిసెంబర్‌లో 7.6 శాతం, ఎగుమతులు 4.4 శాతం మేర తగ్గాయి. దీంతో ప్రపంచంలోనే రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన చైనాలో మందగమనం చోటు చేసుకుందని, ఇది ప్రపంచ ఆర్థిక మందగమనానికి దారితీస్తుందన్న ఆందోళన నెలకొన్నది. దీనికి తోడు 21 వ రోజూ అమెరికా షట్‌డౌన్ కొనసాగడం, బ్రెగ్జిట్‌పై యూకేలో నేడు (మంగళవారం) ఓటింగ్ జరగనుండడం నేపథ్యంలో ప్రపంచ మార్కెట్లు పతనమయ్యాయి. జపాన్ మినహా ఇతర ఆసియా మార్కెట్లు, యూరప్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. మన దగ్గర పారిశ్రామికోత్పత్తి 17 నెలల కనిష్ట స్థాయికి పడిపోవడం, ఇప్పటివరకూ వెల్లడైన క్యూ3 ఫలితాలు అంతంత మాత్రంగానే ఉండటం, డాలర్‌తో రూపాయి మారకం విలువ 43 పైసలు క్షీణించి నెల కనిష్టానికి చేరడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.

433 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్...

సెన్సెక్స్ లాభాల్లో ఆరంభమైనా, వెంటనే నష్టాల్లోకి జారిపోయింది. ఒక దశలో 115 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్ మరో దశలో 318 పాయింట్లు నష్టపోయింది. మొత్తం మీద రోజంతా 433 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. చివర్లో కొనుగోళ్ల దన్నుతో నష్టాలు రికవరీ అయ్యాయి. ఇంట్రాడే కనిష్ట స్థాయి నుంచి చూస్తే, సెన్సెక్స్ 180 పాయింట్లు, నిఫ్టీ 50 పాయింట్ల మేర రికవరీ అయ్యాయి.

- ఎమ్‌డీ, సీఈఓ పదవుల నుంచి ఈ నెల 31న వైదొలగనున్న రాణా కపూర్ వారసుడిగా రెండు పేర్లను యస్‌బ్యాంక్ షార్ట్ లిస్ట్ చేసింది. నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా బ్రహ్మదత్ పేరు ఖరారు కావడం కూడా సానుకూల ప్రభావం చూపడంతో ఈ షేర్ 6.2 శాతం లాభంతో రూ.195 వద్ద ముగిసింది. సెన్సెక్స్, నిఫ్టీల్లో బాగా లాభపడిన షేర్ ఇదే.
- ఇతర ఐటీ షేర్లు తగ్గినా... ఇన్ఫోసిస్ 2.5% లాభంతో రూ.701 వద్ద ముగిసింది. ఈ కంపెనీ క్యూ3 ఫలితాలు అంతంతమాత్రంగానే ఉన్నా, ఈ ఆర్థిక సంవత్సర ఆదాయ అంచనాలు బాగా ఉండటం, రూ.800 ధరకు షేర్ల బైబ్యాక్‌ను ప్రకటించడం, ఒక్కో షేర్‌కు రూ.4 ప్రత్యేక డివిడెండ్‌ను ప్రకటించడం సానుకూల ప్రభావం చూపించాయి.

గురువారం స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	2,735
ఎన్ఎస్ఈ	24,924
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	5,04,355
ఎఫ్ఐఐ	- 732
డీఐఐ	527

నిఫ్టీ 50

టాప్ 10 గెయినర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
YESBANK	195	5.83
INFY	701.3	2.6
SUNPHARMA	451.5	1.6
BAJFINANCE	2,551.00	1.46
MARUTI	7,425.00	1.43
TATAMOTORS	182.4	1.16
INFRATEL	280.15	1.06
IOC	132.15	0.72
CIPLA	513.25	0.6
ULTRACEMCO	3,776.40	0.16

టాప్ 10 లూజర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
WIPRO	312.5	-4.93
GAIL	325.2	-3.96
IBULHSGFIN	789.45	-3.27
TECHM	679.85	-2.77
LT	1,334.50	-2.56
INDUSINDBK	1,483.25	-2.11
UPL	769	-1.84
VEDL	193	-1.83
JSWSTEEL	283.9	-1.7
NTPC	145.7	-1.55

భారీగా పెరిగిన పీఈ, వీసీ పెట్టుబడులు

- 2018లో 2.45 లక్షల కోట్ల రాక
- అంతకుముందు ఏడాదితో పోలిస్తే 35 శాతం వృద్ధి

ముంబై: ప్రైవేటు ఈక్విటీ(పీఈ), వెంచర్ క్యాపిటల్ (వీసీ) పెట్టుబడులు గతేడాది భారీ ఎత్తున వచ్చాయి. 2017లో 26.1 బిలియన్ డాలర్లు ఈ రూపంలో రాగా, 2018లో ఏకంగా 35 శాతం అధికంగా 35.1 బిలియన్ డాలర్ల (రూ.2,45,700 కోట్లు) మేర పెట్టుబడులు తరలివచ్చాయి. భారీ డీల్స్ 2017లో చోటు చేసుకోవడమే ఈ వృద్ధికి కారణం. ఇక పీఈ/వీసీల పెట్టుబడుల ఉపసంహరణ విలువ 2018లో 26 బిలియన్ డాలర్ల (రూ.1,82,000 కోట్లు) మేర ఉంది. ఇది క్రితం సంవత్సరం స్థాయిలోనే ఉంది. ‘‘పీఈ/వీసీ పెట్టుబడులు, ఉపసంహరణలకు 2018 మంచి సంవత్సరం. మేము ముందుగా అంచనా వేసిన విధంగానే పీఈ, వీసీల పెట్టుబడులు, ఉపసంహరణలు 2018లో నూతన రికార్డు స్థాయికి చేరాయి’’అని ఈవై పార్ట్‌నర్ వివేక్‌సోని తమ నివేదికలో తెలిపారు. స్టాక్ మార్కెట్లలో అస్థిరత వల్ల 2018 ద్వితీయ భాగంలో ప్రైవేటు పెట్టుబడులకు విఘాతం కలిగినప్పటికీ... కొనుగోళ్లు, స్టార్టప్ యాక్టివిటీతో ఈ ప్రభావం తగ్గిపోయిందని వివరించారు.

డీల్స్ వివరాలు...

- 2018లో 500 మిలియన్ డాలర్లు (రూ.3,500 కోట్లు), అంతకంటే ఎక్కువ విలువ కలిగిన 12 డీల్స్ జరిగాయి. ఇందులో ఎనిమిది డీల్స్ విలువ ఒక్కోటీ బిలియన్ డాలర్లపైనే ఉండడం గమనార్హం.




- 76 ఒప్పందాల విలువ 100 మిలియన్ డాలర్ల (రూ.700 కోట్లు) కంటే ఎక్కువ ఉంది. వీటి మొత్తం విలువ 25.9 బిలియన్ డాలర్లు. 2018లో వచ్చిన పీఈ, వీసీ మొత్తం పెట్టుబడుల్లో 74 శాతం.
- 2018లో మొత్తం డీల్స్ 761గా ఉన్నాయి. 2017లో ఉన్న 594 డీల్స్ కంటే 28 శాతం ఎక్కువ.
- స్టార్టప్ పెట్టుబడులు బలంగా ఉన్నాయి. సాఫ్ట్ బ్యాంకు, టెన్సెంట్, నాస్పర్స్ పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టడం ఇందుకు తోడ్పడింది.
- అతిపెద్ద డీల్... హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్‌లో జీఐసీ, కేకేఆర్, ప్రేమ్‌జీ ఇన్వెస్ట్, ఓమర్స్ చేసిన 1.7 బిలియన్ డాలర్ల పెట్టుబడి కావడం గమనార్హం.
- ఫ్లిప్‌కార్ట్‌లో వాల్‌మార్ట్ ప్రవేశంతో సాఫ్ట్‌బ్యాంకు, టైగర్ గ్లోబల్, మరికొంత మంది ఇన్వెస్టర్లు తప్పుకున్న విషయం తెలిసిందే. ఇది 16 బిలియన్ డాలర్ల విలువైన డీల్. దేశ పీఈ/వీసీ మార్కెట్లో ఇదే ఇప్పటి వరకు అతిపెద్ద డీల్.
- పీఈ, వీసీ పెట్టుబడుల ఉపసంహరణ డీల్స్ జరిగిన రంగాలను గమనిస్తే... ఈ కామర్స్ (16.4 బిలియన్ డాలర్లు), టెక్నాలజీ(రూ.1.8 బిలియన్ డాలర్లు), ఫైనాన్షియల్ సర్వీసెస్ (1.5 బిలియన్ డాలర్లు) ముందున్నాయి.

వ్యాపారంపై తగ్గిన విశ్వాసం!

జనవరి–మార్చి మధ్య పరిస్థితిపై డీఅండ్‌బీ నివేదిక

న్యూఢిల్లీ: వ్యాపార ఆశావాదం జనవరి–మార్చి త్రైమాసికానికి తగ్గింది. డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ (డీ అండ్ బీ)కాంపోజిట్ బిజినెస్ ఆప్టిమిజమ్ ఇండెక్స్ ఈ త్రైమాసికానికి సంబంధించి 73.8గా ఉంది. అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంతో పోల్చిచూస్తే, ఈ సూచీ 7 శాతం తగ్గింది. వచ్చే కొద్ది నెలల్లో జరగనున్న ఎన్నికల ఫలితంపై అనిశ్చితి, సంస్కరణల అజెండా కొనసాగడంపై సందేహాలు వ్యాపార ఆశావహ సూచీ తగ్గడానికి కారణమని డీ అండ్ బీ మేనేజింగ్ డైరెక్టర్ మనీష్ సిన్హా పేర్కొన్నారు. అమెరికా మందగమనం, ప్రపంచ ఆర్థిక వృద్ధి బలహీనత వంటి అంశాలూ దేశీయ వృద్ధిపై ఆందోళనలను పెంచుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. వ్యాపార అంచనాలపై వ్యాపార ప్రతినిధులు ఆరు అంశాలపై ఇచ్చిన అభిప్రాయాల ఆధారంగా సూచీ కదలికలను పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుంది. సూచీకి సంబంధించి పరిగణనలోకి తీసుకునే మొత్తం ఆరు ప్రమాణాల్లో ఐదు (నికర ఆదాయం, కొత్త ఆర్డర్లు, అమ్మకాల పరిమాణం, నిల్వలు, అమ్మకపు ధర) అక్టోబర్–డిసెంబర్ మధ్య కాలంతో పోల్చితే ప్రతికూలతను నమోదుచేసుకున్నాయి. దీంతో ఉపాధి కల్పనకు సంబంధించి ఆశావహ పరిస్థితి 7% పెరిగినా, మొత్తం ఫలితం ప్రతికూలంగా ఉంది.

మహిళా వ్యాపారవేత్తలకు కేంద్రం తోడ్పాటు



న్యూఢిల్లీ: గవర్నమెంట్ ఈ–మార్కెట్‌ప్లేస్ (జీఈఎం) పోర్టల్‌లో వివిధ ఉత్పత్తులను విక్రయించేలా మరింత మంది మహిళా వ్యాపారవేత్తలు, స్వయం సహాయక బృందాలను (ఎస్‌హెచ్‌జీ) ప్రోత్సహించే దిశగా కేంద్రం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఉమనియా పేరిట జీఈఎం పోర్టల్‌లో ప్రత్యేకంగా హోమ్‌పేజీ రూపొందించింది. https://gem.gov.womaniya ఈ పేజీలో మహిళా వ్యాపారవేత్తలు విక్రయించే ఉత్పత్తులు, సర్వీసుల గురించి వివిధ ప్రభుత్వ శాఖలు, విభాగాలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు వివరాలు లభిస్తాయని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటిదాకా సుమారు 7,31,431 ఉత్పత్తులు, సర్వీసుల విక్రయానికి 1,80,862 మంది పైచిలుకు విక్రేతలు, సర్వీస్ ప్రొవైడర్స్ జీఈఎంలో నమోదు చేసుకున్నారు.

మొండి బకాయిల వసూళ్లకు ప్రత్యేక టీమ్

సిండికేట్ బ్యాంక్ ఎండీ మృత్యుంజయ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వచ్చే ఆరు నెలల్లోగా సుమారు రూ.1,500 కోట్ల మొండి బకాయిలు వసూలు అవుతాయని సిండికేట్ బ్యాంక్ కృతనిశ్చయంతో ఉంది. ఎనిమిది స్పెషల్ బ్రాంచ్‌లకు అదనంగా రికవరీల కోసం ప్రత్యేకంగా 1,500 మంది సిబ్బందితో ఒక బృందాన్ని ఏర్పాటు చేశామని బ్యాంకు ఎండీ, సీఈవో మృత్యుంజయ్ మహాపాత్ర వెల్లడించారు. 2018 సెప్టెంబరు నాటికి బ్యాంకు స్థూల ఎన్‌పీఏలు 12.9 శాతం, నికర ఎన్‌పీఏలు 6.8 శాతంగా ఉన్నాయి. రుణ మాఫీ అవుతుందన్న అంచనాల నేపథ్యంలో అటు వ్యవసాయ రంగంలోనూ మొండి బకాయిలు పెరుగుతున్నాయని మహాపాత్ర పేర్కొన్నారు. అగ్రి రుణాల్లో 14 శాతం ఎన్‌పీఏలుగా మారాయని వివరించారు. బకాయిల రికవరీతో పాటు రిటైల్, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా కంపెనీలకు అధిక రుణాలు ఇవ్వడం ద్వారా జూన్ నాటికి బ్యాంకు లాభాల్లోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మార్చికల్లా బ్రేక్ ఈవెన్‌కు చేరుకుంటామన్నారు. వచ్చే రెండు త్రైమాసికాలు నెట్ ఇంటరెస్ట్ మార్జిన్ 2.25–2.5 శాతం ఉండొచ్చని అంచనాగా చెప్పారు. సిండికేట్ బ్యాంకు ఎంప్లాయీ స్టాక్ పర్చేజ్ స్కీం కింద రూ.500 కోట్ల ఈక్విటీని ఫిబ్రవరికల్లా సమకూర్చుకుంటోంది. ఇందుకోసం 30 కోట్ల షేర్లను ఉద్యోగులకు జారీ చేయనుంది.

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్లు)	33,140
బంగారం (22 క్యారెట్లు)	31,560
వెండి (కిలో)	42,600
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	32,420
బంగారం (22 క్యారెట్లు)	30,880
వెండి (కిలో)	42,600
హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	32,420
బంగారం (22 క్యారెట్లు)	30,880
వెండి (కిలో)	42,600
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	32,700
బంగారం (22 క్యారెట్లు)	30,280
వెండి (కిలో)	40,200
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	32,980
బంగారం (22 క్యారెట్లు)	30,680
వెండి (కిలో)	40,500
విజయవాడ	
బంగారం(24 క్యారెట్లు)	32,850
బంగారం (22 క్యారెట్లు)	30,150
వెండి (కిలో)	40,000
ఏపీ బులియన్ అసోసియేషన్	
బంగారం (24 క్యారెట్లు)	32,910
బంగారం (22 క్యారెట్లు)	30,440
వెండి (కిలో)	40,300

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు	శుక్రవారం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	51.34	$51.59
బ్రెంట్	60.01	$60.48

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 15-01-2019

విశాఖ	445-00
చిత్తూరు	443-00
వరంగల్	435-00
చెన్నై	450-00
ముంబై	483-00
విజయవాడ	443-00
నమక్కల్	435-00
గోదావరి	443-00
14-1-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	433-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.95
బెంగళూరు	445-00
కోల్‌కత్త	476-00
ఢిల్లీ	460-00

వచ్చే నెల్లో శాంసంగ్ ‘గెలాక్సీ ఎం సిరీస్’ విడుదల..!

ధరల శ్రేణి రూ.20,000



న్యూఢిల్లీ: చైనాకు చెందిన దిగ్గజ మొబైల్ హ్యాండ్‌సెట్స్ తయారీ కంపెనీ షావోమికి పోటీగా.. కొరియా స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ శాంసంగ్ అతి త్వరలోనే ‘గెలాక్సీ ఎం సిరీస్’ను భారత్‌లో విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. రెండంకల వృద్ధి రేటును సాధించడంలో భాగంగా తొలుత ఈఫోన్ సిరీస్‌ను భారత్‌లోనే విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. ఈ స్మార్ట్‌ఫోన్స్ ధరలు రూ.20,000 వరకు ఉండనున్నట్లు శాంసంగ్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అసిమ్ వార్సీ మీడియాతో అన్నారు. ఈ అంశంపై ఆయన మాట్లాడుతూ.. ‘ఈనెల తరువాత స్మార్ట్ ఫోన్లను విడుదల చేయాలని భావిస్తున్నాం. శాంసంగ్, అమేజాన్ వెబ్‌సైట్లలో వీటిని అందించనున్నాం. ఎం సిరీస్ విడుదల ద్వారా 2019లో రెండంకెల వృద్ధి రేటును లక్ష్యంగా నిర్ధేశించుకున్నాం. కేవలం డివైజ్‌ల పరంగానే కాకుండగా.. ఫ్యాక్టరీ, ఎక్సిపీరియన్స్ సెంటర్ల విస్తరణపై కూడా దృష్టి సారించాం. భారత మార్కెట్‌కు అవసరాలకు తగిన విధంగా సేవలందించడమే మా సంస్థ ధ్యేయం.’ అని వివరించారు.

నత్తనడకన ప్యాసింజర్ వాహన అమ్మకాలు..

న్యూఢిల్లీ: గతేడాది రెండవ అర్ధభాగంలో ప్యాసింజర్ వాహన విక్రయాలు నెమ్మదించాయి. భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం(సియామ్) సోమవారం విడుదలచేసిన గణాంకాల ప్రకారం.. గడిచిన ఆరు నెలల్లో 5 నెలల అమ్మకాలు తగ్గుదలను నమోదుచేశాయి. అక్టోబర్ మినహాయించి మిగిలిన ఐదు నెలల్లో అమ్మకాలు తగ్గాయి. తాజాగా డిసెంబర్ విక్రయాలు 2,38,692 యూనిట్లుగా వెల్లడి కాగా, అంతక్రితం ఏడాది ఇదే నెల్లో 2,39,723 యూనిట్లు అమ్ముడయ్యాయి. డిసెంబర్ నెలలో ఒక్క కార్ల అమ్మకాలే 1,55,159 యూనిట్లుగా ఉన్నాయని, అంతక్రితం ఏడాది ఇదే నెలలో దేశీ కార్ల అమ్మకాలు 1,58,338 యూనిట్లుగా ఉన్నాయని సియామ్ తెలిపింది. ‘గతేడాది పండుగ సీజన్ అమ్మకాలు అనుకున్నంత జరగలేదు. డీలర్ స్థాయిలో నిల్వలు పెరిగిపోయాయి. ఇందుకు అనుగుణంగా ఉత్పత్తి సంస్థలు పలు సర్దుబాట్లు చేశాయి. ఈ కారణంగానే డిసెంబర్ అమ్మకాలు తగ్గాయి.’ అని సియామ్ ప్రెసిడెంట్ రాజన్ వడేరా వ్యాఖ్యానించారు. ఇక పూర్తి ఏడాది పరంగా చూస్తే.. గతేడాది ప్యాసింజర్ వాహన విక్రయాలు 5.08 శాతం పెరిగాయి. 2018లో 33,94,756 యూనిట్లు అమ్ముడయ్యాయి. అంతక్రితం ఏడాదిలో 32,30,614 యూనిట్ల విక్రయాలు నమోదయ్యాయి.

ద్విచక్ర వాహన అమ్మకాలు తగ్గాయి

గతనెల మొత్తం ద్విచక్ర వాహన విక్రయాలు 2.23 శాతం తగ్గాయి. 12,59,026 యూనిట్లు అమ్ముడైనట్లు సియామ్ తెలిపింది. మోటార్ సైకిల్ విక్రయాలు స్వల్పంగా పెరిగి 7,93,061 యూనిట్లుగా కాగా, స్కూటర్ సేల్స్ 6.08 శాతం తగ్గి 4,06,137 యూనిట్లుగా ఉన్నాయని తెలిపింది.

పొల్యూషన్ సర్టిఫికెట్ ఉంటేనే వాహన బీమా

న్యూఢిల్లీ: వాహన బీమా పాలసీలతో కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్ (పొల్యూషన్ అండర్ కంట్రోల్ –పీయూసీ)ని కూడా తప్పనిసరిగా అనుసంధానించే క్రమంలో బీమా సంస్థలతో కలిసి పనిచేయనున్నట్లు పర్యావరణ కాలుష్య నియంత్రణ సంస్థ (ఈపీసీఏ) వెల్లడించింది. ముందుగా ఢిల్లీ ప్రాంతంలో దీన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు పేర్కొంది. ప్రతీ సంవత్సరం పీయూసీ సర్టిఫికెట్‌ను పునరుద్ధరించుకోని వాహనాల వివరాలను రవాణా శాఖకు అందజేయనున్నట్లు ఈపీసీఏ సభ్యురాలు సునీత నారాయణ్ చెప్పారు. సుప్రీం ఆదేశాల మేరకు పీయూసీ లేకుండా వాహన బీమా పాలసీ జారీ చేయొద్దంటూ బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ ఐఆర్‌డీఏ గతేడాది జూలైలో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలను ఆదేశించిన సంగతి తెలిసిందే.

ఇబిక్స్‌క్యాష్ చేతికి వీజ్‌మన్ ఫారెక్స్

ఎస్సెల్ ఫారెక్స్ కూడా కొనుగోలు



ముంబై: ఇబిక్స్‌క్యాష్ కంపెనీ భారత్‌కు చెందిన రెండు కంపెనీలను కొనుగోలు చేయనున్నది. వీజ్‌మన్ ఫారెక్స్ కంపెనీలో 74.84 శాతం వాటాను 6.59 కోట్ల డాలర్లకు కొనుగోలు చేయనున్నది. ఎస్సెల్ ఫారెక్స్ కంపెనీలో వంద శాతం వాటాను 80 లక్షల డాలర్లకు కొనుగోలు చేయడానికి కూడా ఈ ఇబిక్స్ క్యాష్ కంపెనీ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ రెండు కంపెనీల చేరికతో ఇబిక్స్ క్యాష్ కంపెనీ... ఆర్థిక సేవల్లో అతి పెద్ద నెట్‌వర్క్ కంపెనీగా అవతరిస్తుంది. ప్రిపెయిడ్ ఫారెక్స్ కార్డ్ సెగ్మెంట్లో అతిపెద్ద బ్యాంకేతర కంపెనీగా ఇబిక్స్ క్యాష్ నిలుస్తుంది.

సైయంట్ షేర్ల బైబ్యాక్ !

ఈ నెల 17న నిర్ణయం



హైదరాబాద్: సైయంట్ కంపెనీ ఈ నెల 17న జరిగే బోర్డ్ సమావేశంలో షేర్ల బైబ్యాక్‌పై చర్చించనున్నది. కంపెనీ చేపట్టనున్న తొలి షేర్ల బైబ్యాక్ ఇదే. ఈ గురువారం(ఈ నెల 17) జరిగే బోర్డ్ సమావేశంలో ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలను కూడా పరిశీలించి ఆమోదం తెలపనున్నది. షేర్ల బైబ్యాక్‌కు సంబంధించిన ఇతర వివరాలను కంపెనీ వెల్లడించలేదు.

ఈఎమ్‌డీ ఎంత చెల్లిస్తారో చెప్పండి

ఎస్‌పీజీపీని అడిగిన ఎన్‌సీఎల్‌టీ

న్యూఢిల్లీ: రీడ్ అండ్ టేలర్ దివాలా కేసుకు సంబంధించి ఎంత ఈఎమ్‌డీ (ఎర్నస్ట్ మనీ డిపాజిట్)ను చెల్లిస్తారో చెప్పాలని ఎస్‌పీ గ్రోత్ పార్ట్‌నర్స్(ఎస్‌పీజీపీ)ని ఎన్‌సీఎల్‌టీ (నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్) ఆదేశించింది. రూ.4,100 కోట్ల బ్యాంక్ రుణాల చెల్లింపుల్లో విఫలం కావడంతో రీడ్ అండ్ టేలర్ కంపెనీపై దివాలా ప్రక్రియ కొనసాగుతోంది. ఈ కంపెనీని టేకోవర్ చేయడానికి ముందుకు వచ్చిన కంపెనీల రిజల్యూషన్ ప్లాన్‌లు సరిగా లేవని, లిక్విడేషన్ మినహా మరే మార్గం లేదని రుణ దాతల సంఘం నిర్ణయించింది. అయితే కంపెనీని టేకోవర్ చేయడానికి తమకొక అవకాశం ఇవ్వాలని రీడ్ అండ్ టేలర్ ఉద్యోగుల సంక్షేమ సంఘంతో కలిసి ఎస్‌పీజీపీ ఎన్‌సీఎల్‌టీని కోరింది. హాంగ్‌కాంగ్‌కు చెందిన ఎస్‌పీజీపీ రీడ్ అండ్ టేలర్ కంపెనీలో కొంత పెట్టుబడి పెట్టింది. ఈ కంపెనీకి సంబంధించి గత ఆర్థిక సంవత్సరం ఖాతాల వివరాలను తమకు సమర్పించాల్సిందిగా ఎన్‌సీఎల్‌టీ ఆదేశించింది. తదనంతరం ఎస్‌పీజీపీ సమర్పించిన డాక్యుమెంట్లు సదరు సంస్థ నెట్‌వర్త్ రూ.7 కోట్లని పేర్కొన్నాయి. గతంలో తమ నెట్‌వర్త్ రూ.70 కోట్లని ఎస్‌పీజీపీ వెల్లడించింది.

బోర్డ్ మీటింగ్స్

మంగళవారం-15/01/2019

జీ ఎంటర్‌టైన్మెంట్ ఎంటర్‌ప్రైజెస్, మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్(ఎంసీఎక్స్), హిందుస్తాన్ మీడియా వెంచర్స్, డెన్ నెట్‌వర్క్స్, స్పెషాల్టీ రెస్టారెంట్స్, ట్రైడెంట్, జే భారత్ మారుతి, కేపీఐటీ టెక్నాలజీస్, నెట్‌వర్క్ 18 మీడియా అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్, టిన్‌ప్లేట్ కంపెనీ ఆఫ్ ఇండియా, టీవీ18 బ్రాడ్‌కాస్ట్,

బుధవారం-16/01/2019

డీసీబీ బ్యాంక్, మైండ్‌ట్రీ, మోతిలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫిలిప్స్ కార్బన్

10 లక్షల గదుల మైలురాయికి త్వరలోనే ‘ఓయో’

- 2023 నాటికి 25 లక్షలు
- ప్రపంచంలో నంబర్ 1 కావడమే లక్ష్యం
- సంస్థ సీఈవో ఆదిత్య ఘోష్



కోల్‌కతా: ఆతిథ్య సేవల సంస్థ ఓయో హోటల్స్ అండ్ రూమ్స్ త్వరలోనే మిలియన్ గదుల (10 లక్షల గదులు) మార్క్‌ను చేరుకోనుందని ఆ సంస్థ సీఈవో (భారత్, దక్షిణాసియా) ఆదిత్య ఘోష్ తెలిపారు. ప్రస్తుతం ఈ సంస్థ నిర్వహణలో 4.6 లక్షల గదుల వసతి నిర్వహణ ఉంది. త్వరలోనే 10 లక్షల గదుల మార్క్‌ను చేరుకునేందుకు రోడ్‌మ్యాప్‌పై పనిచేస్తున్నామని ఘోష్ చెప్పారు. ఏడాదిన్నరలో ఇది సాకారం అవుతుందన్నారు. దీంతో ప్రపంచంలో ప్రస్తుతం మూడో స్థానంలో ఉన్న ఓయో మొదటి స్థానానికి చేరుకుంటుందని చెప్పారు. తాము 2023 నాటికి 2.5 మిలియన్ల గదుల (25 లక్షలు) లక్ష్యాన్ని విధించుకున్నామని సంస్థ ప్రమోటర్ రితేష్ అగర్వాల్ తెలిపారు. ప్రస్తుతం ఓయోకు 13,000 ఫ్రాంచైజీ, లీజ్డ్ హోటల్స్, 4,50,000 గదులు ఉన్నాయి. ప్రతీ నెలా అంతర్జాతీయంగా 64,000 గదులను జత చేస్తుంటూ వెళుతోంది. భారత్‌లో 8,700 లీజ్, ఫ్రాంచైజీ హోటల్స్, 1,64,000 గదులను నిర్వహిస్తున్నట్టు రితేష్ తెలిపారు. చైనాలో తమకు 1.8 లక్షల గదులు ఉన్నప్పటికీ ఆదాయం తక్కువగానే వస్తుందన్నారు. ఓయో ప్రస్తుతం ఏడు దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తుండగా, 15 దేశాలకు విస్తరించాలనుకుంటోంది. కస్టమర్ల రాక, పోకల వివరాలను నేరుగా రాష్ట్ర ప్రభుత్వాలతో పంచుకునేందుకు డిజిటల్ రికార్డు విధానాన్ని సంస్థ ప్రవేశపెడుతోంది. దీనిపై తెలంగాణ, రాజస్థాన్, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాలు ఆసక్తి వ్యక్తం చేశాయని ఆదిత్య ఘోష్ తెలిపారు.

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	374.45	377.15
ASIAN PAINT	1388.6	1403.65
AXIS BANK L	659.2	666.5
BAJAJ AUTO	2699.15	2720.95
BAJAJ FINSE	6368.8	6371.65
BAJAJ FINAN	2544.8	2514.2
BHARTI AIRT	331.6	335.1
BPCL	334.95	337.3
CIPLA LTD	511.95	510.2
COAL INDIA	230.9	232.25
EICHER MOTO	20480.4	20507.6
GAIL (INDIA	324.9	338.6
GRASIM INDU	813.7	814.25
HCL TECHNOL	937.2	940.05
HDFC LTD	1969.2	1991.4
HDFC BANK L	2101.65	2111.9
HERO MOTOCO	2867	2899.25
HINDALCO I	206.15	205.85
HPCL	233.95	233.5
HUL	1763.9	1769.4
INDIABULLS	790.95	816.15
ICICI BANK	373.35	378.55
INDUSIND BA	1484.05	1515.15
BHARTI INFR	280.1	277.2
INFOSYS LIM	701.9	683.5
INDIAN OIL	132.3	131.2
ITC LTD	294.3	295.35
JSW STEEL L	283.9	288.8
KOTAK MAHIN	1211.75	1223.2
LARSEN & T	1333.9	1369.6
MAHINDRA &M	724.55	727.9
MARUTI SUZU	7408.7	7320.5
NTPC LTD	145.55	148
OIL AND NAT	143.45	144.65
POWER GRID	192.5	194.35
RIL	1096.8	1098.05
SBI	300.4	302.75
SUN PHARMAC	450.85	444.4
TATA MOTORS	182.4	180.3
TATA STEEL	470.85	474.2
TCS	1813.25	1842.55
TECH MAHIND	679.85	699.2
TITAN COMPA	957.5	959.3
ULTRATECH C	3776.6	3770.2
UPL LIMITED	770.4	783.45
VEDANTA LIM	193.05	196.6
WIPRO LTD	312.55	328.7
YES BANK LI	195.35	184.25
ZEE ENTERTA	448.1	451.05

నిఫ్టీ నెక్ట్స్ ఫిఫ్టీ

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ABB INDIA L	1307.35	1345.6
ADITYA BIRL	96.1	96.45
ACC LIMITED	1459.6	1458.65
AMBUJA CEME	214.85	212.85
ASHOK LEYLA	93.5	94.3
BANDHAN BAN	443.2	454.4
BANK OF BAR	120.95	121.15
BHARAT ELEC	91.6	92.05
BHEL	67.8	68.55
BIOCON LIMI	645.5	642.5
BOSCH LIMIT	19116.1	19517.8
BRITANNIA I	3113.65	3096.85
CADILA HEAL	353.7	348.3
COLGATE PAL	1305.75	1319.45
CONTAINER C	682.3	678.55
DABUR INDIA	433.5	421.65
DLF LIMITED	181.15	182.15
AVENUE SUPE	1397.4	1571.65
GENERAL INS	258.15	262.15
GODREJ CONS	777.2	778.95
HAVELLS IND	688.55	688.05
HDFC STAND	392.05	406.6
HINDUSTAN Z	271.4	273.5
ICICI LOMBA	862.35	885
ICICI PRU L	350.5	356.55
VODAFONE ID	35.95	36.9
INTERGLOBE	1081.65	1057.45
L&T FINANCE	136.25	141.5
LIC HOUSING	479.15	484.1
LUPIN LIMIT	834.75	839.35
MARICO LIMI	382.1	381.45
UNITED SPIR	596.85	591.6
MOTHERSON S	161.75	161.2
MRF LTD	66653.05	66937.25
NHPC LTD	25.4	25.5
THE NEW IND	180.05	179.65
NMDC LTD.	92.1	92.2
ORACLE FIN	3621.75	3637.35
OIL INDIA L	173.25	174.55
PIRAMAL ENT	2275.75	2296.85
PETRONET LN	216.95	216.7
P&G HYGIENE	9999.3	9998.5
PIDILITE IN	1134.65	1109.25
STEEL AUTHO	50.55	52.2
SBI LIFE IN	620.1	638.5
SHREE CEMEN	15496.55	15913.2
SIEMENS LTD	1054.1	1057.85
SHRIRAM TRA	1169.05	1189.7
SUN TV NETW	579	588.9

బీఎస్ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
Alphageo	473.3	464
Alu Flouride	115.9	119.35
Amar Raja Bat	762.45	756.1
And Bank	29.35	29.5
And Cemen	5.94	5.86
And Paper	443.9	450.9
And Petro	63.6	65.45
Aries Agro Ltd	99.5	100.55
Aurobindo Ph	770.35	769.8
Avantel Soft	231	231.05
Avanti Feeds	372.4	376.2
AvonOrg	6.14	6.45
BN Rathi Sec	28	26.45
Bakelite	19.65	20.65
Balaji Amin	442.9	441.9
Bambino Agro	198.45	198.75
Baron Info	0.19	0.19
Bartronics	7.29	7.3
Bhagira Chem	428.1	427.1
Bhagya Nag	36	34.95
Bhagya Wood	17.05	17.85
Bhaskar Agro	28.1	26.8
Brilliant Sec	1.09	1.05
CIL Securi	16.4	17.7
Color Chip	19	19
Cont Coffee	267.2	268.9
CoroFert	454.9	462.9
Cosboard Ind	14.11	14.39
Country Club	7.3	7.4
Cubex Tub	13.45	14.12
Cybermate	2.04	2.14
DR Reddy	2576	2589.8
Danlaw Tec	100	103.65
DecCement	385.05	390.05
Divi's Lab	1527.4	1504.35
Divya Granit	85.45	84.4
Dolphin Medi	0.68	0.71
Dredgin Corp	439.7	452.85
Empee Sugars	1.31	1.31
Everest Org	123	115.1
Fortune Info	39	39.65
Four Soft	39.15	40.4
GMR Ferro	1.38	1.32
GMR Infra	16.4	16.7
GVK Power	7.55	7.7
Gati Corpn	81.95	81.4
Gayatri Bio	2.69	2.82
Gayatri Proj	177	171.8
Gayatri Sugrs	2.89	2.88
Gennex Lab	3.64	3.61
GodavDru	23.35	22.7
GoldCarpe	4.56	4.56
Goldstn Tele	233.8	227.35
Goldstone Tech	15.5	15.65
Granules (I)	87.55	89.85
HBL Nife Pow	28.5	28.3
HYDIndus	1976	2003.05
Heritage Food	523.9	520.8
HindFlurocarb	15	15.65
IDL Industrs	270	279
IQMS Soft	12	12.4
IVRCL Infras	0.98	0.99
Incap	38	40
IndoNationl	706.8	720.5
Infotech En	607	596
Invinex Lab	42.25	44.25
JSTL	36.5	37.2
KCP LTD	89.35	89.85
KNR Constructio	215.4	214.45
KakatiCem	196.05	195.95
Kallam Spg	18.6	18.65
Kernex Micro	25.6	24.4
Krebs Bio	119.95	110.35
LGS Global	3	3.32
LancoIndus	179.2	179.2
Lokesh Mach	44.35	45.2
Lotus Choc	24	23.55
MIC Elec	1.06	1.11
Madhucon Proje	6.41	6.63
Maytas Infra	15	14.6
Medinova Dia	19.8	19.8
Mold-tek	43.5	44
Moldtek Plastic	263.5	264.6
Moschip Semi	24.95	23.95
NCLInd	129	129.25
NETTLINX	49.4	51.8
NMDC Ltd	92.1	92.25
NagarAgrich	27.4	27.9
NagarConst	88.8	92.15
Natco Pharma	684.2	687.35
Nava Bh Ventur	115.4	115.15
Neha Inter	4.22	4.2
Neocure Ther	2.57	2.56
Neuland Lab	508.85	510.75
Nihar Info Glo	14.5	13.99
Nile	373	371.7
Northgate Tech	0.77	0.81
Oil Country	15.4	15.7
Ortin Lab	15.40	15.45
Padmalaya Tele	2.56	2.45
Panyam Cemen	13.33	13.3
PennInd	38.85	39.6
PennProf	3.61	3.6
Phytochem I	40.85	44.7
Pitti Lamin	62.25	64.25
Pokarna	160.35	156.35
Prajay Engs	8.43	8.52
PremiExpl	239.35	236.95
Prism Cement	84.45	86
Raasi Refrac	13.1	13.3
Rain Industries	117.15	116.75
Raj Packagin	27	27
Ram Informat	40.85	39.9
RavilGr	12.55	13.2
Reg.Ceramic	4.5	4.29
Restile Cer	3.67	3.67
Roopa Indus	10	10.5
Sagar Cem	641.1	642.7
Samkrg Pist	188	190.25
SangInd	59.8	60.2
Satvah. Ispat	9.2	9.21
Saven Techno	28.5	29.9
South Bio Tech	2.05	2.05
SrRayAlk	34.95	35.15
Srinivasa Ship	39.6	41.2
Starchik Sp	26	24.8
Sujana Metal	0.44	0.42
Sujana Towers	1.26	1.2
Surana Strip	1.3	1.35
Surana Tele	4.65	4.61
Suryachakra Pow	0.33	0.34
Suryalata Sp	127.25	127.25
Suven Pharma	218.65	224.4
TCI Finance	15.05	14.85
Taj Gvk Hotel	180.55	181.55
Tanla Solutions	28.9	30.15
Tirumala Seu	0.91	0.95
Trans Biotek	4.48	4.27
Transport Co	294.8	303.35
Trendy Knit	0.22	0.21
Usher Agro	2.2	2.2
V&K Soft	4.05	4.05
VBC Ferro	40.9	40.15
VST Indus	3319	3189.5
Vamshi Rubb	29.6	31
Viceroy Hotels	4.55	4.75
VijayTextil	42.85	44.85
Vimta Labs	294.1	300.3
Virat Crane	33	35.95
Virinchi Con	77	80.9
VisakaInd	422.5	439.25
Vista Pharma	29	27.75
Vivimed Labs	34.1	34.5
Vjil Consult	42	43.4
ZenoTech Lab	35.5	35.3

కోస్తాకు సరే.. కాస్త ఇటూ చూడండి!

- 203 ప్రత్యేక రైళ్లలో 70 శాతం కోస్తా వైపు
- గతేడాది తెలంగాణకు 10 ప్రత్యేక రైళ్లు.. ఈ సారి ఒక్కటీ లేదు
- ఉన్న 31 డెమూలూ కుంభమేళాకు తరలింపు
- బస్సుల భారం తగ్గించాలంటున్న తెలంగాణ ప్రాంత ప్రయాణికులు



సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి రద్దీ దృష్ట్యా కోస్తాకు ప్రత్యేక రైళ్ల సంఖ్య భారీగా పెరిగింది. ఈ మేరకు ఈ సంక్రాంతికి దక్షిణ మధ్య రైల్వే అధికారులు 203 ప్రత్యేక రైళ్లు వేయగా వాటిలో 70 శాతం కోస్తా ప్రయాణికుల కోసం కేటాయించారు. మరో వైపు తెలంగాణ వైపు ప్రయాణించే వారికోసం బస్సులే దిక్కవుతున్నాయి. ఇటు వైపు కూడా ప్రత్యేక రైళ్లను వేసి ఉంటే పండుగ వేళ ప్రయాణాలు సునాయాసంగా జరిగేవన్న వాదనలు వినిపిస్తున్నాయి. గతేడాది తెలంగాణకు కనీసం 10 రైళ్లు నడిపి ఈసారి ఒక్క రైలైనా ఎందుకు వేయలేదని ప్రశ్నిస్తున్నారు. హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు నడిచే 31 డెమూ రైళ్లను ఎందుకు ఎత్తేశారని నిలదీస్తున్నారు. సంక్రాంతి రద్దీ నేపథ్యంలో దాదాపుగా 203 రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఇందులో దాదాపుగా 141కిపైగా కోస్తా ప్రాంతాలకు వేశారు. ఇందులో విజయవాడ, గుంటూరు, తాడేపల్లిగూడెం, సామర్లకోట, విజయనగరం, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు నడిపిస్తోంది. వీటిలో 60 జనసాధారణ్ రైళ్లు ఉన్నాయి. వాటిలో 15 వరకు సాధారణ బోగీలే ఉన్నాయి. మరో 10 సువిధ ప్రత్యేక రైళ్లు నడుపుతోంది. వీటిలో ధరలు 300 నుంచి 400 శాతం అధికంగా ఉన్నాయి. సువిధ రైళ్లలో ధరల్ని చూసి ప్రయాణికులు బెంబేలెత్తిపోయారు. దీంతో 60 జనసాధారణ్ రైళ్లు కూడా ప్రత్యేక రైళ్లని ప్రకటించడంతో వీటిలో ఎక్కేందుకు ఎవరూ సాహసించడం లేదు. రోజుకు 4 రైళ్లు కోస్తాలోని వివిధ ప్రాంతాలకు బయల్దేరుతున్నా... ఈ రైళ్లు చాలామటుకు ఖాళీగా వెళ్తుండటం గమనార్హం. మరో వైపు తిరుపతికి 10 వరకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు సమాచారం. ఇవి ఆ మార్గంలోని రద్దీకి అనుగుణంగా లేవన్న వాదనలూ వస్తున్నాయి.

కుంభ మేళా దెబ్బతో...

వాస్తవానికి గతేడాది వరకు తెలంగాణ ప్రాంతాల వైపు సంక్రాంతి సీజన్‌లో 10 వరకు ప్రత్యేక రైళ్లు నడిపారు. ఈసారి ఒక్క ప్రత్యేక రైలు నడపడం లేదు. మరోవైపు హైదరాబాద్ నుంచి మేడ్చల్, భువనగిరి తదితర ప్రాంతాలకు నడిచే 31 లోకల్ డెమూ రైళ్లను కూడా ఎత్తేశారు. వీటిని కుంభమేళాకు తరలించినట్లు సమాచారం.

మొత్తం రైళ్లు	203
ఆంధ్రకు	141కిపైగా
ఎత్తేసిన డెమూ రైళ్లు	31

తెలంగాణ ఆర్టీసీ సంక్రాంతి కోసం 5,252 ప్రత్యేక బస్సుల్ని నడుపుతోంది. వీటిలో 1500 ఆంధ్రకు నడుస్తుండగా.. మిగిలిన 3,700 బస్సులు తెలంగాణకు నడుస్తున్నాయి. బస్సుకు 50 మంది చొప్పున వేసుకున్నా.. గత వారం రోజులుగా రోజుకు 3.2

రైళ్లను ఇటూ వేసి ఉంటే...

లక్షల మంది తెలంగాణ వాసులు వివిధ తెలంగాణ జిల్లాలకు ప్రయాణాలు సాగిస్తున్నారు. వీరంతా 50 శాతం అదనపు చార్జీలు చెల్లించి మరీ బస్సుల్లో తిప్పలు పడుతూ వెళ్తున్నారు.ఈ అదనపు మోతను తప్పించడానికి ప్రత్యేక రైళ్లను కూడా వేసి ఉంటే ఆర్థిక భారం తగ్గేదని ప్రయాణికులు అంటున్నారు.

కనీసం తిరుగు ప్రయాణంలోనైనా..!

కనీసం 10 రైళ్లయినా తెలంగాణకు వేస్తే చాలా మేలు చేసిన వారవుతారని తెలంగాణ ప్రాంత ప్రయాణికులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఇలా చేస్తే కనీసం తిరుగు ప్రయాణంలోనైనా తమకు అధిక చార్జీల నుంచి ఉపశమనం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఢిల్లీ దారిలోని వరంగల్, కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం, మందమర్రి, మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్ తదితర ప్రాంతాలు, ముంబై మార్గంలోని మేడ్చల్, కామారెడ్డి, బాసరా, నిజామాబాద్ ప్రాంతాల ప్రయాణికులకు వెసులుబాటుగా ఉంటుంది.

పురుషుల జైలుకా.. మహిళల జైలుకా..

- నలుగురు హిజ్రాల రిమాండ్‌లో పోలీసుల తర్జనభర్జన
- ఆడవారేనని ధ్రువీకరించడంతో మహిళా జైలుకు తరలింపు

హైదరాబాద్: హిజ్రాల అరెస్టు కేసులో పోలీసులకు పెద్ద చిక్కే వచ్చిపడింది. ఓ కేసుకు సంబంధించి ప్రియ(22), సనం(20), అఫ్రిన్(22), యాస్మిన్(26) అనే నలుగురు హిజ్రాలను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించమని కోర్టు ఆదేశించింది. అయితే వారిని మగవారి జైలుకు తరలించాలా? లేక మహిళా జైలుకు తరలించాలా? అన్న దానిపై పోలీసులు తర్జనభర్జన పడ్డారు. జూబ్లీహిల్స్ పోలీసులు మొదట వీరిని చంచల్‌గూడ మగవారి జైలుకు తీసుకెళ్లారు. అయితే వీరు ఆడవారని, ఇక్కడకు అనుమతించబోమంటూ జైలు అధికారి నిరాకరించారు. దీంతో పోలీసులు కోర్టును ఆశ్రయించగా తాము రిమాండ్ విధించి జైలుకు తరలించాలని చెప్పామని, ఎక్కడికి తీసుకెళ్తారో మీ ఇష్టమంటూ వ్యాఖ్యానించింది. దీంతో పోలీసులు ఈ నలుగురిని మహిళా జైలుకు తీసుకెళ్లారు. అయితే వీరు ఆడా? మగా? అన్న విషయాన్ని వైద్యుడిచే ధ్రువీకరించి తీసుకురావాలని జైలు అధికారి తెలిపారు. దీంతో ఈ నలుగురిని ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించగా ఆడవారే(మగవారు ఆపరేషన్ చేయించుకుని మహిళలుగా మారారు)నని వైద్యులు నిర్ధారించారు. అనంతరం ఆ పత్రాలు తీసుకెళ్లి చంచల్‌గూడ మహిళా జైలర్‌కు ఇవ్వడంతో జైలర్ వీరిని జైలులోకి అనుమతించారు. వీరిని రిమాండ్‌కు తరలించడానికి 10 గంటల పాటు పోలీసులు కష్టపడాల్సి వచ్చింది. వివరాలు.. రాజస్తాన్‌కు చెందిన కైలాశ్ పటేల్ అనే యువకుడు అన్నపూర్ణ స్టూడియో పక్కన నుంచి శనివారం రాత్రి నడుచుకుంటూ వెళ్తున్నాడు. అక్కడ ఐదుగురు హిజ్రాలు కనపడగా వారితో మాటామంతి కలిపాడు. కొద్దిసేపటికి తన నుంచి హిజ్రాలు డబ్బులు లాక్కున్నారంటూ అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం ఉదయం నలుగురు హిజ్రాలను అదుపులోకి తీసుకొని విచారించిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సిమ్రాన్ ఫాతిమా(20) అనే మరొకరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792